# ఈనాడు



విజయవాడ 22-12-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 132
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



## కాంగ్రెస్ తప్పులు అన్నీఇన్నీ కావు


11 ఏళ్లలో ఎన్ని సరిచేసినా ఇంకా ఉన్నాయి

చొరబాటుదారులంటే ఆ పార్టీకి ఎంతో ప్రీతి

విరుచుకుపడ్డ ప్రధాని మోదీ

2 లో

# రెవెన్యూ దస్త్రమా.. డిస్కస్!



### కొర్రీలు వేసి వెనక్కి పంపించేయడమే

- ఎక్కువ జిల్లాల్లో జేసీ, కలెక్టర్లది ఇదే తీరు
- 22ఏ సహా మరెన్నో సమస్యలు ఎక్కడివక్కడే
- ప్రక్షాళన ఇక్కడి నుంచే మొదలుపెట్టాలి

ఈనాడు, అమరావతి: రెవెన్యూ సమస్యల పరిష్కారంలో తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాలే కాదు.. కలెక్టరేట్, సీసీఎల్ఏ కార్యాలయాలూ నిద్ర నటిస్తున్నాయి. మండలం, డివిజన్, జిల్లా నుంచి ఏదైనా దస్త్రం వచ్చిందంటే పరిష్కారం మాట అటుంచి.. కొర్రీలేస్తున్నారు. తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాల్లో రెవెన్యూ అర్జీలను పరిష్కరించడం లేదంటున్న ఉన్నతాధికారులు.. వారి వద్ద ఉన్న దస్త్రాల ఊసెత్తడం లేదు. కొందరు సంయుక్త కలెక్టర్లు, కలెక్టర్లు ఆయా దస్త్రాలపై 'డిస్కస్' అని రాసి.. వెనక్కి పంపేస్తున్నారు. ఆ తర్వాత వాటి పరిష్కారానికి నెలలు, ఏళ్ల సమయం పడుతోంది. జిల్లాల నుంచి సీసీఎల్ఏ వరకు ఎవరికి వారే.. తమకు ఎందుకొచ్చిన గొడవ అని పక్కవారిపై నెట్టేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. పాత రికార్డులు కనిపించడం లేదంటూ పక్కన పెట్టేయడమూ రివాజుగా మారింది. ఎన్ని కొర్రీలు వేస్తే.. అంత గొప్పగా పరిశీలించినట్లు లెక్క అనే భావన కలెక్టరేట్లలోని కొందరు రెవెన్యూ అధికారుల్లో పాతుకుపోయింది. సిబ్బంది కొరత కూడా సమస్యకు మరో కారణం. రెవెన్యూ ప్రక్షాళన చేయాలని భావిస్తున్న ప్రభుత్వం ముందుగా వీటిపై ఆలోచించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### వచ్చేవన్నీ దీర్ఘకాలిక సమస్యలే

గ్రామాల్లో వేల రెవెన్యూ సమస్యలు దీర్ఘకాలంగా కొనసాగుతున్నాయి. వాటిలో అధిక భాగం సమస్యలకు సంబంధించిన దస్త్రాలు కలెక్టరేట్లు, సీసీఎల్ఏ కార్యాలయాలకు వచ్చి, మళ్లీ వెనక్కి వెళ్తున్నాయి. ఇందులో 22ఏ (మిగతా 2లో)

# బీసీలు, మహిళలకు పెద్దపీట

### తెదేపా లోక్‌సభ నియోజకవర్గాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ప్రకటన

- బీసీలకు 8 అధ్యక్ష, 12 ప్రధాన కార్యదర్శుల పదవులు
- ఐదు స్థానాల్లో మహిళలకే అధ్యక్ష పీఠం
- సీనియర్లు, యువత మధ్య సమతూకం

ఈనాడు, అమరావతి: తెలుగుదేశం పార్టీ.. లోక్‌సభ నియోజకవర్గాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల్ని ఆదివారం ప్రకటించింది. 25 లోక్‌సభ స్థానాలకు ఐదుచోట్ల మహిళల్ని అధ్యక్ష స్థానంలో నియమించింది. మొదటి నుంచీ తెదేపాకి వెన్నెముకగా నిలిచిన వెనుకబడిన వర్గాలకు సముచిత ప్రాధాన్యమిస్తూ 8 లోక్‌సభ స్థానాల్లో వారిని పార్టీ అధ్యక్షులుగా, 12 చోట్ల ప్రధాన కార్యదర్శులుగా నియమించింది. అధ్యక్ష పదవుల్లో ఓసీలకు 11, ఎస్సీలకు 4, ఎస్టీలు, మైనారిటీలకు ఒక్కోటి చొప్పున కేటాయించింది. లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపికకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ కసరత్తు చేశారు. సామాజిక, రాజకీయ, స్థానిక సమీకరణలు, పార్టీకి విధేయత, భవిష్యత్ నాయకత్వాన్ని తయారు చేయడం వంటి అంశాల్ని ప్రాతిపదికగా చేసుకున్నారు. సీనియర్లకు, యువతకు మధ్య సమతూకం పాటించారు. త్రిసభ్య కమిటీలు ఆయా లోక్‌సభ స్థానాలకు వెళ్లి.. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జుల నుంచి సేకరించిన అభిప్రాయాలు, ఐవీఆర్ఎస్ సహా వివిధ సర్వేల ద్వారా తీసుకున్న సమాచారం, పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల్ని, ఇతర కార్యకవర్గాన్ని ఎంపిక చేశారు. చంద్రబాబు త్రిసభ్య కమిటీలతో పలు దఫాలు సమావేశమయ్యారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవులకు పరిశీలనలో ఉన్న వారి పేర్లతో మంగళవారమే ఒక జాబితా సిద్ధం చేశారు. దానిపై పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఆ జాబితాలో కొన్ని మార్పులు చేశారు. చంద్రబాబు శనివారం రాత్రి మరోసారి సమీక్షించి, తుది జాబితా ఖరారు చేశారు. (మిగతా 2లో)



లోక్‌సభ నియోజకవర్గ కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు పట్టుబట్టి మరీ కార్యరూపం దాల్చేలా చూశారు.



## అక్కడికి వెళితే.. టైం మిషన్ ఎక్కినట్లే!

12 లో

'వేళ్లూనుకొన్న' చరిత్ర

గురువుకు రక్త తులాభారం!





# రైల్వే ఛార్జీల పెంపు

## 26 నుంచి అమలు

- సబర్బన్, నెలవారీ సీజన్ టికెట్లకు, 215 కిలోమీటర్లలోపు సాధారణ ప్రయాణాలకు మినహాయింపు
- మిగిలిన వాటిపై కిలోమీటరుకు 1-2 పైసల చొప్పున పెంపు



ఈనాడు, దిల్లీ: ఈ నెల 26 నుంచి రైల్వే ఛార్జీలు పెరగనున్నాయి. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రైల్వే శాఖ ఈ మేరకు పెంపు నిర్ణయం తీసుకుంది. సబర్బన్, నెలవారీ సీజన్ టికెట్లు, 215 కిలోమీటర్లలోపు సాధారణ క్లాస్‌ను మినహాయిస్తూ.. దూర ప్రయాణ ఛార్జీలను పెంచుతున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. తాజా పెంపుతో రైల్వేకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలంలో రూ.600 కోట్ల దాకా అదనపు ఆదాయం లభించనుంది. గత దశాబ్ద కాలంలో రైల్వే నెట్‌వర్క్ గణనీయంగా విస్తరించింది. నిర్వహణ వ్యయం పెరిగింది. వీటితోపాటు భవిష్యత్తులో పెరగనున్న అవసరాలను తీర్చేలా రైళ్ల నిర్వహణ, భద్రతా చర్యలు చేపట్టడానికి మానవ వనరులను పెంచాల్సి ఉండటంతో (మిగతా 2లో)

## అనాథల చదువుకు చుక్కాని.. 'హీల్'

హీల్ ప్యారడైజ్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

## ఆర్థిక సంఘం నిధులకు సర్పంచుల అడ్డదార్లు!

రూ.200 కోట్లు డ్రా చేసేందుకు కార్యదర్శులపై ఒత్తిడి

11 లో

## విచారణలు సామాన్యులకు అర్థమవ్వాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర

# తితిదే.. ఇక గ్లోబల్ బ్రాండ్!

### విదేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం, నిర్వహణకు కసరత్తు ● 3 నమూనాలు సిద్ధం



ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యవైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు తితిదే బృహత్తర ప్రణాళికను రూపొందించింది. ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు.. శ్రీవారి ఆస్తులు, ఆలయాలను అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేందుకు పాలకమండలి కసరత్తు వేగవంతం చేసింది. ప్రత్యేకంగా నిపుణుల కమిటీని నియమించి, విదేశాల్లో ఆలయాల నిర్మాణం, నిర్వహణకు చట్టపరమైన అంశాలపై లోతైన అధ్యయనం చేయించింది. ఈ కమిటీ ప్రతిపాదనలపై తితిదే బోర్డు పలుమార్లు చర్చించింది. కార్యాచరణ ప్రారంభించే ముందు దేవాదాయ శాఖ, ఆర్‌బీఐ, ఫెరా, ఫెమా అనుమతులు పొందాల్సి ఉంది. అప్పటివరకు ఈ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. త్వరలోనే పూర్తిస్థాయి కార్యాచరణతో వివిధ దేశాల్లో శ్రీనివాసుడి ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనుంది. (మిగతా 2లో)

వన్డేల్లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాక, భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన తొలి సిరీస్‌లో హర్మన్‌ప్రీత్ సేన.. స్థాయికి తగ్గ ప్రదర్శనే చేసింది. సొంతగడ్డపై శ్రీలంకతో అయిదు టీ20ల సిరీస్‌ను భారత జట్టు ఘనవిజయంతో ఆరంభించింది. ప్రపంచకప్‌లో కలిసి రాని విశాఖపట్నం వేదిక.. ఈ మ్యాచ్‌లో మాత్రం భారత అమ్మాయిలకు పూర్తి అనుకూలంగా మారింది. బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థికి కళ్లెం వేస్తే.. ప్రపంచకప్ ఫామ్‌ను కొనసాగిస్తూ జెమీమా రోడ్రిగ్స్ మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో భారత్ అలవోకగా విజయాన్నందుకుంది.

# ఆరంభం అదిరింది

## శ్రీలంకతో తొలి టీ20లో భారత్ ఘనవిజయం

చెలరేగిన జెమీమా

మెరిసిన దీప్తి


జెమీమా 69 నాటౌట్


స్మృతి

ఈనాడు - విశాఖపట్నం

బంతితో, బ్యాటుతో అదరగొట్టిన భారత మహిళల జట్టు శ్రీలంకతో అయిదు టీ20ల సిరీస్‌ను ఘనంగా ఆరంభించింది. తొలి మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ప్రత్యర్థిని చిత్తు చేసింది. మొదట బౌలర్లు సమష్టిగా రాణించడంతో శ్రీలంక 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 121 పరుగులే చేయగలిగింది. ఓపెనర్ విష్మి గుణరత్నె (39; 43 బంతుల్లో 1×4, 1×6) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేసింది. ఆ జట్టులో ముగ్గురు బ్యాటర్లు రనౌటయ్యారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ (4-1-20-1) గొప్పగా బౌలింగ్ చేసింది. క్రాంతి గౌడ్, శ్రీ చరణి తలో వికెట్ తీశారు. అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెమీమా రోడ్రిగ్స్ (69 నాటౌట్; 44 బంతుల్లో 10×4) చెలరేగడంతో భారత్ 14.4 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రెండో టీ20 కూడా విశాఖపట్నంలోనే మంగళవారం జరుగుతుంది.

**అటు తడబాటు.. ఇటు ధనాధన్:** శ్రీలంక, భారత్ ఇన్నింగ్స్‌లు పూర్తి భిన్నంగా సాగాయి. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన లంక.. ఆద్యంతం తడబడింది. 3 ఫోర్లు కొట్టి ఊపుమీద కనిపించిన కెప్టెన్ చమరి ఆటపట్టు (15)ను క్రాంతి బౌల్డ్ చేయడంతో లంక కష్టాలు మొదలయ్యాయి. ఓ ఎండ్‌లో విష్మి నిలబడ్డా.. ఆశించినంత వేగంగా ఆడలేకపోయింది. విష్మితో హాసిని పెరీరా (20), హర్షిత సమరవిక్రమ (21) భాగస్వామ్యాలు నెలకొల్పినప్పటికీ.. వీళ్లిద్దరూ కూడా వేగంగా ఆడలేకపోయారు. బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తుంటే.. ఫీల్డర్లూ రాణించడంతో లంక పరుగుల కోసం చెమటోడ్చక తప్పలేదు. ఇన్నింగ్స్ ముందుకు సాగేకొద్దీ లంక కష్టాలు పెరిగాయి. చివరి ఓవర్లలోనూ స్కోరు వేగం పెరగలేదు. అనంతరం ఛేదనలో బంతికో పరుగు చొప్పున చేయాల్సిన భారత్.. ఆరంభంలోనే షెఫాలి (9) వికెట్ కోల్పోయినప్పటికీ, ఇబ్బంది పడలేదు. జెమీమా వచ్చీ రాగానే బ్యాటుకు పని చెప్పింది. అలవోకగా బౌండరీలు బాదింది. స్మృతి మంధాన (25; 25 బంతుల్లో 4×4)తో రెండో వికెట్‌కు 54 పరుగులు జోడించిన ఆమె.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (15 నాటౌట్)తో అభేద్యమైన మూడో వికెట్‌కు 55 పరుగులు జోడించి జట్టుకు తిరుగులేని విజయాన్నందించింది. భారత్ 32 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది.

### స్మృతి @ 4000

మహిళల అంతర్జాతీయ టీ20ల్లో 4 వేల పరుగుల మైలురాయిని చేరుకున్న భారత తొలి బ్యాటర్‌గా స్మృతి మంధాన రికార్డు నెలకొల్పింది. మహిళల్లో సుజీ బేట్స్ (4,716, న్యూజిలాండ్) తర్వాత ఈ క్లబ్బులో అడుగు పెట్టిన క్రికెటర్ స్మృతినే.

**శ్రీలంక ఇన్నింగ్స్:** విష్మి రనౌట్ 39; చమరి (బి) క్రాంతి 15; హాసిని పెరీరా (సి) క్రాంతి (బి) దీప్తి 20; హర్షిత (బి) శ్రీ చరణి 21; నీలాక్షిక రనౌట్ 8; కవిష రనౌట్ 6; కౌశిని నాటౌట్ 9; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **121**; **వికెట్ల పతనం:** 1-18, 2-49, 3-87, 4-103, 5-108, 6-121; **బౌలింగ్:** క్రాంతి 3-0-23-1; అరుంధతి 4-0-23-0; దీప్తి 4-1-20-1; వైష్ణవి 4-0-16-0; శ్రీ చరణి 4-0-30-1; అమన్‌జ్యోత్ 1-0-8-0

**భారత్ ఇన్నింగ్స్:** స్మృతి (సి) నీలాక్షిక (బి) ఇనోక 25; షెఫాలి (సి) గింహని (బి) కావ్య 9; జెమీమా నాటౌట్ 69; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 15; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (14.4 ఓవర్లలో 2 వికెట్లకు) **122**; **వికెట్ల పతనం:** 1-13, 2-67; **బౌలింగ్:** మల్కి 2-0-19-0; కావ్య 3-0-20-1; చమరి 2-0-16-0; షషిని 2-0-32-0; ఇనోక 3.4-0-17-1; కవిష 2-0-18-0

# ఫైనల్లో భారత్ బోల్తా

191 పరుగుల తేడాతో ఓటమి

పాకిస్థాన్‌దే అండర్-19 ఆసియాకప్


వైభవ్, ఆయుష్

దుబాయ్

యువ భారత్ బోల్తా కొట్టింది. అండర్-19 ఆసియాకప్ వన్డే టోర్నీ ఆరంభం నుంచి అదిరే ప్రదర్శన చేసిన జట్టు.. తుది మెట్టుపై చతికిల పడింది. ఆదివారం ఫైనల్లో బంతితో, బ్యాటుతో ఘోరంగా విఫలమైన భారత్.. 191 పరుగుల భారీ తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ చేతిలో ఓడిపోయింది. సమీర్ మిన్హాస్ (172; 113 బంతుల్లో 17×4, 9×6) విరుచుకుపడడంతో మొదట పాకిస్థాన్ 8 వికెట్ల నష్టానికి 347 పరుగుల భారీస్కోరు సాధించింది. అహ్మద్ హుస్సేన్ (56), ఉస్మాన్ ఖాన్ (35) రాణించారు. బంతితో భారత్ తేలిపోయింది. దీపేశ్ (3/83), కనిష్క్ చౌహాన్ (1/72), హెనిల్ పటేల్ (2/62) ధారాళంగా పరుగులిచ్చారు. ఖిలాన్ పటేల్ (2/44) పొదుపుగా బౌలింగ్ చేశాడు. ఛేదనలో భారత్ చేతులెత్తేసింది. అలీ రజా (4/42), హుజైఫా (2/12), సుభాన్ (2/29), సయ్యామ్ (2/38) ధాటికి 26.2 ఓవర్లలో 156 పరుగులకే కుప్పకూలింది. 36 పరుగులు చేసిన దీపేశ్ టాప్ స్కోరర్. సమీర్ మిన్హాస్.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యాడు.

**తేలిపోయారు..:** పాకిస్థాన్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్ సమీర్ మిన్హాస్ విధ్వంసక బ్యాటింగ్‌తో రెచ్చిపోయాడు. ఫోర్లు, సిక్స్‌లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. పేలవంగా బౌలింగ్ చేసిన భారత బౌలర్లు అతణ్ని ఏమాత్రం కట్టడి చేయలేకపోయారు. మరో ఓపెనర్ హంజా (18) త్వరగానే నిష్క్రమించినా.. సమీర్ జోరుతో పాక్ భారీ స్కోరు దిశగా సాగింది. సమీర్.. ఉస్మాన్ ఖాన్‌తో రెండో వికెట్‌కు 92, అహ్మద్ హుస్సేన్‌తో మూడో వికెట్‌కు 137 పరుగులు జోడించాడు. ఆ తర్వాత ఫర్హాన్ (19)తో నాలుగో వికెట్‌కు 42 పరుగులు జోడించి.. 43వ ఓవర్లో ఔటయ్యాడు. ఆఖర్లో భారత బౌలర్లు కాస్త మెరుగ్గా బౌలింగ్ చేయగలిగారు. పాక్ చివరి ఏడు ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 45 పరుగులు రాబట్టింది. ఛేదనలో క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన భారత్.. ఏ దశలోనూ గెలిచేలా కనపడలేదు. పది ఓవర్లలోపే ఓటమి ఖాయమైపోయింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (26; 10 బంతుల్లో 1×4, 3×6) ధాటిగానే ఆరంభించినా.. ఎక్కువసేపు నిలవలేకపోయాడు. 5వ ఓవర్లో అతడు ఔటయ్యేటప్పటికి స్కోరు 49. అంతకన్నా ముందే ఆయుష్ మాత్రే (2), ఆరోన్ జార్జ్ (16) వెనుదిరిగారు. విహాన్ మల్హోత్రా (7), వేదాంత్ త్రివేది (9) కూడా విఫలం కావడంతో భారత్ 68/5తో పీకలలోతు కష్టాల్లోకి కూరుకుపోయింది. ఆ తర్వాత అద్భుతమేమీ జరగలేదు. మిగతా బ్యాటర్లు కూడా పోరాడకుండానే వెనుదిరిగారు.

**సంక్షిప్త స్కోర్లు... పాకిస్థాన్:** 347/8 (సమీర్ మిన్హాస్ 172, అహ్మద్ హుస్సేన్ 56, ఉస్మాన్ ఖాన్ 35, ఫర్హాన్ 19; దీపేశ్ 3/83, ఖిలాన్ పటేల్ 2/44, హెనిల్ పటేల్ 2/62)

**భారత్:** 26.2 ఓవర్లలో 156 ఆలౌట్ (దీపేశ్ 36, వైభవ్ సూర్యవంశీ 26, ఖిలాన్ పటేల్ 19, ఆరోన్ జార్జ్ 16, అభిజ్ఞాన్ కుందు 13, ఆయుష్ మాత్రే 2; అలీ రజా 4/42, సుభాన్ 2/29, సయ్యామ్ 2/38)

# ఫిబ్రవరి 13 నుంచి టాలీవుడ్ ప్రో లీగ్

ట్రోఫీ, జెర్సీ ఆవిష్కరణలో కపిల్, సెహ్వాగ్, రైనా

మాదాపూర్, న్యూస్‌టుడే: సినీ ప్రముఖులు పాల్గొనే టాలీవుడ్ ప్రో లీగ్ (టీపీఎల్) క్రికెట్ టోర్నీ ఫిబ్రవరి 13 నుంచి హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరగనుంది. మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం ఈ లీగ్ ట్రోఫీని, జెర్సీని సినీ, క్రికెట్ ప్రముఖులు ఆవిష్కరించారు. దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్, మాజీ స్టార్ ఆటగాళ్లు వీరేంద్ర సెహ్వాగ్, సురేశ్ రైనాలతో పాటు సినీ నిర్మాత దిల్ రాజు, నటుడు సోనూ సూద్, సంగీత దర్శకుడు తమన్, నటి రాశీ ఖన్నా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కపిల్, సెహ్వాగ్, దిల్ రాజు, సోనూ సూద్ కలిసి స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఈ సందర్భంగా కపిల్‌దేవ్ మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ క్రికెట్ పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ అందమైన నగరమే కాదు, రుచికరమైన వంటకాలకు కేంద్రమని కొనియాడారు. వీరేంద్ర సెహ్వాగ్ మాట్లాడుతూ.. సినిమా రంగానికి చెందిన నటులు, టెక్నీషియన్లు కలిసి క్రికెట్ లీగ్ ఆడటం మంచి పరిణామమన్నారు. దిల్ రాజు మాట్లాడుతూ.. తెర మీద కనిపించే నటులతో పాటు తెర వెనుక ఉండి పని చేసేవారితో కలిసి టీపీఎల్ టోర్నీ జరుగుతుందన్నారు. ఆరు జట్లతో కూడిన ఈ ఫ్రాంఛైజీ ఆధారిత లీగ్‌లో ప్రముఖ నిర్మాతలు జట్లకు యజమానులుగా వ్యవహరిస్తారని రాజు తెలిపారు. సినీనటుడు ఆశిష్ విద్యార్థి, దర్శకుడు అనిల్ రావిపూడి, ఈబీజీ గ్రూప్ అధ్యక్షుడు ఇర్ఫాన్ ఖాన్, టీపీఎల్ వ్యవస్థాపకుడు వంశీ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.


టీపీఎల్ ట్రోఫీ ఆవిష్కరణలో సురేశ్ రైనా, వీరేంద్ర సెహ్వాగ్, కపిల్‌దేవ్, డాక్టర్ ఇర్ఫాన్ ఖాన్, దిల్ రాజు, సోనూసూద్, రాశీఖన్నా, తమన్, వంశీ

# అనగనగా అమన్..


అమన్ రావు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్

తన వయసు కుర్రాళ్లు పుస్తకాలతో పోటీ పడుతుంటే.. అతను మాత్రం అంతర్జాతీయ ఆటగాళ్లతో కలిసి క్రికెట్ ఆడబోతున్నాడు. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ క్రికెటర్లు తలపడే ఐపీఎల్‌లో అతడికి అవకాశం దక్కింది. వచ్చే సీజన్లో ఐపీఎల్‌లో అడుగు పెట్టబోతున్న ఆ కుర్రాడే.. పేరాల అమన్ రావు. ఈ హైదరాబాద్ క్రికెటర్‌ను ఇటీవల వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు రూ.30 లక్షలకు కొనుక్కుంది. అమన్ ఆసక్తికి తల్లిదండ్రుల ప్రోత్సాహం దక్కడంతో ఐపీఎల్ ఆడే అరుదైన అవకాశం దక్కింది. ఇక్కడి వరకు అతడి ప్రయాణం ఆసక్తికరం.

21 ఏళ్ల అమన్‌రావుది హైదరాబాద్. అతడి తండ్రి వ్యాపారం చేస్తుంటారు. తల్లి గృహిణి. తన అన్నయ్య ఆకాశ్‌తో కలిసి చిన్నతనంలో అతను క్రికెట్ ఆడడానికి వెళ్లేవాడు. అలా ఆ ఆటపై ఆసక్తి కలిగింది. ఏడేళ్ల వయసులో గల్లీ క్రికెట్‌తో మొదలు పెట్టిన అతను.. తర్వాత మైదానాలకు వెళ్లి మ్యాచ్‌లు ఆడాడు. అమన్ ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు.. క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే దిశగా ప్రోత్సహించారు. రోజూ ఉదయం 5 గంటలకే లేచి క్రికెట్ సాధన కోసం వెళ్లేవాడు అమన్. తల్లి తన కంటే ముందు లేచి అతడికి అవసరమైనవన్నీ సమకూర్చి పెట్టడమే కాదు.. స్వయంగా వెళ్లి మైదానంలో దించేవారు. చిన్న వయసు నుంచే సాధన చేయడంతో పదేళ్లకే అమన్ రాష్ట్ర స్థాయి అండర్-14 పోటీల్లో పాల్గొన్నాడు. తర్వాత హెచ్‌సీఏ లీగ్స్‌లో నిలకడగా రాణిస్తూ.. అంచెలంచెలుగా ఎదిగాడు. 2018లో బీసీసీఐ అండర్-14 టోర్నీలో సౌత్ జోన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. అండర్-16 విజయ్ మర్చంట్ టోర్నీలో హైదరాబాద్‌కు అతను కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. ఆ టోర్నీలో నిలకడగా రాణించి 238 పరుగులు సాధించాడు. జట్టును సెమీస్‌కు తీసుకెళ్లాడు. అదే అమన్ కెరీర్లో మలుపు. 2021-22 సీజన్లో కూచ్ బెహార్ ట్రోఫీ, వినూ మన్కడ్ ట్రోఫీలో హైదరాబాద్ తరఫున అమన్ నిలకడగా రాణించాడు. తర్వాతి సీజన్లోనూ ఈ టోర్నీల్లో సత్తా చాటాడు. 2024-25 సీజన్లో దేశవాళీ టీ20 ట్రోఫీ ముస్తాక్ అలీ టోర్నీలో హైదరాబాద్‌కు ఆడుతూ అమన్ రావు 234 పరుగులు చేశాడు. అందులో అతడి స్ట్రైక్ రేట్ 164 కావడం విశేషం. సీకే నాయుడు ట్రోఫీ అండర్-23 టోర్నీలో అతను ఇంకా మెరుగైన ప్రదర్శన చేశాడు. 709 పరుగులతో హైదరాబాద్ తరఫున టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. బలమైన జట్టయిన హరియాణాపై అమన్ 193 పరుగుల మారథాన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఝార్ఖండ్‌పైనా సెంచరీ (101) చేశాడు. ఈ ప్రదర్శనతోనే అతను ఐపీఎల్ ఫ్రాంఛైజీల దృష్టిలో పడ్డాడు. వేలంలో రాజస్థాన్ సొంతమయ్యాడు.

### నా శైలి నాదే

"నేను ఇక్కడిదాకా రావడానికి అమ్మానాన్నలే కారణం. వాళ్లే నాలో ఆసక్తిని గుర్తించి క్రికెట్లో ప్రోత్సహించారు. క్రికెట్ ఆడుతున్నపుడు ఒత్తిడి ఎక్కువ ఉంటుంది. దాన్ని అధిగమించడానికి ఖాళీ సమయాల్లో వీడియో గేమ్స్ ఆడడం, అమ్మానాన్నలతో గడుపుతుంటా. 2021లో బీసీసీఐ అండర్-19 టోర్నీకి ఎంపిక కాలేదు. ఆ సమయంలో ఏం చేయాలో అర్థం కాలేదు. కొన్ని రోజులు ఇంట్లోనే ఉండాలనిపించింది. కానీ క్రికెట్ ప్రపంచంలో ప్రతి నిమిషం ముఖ్యమైందే. అందుకే నాకు నేను భరోసా ఇచ్చుకుని మళ్లీ ప్రాక్టీస్ ప్రారంభించాను. ఇప్పుడు ఐపీఎల్‌లో అవకాశం అందుకున్నాను. కేన్ విలియమ్సన్, రోహిత్ శర్మల ఆట ఇష్టం. కానీ నేను ఎవరి శైలినీ అనుసరించను. నాకంటూ ఒక శైలి ఉండాలనుకుంటా. అమ్మానాన్నలు నా వెనుక లేకుంటే ఇప్పుడిలా ఉండేవాడిని కాదు. వారి నమ్మకాన్ని ఎప్పుడూ ఓడిపోనివ్వను. మనం ఏదైనా చేయాలనుకుంటే చేయాలి. అంతే తప్ప ఎవరైనా వస్తారు, సాయం చేస్తారు అని ఎదురు చూడకూడదు''

– అమన్ రావు


చెప్తెగీ

# విజేత చెప్తెగీ

టాటా స్టీల్ వరల్డ్ 25కె కోల్‌కతా


గుల్వీర్

కోల్‌కతా: టాటా స్టీల్ వరల్డ్ 25కే కోల్‌కతా మారథాన్‌లో పురుషుల విభాగంలో ఉగాండా స్టార్ జోషువా చెప్తెగీ విజేతగా నిలిచాడు. గంట 11 నిమిషాల 49 సెకన్లలో అతడు లక్ష్యాన్ని పూర్తి చేశాడు. ఫెలిక్స్ స్యుంబు (టాంజానియా, 1:11.56) రెండో స్థానంలో, తెబెలో (లెసోథో; 1:11.59) మూడో స్థానంలో నిలిచారు. ఇథియోపియా అథ్లెట్ అజిమెరావ్ (1:19.36) మహిళల టైటిల్‌ను గెలుచుకుంది. ఆదివారం జరిగిన ఈవెంట్లో భారత్ నుంచి పోటీపడ్డ రన్నర్లలో పురుషుల విభాగం (ఇండియన్ వరల్డ్ 25కె మెన్)లో గుల్వీర్‌సింగ్ (1:12.06), మహిళల విభాగం (ఇండియన్ వరల్డ్ 25కె వుమన్)లో సీమా (1:26.04) విజేతలుగా నిలిచారు.


సీమా

# కంగారూలదే యాషెస్

## మూడో టెస్టులోనూ విజయం ● పోరాడి ఓడిన ఇంగ్లాండ్

అడిలైడ్


అలెక్స్ కేరీ

ఆస్ట్రేలియా మరో రెండు మ్యాచ్‌ల మిగిలుండగానే యాషెస్ సిరీస్‌ను నిలబెట్టుకుంది. ఆదివారం ముగిసిన మూడో టెస్టులో ఆ జట్టు 82 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌పై విజయం సాధించింది. 435 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 207/6తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్.. 352 పరుగులకు ఆలౌటైంది. జేమీ స్మిత్ (60; 83 బంతుల్లో 7×4, 2×6), విల్ జాక్స్ (47; 137 బంతుల్లో 3×4), కార్స్ (39 నాటౌట్; 64 బంతుల్లో 4×4, 1×6) పోరాటపటిమను ప్రదర్శించారు. స్టార్క్ మూడు వికెట్లు పడగొట్టాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 371 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 286 పరుగులకు ఆలౌటైంది. అలెక్స్ కేరీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ విజయంతో అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 3-0 ఆధిక్యం సంపాదించింది. నాలుగో టెస్టు శుక్రవారం మొదలవుతుంది.

**పోరాడిన స్మిత్, జాక్స్:** చేతిలో నాలుగు వికెట్లు మాత్రమే ఉన్న ఇంగ్లాండ్.. చివరి రోజు నెగ్గాలంటే చేయాల్సిన పరుగులు 228. ఆసీస్ బౌలర్లు తేలికగానే ఇన్నింగ్స్‌ను ముగిస్తారని అనుకున్నారంతా! కానీ ఇంగ్లాండ్ పోరాడింది. పట్టుదలగా నిలిచిన జేమీ స్మిత్ (ఓవర్‌నైట్ 2), విల్ జాక్స్ (ఓవర్‌నైట్ 11) కంగారూ బౌలర్లను పరీక్షించారు. ఏడో వికెట్‌కు 91 పరుగులు జోడించారు. లంచ్ వరకు స్మిత్ వికెట్‌ను మాత్రమే కోల్పోయి 309/7తో నిలిచింది ఇంగ్లాండ్. అప్పటికి విజయానికి కావాల్సింది 126 పరుగులు. ఆసీస్‌కు కాస్త కంగారు తప్పలేదు. జాక్స్‌కు కార్స్ తోడుగా నిలవడంతో ఓ దశలో ఇంగ్లాండ్ 337/7తో నిలిచింది. అయితే జాక్స్‌ను ఔట్ చేయడం ద్వారా ఈ భాగస్వామ్యాన్ని స్టార్క్ విడదీశాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ త్వరగానే ముగిసింది.

**సంక్షిప్త స్కోర్లు... ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 371; **ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్:** 286; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 349; **ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్:** 352 (క్రాలీ 85, జేమీ స్మిత్ 60, జాక్స్ 47, కార్స్ 39 నాటౌట్; స్టార్క్ 3/62, కమిన్స్ 3/48, లైయన్ 3/77)

# వెస్టిండీస్ లక్ష్యం 462

## న్యూజిలాండ్‌తో మూడో టెస్టు


లేథమ్

మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్‌తో మూడో టెస్టులో వెసిడీస్ ముందు 462 పరుగుల లక్ష్యం నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 381/6తో నాలుగో రోజు, ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్.. 420 పరుగులకు ఆలౌటైంది. దీంతో కివీస్‌కు 155 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం ఓపెనర్లు లేథమ్ (101), కాన్వే (100) శతకాలు బాదడంతో న్యూజిలాండ్ 306/2 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. విలియమ్సన్ (40 నాటౌట్), రచిన్ రవీంద్ర (46 నాటౌట్) రాణించారు. టెస్టుల్లో ఒకే మ్యాచ్‌లో ట్రిపుల్ సెంచరీ, సెంచరీ భాగస్వామ్యం నమోదు చేసిన తొలి జంటగా లేథమ్, కాన్వే రికార్డు సృష్టించారు. ఈ ఓపెనింగ్ జంట తొలి ఇన్నింగ్స్‌లో 323, రెండో ఇన్నింగ్స్‌లో 192 పరుగులు జోడించింది. 462 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్.. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 43 పరుగులు చేసింది. బ్రెండన్ కింగ్ (37), జాన్ క్యాంప్‌బెల్ (2) క్రీజులో ఉన్నారు.

# సేయంగ్ రికార్డు


సేయంగ్

హాంగ్‌జౌ: ఒక ఏడాదిలో మిలియన్ డాలర్ల నగదు బహుమతిని గెలుచుకున్న తొలి బ్యాడ్మింటన్ ప్లేయర్‌గా దక్షిణ కొరియా స్టార్ ఆన్ సేయంగ్ ఘనత సాధించింది. ఆదివారం ఆమె బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ విజేతగా నిలిచింది. మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో ఆమె 21-13, 18-21, 21-10తో వాంగ్ జియి (చైనా)ని ఓడించింది. ఈ టోర్నీకి దక్కిన దాంతో కలిపి ఈ ఏడాది సేయాంగ్ మొత్తం నగదు బహుమతి మిలియన్ డాలర్లు దాటింది. ఈ సీజన్‌లో ఆమెకిది 11వ టైటిల్. ఈ సీజన్‌లో ఆడిన 77 మ్యాచ్‌ల్లో సేయాంగ్ 74 గెలవడం విశేషం. వరల్డ్ టూర్ ఫైనల్స్ పురుషుల విభాగంలో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) టైటిల్ గెలుచుకున్నాడు.

# విజయ్ హజారే ట్రోఫీకి హైదరాబాద్ జట్టిదే

హైదరాబాద్: విజయ్ హజారే ట్రోఫీలో పోటీపడే హైదరాబాద్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యుల జట్టుకు రాహుల్ సింగ్ నాయకత్వం వహించనున్నాడు. ఈ టోర్నీ బుధవారం మొదలవుతుంది.

**హైదరాబాద్:** రాహుల్ సింగ్ (కెప్టెన్), రాహుల్ బుద్ధి (వైస్ కెప్టెన్), తన్మయ్ అగర్వాల్, తనయ్ త్యాగరాజన్, అమన్‌రావు, అభిరత్ రెడ్డి, నితేశ్ రెడ్డి, వరుణ్ గౌడ్, సాయి ప్రజ్ఞయ్‌రెడ్డి, ప్రతీక్ రెడ్డి, నితిన్ సాయి యాదవ్, రక్షణ్, కార్తికేయ, పున్నయ్య, అర్ఫాజ్.

ఈనాడు
విజయవాడ 22-12-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 132
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



# నీటి తడులకు... ఏఐ!

హరీశ్ 28 ఎకరాల బత్తాయితోటకు సూక్ష్మసేద్య పరికరాలు ఏర్పాటుచేశారు. నీరు పెట్టేందుకు కూలీలను పంపిస్తే కొన్ని వాల్వ్‌లు ఎక్కువసేపు, మరికొన్ని తక్కువసేపు, ఇంకొన్ని మరచిపోవడం తదితర సమస్యలుండేవి. మొక్కలన్నింటికీ తేమ సమానంగా ఉండేది కాదు. గతేడాది రూ.5 లక్షలతో ఆటోమేషన్ పరికరాలు బిగించారు.

ఇక నీటితడి ఆయనకు అరచేతిలో పనే. వాల్వ్‌ల ఆన్/ఆఫ్, నీరందించిన సమయం వంటి సమాచారమంతా మొబైల్‌లోనే కనిపిస్తుంది.

**తోటలకు నీరు పెట్టాలంటే...**

**అర్ధరాత్రి, అపరాత్రి అని చూసుకోకుండా రైతన్న పొలానికి వెళ్లాల్సిన అవసరం లేదు.**

**ఎక్కడినుంచైనా నీటి పారుదలను నియంత్రించే సౌలభ్యాన్ని కృత్రిమ మేధ పరికరాలు కల్పిస్తున్నాయి.**



పంటలో తేమ తగ్గగానే వాల్వ్‌లు ఆన్ చేయడానికి, ఏ సాలుకు ఎంత నీరు పంపాలో చూసుకోవడానికి ఐఓటీ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) ఆధారంగా పనిచేసే పరికరాలతో పాటు ఏఐ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని యాప్ సాయంతో ఎక్కడి నుంచైనా నియంత్రించవచ్చు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 60మంది రైతులు ఇప్పటికే సూక్ష్మ, తుంపర సేద్య పరికరాలకు వీటిని అమర్చుకుని నీటి తడులందిస్తున్నారు.

వాతావరణ మార్పులను అంచనా వేస్తూ అందుకు అనుగుణంగా పనిచేసే ఏఐ సాంకేతికత కూడా ట్రయల్స్‌లో ఉందని నిపుణులు పేర్కొన్నారు.

### సిమ్ కార్డు.. మాస్టర్ కంట్రోలర్.. సోలెనాయిడ్ వాల్వ్‌లు

- సూక్ష్మ, తుంపర సేద్య పరికరాలకు అమర్చే ఏఐ యంత్రాల్లో సిమ్ కార్డుతో పనిచేసే డివైజ్, మాస్టర్ కంట్రోలర్, సోలెనాయిడ్ వాల్వ్‌లు ఉంటాయి.
- సౌర ఆధారిత పవర్ బ్యాకప్‌తో ఎండ లేకున్నా మూడు రోజుల వరకూ పనిచేస్తాయి.
- ఒక్క సిమ్‌తో 20 పంపు సెట్లు, 1,000 పైగా గేట్ వాల్వ్‌లను ఆన్/ఆఫ్ చేసుకోవచ్చు.
- సిమ్, వైఫైలు బ్లూటూత్‌తో అనుసంధానమై పనిచేస్తాయి. యాప్ ద్వారా వీటిని నియంత్రించవచ్చు.



### వైర్.. వైర్‌లెస్ విధానాల్లో

- ఎకరా, రెండెకరాల రైతులకు వైర్ ఆధారిత విధానం అనువుగా ఉంటుంది.
- తక్కువ సంఖ్యలో వాల్వ్‌లు ఉంటే.. వైర్ ఆధారిత సోలెనాయిడ్ వాల్వ్‌లు ఏర్పాటుచేస్తారు.
- ఖర్చు ఎకరానికి రూ. 40వేల వరకు ఉంటుంది. వైఫై ద్వారా నడుస్తుంది.
- ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే రైతులకు వైర్‌లెస్ విధానం ఉపయోగకరం.
- ఇది సౌరశక్తి సాయంతో బ్యాటరీ బ్యాకప్ ద్వారా సిమ్ ఆధారంగా పనిచేస్తుంది.
- వాల్వ్‌లకు విస్తీర్ణానికి అనుగుణంగా రూ. లక్షకు పైగా ఖర్చవుతుంది.



### ఉపయోగాలెన్నో...

- నీటితడులను మొబైల్ నుంచే నిర్వహించవచ్చు. యాప్‌లోకి ప్రవేశించగానే.. వాల్వ్‌లవారీగా మ్యాప్ కనిపిస్తుంది.
- అందులో ఇప్పటికే నీరిచ్చిన వాల్వ్‌లు, ఇవ్వాల్సినవి, ఏ రోజు ఎంత సమయం నడిచింది? ప్రస్తుతం వేటికి నీరు వెళుతోంది, ఎప్పుడెప్పుడు ఎంత నీరిచ్చారో కూడా తెలుసుకోవచ్చు.
- ఇందులో మోటార్, వాల్వ్, గ్రూప్, ప్రోగ్రామ్, టైమ్‌లైన్, నోడ్ లాగ్ వంటి ఆప్షన్‌లు ఉంటాయి.
- ఎంతసేపు కరెంటు ఉంది? వోల్టేజీ వివరాలు కూడా చూసుకోవచ్చు.
- అరటి, బత్తాయి, దానిమ్మ, ఆయిల్‌పామ్ తదితర తోటలు ఉంటే అందుకు అనుగుణంగా ప్రోగ్రామ్ చేసుకుని నీటితడులు ఇవ్వవచ్చు.

- ఈనాడు అమరావతి

**టైమ్:** కరెంటు రాగానే మోటారు నుంచి ఏ గేట్ వాల్వ్‌కు నీరు వెళ్లాలో వాటిని ఆన్ చేస్తుంది.

**వాల్యూమ్:** ఏ వాల్వ్ ద్వారా ఎంత సమయం, నీరు పంపాలో చూసుకుంటుంది.

**అటానమస్:** సెన్సర్ల ద్వారా పనిచేస్తుంది. అవసరమైన ఎరువుల్ని కావాల్సినంత మేరకు ట్యాంకుల్లో పోస్తే చాలు.. అందులోకి నీరు పంపి, కరిగించి ఏ వాల్వ్ ద్వారా ఎప్పుడు, ఎంత పంపాలో సెట్ చేసుకోవచ్చు.



### తేమకు అనుగుణంగా ఆన్/ఆఫ్

- పొలంలో ఏర్పాటు చేసిన తేమ సూచీల (సెన్సర్ల) ఆధారంగా మొక్కలకు ఏ సీజన్‌లో ఎంత తేమ అవసరమో కృత్రిమ మేధతో గుర్తించి నీరందిస్తుంది.
- తేమ పెరిగిన వెంటనే మోటార్ ఆఫ్ చేస్తుంది.
- తెలంగాణలోని కొన్ని తోటల్లో ఈ తరహా పరికరాలు ఏర్పాటుచేశారు.

### పొలంలో వాతావరణ స్టేషన్..

- కొందరు రైతులు పొలంలో వాతావరణ కేంద్రం(వెదర్‌స్టేషన్) కూడా ఏర్పాటు చేస్తున్నారు.
- దీని ద్వారా ప్రస్తుతం ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలిలోని తేమ, వేగం, దిశ తెలుసుకోవచ్చు.
- మొబైల్‌లోనే వాటిని చూసుకుని అందుకు అనుగుణంగా నీటి తడిని షెడ్యూల్ చేసుకోవచ్చు.

### తేమ, వర్షాల సమన్వయంతో...

రోజువారీ వాతావరణం తీరును అంచనా వేసుకుని నీటితడులు అందజేసే విధానం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఏ వాల్వ్ పరిధిలో మొక్కలకు తేమ అవసరమో గుర్తించి వాటికే నీరందించే వెసులుబాటూ ఉంటుంది. పొలంలో ఏర్పాటుచేసిన వాతావరణ కేంద్రం అక్కడి పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు మొబైల్ యాప్‌లకు అందిస్తుంది. దాంతో నేలలో తేమ, వర్షం కురిసే అవకాశాల్ని సమన్వయం చేసుకుంటూ అవసరమైన సమయంలో మోటార్ ఆన్ చేస్తుంది. ఇది ప్రస్తుతం ట్రయల్స్‌లో ఉంది. **- మొబిటెక్ సొల్యూషన్స్ ఏపీ, తెలంగాణ ప్రతినిధి సుజీత్**

# గిరిజన గ్రామాలకు మహర్దశ

- **అనుసంధాన రహదారులు, కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణం**
- **కాఫీ, జీడిపప్పు, రబ్బరు యూనిట్ల మంజూరు**
- **తొలి విడతగా రూ.98 కోట్ల విడుదల**
- **ఇప్పటికే పలు చోట్ల పనులు ప్రారంభం**



**ఈనాడు, అమరావతి:** కొండాకోనలు, రాళ్లురప్పల మధ్య కాలినడకతో ఏళ్లుగా గిరిజనులు పడుతున్న ఇబ్బందులు తీర్చేలా కూటమి ప్రభుత్వం ముందుకుసాగుతోంది. మారుమూల గిరిజన ప్రాంతాలను రహదారులతో అనుసంధానించడానికి, వాగులు, వంకలు, కాల్వలపై హైలెవల్ బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణం, మౌలిక వసతుల పనులు చేపట్టనుంది. కేంద్ర ప్రభుత్వం గతేడాది రూ. 154 కోట్లు కేటాయించింది. ఇందులో ఈ ఏడాది రూ. 98 కోట్లను ఇటీవల గ్రాంట్‌గా రాష్ట్రానికి ఇచ్చింది. వీటితో పలు చోట్ల ఇప్పటికే పనులు ప్రారంభించారు.

### 20 గ్రామాల గిరిజనులకు తీరనున్న కష్టాలు

రహదారుల అనుసంధానం, ఇతర పనులతో దాదాపుగా 20 గ్రామాల గిరిజనులకు అనేక ఏళ్లుగా పడుతున్న అవస్థలు తీరనున్నాయి. 5 గ్రామాల పరిధిలో బీటీ రహదారులు 1 నుంచి 3 కి. మీ. వరకు వేయనున్నారు. వీటికి రూ. 3 కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు.

### పాడేరు పరిధిలో కాఫీ యూనిట్..

కాఫీ సాగు చేస్తున్న గిరిజన రైతులు దళారుల బారిన పడి నష్టపోకుండా కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసింది. ఇది పాడేరు పరిధిలో ఏర్పాటు కానుంది. రూ. 10 కోట్లు కేటాయించగా... రూ. 5 కోట్లు తొలి విడతగా విడుదల చేసింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు.

- అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం పూజారిపాకల గ్రామం వద్ద రూ. 5 కోట్లతో రబ్బర్ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఇప్పటికే రూ. 2.50 కోట్లు విడుదలయ్యాయి. రబ్బర్‌బోర్డుతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. త్వరలో పనులు ప్రారంభంకానున్నాయి.
- పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో రెండు జీడిపప్పు ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. వీటికి రూ. 50 లక్షలు విడుదలయ్యాయి. పనులు ప్రారంభించారు.
- స్టడీ సర్కిల్, కాఫీ పల్పింగ్ యూనిట్లలో మౌలిక సదుపాయాలు, టార్పాలిన్, సిమెంట్ డ్రయింగ్ యార్డ్, బేబీ పల్పర్స్ సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాలు, యూత్ ట్రైనింగ్ సెంటర్ ప్రహరీలు, ఆసుపత్రుల్లో డార్మెటరీలు, కమ్యూనిటీ హాల్, వరద రక్షణ గోడలు, పర్యాటక కాటేజీల అభివృద్ధి, ఆశ్రమ పాఠశాలల్లో అదనపు మౌలిక వసతులు కల్పించనున్నారు.
- గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యుత్తు సౌకర్యంతో పాటు, ఇన్వర్టర్లను ఏర్పాటు చేయనున్నారు. రూ. 39.54 కోట్లతో ఇన్వర్టర్ల ఏర్పాటుకు కేంద్రం అంగీకరించింది.

| ఐటీడీఏ | నిధుల విడుదల (రూ.కోట్లలో) |
|---|---|
| సీతంపేట | 10.20 |
| పార్వతీపురం మన్యం | 29.10 |
| పాడేరు | 16.05 |
| అరకు | 9.40 |
| రంపచోడవరం | 9.40 |
| చింతూరు | 3.46 |
| కేఆర్ పురం | 9.55 |
| శ్రీశైలం | 4.72 |
| నెల్లూరు | 5.40 |

### వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం..

కేంద్రం అమలు చేసే ఆర్టికల్ 275 పథకాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీని కింద కేంద్రం కేటాయించిన నిధుల్ని ఇతర అవసరాలకు మళ్లించింది. కనీస మౌలిక సదుపాయాలు లేక గిరిజనులు ఇబ్బందిపడుతున్నా పట్టించుకోలేదు. జగన్ అధికారంలో ఉన్న మొదటి మూడుళ్లు కేంద్రం విడుదల చేసిన నిధులకు యూసీలు కూడా సకాలంలో ఇవ్వలేదు. దీంతో తదుపరి రెండేళ్లూ ఒక్క రూపాయి కూడా రాష్ట్రానికి మంజూరు కాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రానికి యూసీలు సమర్పించి తిరిగి ఈ పథకాన్ని గాడినపెట్టింది.

# గంటకు రూ. 8.54 లక్షల దోపిడీ



- **ఏడాదిలో రూ.751.40 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు**
- **క్షణాల్లో వందల ఖాతాల్లోకి సొత్తు మళ్లింపు**

**ఈనాడు, అమరావతి:** సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏపీలో సగటున ప్రతి గంటకు రూ. 8.54 లక్షలు దోచుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ రూ. 751.40 కోట్లు కొల్లగొట్టారు. డిజిటల్ అరెస్టులు, క్రెడిట్, డెబిట్ కార్డులు, ఓటీపీ, ఆన్‌లైన్ పెట్టుబడులు, ట్రేడింగ్, క్రిప్టోకరెన్సీ లావాదేవీలు, ఈ-కేవైసీ, వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగాల పేరిట మోసాలు, న్యూడ్ వీడియోకాల్స్‌తో ఉచ్చులోకి లాగటం. . ఇలా ఒకటేమిటి ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులతో నేరాలకు పాల్పడుతున్నారు. కేంద్ర హోంశాఖ పరిధిలోని నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఈ ఏడాదిలో మన రాష్ట్రం నుంచి నమోదైన ఫిర్యాదుల ఆధారంగా ఈ గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. జనవరి నుంచి ఇప్పటివరకూ ఈ పోర్టల్‌కు ఏపీ నుంచి 57,673 ఫిర్యాదులు అందగా. ఆయా ఘటనల్లో బాధితులు రోజుకు సగటున రూ. 2.05 కోట్లు పోగొట్టుకుంటున్నట్లు వెల్లడైంది. ఎన్‌సీఆర్‌పీకి అందిన ఫిర్యాదుల్లో ఒకే తరహాలో ఉన్నవాటన్నింటినీ వర్గీకరించి పోలీసులు 1,771 కేసులు నమోదు చేశారు.

### ఒక్క శాతమైనా రికవరీ కావట్లేదు..

- ఈ ఏడాదిలో జరిగిన నేరాల్లో సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి రూ. 751.40 కోట్లు కొల్లగొడితే అందులో 2.21 కోట్లు (0.29%) మాత్రమే అధికారులు వెనక్కి తీసుకురాగలిగారు. బాధితులు పోగొట్టుకొంటున్న దాంట్లో కనీసం ఒక్క శాతమైనా రికవరీ కావట్లేదు. మరో రూ. 89 కోట్లు (11.84%) నేరగాళ్లపరం కాకుండా బ్యాంకు ఖాతాల్లో స్తంభింపజేయగలిగారు.
- బాధితుడి బ్యాంకుఖాతా నుంచి తాము చెప్పిన ఖాతాల్లోకి సొమ్ము జమైన వెంటనే సైబర్ నేరగాళ్లు క్షణాల వ్యవధిలో దాన్ని వందల ఖాతాల్లోకి మళ్లించేస్తున్నారు. ఈ మ్యూల్ ఖాతాల సేకరణ కోసం కమీషన్లు ఇచ్చి మరీ ప్రత్యేక ముఠాలనే నడిపిస్తున్నారు. దీంతో సొత్తు రికవరీ దర్యాప్తు సంస్థలకు కష్టమవుతోంది.
- ఈ సైబర్ నేరాల ముఠాల నిర్వాహకులు విదేశాల్లో ఉంటూ తమ తరఫున ఆపరేటర్లను ఇక్కడ పెట్టుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. దీంతో కేసుల ఛేదన సవాల్‌గా మారుతోంది.
- నేరగాళ్లు వేర్వేరు దేశాలు, వివిధ ప్రాంతాల్లో ఉంటూ ఈ మోసాలకు తెగబడుతున్నారు. వారిని పట్టుకోవటం, సొమ్ము రికవరీ చేయటం కోసం ఎంతో శ్రమ పడాల్సి వస్తోంది.
- సైబర్ నేరాల బారిన పడిన మొదటి గంటలోగా (గోల్డెన్ అవర్‌లో) బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగలిగితే ఆ సొత్తు నేరగాళ్ల ఖాతాల్లోకి మళ్లిపోకుండా బ్యాంకు వద్దే స్తంభింపజేసేందుకు అవకాశముంటుంది.
- టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు ఇవ్వొచ్చు.

## ప్రశాంతంగా ముగిసిన టెట్ పరీక్షలు

2,48,427 మంది హాజరు

**ఈనాడు, అమరావతి:** ఉపాధ్యాయ అర్హత పరీక్షలు(టెట్) ఆదివారంతో ముగిశాయి. ఈ నెల పదోతేదీ నుంచి పది రోజుల పాటు ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 2,71,698 మంది దరఖాస్తు చేయగా 2,48,427 మంది హాజరయ్యారు. వీటిలో ఇప్పటికే కొన్ని పరీక్షల ప్రాథమిక కీ విడుదల చేసినట్టు టెట్ కన్వీనర్ ఎం. వెంకటకృష్ణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. "15, 16, 17, 18 తేదీల్లో జరిగిన పరీక్షల ప్రాథమిక కీ సోమవారం, 19, 20, 21 తేదీల్లో జరిగిన పరీక్షల ప్రాథమిక కీ 26వ తేదీ విడుదల చేస్తాం. ప్రాథమిక కీ పై అభ్యంతరాలు ఉంటే వెబ్‌సైట్‌లో తెలియజేయాలి" అని వెంకటకృష్ణారెడ్డి తెలిపారు.



## దివ్యశక్తికి సలాం!

సంకల్పం ఉంటే వైకల్యం దేనికీ అడ్డు కాదనడానికి ఈ చిత్రాలే ఉదాహరణ. ఒక చేయి లేకపోయినా బ్యాటు పట్టి షాట్లు కొడుతూ ఒక ఆటగాడు ఆశ్చర్యపరిస్తే.. ఒక కాలు లేకపోయినా ఊత కర్ర సాయంతో పరుగులు తీస్తూ బౌలింగ్ చేసిన మరో ఆటగాడు అబ్బురపరిచాడు. వారణాసిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న దివ్యశక్తి సుగమ్య భాగ్య క్రికెట్ ట్రోఫీలో కనిపించిన దృశ్యాలివి. బీసీసీఐ ఈ టోర్నీకి స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.



# వివేకా కుటుంబంపై వైకాపా పగ

- **ఆయన భార్య సౌభాగ్యమ్మ పేరిట ఉన్న 7 ఎకరాలు మాయం**
- **పులివెందుల పట్టణంలోని భూములు జగన్ హయాంలో ఇతరుల పేరిట బదలాయింపు**

**ఈనాడు, కడప:** భర్త వైఎస్ వివేకానందరెడ్డిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వైఎస్ సౌభాగ్యమ్మ, కుమార్తె సునీతకు మరో చేదు అనుభవం ఎదురైంది. పులివెందులలో సౌభాగ్యమ్మ పేరిట రూ. 4కోట్ల విలువైన 7.03 ఎకరాల భూములుండగా వాటిని ఇతరుల పేరిట బదలాయించారు. ఇవన్నీ వైకాపా ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపుతో జరిగినట్లు తేలింది. పులివెందుల మండలం కె.వెలంవారిపల్లెలో 2006 ఫిబ్రవరి 17న స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజుల సంఖ్య 1577/2006, 1579/2006 కింద నాలుగు సర్వే నంబర్లలోని 7.03 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. సర్వే నంబరు 351/ఎలో 2.91 ఎకరాలు, 352లో 4.05 ఎకరాలు, 353/1లో 0.04 సెంట్లు, 354లో 0.03 సెంట్లు.. మొత్తంగా 7.03 ఎకరాలు ఇప్పుడు సౌభాగ్యమ్మ పేరిట వెబ్‌ల్యాండ్‌లో కనిపించడంలేదు. ఈ భూముల మ్యుటేషన్ కోసం ఇటీవల ప్రయత్నం చేయగా ఆ భూములు ఆమె పేరిట లేనట్లుగా వెలుగులోకి వచ్చింది. రికార్డులు పరిశీలించగా 2022 వరకు సౌభాగ్యమ్మ పేరిటే భూములన్నాయి. సర్వే నంబరు 351/ఎ కింద ఉన్న 2.91 ఎకరాల భూమి సౌభాగ్యమ్మ పేరుతో పోలిన సగిలి వెంకట సౌభాగ్యలక్ష్మి (భర్త పేరు గంగిరెడ్డి) పేరిట బదలాయించినట్లు బయటపడింది.



వైఎస్ సౌభాగ్యమ్మ

### తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి ద్వారా సాగిన అరాచకం

తన పేరిట వెబ్‌ల్యాండ్‌లో భూములు లేకుండా చేయడాన్ని తెలుసుకున్న సౌభాగ్యమ్మ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై పులివెందుల ఆర్డీవో చిన్నయ్య విచారణ చేపట్టి జేసీ అదితిసింగ్‌కు నివేదిక ఇచ్చారు. కె.వెలమవారిపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్లు 352, 353/1, 354లో ఉన్న మొత్తం 4.12 ఎకరాల భూములు వెబ్‌ల్యాండ్‌లో అక్రమ మార్పులు జరిగినట్లు జేసీకి ఇచ్చిన నివేదికలో ఆర్డీవో పేర్కొన్నారు. ఈ భూములు వైఎస్ సౌభాగ్యమ్మ పేరున రెగ్యులర్ ఖాతా నంబరు 763లో ఉండగా అవి నోషనల్ ఖాతా నంబరు 300004 కిందకు మార్చినట్లు తెలిపారు. మండల సర్వేయర్ సర్వే నిర్వహించి ఆ భూములు సౌభాగ్యమ్మవిగా తేల్చారు. వెబ్‌ల్యాండ్‌లో మార్పులు అప్పటి తహసీల్దార్ కె.మాధవ కృష్ణారెడ్డి పని చేస్తున్న సమయంలో జరిగాయని తన నివేదికలో పేర్కొన్నారు. రికార్డుల పరంగా చూస్తే సౌభాగ్యమ్మకే భూములు చెందుతాయని, తహసీల్దార్ అక్రమాలకు పాల్పడి వెబ్‌ల్యాండ్‌లో బదలాయింపు చేశారని విచారణ నివేదికలో వివరించారు.

### పులివెందులలో నాలుగేళ్లు పనిచేసిన మాధవ కృష్ణారెడ్డి

2020 నుంచి 2024 వరకు పులివెందుల తహసీల్దార్‌గా మాధవ కృష్ణారెడ్డి పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 'ఎఫ్' సెక్షన్ పర్యవేక్షకులుగా పనిచేస్తున్నారు. ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. కలెక్టర్ కార్యాలయంలోనే పూర్వస్థానంలోనే తహసీల్దార్ హోదా కిందే పనిచేస్తున్నారు. కీలకమైన ఈ విభాగంలో నిషేధిత జాబితాలో భూములు చేర్చడం, తొలగించడంలాంటి కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# రైల్వే ఛార్జీల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ఛార్జీలను హేతుబద్ధీకరించినట్లు రైల్వేశాఖ తెలిపింది.

రైల్వే వెల్లడించిన వివరాల ప్రకారం- ఆ శాఖలో ప్రస్తుతం మానవ వనరుల ఖర్చు రూ.1,15,000 కోట్లకు పెరిగింది. పింఛను వ్యయం రూ.60 వేల కోట్లకు చేరుకుంది. దీనివల్ల నిర్వహణ ఖర్చు 2024-25లో రూ.2,63,000 కోట్లకు పెరిగింది. ఈ ఖర్చును అందుకోవడానికి కార్గో లోడింగ్‌పై దృష్టిసారించినట్లు రైల్వే తెలిపింది. ప్రస్తుతం ఛార్జీల హేతుబద్ధీకరణ ద్వారా ప్రయాణికులపై స్వల్ప భారమే పడుతుందని వెల్లడించింది. దీనివల్ల రైల్వే తన నిర్వహణ కార్యకలాపాలను పెంచడంతోపాటు ప్రయాణికుల భద్రతను మరింత మెరుగుపరచడానికి వీలవుతుందని పేర్కొంది.

### ఛార్జీల పెంపు ఇలా..

✦ 215 కిలోమీటర్ల దూరానికి పైబడిన సాధారణ క్లాస్ - కిలోమీటరుకు 1 పైసా చొప్పున ✦ మెయిల్/ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ- కిలోమీటరుకు 2 పైసల చొప్పున ✦ ఏసీ క్లాస్- కిలోమీటరుకు 2 పైసల చొప్పున ✦ నాన్ ఏసీ కోచ్‌ల్లో 500 కిలోమీటర్ల ప్రయాణానికి - రూ.10 అదనం

### ఏటా రూ.2,400 కోట్ల భారం

రైల్వేశాఖ ప్రయాణికుల ఛార్జీలను పెంచడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. 2020 జనవరి 1 తర్వాత తొలిసారిగా 2025 జులై 1 నుంచి ఛార్జీలను పెంచింది. ఆరు నెలలు తిరగకముందే మళ్లీ ఇప్పుడు రెండోసారి ప్రయాణికులపై భారం మోపింది. ఈసారి క్రితంకంటే రెట్టింపు పెంచింది! ప్రస్తుత పెంపుతో ప్రయాణికులపై ఏటా రూ.2,400 కోట్ల భారం పడనుంది. జులై 1న ప్రకటించిన హేతుబద్ధీకరణలో 500 కిలోమీటర్ల వరకు సాధారణ తరగతిని పెంపు నుంచి రైల్వే మినహాయించింది. ఇప్పుడు మినహాయింపును 215 కిలోమీటర్లకే పరిమితం చేసింది. ఇదివరకు 500 కిలోమీటర్ల కంటే ఎక్కువ ప్రయాణానికి కిలోమీటరుకు అరపైసా, మెయిల్/ఎక్స్‌ప్రెస్ ప్రయాణాలకు కిలోమీటరుకు పైసా చెప్పున పెంచింది. ఏసీ తరగతులకు ఇప్పట్లాగే అప్పుడూ 2 పైసలు (ప్రతి కిలోమీటరుకు) పెంచింది.

# వచ్చే ఏడాది డిసెంబరు నుంచి..
# రాయ్‌పుర్ హైవేపై రయ్ రయ్

- ఏపీలో 92 కి.మీ. పనులు పూర్తి
- భూసేకరణ సమస్యతో 2 చోట్ల 2.5 కి.మీ. పెండింగ్
- ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో వచ్చే ఏడాదికి కొలిక్కి
- విశాఖ - రాయ్‌పుర్ మధ్య తగ్గనున్న 132 కి.మీ. దూరం

ఈనాడు – విజయనగరం, అమరావతి

విశాఖ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్ వరకు నిర్మిస్తున్న యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వచ్చే ఏడాది డిసెంబరు నుంచి వాహనాలు పరుగులు పెట్టనున్నాయి. 465 కి.మీ. మేర ఆరు వరుసలతో నిర్మిస్తున్న ఈ హైవేకి రూ.16,482 కోట్లు వెచ్చిస్తున్నారు. ఏపీలో 92 శాతం పనులు పూర్తికాగా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో వచ్చే ఏడాది చివరకు పనులు కొలిక్కి వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇవి పూర్తికాగానే వాహనాల రాకపోకలను అనుమతించనున్నారు.

### ఏపీలోనే శరవేగంగా పనులు

- ఈ హైవే ఏపీలో 100 కి.మీ., ఒడిశాలో 241 కి.మీ., ఛత్తీస్‌గఢ్‌లో 124 కి.మీ. కలిపి మొత్తం 465 కి.మీ. మేరకు ఉంటుంది.
- మన రాష్ట్ర పరిధిలో అనకాపల్లి జిల్లా సబ్బవరం వద్ద కోల్‌కతా-చెన్నై హైవే వద్ద మొదలై.. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల మీదుగా పాచిపెంట మండలం బంగారుగుడి గ్రామం దాటిన తర్వాత ఒడిశాలోకి ప్రవేశిస్తుంది.
- ఏపీ పరిధిలో 92 కి.మీ. మేర పనులు పూర్తయ్యాయి.
- 5.5 కి.మీ. మేర పార్వతీపురం జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఘాట్ సెక్షన్‌లో పనులు జరుగుతున్నాయి.
- కొత్తవలస మండలం చిన్నిపాలెంలో 2.5 కి.మీ., మెంటాడ మండలం జయతిలో 250 మీటర్ల మేర భూసేకరణ సమస్యతో పనులు ఇంకా మొదలుకాలేదు.
- ఇక్కడి భూములకు యజమానులు ఎక్కువ పరిహారం కోరుతుండగా, నిబంధనల ప్రకారం ఇవ్వనున్నట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చెబుతోంది. దీంతో హైకోర్టు, జిల్లా కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. అవి పరిష్కారమయ్యాక పనులు ఆరంభించనున్నారు.
- ఒడిశాలో 80 శాతం పనులు పూర్తయ్యాయి. పెండింగ్ పనులు వచ్చే ఏడాదికి కొలిక్కి రానున్నాయి.
- ఛత్తీస్‌గఢ్‌లో ఆలస్యంగా పనులు మొదలుకాగా, ఈమధ్యే ఊపందుకున్నాయి. అక్కడ దాదాపు 65 శాతానికి పైగా పనులు జరిగాయి. వీటిని కూడా వచ్చే ఏడాది పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.




పాచిపెంట వద్ద కొండను తొలిచి హైవే నిర్మాణం



కొర్లాం వద్ద ఇంటర్ ఛేంజ్

### తగ్గనున్న 132 కి.మీ. దూరం..

- ప్రస్తుతం విశాఖపట్నం-రాయ్‌పుర్ మధ్య 597 కి.మీ. మేర 12 గంటలపాటు ప్రయాణించాల్సి వస్తోంది.
- గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తయితే.. 132 కి.మీ. దూరం తగ్గనుంది. ప్రయాణ సమయం కూడా 7 గంటలు తగ్గి, కేవలం 5 గంటల్లోనే చేరుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.
- ఈ హైవేను గంటకు గరిష్ఠంగా 100 కి.మీ. వేగంతో వాహనాలు పరుగులు పెట్టేలా డిజైన్ చేశారు.
- ఈ హైవే ద్వారా.. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని పారిశ్రామిక ఉత్పత్తులు, ఖనిజాలను విశాఖపట్నం ఓడరేవుకు వేగంగా రవాణా చేసేందుకు వీలు కలుగుతుంది. సరుకు రవాణా సులభమవుతుంది.
- రెండు నగరాల మధ్య ప్రజా రవాణా కూడా వేగంగా సాగించేందుకు అవకాశం ఏర్పడుతుంది.
- ఈ హైవే వల్ల మూడు రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది.
- సబ్బవరం వద్ద చెన్నై-కోల్‌కతా హైవేలో ఈ హైవే మొదలవ్వగా.. సింగిల్ ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ నిర్మిస్తున్నారు.



రాత్రి వేళ మెంటాడ ఇంటర్‌ఛేంజ్ వెలుగులు

# కాంగ్రెస్ తప్పులు అన్నీఇన్నీ కావు

- అస్సాంలో విమర్శలతో విరుచుకుపడ్డ ప్రధాని మోదీ

నామ్‌రూప్ (అస్సాం): దేశంలో కాంగ్రెస్ లెక్కలేనన్ని తప్పులు చేసిందని, గత 11 ఏళ్లలో ఎన్నింటిని సరిచేసినా ఇంకా మిగిలే ఉంటున్నాయని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు ఆ పార్టీ పాల్పడుతోందని, బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులు వచ్చి అస్సాంలో స్థిరపడేందుకు సాయపడుతోందని ఆరోపించారు. అస్సాంలో రెండో రోజు పర్యటనలో భాగంగా.. డిబ్రూగఢ్ జిల్లా నామ్‌రూప్‌లో రూ.10,601 కోట్లతో నిర్మించతలపెట్టిన ఎరువుల కర్మాగారానికి ఆదివారం ఆయన భూమిపూజ చేసి, బహిరంగ సభలో ప్రసంగించారు. "ఓటుబ్యాంకును బలోపేతం చేసుకునేందుకు బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారులు వచ్చి ఇక్కడి అడవులు, భూముల్లో స్థిర నివాసం ఏర్పరచుకోవాలని కాంగ్రెస్ కోరుకుంటోంది. వాళ్లకు కావాల్సింది ఓటుబ్యాంకే ప్రజలు కాదు. అందుకే ఓటర్ల జాబితాల సవరణను వ్యతిరేకిస్తోంది. నేను ఏ మంచి చేయాలన్నా వాళ్లు వ్యతిరేకిస్తారు. అస్సాం గుర్తింపు, అస్తిత్వం, గర్వించదగ్గ విషయాలను వాళ్లు పట్టించుకోరు. భాజపా మాత్రం వీటిని కాపాడుతోంది. కాంగ్రెస్ బుజ్జగింపులు, ఓటుబ్యాంకు రాజకీయాలు అనే విషం నుంచి అస్సాంను కాపాడుకోవాలి. దీనికి భాజపా డబుల్ ఇంజిన్ సర్కారు ఒక రక్షణ కవచంలా నిలుస్తుంది" అని ప్రధాని చెప్పారు. ఈశాన్యం వృద్ధిలోకి రానిదే దేశం అభివృద్ధి చెందదన్నారు.

### రైతుల్ని విస్మరించారు

కాంగ్రెస్ హయాంలో రైతుల కష్టాలను వినే నాథుడే లేకుండాపోయాడని, పాతబడిన ఎరువుల కర్మాగారాలు మూతపడిపోయినా పట్టించుకోలేదని ప్రధాని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే రైతు సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. 2014లో దేశంలో యూరియా ఉత్పత్తి 225 లక్షల టన్నులు ఉండగా ఇప్పుడు 306 లక్షల టన్నులకు చేరిందని వివరించారు. యూరియా రంగంలో స్వావలంబన సాధించే దిశగా బలమైన అడుగులు పడుతున్నాయని చెప్పారు. అధిక దిగుబడులపై ఆశతో యూరియాను విచ్చలవిడిగా వాడొద్దని సూచించారు. గ్రామాల్లో కనీసం సగం కుటుంబాల్లో కారు, బైకు, ఫ్రిజ్ వంటివి ఉంటున్నాయని తెలిపారు. అస్సాం ఆందోళనలో ప్రాణాలు కోల్పోయిన 860 మందికి గువాహటిలో స్మారక కేంద్రం వద్ద మోదీ నివాళులర్పించారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మపుత్ర నదిలో ప్రయాణికుల నౌకలో ప్రధాని విహరించి, విద్యార్థులతో ముప్పావు గంటసేపు 'పరీక్షా పే చర్చ'లో పాల్గొన్నారు.



గువాహటిలోని అమర వీరుల స్మారకం వద్ద ప్రధాని మోదీకి జ్ఞాపికను బహూకరిస్తున్న కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్, అస్సాం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, రాష్ట్ర మంత్రి అతుల్ బోరా

# తితిదే.. ఇక గ్లోబల్ బ్రాండ్!

(మొదటి పేజీ తరువాయి)

శ్రీవారి ఆలయాల నిర్మాణానికి విదేశాల నుంచి తితిదేకు భారీగా విన్నపాలు అందుతున్నాయి. ఇప్పటికే యూకే నుంచి 4, జర్మనీ నుంచి 3 ప్రతిపాదనలు రాగా, ఆస్ట్రేలియా, శ్రీలంక, నెదర్లాండ్స్, స్వీడన్, స్విట్జర్లాండ్, పోలండ్, ఐర్లండ్, న్యూజిలాండ్ తదితర దేశాల నుంచి కూడా అభ్యర్థనలు వచ్చాయి. విదేశాల్లో శ్రీవారి ఆలయాలను ఎలా నిర్వహించాలన్న అంశంపై తితిదే మూడు ప్రధాన నమూనాలు పరిశీలిస్తోంది.

**నమూనా-1:** ఇది పూర్తిగా తితిదే యాజమాన్యంలో ఉండే నమూనా. భూమి కొనుగోలు, ఆలయ నిర్మాణం, అర్చకుల నియామకం, రోజువారీ నిర్వహణ అంతా తితిదేనే చూసుకుంటుంది. చట్టపరంగా ఇది అత్యంత సురక్షితమైందని కమిటీ అభిప్రాయపడింది.

**నమూనా-2:** విదేశాల్లోని స్థానిక హిందూసంస్థలు నిర్మించే ఆలయాలకు తితిదే తరఫున కేవలం ఆధ్యాత్మిక, సాంకేతిక సహకారం అందించడం.

**నమూనా-3:** తితిదే, స్థానిక కమిటీలు సంయుక్తంగా నిధులు సమకూర్చి ఆలయాన్ని నడపడం.

వీటిలో మొదటి నమూనా ద్వారానే తితిదే బ్రాండ్ విలువను, పూజా విధానాల్లో స్వచ్ఛతను కాపాడగలమని నిపుణులు సిఫార్సు చేశారు.

### భారతీయ శిల్పకళ ఉట్టిపడేలా..

✦ విదేశాల్లో నిర్మించే ఆలయాల్లోనూ తిరుమల తరహాలోనే ఆగమశాస్త్ర ప్రకారం పూజలు జరిగేలా తితిదే నుంచి అర్చకులను పంపిస్తారు.
✦ భారతదేశం నుంచి ప్రత్యేకంగా శిల్పులను పంపించి, మన సంప్రదాయం ఉట్టిపడేలా ఆలయాలు నిర్మిస్తారు.
✦ విదేశీ నిబంధనల ప్రకారం స్థానికంగా ప్రత్యేక లాభాపేక్ష లేని సంస్థలను ఏర్పాటుచేసి, తితిదేకు నష్టం కలగకుండా 'రింగ్ ఫెన్సింగ్' పద్ధతిని అనుసరిస్తారు.
✦ అంతర్జాతీయంగా తితిదే పేరును ట్రేడ్‌మార్క్ చేయాలని నిర్ణయించారు.

# రెవెన్యూ దస్త్రమా.. డిస్కస్!

(మొదటి పేజీ తరువాయి)

నిషేధిత భూములకు సంబంధించిన వాటితో పాటు. . సుమోటో కరెక్షన్లు, చుక్కల భూములు, రీసర్వేకు సంబంధించినవి ఎక్కువగా ఉంటున్నాయి. ఏదైనా దస్త్రం వచ్చిందంటే కొన్నిచోట్ల కలెక్టరేట్‌లోని అధికారులు లోపాలున్నాయని వెనక్కి పంపిస్తున్నారు. కలెక్టర్, సంయుక్త కలెక్టర్ కూడా వారు చెప్పిన దానికి తలూపుతున్న పరిస్థితులున్నాయి.

### వందేళ్ల ఆధారాలతో సమర్పించాలంటూ..

ఏదైనా భూ సమస్యకు సంబంధించిన అర్జీ వస్తే.. వాటికి సంబంధించిన లింక్ దస్తావేజులు ఇవ్వాలని మండల అధికారుల్ని కోరుతున్నారు. అక్కడ అందుబాటులో లేకపోతే .. ఏళ్లపాటు ఆయా దస్త్రాలు కదలవు. కొన్నింటికి వందేళ్ల ఆధారాలు సమర్పించాలని ఆదేశిస్తున్నారు. రైతులకు అది సాధ్యమా? కాదా? అని ఆలోచించడం లేదు. ఉదాహరణకు కోస్తాలోని ఓ జిల్లాలో వందేళ్ల కిందట కన్వర్షన్ అయిన భూమిని 22ఏ కింద పెట్టేశారు. దీన్ని సరిదిద్దాలని తహసీల్దార్లు, ఆర్డీవోలు కూడా కలెక్టర్, సీసీఎల్ఏకు లేఖలు రాశారు. అయినా పరిష్కారం దొరకలేదు. న్యాయస్థానం జోక్యంతో చివరకు ఆధారాలు లేవని తిరస్కరించేశారు. ఈ సమస్య కారణంగా సుమారు 40 మంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి కేసులు రాష్ట్రంలో వేలల్లో ఉన్నాయి. ప్రభుత్వం వీటన్నిటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేతో సమస్య మొదలైంది. గతంలో ఉన్న 302 అనే ఎల్‌పీఎంను విభజించి భూనక్ష మ్యాప్‌లో 307, 308 నంబర్లుగా నమోదు చేశారు. వెబ్‌ల్యాండ్ ఆర్‌ఓఆర్‌లో 314, 315 ఎల్‌పీఎం నంబర్లుగా పేర్కొన్నారు. వాస్తవానికి భూనక్షలోని నంబర్లే వెబ్‌ల్యాండ్‌లోనూ కనిపించాలి. అలా కాకుండా రెండుచోట్ల వేర్వేరుగా అప్‌డేట్ అయ్యాయి. దీన్ని సరిదిద్దాలంటూ సీసీఎల్ఏకు పది నెలల కిందట దస్త్రం పంపినా ఇప్పటికీ కొలిక్కి రాలేదు. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులకు లేఖలు రాసినా ఫలితం లేదు.

గుంటూరు జిల్లా పట్టిచెరుకూరు గ్రామం 1134 సంవత్సరం నుంచి రికార్డుల్లో ఉంది. 1906లో ఆర్ఎస్ఆర్ తయారీ సమయంలో చెరువు సర్వే నంబరులో ఊరి విస్తీర్ణాన్ని కలిపేశారు. దీంతో రికార్డుల్లో ఊరంతా చెరువు భూమిగా కనిపిస్తోంది. దీంతో గ్రామంలోని 735 గృహాల వారు భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా కలెక్టరేట్, సీసీఎల్ఏ స్థాయిలోనూ ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు. ఎట్టకేలకు ప్రస్తుతం ఆర్డీవో స్థాయిలో రికార్డులు తయారు చేస్తున్నారు.

# పీపుల్స్‌వార్ మాజీ నేత గాదె ఇన్నయ్య అరెస్ట్

ఈనాడు, హైదరాబాద్: పీపుల్స్‌వార్ మాజీ నేత, భారత్ బచావో ప్రధాన కార్యదర్శి సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్య (64)ను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. మావోయిస్టు విప్లవాన్ని కొనసాగించేలా ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలతో హైదరాబాద్ ఎన్ఐఏలో ఆయనపై బీఎన్ఎస్ 152 సెక్షన్, యూఏ(పీ)యాక్ట్(ఉపా) 1967 సెక్షన్లు 13, 39 కింద నమోదు చేసిన కేసులో అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. తెలంగాణలోని జనగామ జిల్లా టీబీ తండాలో ఇన్నయ్య దంపతులు నిర్వహిస్తున్న 'మా ఇల్లు ప్రజాదరణ అనాథాశ్రమం' వద్ద పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

✦ ఇన్నయ్య గతంలో పీపుల్స్‌వార్ గ్రూప్‌లో దాదాపు 20 ఏళ్ల పాటు క్రియాశీలకంగా పనిచేసి జనజీవన స్రవంతిలో కలిశారు. ఇటీవల మృతిచెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కట్ట రాంచంద్రారెడ్డి ఎలియాస్ వికల్ప్ అంత్యక్రియల సభలో ఆయన ప్రసంగించారు. అది ఓ యూట్యూబ్ ఛానెల్‌లో ప్రసారమైంది. ఆ ప్రసంగం ద్వారా మావోయిస్టు పార్టీకి మద్దతు ఇవ్వడాన్ని ఇన్నయ్య ప్రోత్సహించారని.. మావోయిస్టు కార్యకలాపాల్ని ముందుకు తీసుకెళ్లే ఉద్దేశం కలిగి ఉన్నారని. . చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేలా, విప్లవాన్ని కొనసాగించేలా అక్కడి సమూహాన్ని ప్రేరేపించారంటూ ఎన్ఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు.

# బీసీలు, మహిళలకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం బయటకు వచ్చిన అధ్యక్షుల జాబితాలో ఐదు, ప్రధాన కార్యదర్శుల జాబితాలో రెండు మార్పులు జరిగాయి. అనకాపల్లికి కోట్నీ బాలాజీ, నరసరావుపేటకు కొమ్మాలపాటి శ్రీధర్, అనంతపురం స్థానానికి కాలవ శ్రీనివాసులు, కర్నూలుకు షేక్ వహీద్ హుస్సేన్, నంద్యాలకు మన్నె సుబ్బారెడ్డి పేర్లను మొదట ప్రతిపాదించగా, ఇప్పుడు వారికి బదులు బత్తుల తాతయ్యబాబు, షేక్ జానే సైదా, పూల నాగరాజు, గుడిసె కృష్ణమ్మ, గౌరు చరితారెడ్డిల్ని ఆయా స్థానాలకు అధ్యక్షులుగా నియమించారు. ప్రధాన కార్యదర్శుల్లో నరసరావుపేటకు మొదట సయ్యద్ ఆమీర్ ఆలీ పేరు ప్రతిపాదించగా.. ఇప్పుడు నల్లపాటి రామచంద్రప్రసాద్‌ను నియమించారు. తిరుపతికి బిల్లు చెంచురామయ్య, గంగల కామేశ్వర్ పేర్లను మొదట పరిశీలించగా, చివరకు డాలర్ దివాకర్‌రెడ్డి పేరు ఖరారు చేశారు.

### మహిళలకు సముచిత ప్రాతినిధ్యం

తెదేపా లోక్‌సభ నియోజకవర్గ కమిటీల్లో మహిళలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు త్రిసభ్య కమిటీలకు పదేపదే చెప్పారు. కనీసం 30 శాతం పదవులు మహిళలకు కేటాయించాలని చెబుతూ రెండుసార్లు జాబితాలో మార్పులు చేయించారు. జిల్లా కార్యవర్గాన్ని 32 నుంచి 40కి పెంచారు. జిల్లా అధ్యక్ష పదవుల్లో ఐదు మహిళలకు కేటాయించారు. మొదట ముగ్గురు మహిళలకే అధ్యక్ష పదవులు ప్రతిపాదించగా.. తుది జాబితాలో దాన్ని ఐదుకు పెంచారు.

✦ కేంద్ర మాజీమంత్రి, తితిదే పాలక మండలి సభ్యురాలు పనబాక లక్ష్మి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన మోజోరు తేజోవతి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న గుడిసె కృష్ణమ్మలకు అధ్యక్ష పదవులు దక్కాయి.

✦ నలుగురు ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణ (చంటి), ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఎం.ఎస్.రాజు, గౌరు చరితారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్‌లను అధ్యక్షులుగా నియమించారు. వీరిలో ఎం.ఎస్.రాజు తితిదే పాలక మండలి సభ్యుడిగా ఉన్నారు.

✦ ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులుగా ఉన్న బత్తుల తాతయ్యబాబు, కిమిడి నాగార్జున, జ్యోతుల నవీన్, సలగల రాజశేఖర్ బాబుకు మళ్లీ అవకాశం దక్కింది.

✦ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులుగా నియమితులైనవారిలో బత్తుల తాతయ్యబాబు, పిల్లి మాణిక్యరావు, మంతెన రామరాజు, వీరంకి గురుమూర్తి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల ఛైర్మన్లుగా ఉన్నారు.

✦ బొడ్డు వెంకటరమణ చౌదరి రుడా ఛైర్మన్‌గా, కిమిడి నాగార్జున విజయనగరం డీసీసీబీ అధ్యక్షుడిగా, పూల నాగరాజు ఆర్టీసీ కడప రీజియన్ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు.

### బీసీలకు 12 ప్రధాన కార్యదర్శుల పదవులు

తెదేపా లోక్‌సభ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శుల పదవుల్లోను బీసీలకు సముచిత ప్రాధాన్యమిచ్చారు. 12 స్థానాలు వారికి కేటాయించారు. ఓసీలకు 9, ముస్లింలకు 3, ఎస్సీలకు ఒకచోట అవకాశమిచ్చారు. ప్రధాన కార్యదర్శుల్లో డాలర్ దివాకర్‌రెడ్డి ప్రస్తుతం తుడా ఛైర్మన్‌గా ఉన్నారు. చెన్నుబోయిన చిట్టిబాబు కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు.

**తెదేపా లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల జాబితా**

| లోక్‌సభ నియోజకవర్గం | అధ్యక్షులు | ప్రధాన కార్యదర్శి |
|---|---|---|
| అనకాపల్లి | బత్తుల తాతయ్యబాబు | లాలం కాశినాయుడు |
| అరకు (ఎస్టీ) | మోజోరు తేజోవతి | దత్తి లక్ష్మణరావు |
| శ్రీకాకుళం | మొదలవలస రమేశ్ | పీరికట్ల విఠల్‌రావు |
| విశాఖపట్నం | చోడే వెంకట పట్టాభిరాం | లొడగల కృష్ణ |
| విజయనగరం | కిమిడి నాగార్జున | ప్రసాదుల వరప్రసాద్ |
| అమలాపురం | గుత్తల సాయి | పాలం రాజు |
| ఏలూరు | బడేటి రాధాకృష్ణ | జగ్గవరపు ముత్తారెడ్డి |
| కాకినాడ | జ్యోతుల నవీన్ | పెంకే శ్రీనివాస్‌బాబా |
| నర్సాపురం | మంతెన రామరాజు | పితాని మోహన్‌రావు |
| రాజమహేంద్రవరం | బొడ్డు వెంకటరమణచౌదరి | కాసి నవీన్ |
| బాపట్ల | సలగల రాజశేఖర్‌బాబు | నక్కల రాఘవ |
| గుంటూరు | పిల్లి మాణిక్యరావు | పోతినేని శ్రీనివాసరావు |
| మచిలీపట్నం | వీరంకి గురుమూర్తి | గోపు సత్యనారాయణ |
| నరసరావుపేట | షేక్ జానే సైదా | నల్లపాటి రామచంద్రప్రసాద్ |
| విజయవాడ | గద్దె అనురాధ | చెన్నుబోయిన చిట్టిబాబు |
| చిత్తూరు | షణ్ముగరెడ్డి | వై.సునీల్‌కుమార్‌చౌదరి |
| నెల్లూరు | బీద రవిచంద్రయాదవ్ | చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి |
| ఒంగోలు | ముక్కు ఉగ్రనరసింహారెడ్డి | కొరారి నాగేశ్వరరావు |
| రాజంపేట | సుగవాసి ప్రసాద్‌బాబు | పఠాన్ ఖాదర్‌ఖాన్ |
| తిరుపతి | పనబాక లక్ష్మి | డాలర్ దివాకర్‌రెడ్డి |
| అనంతపురం | పూల నాగరాజు | జి.శ్రీధర్‌చౌదరి |
| హిందూపురం | ఎంఎస్ రాజు | హనుమప్ప |
| కడప | చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి | వైఎస్ జబీవుల్లా |
| కర్నూలు | గుడిసె కృష్ణమ్మ | పూల నాగరాజుయాదవ్ |
| నంద్యాల | గౌరు చరితారెడ్డి | ఎన్ఎండీ ఫిరోజ్ |

# వైకాపా అరాచకాలకు ఎదురొడ్డి నిలిచినవారికే పట్టం

- సామాన్య కార్యకర్తలకే కీలక పదవులు
- అంకితభావంతో పనిచేసే వారికీ గుర్తింపు
- లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ పగ్గాలు అప్పగించిన తెదేపా

ఈనాడు, అమరావతి: వాళ్లు సామాన్యులే.. తెదేపాలో సాధారణ కార్యకర్తలే.. 2019-24 మధ్య వైకాపా ప్రభుత్వ అక్రమాలకు ఎదురొడ్డి పోరాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలపై జగన్ సర్కారు వేధింపుల్ని నిరసిస్తూ.. రోడ్డెక్కి గళం వినిపించారు. అక్రమ కేసులు బనాయించినా వెరవలేదు. వారి కృషిని గుర్తించిన తెదేపా అధిష్ఠానం.. లోక్‌సభ నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా అవకాశం కల్పించింది. తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగుతూ.. అంకితభావంతో పనిచేసే వారికీ పార్టీ పదవుల ఎంపికల్లో ప్రాధాన్యమిచ్చింది.

✦ పల్నాడు జిల్లా అమరావతికి చెందిన జానీసైదా.. వైకాపా ప్రభుత్వ అక్రమాలపై పోరాటం చేశారు. 2019-24 మధ్య ఆయనపై 28 అక్రమ కేసులు బనాయించారు. రౌడీషీట్ తెరిచారు. పార్టీకి ఆయన చేసిన సేవల్ని గుర్తిస్తూ తెదేపా అధిష్ఠానం నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గం పార్టీ అధ్యక్షుడిగా నియమించింది. తొలుత అక్కడ ఓసీ వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేను అధ్యక్షుడిగా నియమించాలని ప్రతిపాదన వచ్చినా.. దాన్ని పక్కనపెట్టి జానీసైదాకే ప్రాధాన్యమిచ్చింది.

✦ పఠాన్ ఖాదర్‌ఖాన్ సామాన్య తెదేపా కార్యకర్త.. పార్టీకి వీరవిధేయుడు. చంద్రబాబుపై రాళ్ల దాడికి సంబంధించి అంగళ్లు కేసులో.. వైకాపా ప్రభుత్వం ఆయనపై రెండు అక్రమ కేసులు బనాయించింది. ఆయన సేవలకు గుర్తింపుగా.. తెదేపా నాయకత్వం రాజంపేట లోక్‌సభ నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించింది.

✦ తెదేపా ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా 2019-24 మధ్య దళితులపై అరాచకాలు, అకృత్యాల్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త పోరాటంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముందువరసలో నిలిచారు. 20కి పైగా అక్రమ కేసులు పెట్టినా వెరవకుండా దళితుల పక్షం వహించారు. తెదేపా అధిష్ఠానం ఆయనకు శాసనసభ టికెట్ ఇచ్చి గెలిపించుకోవడంతోపాటు.. తితిదే బోర్డు సభ్యునిగానూ నియమించింది. తాజాగా హిందూపురం లోక్‌సభ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడి బాధ్యతలూ అప్పగించింది.

✦ తెదేపా అధికార ప్రతినిధిగా వైకాపా ప్రభుత్వ అక్రమాలను ఎండగట్టడంతోపాటు పోరాటం చేసిన ఎస్సీ వర్గానికి చెందిన పిల్లి మాణిక్యరావుకు గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిగా అవకాశం దక్కింది. ఆయన లిడ్‌క్యాప్ ఛైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నారు.

✦ పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరుకు చెందిన వీరంకి గురుమూర్తి విద్యార్థి దశ నుంచి తెలుగుదేశమే. 2019-24 మధ్య ఆయనపై 10 అక్రమ కేసులు నమోదు చేశారు. ఆయన కృషిని గుర్తించిన అధిష్ఠానం గౌడ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించింది. తాజాగా మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడిగా అవకాశం కల్పించింది. ప్రధాన కార్యదర్శిగా గోపు సత్యనారాయణను నియమించింది. ఆయన రెండుసార్లు సర్పంచిగా పనిచేశారు. జిల్లా తెలుగురైతు అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

✦ జమ్మలమడుగు నియోజకవర్గంలో వైకాపా అరాచకాలను ఎదుర్కొన్న చదిపిరాళ్ల భూపేష్ సుబ్బిరామిరెడ్డి.. తెదేపా కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలిచారు. పొత్తులో భాగంగా అధిష్ఠానం సూచన మేరకు శాసనసభ టికెట్‌ను భాజపాకు త్యాగం చేశారు. అధినాయకత్వం ఆదేశాల మేరకు కడప లోక్‌సభ స్థానం తెదేపా అభ్యర్థిగా పోటీచేశారు. ఆయన సేవల్ని గుర్తించి.. కడప లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించింది.

✦ అమరావతి రైతుల ఉద్యమానికి మద్దతుగా విజయవాడలో మహిళల్ని ఏకతాటిపైకి తేవడం నుంచి చంద్రబాబు అరెస్టు సమయంలో మహిళలతో కలిసి పోరాటంలో ముందున్న గద్దె అనూరాధను విజయవాడ లోక్‌సభ నియోజకవర్గ పార్టీ అధ్యక్షురాలిగా నియమించింది.

## గ్రహం అనుగ్రహం

**22-12-2025 సోమవారం**

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
హేమంత రుతువు, పుష్య మాసం, శుక్లపక్షం
**విదియ:** ఉ. 9-33 తదుపరి తదియ
**ఉత్తరాషాఢ:** తె. 4-39 తదుపరి శ్రవణ
**వర్జ్యం:** ఉ. 11-38 నుంచి 1-20 వరకు
**అమృత ఘడియలు:** రా. 9-51 నుంచి 11-33 వరకు
**దుర్ముహూర్తం:** మ. 12-20 నుంచి 1-04 వరకు తిరిగి 2-31 నుంచి 3-15 వరకు
**రాహుకాలం:** ఉ. 7-30 నుంచి 9-00 వరకు
**సూర్యోదయం:** ఉ.6.30; **సూర్యాస్తమయం:** సా.5.27

## చలి - పులి

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| హైదరాబాద్ | 12.2 | 26.8 |
| నల్గొండ | 13.4 | 28.5 |
| ఖమ్మం | 14.0 | 30.2 |
| మహబూబ్‌నగర్ | 14.1 | 30.0 |
| విజయనగరం | 15.0 | 27.0 |
| అనంతపురం | 15.2 | 29.0 |
| కర్నూలు | 16.7 | 30.0 |
| విశాఖపట్నం | 16.8 | 28.2 |
| విజయవాడ | 17.8 | 29.2 |
| శ్రీకాకుళం | 18.0 | 28.0 |
| కడప | 18.0 | 28.0 |
| రాజమహేంద్రవరం | 18.0 | 33.0 |
| నరసాపురం | 18.8 | 30.7 |
| గుంటూరు | 19.0 | 29.0 |
| ఒంగోలు | 20.0 | 30.0 |
| నెల్లూరు | 21.5 | 28.5 |
| తాడేపల్లిగూడెం | 24.0 | 28.0 |



## ఓపికపట్టు.. చేప దొరికేట్టు!

పులికాట్ సరస్సులో వందల సంఖ్యలో వలస పక్షులు సందడి చేస్తున్నాయి. ముఖ్యంగా రంగుల ఈకలతో ఆకట్టుకునే పెయింటెడ్ స్టార్క్‌లు పోటీ పడుతూ చేపలను వేటాడుతున్నాయి. స్థానికులు ఎర్రకాళ్ల కొంగలు అని పిలిచే ఈ పక్షులు ఏటా ఇదే సీజన్‌లో సరస్సులో కనువిందు చేస్తుంటాయి. ఈ సారి దొరవారిసత్రం వద్ద నేలపట్టులో చెట్లపై పెద్దఎత్తున గూళ్లు పెట్టుకున్నాయి. గుంపులుగా చేపలను వేటాడుతూ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. – ఈనాడు, తిరుపతి

## తితిదే నిధులతో కొండగట్టు ఆలయం అభివృద్ధి

- అవకాశం కల్పించిన శ్రీవారికి రుణపడి ఉంటా
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

**ఈనాడు, అమరావతి:** తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం 96 గదుల సత్రం నిర్మించేందుకు ఏపీ ఉప ముఖ్యమంత్రి సిఫార్సులపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) రూ.35.19 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ఎక్స్ వేదికగా ఆదివారం పేర్కొంటూ హర్షం వ్యక్తం చేశారు. దీనిపై పవన్‌కల్యాణ్ అదే వేదికగా ప్రతిస్పందించారు. 'కొండగట్టు దేవాలయం అభివృద్ధి కోసం చేసిన ప్రతిపాదనలపై నిధులు మంజూరుచేసిన తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులకు, ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ నిధుల ద్వారా కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నా. నాకు పునర్జన్మను ప్రసాదించి నడిపిస్తున్న కొండగట్టు అంజన్నస్వామి సన్నిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం కల్పించిన వేంకటేశ్వర స్వామికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు.

## జనసేన 'పదవి- బాధ్యత' కార్యక్రమం నేడు

**ఈనాడు, అమరావతి:** కూటమి ప్రభుత్వంలో జనసేన తరఫున నామినేటెడ్ పదవులు పొందినవారితో ఆ పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం సమావేశమవుతారని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. 'పదవి- బాధ్యత' పేరుతో నిర్వహించే సమావేశంలో 3వేల మందికి పార్టీ అధ్యక్షుడు దిశానిర్దేశం చేస్తారన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమంపై పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, పార్టీ నాయకులతోనూ మనోహర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమావేశం ప్రాధాన్యాన్ని వివరించారు.

## వాసవి క్లబ్ ప్రతిష్ఠను అన్ని దేశాలకు విస్తరించాలి

### క్లబ్ నూతన అంతర్జాతీయ అధ్యక్షుడు శిద్దా వెంకట సూర్యప్రకాశరావు



శిద్దా వెంకట సూర్యప్రకాశరావును గజమాలతో సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** వాసవి క్లబ్ కీర్తిప్రతిష్ఠలను అన్ని దేశాలకు విస్తరించడమే లక్ష్యంగా కార్యవర్గ సభ్యులు ముందుకు సాగాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్-2026 నూతన అంతర్జాతీయ అధ్యక్షుడు శిద్దా వెంకట సూర్యప్రకాశరావు పిలుపునిచ్చారు. ఆదివారం శంషాబాద్‌లో జరిగిన క్లబ్ వార్షికోత్సవంలో కొత్త కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. సూర్యప్రకాశరావుకు ఏపీ మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ది స్పిరిట్ ఆఫ్ 2026 లోగోలను ఆవిష్కరించారు. లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డును వ్యాపారవేత్త బూరుగు రవికుమార్‌కు అందజేశారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ.. దేశవిదేశాల్లో 1,500 శాఖలతోపాటు 75 వేల మంది సభ్యులు వాసవి క్లబ్ సేవల్లో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. సామాజికసేవలను అన్నివర్గాలకు అందించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ, గార్లపాటి శ్రీనివాస్, జె.రమేశ్‌బాబు, సెంధిల్‌కుమార్, ఎం.శంకర్, దర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### నామినీని మరవొద్దు



మ్యూచువల్ ఫండ్లు, షేర్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి రికార్డుల్లో నామినీని తప్పక పేర్కొనండి. అన్ని పెట్టుబడుల వివరాలు, వాటి పాస్‌వర్డ్‌ల జాబితాను రూపొందించి మీ కుటుంబసభ్యులకు అందించండి. ఈ విషయాల్లో సరైన ప్రణాళికను అమలు పరచలేకపోతే మీరెంత సంపాదించినా మీ అనంతరం మీ కుటుంబం ఆ సంపదను పొందడంలో ఇబ్బందిపడే ప్రమాదం ఉంది.
– నేహా నగర్, ఆర్థిక సలహాదారు

# త్వరలో తెలంగాణలోనూ ఎస్ఐఆర్

- ఈ సర్వేను బీఎల్‌వోలు విజయవంతం చేయాలి
- పౌరసత్వానికి, పుట్టిన తేదీకి ఆధార్ ప్రామాణికం కాదు
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్



**ఈనాడు, హైదరాబాద్:** తెలంగాణలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను త్వరలో నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐఆర్ జరగని అన్ని రాష్ట్రాల్లోనూ మూడో దశలో సర్వే ఉంటుందని వెల్లడించారు. బిహార్‌లో ఎస్ఐఆర్ విజయవంతమైందని, ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో కొనసాగుతోందని వెల్లడించారు. బిహార్‌లో జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రామాణికంగా తీసుకుని తెలంగాణలోనూ బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) సర్వేను విజయవంతం చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం బీఎల్‌వోలతో సీఈసీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. "దేశ ఎన్నికల వ్యవస్థకు బీఎల్‌వోలే వెన్నెముక. మన దేశ ఎన్నికల వ్యవస్థ నిర్వహణను ప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తోంది. బిహార్‌లో ఎస్ఐఆర్ సర్వేను బీఎల్‌వోలు విజయవంతం చేసి దేశానికి మార్గనిర్దేశం చేశారు. అక్కడ ఎస్ఐఆర్ తర్వాత 7.5 కోట్ల మందితో ఓటర్ల జాబితాను విడుదల చేశాం. వాటిపై ఫిర్యాదులేవీ రాలేదు. అక్కడ ఎన్నికలు జరిగాక ఈవీఎంలు, వీవీప్యాట్లపై కూడా ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. రీపోలింగ్, రీకౌంటింగ్ అవసరం రాలేదు.

### 930 మంది ఓటర్లకు ఒక బీఎల్‌వో

తెలంగాణలో సగటున 930 మంది ఓటర్లకు ఒక బీఎల్‌వో ఉంటారు. ఇప్పటికే ఎస్ఐఆర్ చేసిన చోట్ల.. చనిపోయినవారి పేర్లు, ఒక వ్యక్తికి రెండు ఓట్ల వంటివి కనిపించాయి. ఇలాంటివి తెలంగాణలోనూ ఉండవచ్చు. ఎస్ఐఆర్ ద్వారా అలాంటి వాటిని సవరించాలి. దేశంలో రాజ్యాంగానికి అతి పెద్ద సైనికుడు బీఎల్‌వోనే. దేశంలో ఎన్నికల కోసం 1.80 కోట్ల మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఏడు దేశాల నుంచి 20 మంది ప్రతినిధులు వచ్చి బిహార్ ఎన్నికలను పరిశీలించారు" అని జ్ఞానేశ్‌కుమార్ పేర్కొన్నారు.

### బీఎల్‌వోల ప్రశ్నలకు సమాధానాలు

ఈ సమావేశంలో బీఎల్‌వోలు అడిగిన పలు ప్రశ్నలకు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ సమాధానాలిచ్చారు. "పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉండడానికి స్థానిక ఓటర్ల నిరాసక్తతే ప్రధాన కారణం. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు మాత్రం ఉత్సాహంగా క్యూలో నిలబడి ఓటుహక్కును వినియోగిస్తూ దేశానికి దారి చూపుతున్నారు. దేశంలో ఎన్నికలు పూర్తిగా చట్టప్రకారమే జరుగుతున్నాయి. ఎన్నికల నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాల్సిందే. వలస ఓటర్లు ఏదైనా ఒక ప్రాంతంలోనే ఓటింగ్‌ను కలిగి ఉండాలి. బీఎల్‌వోల గౌరవ వేతనం రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు పెంచాం. ఆధార్ కార్డు అనేది కేవలం ఐడెంటిటీ కార్డు మాత్రమే. ఇది దేశ పౌరసత్వాన్ని, పుట్టిన తేదీని ధ్రువీకరించే కార్డు కాదు. ఓటరు నమోదులో ఆధార్ కార్డు ఒక ఆప్షన్ మాత్రమే" అని సీఈసీ వివరించారు.

# 'వికసిత్ భారత్'లో ధ్యానం పాత్ర కీలకం

- అది దైనందిన జీవితంలో భాగం కావాలి
- ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ హితవు


వేదికపై ధ్యానం చేస్తున్న కమలేష్ డి.పటేల్, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి శ్రీధర్‌బాబు

**ఈనాడు- హైదరాబాద్:** వికసిత్ భారత్ ప్రయాణంలో 'ధ్యానం' పాత్ర కీలకమని.., అది సాంస్కృతిక, భౌగోళిక, మత సరిహద్దులను అధిగమించే సార్వత్రిక అభ్యాసమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అభివర్ణించారు. భావోద్వేగాలను అదుపులో ఉంచుకునేందుకు ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా శాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'ప్రపంచ ధ్యాన దినోత్సవం'లో ఉపరాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక జీవితంలో ధ్యానానికి ప్రాధాన్యం పెరుగుతోందని, మానసిక స్పష్టత, భావోద్వేగ స్థిరత్వం, అంతర్గత పరివర్తనకు ఇదే మార్గమని వెల్లడించారు. శాంతి, సామరస్యం, ఆధ్యాత్మిక శ్రేయస్సు కోసం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నిబద్ధతతో కృషి చేస్తోందని కొనియాడారు. మధ్యప్రదేశ్‌లో పోలీసు బలగాలు హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన సాధన కొనసాగిస్తూ ఒత్తిడిని జయిస్తున్నాయని తెలిపారు. విభిన్న వయసులు, సంస్కృతులున్నవారు ధ్యానాన్ని ఆచరించేలా ప్రపంచ ఆధ్యాత్మిక మార్గదర్శిగా దాజీ కమలేష్ డి.పటేల్ ప్రక్రియను సులభతరం చేశారని వెల్లడించారు. పౌరులు ధ్యానాన్ని దైనందిన జీవితాల్లో చేర్చుకోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ.. జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు 'ధ్యానం' ఓ మార్గమని అన్నారు. వ్యక్తి అంతర్గత పరివర్తనకు ధ్యానం సహాయపడుతుందన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్, శ్రీరామచంద్రమిషన్ అధ్యక్షుడు దాజీ కమలేష్ డి.పటేల్ మాట్లాడుతూ.. శారీరక దృఢత్వానికి పోషణ ఎంత అవసరమో మనసుకు ధ్యానం అంతే అవసరమన్నారు. తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. వ్యక్తిత్వ వికాసానికి ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని, రోజూ 10 నుంచి 15 నిమిషాల పాటు ధ్యానం అభ్యసించాలని సూచించారు. ఈ సందర్భంగా వేదికపై దాజీతో కలిసి ఉపరాష్ట్రపతి, గవర్నర్, శ్రీధర్‌బాబు ధ్యానం చేశారు. కార్యక్రమానికి 30 వేల మంది అభ్యాసకులు, ప్రముఖులు హాజరయ్యారు. ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల మంది అభ్యాసకులను ఏకం చేసేందుకు రాత్రి 8 గంటలకు వర్చువల్‌గా ధ్యాన సాధన నిర్వహించారు.

# రాష్ట్రంలో 54లక్షల మందికి పైగా పిల్లలకు పోలియో చుక్కలు

- పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్


చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, పక్కన ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ, రామకృష్ణారెడ్డి, నాయకులు

**కాకినాడ (మసీదు సెంటర్), న్యూస్‌టుడే :** రాష్ట్రంలో 54 లక్షలకు మందికి పైగా పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామని వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కాకినాడలోని రామారావుపేట యూపీహెచ్‌సీ వద్ద నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ఆయన చిన్నారులకు చుక్కల మందువేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నారులకు వేసే రెండు చుక్కలు వారి నిండు జీవితానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, అనపర్తి శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డీఎంహెచ్‌వో జె.నరసింహానాయక్, రాష్ట్ర రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ వైడీ రామారావు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### వైకాపావారికి యోగి ఆదిత్యనాథ్ తరహా ట్రీట్‌మెంటే సరైనది

రాష్ట్రంలో అడ్డూ అదుపూ లేకుండా రెచ్చిపోతున్న వైకాపా వారికి పీఎం మోదీ, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తరహా ట్రీట్‌మెంటే సరైందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. వైకాపా నేత జగన్, ఆ పార్టీ శ్రేణుల విషయంలో డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల పీపీపీ విధానంపై వాస్తవాలను వక్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్న వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 75.80% మందికి పల్స్‌పోలియో చుక్కలు

**ఈనాడు, అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు వైద్యారోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలో ఐదేళ్లలోపు వయసు కలిగిన 54,07,663 మంది పిల్లలకు పోలియోచుక్కలు వేయాలనేది లక్ష్యం కాగా.. 40,99,254 (75.80%) మందికి ఈ చుక్కలు వేసినట్లు పేర్కొంది. మిగతావారికి 22, 23 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని తెలిపింది. పల్స్ పోలియో కోసం రాష్ట్రానికి 98,99,300 డోసుల పోలియో వ్యాక్సిన్ కేంద్రం అందించిందని, ఇంటింటి సందర్శనలు, సంచార బృందాల ద్వారా శతశాతం పోలియోచుక్కలు వేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు వివరించింది.

# నక్సలిజం అంతంతోనే అభివృద్ధి సాధ్యం


- వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ సభలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయి


రాజమహేంద్రవరంలో వాజ్‌పేయీ కాంస్యవిగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

**ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, దేవీచౌక్:** 'మా రాష్ట్రంలో అపార సహజ వనరులున్నా నక్సలిజం కారణంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందడంలేదు. ప్రధాని మోదీ, అమిత్‌షా నిర్ణయాల వల్ల నక్సలిజాన్ని అంతమొందించాం' అని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో భాజపా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర అధ్యక్షతన ఆదివారం జరిగిన మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'అటల్-మోదీ' సుపరిపాలన యాత్రకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకరించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో సోదరభావంతో ముందుకెళ్తామన్నారు. రాయ్‌పుర్-విశాఖపట్నం మధ్య ఎక్స్‌ప్రెస్ హైవే పూర్తయితే దూరం తగ్గి, బంధం మరింత బలపడుతుందన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అణుపరీక్షల ద్వారా భారతశక్తిని ప్రపంచానికి చాటిన వ్యక్తిగా వాజ్‌పేయీ గుర్తుండిపోతారన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెదేపాను స్థాపించి అధికారంలోకి వస్తే, కాంగ్రెస్ అసంబద్ధంగా ఆయనను గద్దె దించినప్పుడు ఎన్టీఆర్‌కు వాజ్‌పేయీ అండగా నిలిచారని గుర్తుచేశారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. క్లిష్ట పరిస్థితుల్లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు, ప్రతిపక్ష నాయకుడు వాజ్‌పేయీ నుంచి సలహాలు, సహకారం తీసుకున్న విషయాలను వివరించారు. తన తండ్రి ఎన్టీరామారావును ఆయన స్వామీజీ అని పిలిచేవారని గుర్తు చేసుకున్నారు. 2014-19లో మోదీ, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న క్రమంలో 2019లో ఒక్క ఛాన్స్ అన్న మాటను నమ్మి వైకాపాకు ప్రజలు అవకాశం ఇవ్వడం వల్ల విధ్వంసం జరిగిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి వాసు తదితరులు మాట్లాడారు.

## పర్యావరణ పరిరక్షణ మానవాళి ప్రాథమిక బాధ్యత

### సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.వి.విశ్వనాథన్



ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.వి.విశ్వనాథన్, చిత్రంలో రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్. సోమయాజులు, విశాఖ పౌర గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ

**విశాఖ లీగల్, న్యూస్‌టుడే:** పర్యావరణ పరిరక్షణ మానవాళి ప్రాథమిక బాధ్యత అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.వి.విశ్వనాథన్ పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయం, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ సంయుక్తంగా ఆదివారం విశాఖలో నిర్వహించిన డి.వి.సుబ్బారావు స్మారకోపన్యాసంలో జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ముఖ్యఅతిథిగా పాల్గొని 'పర్యావరణ దృష్టికోణంలో రాజ్యాంగం - వాతావరణ మార్పులకు పరిష్కారాలు' అంశంపై ప్రసంగించారు. విశాఖలో న్యాయవాదిగా జీవితం ప్రారంభించి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా ఎదిగిన దివంగత సీనియర్ న్యాయవాది డి.వి.సుబ్బారావు నేటి తరానికి ఆదర్శనీయులన్నారు. జాతీయ, అంతర్జాతీయ రాజ్యాంగాలు, చట్టాలు పర్యావరణ పరిరక్షణకు ఎంతగా ప్రయత్నిస్తున్నా, అందరూ కలసికట్టుగా తమవంతు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మంచినీరు, స్వచ్ఛమైన గాలి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. పర్యావరణ పరిరక్షణపై సుప్రీంకోర్టు వెలువరించిన పలు తీర్పుల గురించి ఆయన వివరించారు. పర్యావరణంపై నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే 2030 నాటికి ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు మాట్లాడుతూ ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణ తమ దైనందిన జీవితంలో ఓ భాగంగా స్వీకరించాలన్నారు. సమావేశానికి విశాఖ పౌర గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ అధ్యక్షత వహించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, ప్రముఖ న్యాయవాది డి.వి.సుబ్బారావు మనవడు కేతన్, నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ విశ్రాంత న్యాయమూర్తి ఎన్.వి.బదరీనాథ్, సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డి.సూర్యప్రకాశరావు, జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు కె.వి.రామమూర్తి, ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు


ఆలయం ఎదుట న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్ తదితరులు

**తిరుమల, న్యూస్‌టుడే:** ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్ ఆదివారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న వారికి తితిదే అధికారులు స్వాగతం పలికి, శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఉచితం అంత సులువు కాదు

- టిడ్కో ఇళ్లను వైకాపా ధ్వంసం చేసింది
- మండపేటలో లబ్ధిదారులకు పట్టాలందించిన మంత్రి నారాయణ


టిడ్కో లబ్ధిదారుకు పట్టా అందిస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి

**మండపేట, న్యూస్‌టుడే:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వడం అంత సులువు కాదని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ వ్యాఖ్యానించారు. వైకాపా ప్రభుత్వం గృహాలను పూర్తిగా ధ్వంసం చేసిందని ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఆదివారం లబ్ధిదారులకు టిడ్కో గృహాలను మంత్రి అందించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ 2014-19 మధ్య పట్టణప్రాంతాల వారికి కేంద్రం రాష్ట్రానికి 7 లక్షల గృహాలు మంజూరు చేసిందన్నారు. ఇందులో 5 లక్షల ఇళ్లను జీ ప్లస్ 3 విధానంలో రూ.38 వేల కోట్లతో నిర్మాణం చేపట్టగా వైకాపా ప్రభుత్వం పనులపై నిర్లక్ష్యం వహించి కేవలం పార్టీ రంగులు పులిమిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు ప్రాజెక్టును పట్టాలెక్కించాలని సూచించారని చెప్పారు. అయితే ఖజానా ఖాళీగా ఉండడంతో ఇళ్లు ఉచితంగా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. వచ్చే జూన్ నెలాఖరుకు ఇళ్లన్నీ పూర్తిచేసి అందిస్తామన్నారు. అనంతరం 960 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించి వారితో గృహప్రవేశం చేయించారు. రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులకూ పట్టాలు అందజేశారు. రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ ఇళ్లు ఉచితంగా ఇచ్చే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి నిధులు మంజూరుచేయించడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. శాసనమండలి సభ్యుడు తోట త్రిమూర్తులు, రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, మండపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణిమాట్లాడారు.

# 'పైడాల'పై జరిమానాకు బదులు నజరానాలు

- నాసిరకంగా రోడ్లు వేసినా, బిల్లుల మంజూరు
- పదేళ్లుగా చర్యల్లేకుండా తొక్కిపెడుతున్న ఇంజినీర్లు
- వైకాపా ప్రభుత్వంలో రూ.370 కోట్ల పనులు
- నేడు నెల్లూరు జిల్లా మంత్రి అండతో కాంట్రాక్టులు


ఆత్మకూరు నుంచి సోమశిల మార్గంలో వేసిన నాణ్యత లేని రహదారి

**ఈనాడు, అమరావతి:** నాణ్యత లేకుండా రహదారి పనులు చేసిన పైడాల తిరుపతిరెడ్డి అండ్ బ్రదర్స్ అనే సంస్థపై పదేళ్లుగా ఎటువంటి చర్యలూ తీసుకోకుండా ఇటు ఇంజినీర్లు, అటు నేతలు కొమ్ముకాస్తున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే విచారణ జరిపి నాణ్యతా లోపాలున్నట్లు తేల్చినా, ఇప్పటి వరకు చర్యల్లేకుండా ఆ సంస్థను ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు జాగ్రత్తగా చూసుకుంటున్నారు. ఈ సంస్థ వైకాపా ప్రభుత్వంలో రూ.వందల కోట్ల రోడ్ల పనులు చేసి, భారీగా బిల్లులు పొందింది. ఇప్పుడు కూడా దానికి పనులు దక్కేలా కూటమి ప్రభుత్వంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి, మరికొందరు నేతలు సహకరిస్తుండటం గమనార్హం. నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు నుంచి సోమశిల వరకు 23.2 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు 2012-13లో టెండర్లు పిలిచారు. అంచనా విలువ రూ.22.02 కోట్లు కాగా, రూ.17.05 కోట్లకే (22.59% లెస్‌తో) పనులు చేసేలా నెల్లూరు జిల్లాకు చెందిన పైడాల తిరుపతిరెడ్డి అండ్ బ్రదర్స్ సంస్థ బిడ్ దక్కించుకుంది. ఈ పనులు చేస్తున్నప్పుడే క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు పరిశీలించి, నాణ్యతాలోపాలను గుర్తించారు. బీటీ లేయర్ సరిగ్గా లేదని, వ్యత్యాసాలు 15 శాతానికి పైగా ఉన్నట్లు తేల్చారు. నాణ్యత లేనిచోట మళ్లీ బీటీ లేయర్ వేయాలని, లేకపోతే దాదాపు రూ.8 కోట్ల మేర రికవరీ చేయాలని అధికారులు 2015-16లో నివేదిక ఇచ్చారు. గుత్తేదారు నుంచి సొమ్ములు రికవరీ చేస్తే.. బాధ్యులైన ఇంజినీర్లు, రిటైర్ అయిన ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ ఫైల్‌ను తొక్కిపెడుతున్నారు. గుత్తేదారు సంస్థ, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని గతేడాది మేలో విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చినప్పటికీ, అంతా గప్‌చుప్‌గా ఉన్నారు.

**నాడూనేడూ మంత్రుల అండ:** ఈ గుత్తేదారు సంస్థ వైకాపా ప్రభుత్వంలో భారీగా పనులు చేపట్టింది. అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నియోజకవర్గమైన డోన్‌తో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాల్లో కలిపి రూ.390 కోట్ల మేర పనులు చేయగా, దాదాపు రూ.370 కోట్ల బిల్లులు కూడా పొందింది. గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో డోన్ పరిధిలో కేంద్ర రహదారి నిధి (సీఆర్ఎఫ్)తో చేసిన పనికి సంబంధించి దీని సోదర సంస్థ పైడాల తిరుపతిరెడ్డి అండ్ సన్స్‌కు మాత్రమే రూ.48 కోట్లు చెల్లించేలా బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ఇచ్చారు. దీనిపై ఇతర గుత్తేదార్లు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో ఆ బిల్లు ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఏడాది జూన్‌లో రూ.270 కోట్ల మేర సీఆర్ఎఫ్ పనులకు ఎల్వోసీ జారీ చేయగా, వాటిలో ఒక్క పైడాల తిరుపతిరెడ్డి సంస్థకు చెల్లించాల్సిన రూ.34.25 కోట్ల బిల్లులకు టోకెన్లు జారీచేశారు. ఇందుకు నెల్లూరు జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి ఒత్తిడే కారణమని తెలిసింది. ఆ మంత్రి అండతోనే ప్రస్తుతం నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో ఈ సంస్థలు కొన్ని పనులు దక్కించుకొని చేస్తున్నాయి.

# ఈనాడు

## సర్వీస్ కమిషన్లను సంస్కరించాల్సిందే!

తమ మంచీచెడూ చూసుకోవడానికి ఏర్పాటైన వ్యవస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకం మీదే ఒక సమాజ పురోగతి ఆధారపడి ఉంటుంది. సామాన్య జనంలో ఆ విశ్వాసాన్ని కల్పించడంలో ప్రభుత్వాధికారులదే కీలక భూమిక. పాలకులు, పౌరుల మధ్య వారు వారధులుగా నిలుస్తూ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులకు చేర్చడానికి కృషి చేయాలి. ముఖ్యంగా అసహాయులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేయాలి. ఆ మేరకు ప్రజోపయోగ విధానాల అమలులో ఉన్నతోద్యోగుల ప్రాధాన్యం అగణితమైనది కాబట్టే వారి కొలువులకు తగిన భద్రత ఉంటుంది. దాన్ని సద్వినియోగం చేసుకుంటూ నీతి నిజాయతీలతో ప్రజానీకానికి సేవలందించే సమర్థులను ఆయా ఉద్యోగాలకు ఎంపిక చేయడం రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల (ఎస్పీఎస్సీల) బాధ్యత. ఆ కర్తవ్యాన్ని నిష్ఠగా నిర్వర్తించడంలో అవి పూర్తిగా సఫలం కాలేకపోతున్నాయన్నది వాస్తవం. ప్రజాప్రయోజనాలకు చెరుపు చేసే ఈ దుస్థితి చెదిరిపోవాలంటే, తాజాగా ఎస్పీఎస్సీ ఛైర్పర్సన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించినట్లుగా సర్వీస్ కమిషన్ల పనితీరు పారదర్శకం కావాలి. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ స్పష్టంచేసినట్లు పరీక్షల్లో అక్రమాలను పరిహరించి వికసిత భారత్ ప్రయాణంలో ఎస్పీఎస్సీలు చురుకైన పాత్ర పోషించాలి!

రాజ్యాంగ నిర్దేశం మేరకు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపికకు కేంద్రంలో యూపీఎస్సీ, రాష్ట్రాల్లో పీఎస్సీలు ఏర్పాటయ్యాయి. పరీక్ష తేదీలను పక్కాగా ప్రకటించి, లక్షల సంఖ్యలో దరఖాస్తుదారులను వడపోసి వివాదాలకు అతీతంగా నియామకాలు చేపట్టడంలో యూపీఎస్సీ ప్రమాణాలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. మరోవైపు ఎస్పీఎస్సీలేమో అవినీతి అక్రమాలు, క్వశ్చన్ పేపర్ల లీకేజీలు, పరీక్షలూ ఎంపికల్లో లుకలుకలు, మితిమీరిన రాజకీయ జోక్యాలతో కునారిల్లుతున్నట్లు చిరకాలంగా విమర్శలున్నాయి. సర్వీస్ కమిషన్లు కళంకితులకు ఆవాసాలయ్యాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ జీఎస్ సింఘ్వీ గతంలోనే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి సర్కారీ ఉద్యోగాల కోసం లక్షల సంఖ్యలో యువత రేయింబవళ్లు కష్టిస్తూ, ఎంతో డబ్బుపోసి శిక్షణ పొందుతూ సంసిద్ధమవుతుంటారు. కమిషన్ల కార్యకలాపాల్లోని పెడపోకడలకు నిరుద్యోగుల కలలు కల్లలు కాకుండా కాచుకోవాల్సిన ప్రాథమిక కర్తవ్యం ప్రభుత్వాలదే!

అధికారిక లెక్కల ప్రకారం గడిచిన ఏడేళ్లలో దేశవ్యాప్తంగా ఉద్యోగాలూ బోర్డు పరీక్షలకు సంబంధించి 70కి పైగా పరీక్ష పత్రాలు లీకయ్యాయి. కోట్ల మందిపై అవి ప్రతికూల ప్రభావం చూపాయి. పరీక్షల నిర్వహణలో విపరీత జాప్యాలు, అవకతవకలూ, ఫలితాల వెల్లడిలో అస్తవ్యస్త ధోరణుల వల్ల తప్పని కోర్టు కేసులు ఎస్పీఎస్సీలపై ప్రజల్లో నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. విత్తనంలోని సారాన్నిబట్టే పంట దిగుబడి వస్తుంది. అలాగే సరైన సేవాస్ఫూర్తి, దీక్షాదక్షతలు కలిగిన వారిని కార్యనిర్వాహక వ్యవస్థలోకి తీసుకొస్తేనే సమ్మిళిత ప్రగతి సాధన సాకారమవుతుంది. రాజ్యాంగ ప్రమాణాలూ చట్టాలకు కట్టుబడి జనజీవన ప్రమాణాల పెంపునకు అంకితమై పనిచేయగలిగిన వారు సర్వీసులోకి వస్తే- ఆపై ముప్పై నలభై ఏళ్ల పాటు స్థానిక ప్రజానీకానికి మేలు జరుగుతుంది. అలాంటి వారికి నారుమళ్లు కావాల్సిన ఎస్పీఎస్సీలు దారితప్పకుండా చూసుకోవడం అత్యావశ్యకం. రాజకీయాలతో సంబంధం లేని నిష్పాక్షిక మేధావులు, వృత్తినిపుణులను పీఎస్సీ పదవుల్లో నియమించాలి. ఆధునిక సాంకేతికత సాయంతో పరీక్ష పేపర్ల లీకేజీలను అడ్డుకోవాలి. అలాంటి పాతకాలకు పాల్పడేవారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూడాలి!




బలహీనుల మీద తమ ప్రతాపం చూపేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ బలవంతులు అనిపించుకోరు. సత్యమార్గంలో నడుస్తూ నిస్సహాయులకు తోడ్పడేవారే నిజమైన బలశాలులు.

– గురుగోవింద్ సింగ్

## దయాగుణం

సృష్టిలోని ప్రతి జీవి సుఖంగా జీవించేందుకు అహర్నిశలు శ్రమిస్తుంది. ఒక్క మనిషి తప్ప అన్ని ప్రాణులు ఏరోజుకారోజు ఆహారాన్ని సముపార్జించుకుంటూ జీవనం సాగిస్తాయి. తనను తాను ఉన్నతుడిగా భావించే మనిషి మాత్రం కొన్ని తరాలకు సరిపడా ధనరాశులు సంపాదించాలనే పేరాశతో.. నీళ్లనుకుని ఎండమావుల వెంట పరుగు తీసే జింకలా పరుగెడుతున్నాడు. ఈ లోకం నుంచి నిష్క్రమించేటప్పుడు చిల్లిగవ్వ తీసుకెళ్లలేనని గుర్తెరిగినా అతడి ధనదాహం తీరడం లేదు.

పరులసేవే చెయ్యి, నిత్యం సరికొత్తగా ఆలోచించే మేధస్సుతో పాటు దీనుల పట్ల స్పందించే హృదయం ఉన్నవారు ఈ దేశానికి ఎంతో అవసరం అంటారు స్వామి వివేకానంద. ఇతరులకు సాయం చేయడంలోనే మానవ జన్మకు సార్థకత. మానవత్వంతో జీవించగలగడమే అసలైన భక్తి. అదే ఆధ్యాత్మికతన్నది అంటారాయన.



ఆ భావనతోనే 'ఆత్మనో మోక్షార్థం జగత్ హితాయచ' అనే సూక్తిని ప్రచారం చేశారు. నేను నరకానికి వెళ్లినా పర్వాలేదు, నేను చెప్పే మంత్రం జనోద్ధరణకు ఉపయోగపడితే చాలు- అంటూ గురువు ఉపదేశించిన మంత్రాన్ని ప్రపంచానికి వెల్లడించారు ఆచార్య రామానుజులు. 'మా కురు ధన జన యౌవన గర్వం హరతి నిమేషాత్కాలః సర్వం' అంటూ భజగోవింద స్తోత్రంలో శంకర భగవత్పాదులు. ధనం, యవ్వనం, పరివారం ఉందని గర్వపడకు. ఇవన్నీ కాలంతో పాటే పోయేవేనని మానవాళిని ఏనాడో హెచ్చరించారు.

అంతర్యామి

మహాత్ములు సర్వమూ దైవమయమే అని, దయాగుణమే దైవత్వమని ఉద్బోధించారు. మహారాష్ట్రకు చెందిన విఠలుడి పరమ భక్తుడైన సంత్ ఏకనాథుడి జీవితంలో చోటు చేసుకున్న ఓ ఘట్టాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఒకసారి ఓ సాధువుల బృందం ప్రయాగ నుంచి గంగాజలాన్ని తీసుకుని రామేశ్వరంలోని రామలింగేశ్వరుడికి అభిషేకం చేసేందుకు బయలుదేరింది. వారితో ఏకనాథుడు ఉన్నాడు. ఓ నిర్జన ప్రాంతం నుంచి వారి ప్రయాణం సాగుతుండగా ఓ గాడిద దాహంతో విలవిల్లాడుతూ కనిపించింది. సాధువులంతా దాన్ని చూసి కూడా చూడనట్లు వెళ్లిపోయారు. ఏకనాథుడు మాత్రం తాను తీసుకువెళ్తున్న గంగాజలంతో ఆ గాడిద దప్పిక తీర్చాడు. శివుడికి అభిషేకించాల్సిన పవిత్ర జలాలను తప్పుగా గాడిదకు పోసి పరమేశ్వరుణ్ని అవమానిస్తావా అంటూ తోటి సాధువులంతా నిందించారు. దానికి ఏకనాథుడు 'జగమంతా పరమాత్ముడు నిండి ఉన్నాడని మీరు నమ్మితే, ఆ గాడిదలోనూ ఉంటాడు కదా. అది తాగిన గంగాజలం నేరుగా శివుడికే చేరిందని నా పరిపూర్ణ విశ్వాసం' అని స్పష్టంచేశాడు.

మంచిచెడ్డలను వడపోసే మనసు. అది ఆకాశం నుంచి కురిసే వర్షపు జల్లు వంటిది. శిబి చక్రవర్తి, రంతిదేవుడు, దధీచి, గౌతమ బుద్ధుడు వంటి వారు దయాగుణంతో పరోపకారులయ్యారు. ఉన్నతంగా జీవిస్తూ అలా జీవించే అవకాశాన్ని ఇతరులకు కల్పించడమే అసలైన ధర్మం. దయాగుణాన్ని అలవర్చుకున్నవాడే మానవుడు. మానవత్వం కలిగి ఉండటమే భగవంతుడికి మనం సమర్పించే అసలైన నైవేద్యం.

– మేర్ల సత్య వెంకట త్రిమూర్తులు

# పన్ను విధానాల్లో మార్పే విరుగుడు

ప్రపంచంలో ఆర్థిక అసమానతలు తగ్గడం లేదు. వివిధ దేశాలు, ధనికులు పేదలు, స్త్రీపురుషులు, విద్య, ఆరోగ్యం.. అన్నింట్లోనూ అంతరాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ అసమానతలను పెంచి పోషించేలా ఉందని పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో సీనియర్ ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ లుకాస్ ఛాన్సల్ పేర్కొన్నారు. భారతదేశంలోనూ అసమానతలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. అంతరాలు తగ్గకపోవడానికి కారణాలు తదితర అంశాలపై ప్రపంచవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు చెందిన సుమారు 200 మంది ఆర్థిక శాస్త్రవేత్తలు, గణాంక నిపుణులు కలిసి 'ప్రపంచ అసమానతల నివేదిక-2026'ను రూపొందించారు. 'వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్' ఆధ్వర్యంలో జరిగిన ఈ అధ్యయనానికి లుకాస్, ప్రముఖ ఆర్థికవేత్తలు థామస్ పికెట్టి, రొవాడియా మెస్రిఫ్, రికార్డో నాయకత్వం వహించారు. ఈ అధ్యయన సమన్వయకర్త ప్రొఫెసర్ లుకాస్ ఛాన్సల్ 'ఈనాడు ప్రత్యేక ప్రతినిధి' ఎం.ఎల్.నరసింహారెడ్డికి ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు...



### అసమానతలపై అధ్యయనంలో తేలిన ప్రధానాంశాలేంటి?

ప్రపంచ జనాభాలోని మొదటి పదిశాతం మంది ఆదాయం మిగిలిన 90 శాతం మంది ఆదాయం కంటే చాలా ఎక్కువగా ఉంది. దిగువన ఉన్న యాభైశాతం పేదలు మొత్తం ప్రపంచ ఆదాయంలో పదిశాతంలోపే పొందుతున్నారు. సంపద మరింత కేంద్రీకృతమై ఉంది. పైన ఉన్న పదిశాతం మంది మూడొంతుల ప్రపంచ సంపదను కలిగి ఉన్నారు. దిగువన ఉన్న యాభైశాతం మంది చేతిలో ఉన్న సంపద కేవలం రెండుశాతమే. మరింత లోతుగా పరిశీలిస్తే పైన ఉన్న పదిశాతం మందిలో కూడా బాగా శ్రీమంతులైన 0.001 శాతం మల్టీమిలియనీర్స్- మొత్తం ప్రజల్లో సగం మంది చేతిలో ఉన్న సంపదకంటే మూడు రెట్లు ఎక్కువగా కలిగి ఉన్నారు. వీరి వాటా స్థిరంగా పెరుగుతోంది. అత్యంత సంపన్నులైన ఈ 0.001 శాతం(సుమారు 60వేల మంది) సంపద 1995లో 3.8శాతం ఉండగా, 2025 నాటికి 6.1శాతానికి పెరిగింది. దీన్ని బట్టే అసమానతలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

### ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలూ జనవర్గాల నడుమ ఆర్థిక అసమానతలు ఏ స్థాయిలో ఉన్నాయి?

సంపదలో అసమానతలు 1990వ దశకం నుంచి తీవ్రరూపం దాల్చాయి. పేదల సంపద వృద్ధిలో ఓ మోస్తరు ప్రగతే కనిపిస్తోంటే, పై అంచెలో ఉన్నవారి సంపద చాలా ఎక్కువగా పెరుగుతోంది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై చాలా కొద్ది మందే ఆధిపత్యం చలాయిస్తున్నారు. మరోవైపు కోట్లమంది కనీస అవసరాలకూ నోచుకోలేకపోతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావం విషయంలోనూ అసమానతలున్నాయి. స్త్రీ, పురుషుల మధ్య సైతం తీవ్ర అసమానతలు నెలకొన్నాయి. సగటున పురుషుడు గంటకు సంపాదించే మొత్తంలో మహిళ ఆర్జన 32 శాతం మాత్రమే. ఇంటిపనికి చేసే శ్రమను పరిగణనలోకి తీసుకొంటే ఈ తేడా ఎక్కువగానే ఉంటుంది. మహిళలు ఎక్కువ గంటలు పని చేస్తున్నా, తక్కువగానే ఆర్జిస్తున్నారు. మహిళలు సగటున వారానికి 53 గంటలు పని చేస్తే, పురుషులు 43 గంటలే శ్రమిస్తున్నారు. దేశాల మధ్య సైతం అసమానతలు అధికంగానే ఉన్నాయి. సబ్‌సహారా ఆఫ్రికాలో ఒక విద్యార్థిపై చేసే ఖర్చుకంటే అమెరికాలో 40 రెట్లు ఎక్కువ. చాలా దేశాల్లో ఇదే పరిస్థితి. ధనిక దేశాలు పేద దేశాల్లో ఎయిడ్ కింద ఖర్చు చేసేది జీడీపీలో 0.3 శాతం మాత్రమే. కానీ ఆయా దేశాల నుంచి తీసుకెళ్తున్నది ఒక శాతందాకా ఉంటోంది. అల్పాదాయ దేశాల్లో విద్య, వైద్యం, వాతావరణ మార్పుల నిరోధక కార్యక్రమాలను చేపట్టే పరిస్థితి కూడా లేదు.



### సంపద, ఆదాయాలకు సంబంధించి భారతదేశంలో పరిస్థితేంటి?

ప్రపంచంలో అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. పై అంచెలో ఉన్న పదిశాతం మంది జాతీయ ఆదాయంలో 58 శాతం వాటా కలిగి ఉండగా, దిగువన ఉన్న యాభై శాతం మంది వాటా 15 శాతం మాత్రమే. సంపద అసమానతలు ఇంకా ఎక్కువ. పదిశాతం మంది ధనికులు 65 శాతం సంపదను కలిగి ఉండగా, అగ్రశ్రేణిలోని ఒక శాతం మంది చేతిలో సుమారు 40 శాతం సంపద ఉంది. గడిచిన దశాబ్ద కాలంలో ఈ ఇరువర్గాల నడుమ ఆదాయ వ్యత్యాసాలు స్థిరంగా కొనసాగుతున్నాయి. మహిళా కార్మికుల భాగస్వామ్యం 15.7 శాతం మాత్రమే. మొత్తంగా భారత్‌లో ఆదాయం, సంపద, స్త్రీపురుష అసమానత్వం తీవ్రంగానే ఉన్నాయి.

### అసమానతలను తగ్గించడానికి ఎలాంటి చర్యలు అవసరం?

ప్రభుత్వాలు అసమానతల గురించి మాట్లాడుతూనే ఉన్నా, సంపద మాత్రం కొందరి దగ్గరే మరింతగా పోగుపడుతోంది. పన్నుల విధానంలో ప్రభుత్వాలు ఆధునికతను అందిపుచ్చుకోకపోవడమే ఇందుకు కారణం. ఇక్కడ నేను ప్రపంచంలోని అన్ని ప్రభుత్వాల గురించీ మాట్లాడుతున్నాను. ధనిక, పేద దేశాలనే తేడా లేదు. సమాజం ఎదుర్కొంటున్న వాస్తవిక సవాళ్లను ఎదుర్కోవడానికి అవి సిద్ధంగా లేవు. ఆధునిక ప్రపంచంలో ఆర్థిక వనరుల చలన స్వభావాన్నిబట్టి పెట్టుబడులు ఒక దేశం నుంచి మరొక దేశానికి సులువుగా వెళ్లిపోతున్నాయి. అత్యంత సంపన్నులు పన్ను ఎగవేయడాన్ని ఇది సులభతరం చేస్తుంది. కాబట్టి పన్నుల విధానంలో ఆధునికత అంటే సంపదపై పన్ను విధించడమే. అత్యంత పై స్థాయిలో అసమానతలు విపరీతంగా పెరుగుతుండటంతో ఇలాంటి చర్యలు అవసరం.

### ప్రభుత్వాలు గట్టి నిర్ణయాలు తీసుకుని అమలు చేసే పరిస్థితి ఉందా?

ఈ విషయంలో ప్రభుత్వాలు ఇంకా సందేహిస్తున్నాయి. వేచి చూస్తున్నాయి. నిరుటి జీ20 సదస్సులో అత్యంత ధనికుల నుంచి అధిక మొత్తంలో ఆదాయపన్ను వసూలు చేయడంపై నిర్దుష్టమైన ప్రతిపాదనలు రావడం మంచి పరిణామం. ప్రపంచవ్యాప్తంగా శతాధిక కోటీశ్వరులపై రెండుశాతం కనీస పన్ను విధించాలన్న ప్రతిపాదనకు ఇది దారి తీసింది. ఇలాంటి వాటిని అన్ని దేశాల్లో స్వచ్ఛందంగా అమలు చేయవచ్చు. ఇవి జరగనంత వరకు అసమానతలు విపరీతంగా పెరుగుతూనే ఉంటాయి. ఇటీవలి కాలంలో ఆరోగ్యం, విద్యపై ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వాల దగ్గర వనరులు ఉండటం లేదు. శ్రీమంతుల్లో చాలామంది పన్ను చెల్లించకపోవడం కూడా ఒక కారణమే. వారి నుంచి పన్నులు వసూలు చేస్తే ప్రజోపయోగ కార్యక్రమాలకు వనరులు పెరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన సర్వేలన్నింట్లో అన్ని వర్గాలకు చెందిన అత్యధిక ప్రజలు ఈ విధానాలకు మద్దతు తెలిపారు. నాయకులు మాత్రం దీనికి సిద్ధంగా ఉన్నట్లు లేదు. కానీ ఏదో ఒక సమయంలో వాళ్లు కూడా ఒప్పుకొంటారు. నూతన పన్ను విధానాలే కాకుండా ప్రభుత్వాల దన్నుతో ప్రపంచవ్యాప్తంగా అసమానతల తగ్గింపును పర్యవేక్షించడానికి అంతర్జాతీయ సంస్థలు ఏర్పాటు కావాలి. ★

# ప్రైవేటు పరిశోధనకు సర్కారీ దన్ను

కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్లు, సింథటిక్ బయాలజీ వంటి అధునాతన సాంకేతికతలే 21వ శతాబ్దిలో అభివృద్ధికి చోదక శక్తులు. వీటిలో రాణించాలంటే ఆర్‌అండ్‌డీకి పెద్దపీట వేయాలి. ముఖ్యంగా సృజనశీలురను నియమించి, వారికి భారీగా నిధులూ, వసతులను కేటాయించాలి. రెండో ప్రపంచ యుద్ధం నుంచి అమెరికా ఇలాగే పనిచేసి అగ్రరాజ్యంగా ఎదిగింది. చైనా సైతం అదే బాట పట్టి నేడు అమెరికాకు పోటీ ఇస్తోంది. ఇండియా ఇప్పుడిప్పుడే ఆ దిశగా అడుగులు వేస్తోంది.

చైనా 2008లో 'సహస్ర ప్రతిభల ఆకర్షక పథకం' ద్వారా విదేశాల నుంచి సుమారు ఏడు వేల మంది తన శాస్త్రవేత్తలు, వ్యవస్థాపకులను స్వదేశానికి రప్పించింది. 2011లో సహస్ర యువ ప్రతిభావంతుల ఆకర్షక కార్యక్రమంతో విదేశీ సృజనశీలురనూ రప్పించుకోగలిగింది. కానీ- ఇదంతా అమెరికా, ఐరోపా దేశాల పరిశోధనా ఫలాలను కొల్లగొట్టడానికీ, మేధా హక్కుల చౌర్యానికీ డ్రాగన్ పన్నిన పన్నాగమని పాశ్చాత్య నిఘా సంస్థలు పసిగట్టాయి. దాంతో డ్రాగన్ ఆ పథకాల గురించి మాట్లాడటం మానేసి, 2023లో 'క్విమింగ్(జ్ఞాన సముపార్జన)' వంటి కార్యక్రమాలు



చేపట్టింది. సృజనశీలురకు భారీగా నగదు, గృహవసతి, వారి జీవిత భాగస్వాములకు ఉద్యోగాలు, పిల్లలకు చదువు వంటి సదుపాయాలను అందిస్తోంది. మరోవైపు, అమెరికాలో ట్రంప్ సర్కారు హెచ్-1బీ, గ్రీన్‌కార్డ్ పథకాలకు కోతపెట్టడాన్ని కూడా చైనా తనకు అనువుగా మలచుకుంటోంది. విదేశీ నిపుణులకు కె-వీసా పథకంతో ముందుకొచ్చింది. ఈ కార్యక్రమాల వల్ల నేడు ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, 5జీ, 6జీ, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో డ్రాగన్ అమెరికాను సవాలు చేస్తోంది.

### లక్ష కోట్లతో ప్రత్యేక నిధి

జిన్‌పింగ్ సర్కారు తమ యూనివర్సిటీలు, పరిశ్రమల మధ్య అనుసంధానాన్ని ఏర్పరచింది. ప్రతిభావంతులకు సౌకర్యాలు సమకూర్చి గొప్ప ఫలితాలు సాధిస్తోంది. ట్రంప్ ప్రభుత్వం మాత్రం హార్వర్డ్ వంటి విఖ్యాత విశ్వవిద్యాలయాలు, జాతీయ క్యాన్సర్ పరిశోధన సంస్థ, ఆరోగ్య సంస్థ, సైన్స్ ఫౌండేషన్‌లకు నిధులు తెగ్గోసేసింది. 'నాసా'కూ నిధులు తగ్గించేసింది! సైన్స్, టెక్నాలజీ రంగాల్లో దాదాపు అయిదు వేల రీసెర్చ్ గ్రాంట్లను రద్దు చేసింది. దీంతో ఆర్‌అండ్‌డీని ప్రైవేటు పరం చేయడమే ట్రంప్ ఉద్దేశమా అనే ప్రశ్న తలెత్తింది. అయితే, ఇక్కడ ట్రంప్ సర్కారు ప్రకటించిన 'స్టార్ గేట్' పథకాన్ని ప్రస్తావించాలి. దాని కింద ఓపెన్ ఏఐ, ఒరాకిల్, సాఫ్ట్ బ్యాంక్ వంటి ప్రైవేటు సంస్థలు ఏఐ రంగంలో 50వేల కోట్ల డాలర్ల పెట్టుబడి పెడతాయి.

భారత్ కూడా ఆర్‌అండ్‌డీలో ప్రైవేటుకు పెద్దపీట వేయదలచింది. ఆ క్రమంలోనే కేంద్రం- ప్రస్తుత బడ్జెట్‌లో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశోధన-అభివృద్ధి, నవీకరణ నిధి(ఆర్‌డీఐ)ని ప్రకటించింది. ఈ నిధులను ఆరేళ్లలో ఖర్చుపెడతారు. తొలి విడతగా రూ.20వేల కోట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే విడుదల చేస్తారు. ఏఐ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ (డీప్‌టెక్) రంగాల్లో ప్రైవేటు పరిశోధన ప్రాజెక్టుల కోసం ఆర్‌డీఐ నిధి నుంచి స్వల్ప వడ్డీపై దీర్ఘకాలిక రుణాలిస్తారు. ఇందుకోసం 'ఫండ్ ఆఫ్ ఫండ్స్'ను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే అణు, అంతరిక్ష రంగాల్లో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించిన కేంద్రం- డీప్‌టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, హరిత ఇంధనాలు, జాతీయ భద్రతతో ముడిపడిన రక్షణ సాంకేతికతల్లోనూ ప్రైవేటు పరిశోధనలకు ఊతమిస్తుంది.

### జంకును పోగొట్టేందుకే...

అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో అంతర్భాగమైన స్పెషల్ పర్పస్ ఫండ్(ఎస్‌పీఎఫ్)... లక్ష కోట్ల ఆర్‌డీఐకు నిర్వహణదారుగా ఉంటుంది. ఈ ఎస్‌పీఎఫ్ నుంచి ద్వితీయస్థాయి నిర్వహణ సంస్థలకు మూలధనం లభిస్తుంది. వీటిలో బ్యాంకింగేతర ఫైనాన్స్ సంస్థలు, ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు(ఏఐఎఫ్), అభివృద్ధి ఫైనాన్స్ సంస్థలు(డీఎఫ్ఐ) ఉంటాయి. ఆర్‌డీఐ పథకాన్ని అమలుచేసే బాధ్యతను కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ స్వీకరించినప్పటికీ- ఏయే కంపెనీలు, స్టార్టప్‌లకు నిధులివ్వాలనేది ఎంపిక చేయదు. మార్కెట్లో విజయం సాధించగల కంపెనీలను ఎంపికచేసే బాధ్యతను ద్వితీయ స్థాయి మేనేజింగ్ సంస్థలకు అప్పగిస్తుంది. ఇజ్రాయెల్‌లో యోజ్మా కార్యక్రమం, దక్షిణ కొరియాలో టెక్నాలజీ ఫండ్‌లు ఇదే మార్గాన్ని అనుసరించాయి. అమెరికా రక్షణ శాఖ, నాసా ఇచ్చిన నిధులూ ప్రోత్సాహకాల వల్లే సిలికాన్ వ్యాలీలో స్టార్టప్‌లు వరుస విజయాలు సాధించాయి. అలాగని ఆర్‌అండ్‌డీ ఎల్లవేళలా ఆశించిన ఫలితాలనే ఇవ్వకపోవచ్చు. కాబట్టి, దీనిపై భారీ పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేటు సంస్థలు వెనకాడతాయి. ఈ జంకును పోగొట్టడానికి ప్రభుత్వమే నిధులిచ్చి ప్రైవేటు నవకల్పనలను ప్రోత్సహించాలన్నది ఆర్‌డీఐ పథకం ఉద్దేశం. 2047కల్లా నవీకరణ ద్వారా వికసిత భారత్ సాధనకు ఆర్‌డీఐ పథకం తోడ్పడగలదని ప్రభుత్వం ఆశిస్తోంది. ట్రంప్ నిర్ణయాలతో హెచ్-1బీ, గ్రీన్‌కార్డుల భవిష్యత్తు ప్రశ్నార్థకం కావడంతో భారతీయ ప్రతిభావంతులు ఇక పెద్దసంఖ్యలో అమెరికాకు వెళ్లలేకపోవచ్చు. వీరి ప్రజ్ఞను స్వదేశంలో వినియోగించుకోవడంతోపాటు, ఇప్పటికే విదేశాల్లో ఉంటున్న భారతీయ మేధావులను కూడా తిరిగి రప్పించాలి.

– వరప్రసాద్

కొంతకాలంగా అమర్ ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. అతడి స్నేహితుడు సంపత్ గమనించి, ఏమైందని అడిగాడు. అమర్ నెమ్మదిగా మనసులోని మాట చెప్పాడు. 'నా కొలీగ్స్ ఉద్యోగంలో వేగంగా ఎదుగుతున్నారు. చదువులో నేను వారికన్నా మెరుగ్గా ఉండేవాణ్ని. అలాంటిది ఇప్పుడెందుకు వెనకబడుతున్నానో అర్థం కావడం లేదు. ఆ మధ్య మా కంపెనీలో ఒక లైఫ్ కోచ్ స్వాట్(ఎస్‌డబ్ల్యూఓటీ) గురించి చెప్పారు. బలాలు(స్ట్రెంగ్త్స్), బలహీనతలు(వీక్‌నెసెస్), అవకాశాలు(అపార్చునిటీస్), అపాయాలు(థ్రెట్స్) అనే నాలుగు అంశాలను విశ్లేషించడం ద్వారా జీవితంలోనూ, వృత్తిలోనూ ముందుకు వెళ్లవచ్చన్నారు. బలాలను పెంచుకోవాలి, బలహీనతలను తగ్గించుకోవాలి, అవకాశాలను వినియోగించుకోవాలి, అపాయాలను అధిగమించాలి... అని అందరూ చెబుతున్నారు. కానీ వాటిని అసలెలా గుర్తించాలో ఎవరూ చెప్పడం లేదు' అని అమర్ నిట్టూర్చాడు.

## ఎలా గుర్తించాలి?




'అదా నీ బాధ' అంటూ సంపత్ చిరునవ్వుతో వాటి గురించి వివరించాడు.

'ఏ పనులు నువ్వు ఇతరులకన్నా బాగా చేస్తావు? నీకున్న ప్రత్యేకమైన నైపుణ్యాలేంటి? నీకు గర్వంగా అనిపించే విజయాలేవి?... ఈ ప్రశ్నలకు మనం ఇచ్చే సమాధానాలే మన బలాలు. ఉదాహరణకు నువ్వు ప్రాజెక్ట్‌లను సమయానికి పూర్తి చేస్తావనుకో, అది నీ బలం. నీ దృష్టికోణం లోంచి మాత్రమే చూడకుండా, నీ చుట్టూ ఉన్నవారి అభిప్రాయాలను తెలుసుకుని ఇలాంటివాటి జాబితా రాసుకో. వాటిని మరింతగా మెరుగుపరచుకో. ఇక రెండోది- ఏ పనుల నుంచి తప్పించుకుందామని చూస్తావు? నీవల్ల కాదులే అని ఇతరులు వేటి గురించి అంటారు? నీ అలవాట్లలో, వ్యక్తిత్వంలో వృత్తి ఎదుగుదలకు అడ్డుగా నిలిచే లక్షణాలు ఏమైనా ఉన్నాయా?... అవన్నీ బలహీనతలు. నలుగురి ముందు మాట్లాడటానికి సంకోచించడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం చేయడం.. లాంటివన్న మాట.


'అవకాశాల విషయానికి వస్తే- మనకు సహాయపడే టెక్నాలజీలు ఏమిటి? మనం ఎంచుకున్న రంగం అభివృద్ధి చెందుతోందా? ఆ అభివృద్ధిలో మనం భాగం పంచుకోగలమా?... ఇలాంటివి. కంటికి కనబడే అవకాశాలను అందరూ అందిపుచ్చుకుంటారు. కంటికి కనబడని అవకాశాలను చూడగలగాలి. ఉదాహరణకు సహోద్యోగి సెలవు పెట్టినప్పుడు ఆ పనిని స్వచ్ఛందంగా చేస్తే కొత్త పని చేతనవుతుంది, అనుభవం పెరుగుతుంది. అమ్మో ఆ పని నాకెందుకు- అనుకుంటే ఏమీ రాదు. అలాగే పనిచేసే రంగానికి సంబంధించిన కొత్త సాంకేతికతలను నేర్చుకోవడం కూడా. ఇక్కడ స్వయంగా చొరవ చూపాలే కానీ, ఎవరూ వచ్చి మనకు చెప్పరు. ఇక, చివరిదైన అపాయాల దగ్గరికి వస్తే- ప్రస్తుతం ఉన్నచోట ఎదుర్కొంటున్న పోటీ, చేస్తున్న పనికి డిమాండ్ తగ్గడం, మారుతున్న సాంకేతికత దానికి కారణం కావడం... ఇలాంటివి.

'స్వాట్ విశ్లేషణ మన బలాలు, బలహీనతలు, అవకాశాలు, అపాయాలను అద్దంలా స్పష్టంగా చూపిస్తుంది. ఈ విశ్లేషణ ద్వారా మన సమస్యలేంటో, వాటినెలా ఎదుర్కోవాలో అర్థమవుతుంది.'

– ఆచార్య శివకుమార్ నన్నపనేని

## నిజాయతీకి ఫలితం!

రామాపురం జమీందారు దగ్గర శేషయ్య ఉద్యోగం చేసేవాడు. ఒకసారి జమీందారు ఇంట్లో డబ్బు, నగలు తీసుకొని శేషయ్య పారిపోయాడు. మూడు రోజులైనా అతని జాడ తెలియలేదు. దాంతో శేషయ్య స్థానంలో వేరే ఎవరైనా నమ్మకమైన వ్యక్తిని నియమించాలని అనుకున్నాడు జమీందారు. దాని కోసం ప్రకటన ఇచ్చాడు. ఆ ఉద్యోగం కోసం చాలామందే వచ్చారు. అదే సమయానికి శేషయ్య దొరికాడనీ.. కానీ అతని దగ్గర డబ్బు మూట లేదని ఒక వ్యక్తి వచ్చి చెప్పాడు. 'మరి అది ఏమైనట్లు?' అడిగాడు జమీందారు. 'చీకట్లో పరిగెత్తుతుంటే ఈ చుట్టుపక్కలే ఎక్కడో పడిపోయిందట' అని వివరించాడా వ్యక్తి. దాంతో జమీందారుకు ఏం చేయాలో తోచలేదు. అప్పుడు ఉద్యోగం కోసం వచ్చిన వాళ్లతో.. 'మీరు ఇప్పుడు వెళ్లి, రెండు రోజుల



తరవాత రండి. అప్పుడు మీకు పరీక్ష పెట్టి, అర్హుడిని ఉద్యోగంలో చేర్చుకుంటాను' అన్నాడు. ఇంతలో ఆ జనంలోంచి రాముడు ముందుకొచ్చి.. 'అయ్యా! నేను వస్తుంటే దారిలో ఈ మూట కనిపించింది. ఇప్పటివరకూ మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే శేషయ్య దొంగిలించింది ఇదేనేమో అనిపిస్తోంది' అన్నాడు. మూటను చూసి అదేనని చెప్పాడు జమీందారు. 'అయితే మాకు ఇప్పుడే పోటీ పెట్టి.. ఎవరో ఒకర్ని ఎంపిక చేయండి. అసలే చాలా దూరం నుంచి వచ్చాం' అన్నాడు రాముడు. 'ఇక పరీక్ష అవసరం లేదు. అందరూ వెళ్లిపోవచ్చు.. రాముడే ఈ కొలువుకు అర్హుడు' అని చెప్పాడు జమీందారు.

'అదెలా?' అంటూ ప్రశ్నించారు అక్కడున్నవాళ్లు. 'అంత ధనం దొరికినా దాన్ని తీసుకుని పారిపోకుండా, వచ్చిన పని మీదే దృష్టి పెట్టాడు. ఒక పనిలో చేరడానికి నిజాయతీ, దాని మీద ఇష్టం చాలా ముఖ్యం. అవి అతని దగ్గర ఉన్నాయి' అన్నాడు జమీందారు. దాంతో రాముడి నిజాయతీకి ఫలితం దక్కిందని అంతా అభినందించారు.

– నంద త్రినాథ రావు

## నేనెవర్ని?

1. నేనో నాలుగు అక్షరాల పదాన్ని. 'పాలు'లో ఉంటాను కానీ 'వేలు'లో లేను. 'దరువు'లో ఉంటాను కానీ 'అరువు'లో లేను. 'రణం'లో ఉంటాను కానీ 'కణం'లో లేను. 'సంత'లో ఉంటాను కానీ 'చెంత'లో లేను. నేనెవర్ని?
2. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'వల'లో ఉంటాను కానీ 'అల'లో లేను. 'నయం'లో ఉంటాను కానీ 'గాయం'లో లేను. 'అరు'లో ఉంటాను కానీ 'ఆశ'లో లేను. 'కాలు'లో ఉంటాను కానీ 'కాలం'లో లేను. ఇంతకీ నేనెవర్ని?

జవాబు: 1.పాదరసం 2.వనరులు

## శ్రీమతి అమరావతి... ఎవరికో బహుమతి



విజయవాడ నోవోటెల్‌లో **శ్రీమతి అమరావతి** సీజన్-10 ఆడిషన్స్ ఆదివారం నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేలా మహిళలు ర్యాంప్ వాక్‌తో సందడి చేశారు. 34 మంది పాల్గొనగా 22 మందిని జనవరి 10న జరిగే ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

## వ్యవసాయ సమస్యలకు పరిష్కారం పొందండిలా..!

### 'ఈనాడు' ఆధ్వర్యంలో డీఏవోతో ఫోన్‌ఇన్ రేపు

ఈనాడు మీతోడు



**జి**ల్లాలో రబీ సీజను ఆరంభమైంది. ఇందుకు సరిపడా యూరియా, ఎరువులను అందుబాటులో ఉంచామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఎరువుల నిల్వలు, వీటి పంపిణీలో, రబీ పంటలకు సంబంధించి రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి (డీఏవో) **డి.ఎం.ఎఫ్.విజయకుమారి** తో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. అన్నదాతలు తమ సమస్యలను నేరుగా తెలియజేయవచ్చు. ఆమె సమాధానాలు ఇస్తారు. రైతులు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో ఈ కింది నంబర్‌కు ఫోన్ చేయడమే. - న్యూస్‌టుడే, ఎన్టీఆర్ కలెక్టరేట్

**83310 56859** | 23.12.25 మంగళవారం | 11–12 గంటల మధ్య

## ఇ-చలానా తెలుసుకోండిలా..

### కొత్తగా 'వాట్సప్ గవర్నెన్స్'లో సేవలు

**ప్ర**భుత్వ సేవలన్నీ ఇప్పుడు ఒక్క క్లిక్‌తో మీ చరవాణిలోనే పొందవచ్చు. దీని కోసం వాట్సప్ గవర్నెన్స్ అందుబాటులోకి తెచ్చారు. తాజాగా పోలీసు సేవలను చేర్చారు. దీనిలో మీ వాహనంపై ఉన్న ఇ-చలాన్‌ల వివరాలను తెలుసుకోవచ్చు.. అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చెల్లించవచ్చు.





పోలీసులు రూపొందించిన బ్రోచర్..

రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ సేవల కోసం 95523 00009 నంబరును అందుబాటులోకి తెచ్చింది. దీనిని మీ ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి. వాట్సప్‌లో HI అని మేసేజ్ చేయండి. 'మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్' వస్తుంది. 'టీఈ' అని టైప్ చేస్తే.. తెలుగు భాషలోకి మారుతోంది. దాని కింద భాగంలో ఉన్న 'సేవను ఎంచుకోండి' అనే దాన్ని క్లిక్ చేయండి. వచ్చిన సేవల్లో 'పోలీస్‌శాఖ సేవలు' ఎంపిక చేసుకుంటే.. దానిలో ఎఫ్ఐఆర్, ఎఫ్ఐఆర్ స్థితి, ఇ-చలాన్ అనే మూడు ఆప్షన్లు వస్తాయి. ఇ-చలాన్ వివరాలను ఎంపిక చేసి.. మీ వాహనం నంబరు నమోదు చేసి క్లిక్ చేయాలి. మీ వాహనం రిజిస్ట్రేషన్ నంబరుపై ఉన్న ఇ-చలాన్‌లు కనిపిస్తాయి. వాటిని ఆన్‌లైన్‌లోనే.. బ్యాంకు కార్డు ద్వారా చెల్లింపులు చేయవచ్చు. రశీదు కూడా వస్తుంది. ఒకవేళ చలాన్‌లు లేకపోతే.. 'నో చలానాస్ ఫౌండ్' అని వస్తుంది.

**రవాణా శాఖ చలానాలు**

నిబంధనలను ఉల్లంఘించిన వాహన చోదకులపై రవాణాశాఖ కూడా చలాన్‌లు విధిస్తుంటుంది. వీటిని ప్రత్యేకంగా 'పరివాహన్ సేవ' అనే వెబ్‌సైట్లో చూడొచ్చు. దీని కోసం https://parivahan.gov.in అనే సైట్లోకి వెళ్లి 'ఇ చలాన్ పేమెంట్'ను క్లిక్ చేయండి. దానిలో మీ వాహనం నంబరు నమోదు చేసి.. క్లిక్ చేస్తే మీ వాహనంపై ఉన్న ఇ-చలాన్‌లు వరుసగా కనిపిస్తాయి. ఇక్కడ రవాణాశాఖ చలాన్‌లతో పాటు పోలీస్‌శాఖ నమోదు చేసిన చలాన్‌లు కూడా కనిపిస్తాయి. అక్కడే పేమెంట్ ఆప్షన్ కూడా ఉంటుంది. దాన్ని క్లిక్ చేసి ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టేయవచ్చు.

– విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

## మహిళా నేతకే.. తెదేపా పగ్గాలు

★ గద్దె అనూరాధకు దక్కిన అవకాశం
★ పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారి




తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలిగా గద్దె అనూరాధ నియమితులయ్యారు. జిల్లాలోని సామాజిక సమీకరణాల నేపథ్యంలో అనూరాధకు అనూహ్యంగా అవకాశం లభించింది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఒకచోట ఓసీ, మరోచోట బీసీలకు తెదేపా అధిష్ఠానం అవకాశం కల్పిస్తోంది. జిల్లాల విభజన తర్వాత నుంచి ఇదే పంథా కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లాకు ఓసీ వర్గానికి చెందిన నెట్టెం రఘురామ్, కృష్ణాకు బీసీ వర్గం నేత కొనకళ్ల నారాయణరావు గత అధ్యక్షులుగా వ్యవహరించారు. ఇప్పుడు కూడా కృష్ణా జిల్లా పార్టీ పగ్గాలను బీసీ సామాజిక వర్గం నేత వీరంకి గురుమూర్తికి అప్పగించడంతో.. ఎన్టీఆర్‌లో ఓసీ వర్గానికి చెందిన గద్దె అనూరాధకు అవకాశం ఇచ్చారు. తెదేపా ఆవిర్భావం నుంచి ఒక్కసారి కూడా ఉమ్మడి, ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాకు మహిళా నేతలు పార్టీ పగ్గాలు చేపట్టింది లేదు. తొలిసారి గద్దె అనూరాధకే అవకాశం కల్పించారు.

జిల్లాలోని తిరువూరు సహా పలు నియోజకవర్గాల్లో పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి అనుభవజ్ఞురాలైన నేత అవసరం. కూటమి పార్టీల మధ్య కూడా సమన్వయలోపం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న గద్దె అనూరాధకు అవకాశం ఇస్తే పరిస్థితులను ఆమె చక్కదిద్దగలరని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. 2014-19 వరకు ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్‌గా అనూరాధ పనిచేసిన సమయంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా తన హయాంలో పాలన సాగించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు. ఉత్తమ జిల్లా పరిషత్ అవార్డు ఆమె హయాంలోనే వరించింది. ఆది నుంచి సౌమ్యంగా.. చాలా స్పష్టంగా.. ప్రతి విషయంలోనూ ఆమె నిర్ణయాలు, వ్యవహారశైలి ఉంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వివాదాలు పరిష్కారం కావాలంటే అలాంటి వ్యవహారశైలి, అనుభవం ఉన్న నేత ఉండాలనే భావనతోనే అనూరాధకు అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. అనూరాధ భర్త గద్దె రామ్మోహన్ విజయవాడ తూర్పు ఎమ్మెల్యే. వీరిద్దరూ జిల్లా పార్టీలో కీలకమైన నేతలుగా కొనసాగుతున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. ఈనాడు, అమరావతి– న్యూస్‌టుడే, కొండపల్లి

### పార్టీ విధేయుడికి ప్రధాన కార్యదర్శి పదవి..



ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా **చెన్నుబోయిన చిట్టిబాబు** నియమితులయ్యారు. పార్టీ విధేయుడిగా పేరున్న చిట్టిబాబు.. ప్రస్తుతం కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. వైకాపా హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆయన కౌన్సిలర్‌గా గెలిచారు. కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్ ఎన్నిక వివాదం అవ్వడంతో ఎట్టకేలకు న్యాయస్థానం ఆరు నెలల కిందట తీర్పు ఇవ్వడంతో చిట్టిబాబు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. తాజాగా ఆయనకు పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది.



## బొప్పాయి చెట్టుకి క్యారెట్..!

బొప్పాయి చెట్లకు క్యారెట్లు కాయడం ఎక్కడైనా చూశారా..? అదేంటి, క్యారెట్ భూమి నుంచి వస్తుంది కదా..! బొప్పాయికి అదెలా సాధ్యమని ఆశ్చర్యపోకండి. ఇటీవల బొప్పాయి తోటల్లో క్యారెట్‌లు, పక్షుల తరహాలో కాయలు చిత్ర విచిత్రంగా కనిపిస్తున్నాయి. ప్రతీ తోటలో ఎక్కడో ఓ చోట గోచరిస్తుంటే అన్నదాతలు ఆశ్చర్యపోతున్నారు. ఇందులో భాగంగానే ఎన్టీఆర్ జిల్లా మైలవరం ప్రాంతంలోని ఓ తోటలో క్యారెట్ మాదిరిగా బొప్పాయి కాసింది. అయితే జన్యుపర లోపాలతో పాటు, రైతుల సస్యరక్షణలో లోపాలతోనే కాయ పరిమాణం పెరగక వేరే ఆకృతుల్లో కనిపిస్తున్నాయని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, మైలవరం

## 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' నేడు

**ఎన్టీఆర్ కలెక్టరేట్:** జిల్లాలో ఈ నెల 22వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వివరించారు. అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చన్నారు.

## అలంకారం అపురూపం .. అతివ నైపుణ్యం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

**ఉ**త్సవాలు, నవరాత్రుల సమయాల్లో దేవతామూర్తుల అలంకరణకు భక్తులు ఎంతో ప్రాధాన్యం ఇస్తుంటారు. వివిధ రకాల పూలదండలు, వస్త్రాలతో అలంకరణ చేయడం సాధారణమే కానీ బందరు మండలం మేకవానిపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మవార్లు మాత్రం యాలకులు, బాదంపప్పులతో చేసిన దండలు, కిరీటాలు ధరించి ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారు. వీటి వెనుక ఆలయ నిర్వాహక సభ్యురాలు ఖుర్షిదా సృజన దాగి ఉంది.



ఖుర్షిదా

**కొన్ని రోజుల ముందు నుంచే..** సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఒక్కో పర్వదినాన ఒక్కో రకమైన అలంకరణలో దేవతామూర్తులు దర్శనమిస్తారు. స్వామివారి జన్మ నక్షత్రం కృత్తికా, సుబ్రహ్మణ్య షష్ఠి, కావడిసేవ తదితర రోజుల్లో ఆకట్టుకునే అలంకరణ చేస్తారు. బాదంపప్పు, యాలకులు, వివిధ రకాల పుష్పాలు, గడ్డి, నెమలి





పింఛాలు, ముత్యాల దండలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. బాదంపప్పు, యాలకులతో చీరలు, అమ్మవారి జడలు చేయడం విశేషం.


## సంక్షేమం... ఆరోగ్యానికి ప్రాధాన్యం

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రజలకు ఒక వైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. మరో వైపు మెరుగైన వైద్య సేవలు అందేలా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని మంత్రి సవిత, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనూరాధ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని ఏపీఐఐసీ కాలనీలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 52 లక్షల మంది చిన్నారులున్నట్లు సర్వేలో తేలిందని, ఆ పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనూరాధ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు అశ్రద్ధ చేయకుండా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, పేరేపి ఈశ్వర్, పొట్లూరి సాయి బాబు, పాతూరి సాంబశివరావు, వడ్లపట్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి సవిత, గద్దె అనూరాధ తదితరులు

## ప్రమాదం చెప్పి రాదు.!



**పా**ఠశాలలకు సెలవు రోజుల్లో నగరంలో ఆట స్థలాలు లేక కృష్ణా నది ఒడ్డున ఇసుక తెన్నెలపై ప్రమాదకరంగా ఆటలు ఆడుతున్నారు. నీటి కుంటల్లో లోతు తెలియక దిగి చిన్నారుల ప్రాణాలు పోయిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. వీటి సమీపంలోకి రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. -ఈనాడు, అమరావతి

## గురితప్పని బుల్లెట్

### రైఫిల్ షూటింగ్‌లో ఉమా మహేష్ పతకాలు
### ఒలింపిక్స్‌లో విజయమే లక్ష్యంగా సాధన

నగరంలోని పోస్టల్ కాలనీలో నివసించే మద్దినేని రామకృష్ణ, మంజుల దంపతుల కుమారుడు ఉమా మహేష్ (20) రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటుతున్నాడు. కేఎల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 3 నుంచి 11 వరకు జైపూర్ (రాజస్థాన్)లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో తలపడి రైఫిల్ షూటింగ్‌లో రజత పతకం సాధించాడు. 2017లో ఇతను షూటింగ్‌లో అడుగుపెట్టాడు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్- 17 పోటీల్లో తలపడి కాంస్య పతకాన్ని సాధించి.. రాష్ట్ర జట్టులో స్థానం సాధించాడు.



**అ**నంతరం గుంటూరులోని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్‌లో కోచ్ సుబ్రహ్మణ్యం వద్ద ప్రవేశించారు. ఆరు నెలల పాటు తండ్రి రోజూ అతన్ని గుంటూరు తీసుకెళ్లి శిక్షణకు దించి తిరిగి మళ్లీ రాత్రి 10 గంటలకు తీసుకొచ్చేవారు. ప్రస్తుతం భారత సీనియర్ జట్టులో కొనసాగుతూ విజయవాడ నగరపాలక సంస్థకు స్వచ్ఛ నిర్వేక్షణ్ కార్యక్రమానికి 'బ్రాండ్ అంబాసిడర్'గా కొనసాగుతున్నాడు. 2028 లాస్ ఏంజల్స్ ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాడు ఉమా మహేష్.

– న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

**ఇవీ విజయాలు:** 2022లో జర్మనీలో జరిగిన జూనియర్ వరల్డ్ కప్‌లో పసిడి పతకం సాధించాడు. 2023లో దక్షిణ కొరియాలో జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌లో కాంస్యం, అదే ఏడాది దక్షిణ కొరియాలో జరిగిన ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి, రజతం దక్కాయి. 2024లో ఇండోనేషియాలో జరిగిన ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో ఒక పసిడి, ఒక రజతం, 2024 స్పెయిన్‌లో జరిగిన వరల్డ్ కప్‌లో వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో రెండు పసిడి పతకాలు పొందాడు. 2024 దిల్లీలో వరల్డ్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకం, మూడేళ్ల పాటు బెంగళూరు, అసోం, జైపూర్‌లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఒక పసిడి, రెండు రజత పతకాలు, 2024 హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో ఆలిండియా అంతర్ విశ్వ విద్యాలయాల షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి దక్కింది.



## 24న ఉద్యోగ మేళా

**కలెక్టరేట్ (మచిలీపట్నం):** ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉయ్యూరులో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. బస్టాండ్ సమీపంలోని ఎన్‌ఏసీ శిక్షణ కేంద్రంలో ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుంది. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఫార్మసీ పూర్తిచేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసున్న వారు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులు. ఇతర వివరాల కోసం 79813 68429, 88851 59008 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

## యంత్రాలు మూలకు.. లక్ష్యం గాలికి..

**ని**త్యం కొన్ని వేలమంది ప్రయాణికుల రాకపోకలతో రాష్ట్రంలోనే అత్యంత రద్దీగా ఉండే విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో స్వచ్ఛభారత్‌లో భాగంగా విజయవాడ నగర పాలక సంస్థ సహకారంతో ప్లాస్టిక్ బాటిళ్ల రీసైక్లింగ్ చేసే యంత్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి చేయడం లేదు. దీంతో ఒకదానికి విద్యుత్తు సదుపాయం నిలిపేయగా.. మరొకదాన్ని మూలకు చేర్చారు. వీటిపై అవగాహన ఉండి ప్లాస్టిక్ బాటిళ్లు వేద్దామని వచ్చిన ప్రయాణికులు వాటి దుస్థితి చూసి వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని, లేకుంటే అక్కడి నుంచి తొలగిస్తే కనీసం స్థలం అయినా కలిసి వస్తుందని అంటున్నారు. -ఈనాడు, అమరావతి



## జనవరిలో యువతకు ఉచిత శిక్షణ

**సీతారాంపురం, న్యూస్‌టుడే :** అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎలీప్), సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ (సీఈడీ) అనుబంధ సంస్థ ద్వారా జనవరి మొదటి వారంలో వ్యవసాయ అనుబంధ వ్యాపార రంగాలపై యువతకు ఉచిత శిక్షణ ఇస్తామని ఎలీప్ అధ్యక్షురాలు కె.రమాదేవి తెలిపారు. 45 రోజులపాటు ఈ శిక్షణ ఉంటుంది. అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, పశువైద్య విజ్ఞానం, చేపల పెంపకం, బయో టెక్నాలజీ, అగ్రి ఇంజినీరింగ్, ఫారెస్ట్రీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బీజెడ్‌సీ, హోమ్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌పై పీజీ, డిగ్రీ చదివిన పట్టభద్రులు అర్హులని పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. జాతీయ వ్యవసాయ విస్తరణ కేంద్రం జారీ చేసిన ధ్రువపత్రాన్ని అందజేస్తామన్నారు. బ్యాంకుల ద్వారా రాయితీతో కూడిన రుణ సదుపాయాన్ని పొందవచ్చని వివరించారు. ఆసక్తి గల వారు ఈ నెల 23 నుంచి 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94412 66769 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.



## కిరణ్‌శర్మ వెనుక.. ఆగ్రా ముఠా!

☛ పిల్లల తరలింపు, విక్రయాల్లో తెరపైకి కొత్త పేర్లు
☛ ప్రియాంక, మరో ఇద్దరు మహిళల పాత్ర

ఈనాడు, అమరావతి

**పి**ల్లల విక్రయాలకు సంబంధించి మరిన్ని కోణాలు వెలుగుచూస్తున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి శిశువుల తరలింపు వెనుక మరికొందరి పేర్లు బయటకు వస్తున్నాయి. దిల్లీలోనే కిరణ్‌శర్మపై మరికొంత మంది సూత్రధారులు ఉన్నట్లు తేలింది. ఇటీవల కిరణ్ శర్మను అరెస్టు చేసినప్పుడు విచారణలో పలు విషయాలు వెల్లడయ్యాయి. ఆమె వెనుక ఆగ్రాకు చెందిన ముఠా ఉంది. దిల్లీ, పరిసర ప్రాంతాల్లో కిరణ్ శర్మ నేరుగా పిల్లలను వారి తల్లిదండ్రుల నుంచి కొనుగోలు చేసి విజయవాడకు తరలించేదని భావించారు. దర్యాప్తులో ఆమె మరో ముఠా నుంచి తీసుకుంటుందని తెలిసింది. ఆగ్రా ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు ఇందులో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. వీరిలో ప్రధానంగా ప్రియాంక కీలకమని తేలింది. ఆమెతో పాటు మరో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో కేసు మూలాల్లోకి వెళ్లేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

### లావాదేవీలు, సంబంధాలపై దృష్టి

ఒక బృందం.. ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టు అయిన 12 మందిలో ముఖ్యమైన వారి బ్యాంకు లావాదేవీలు, ఫోన్ కాల్స్‌పై దృష్టి సారించింది. కిరణ్‌శర్మ, బలగం సరోజిని, నందిని, బ్లెస్సీ ఖాతాలకు ఎవరి నుంచి డబ్బు బదిలీ అయింది? వీరి నుంచి ఎవరెవరి ఖాతాలకు వెళ్లింది? అన్న వివరాలు పరిశీలిస్తున్నారు. మరో బృందం.. ప్రధాన నిందితుల సీడీఆర్‌లను వడపోస్తోంది. వీరి ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్‌ను వడపోస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఎవరెవరితో మాట్లాడారన్న వివరాలను లెక్క తేల్చుతున్నారు. విజయవాడ నగరంలోని మూడు స్టేషన్లలో నమోదైన మూడు కేసులతో పాటు గతంలో మహిళా స్టేషన్‌లోని కేసులో పీటీ వారెంట్లు వేసేందుకు దర్యాప్తు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆ తర్వాత కస్టడీకి తీసుకోనున్నారు.

### ముంబయి ముఠా కోసం వేట

ప్రధాన నిందితురాలు సరోజిని.. ముంబయి ముఠా నుంచి ముగ్గురు పిల్లల్ని తీసుకుంది. ముంబయికి చెందిన కవిత.. మూడు సార్లు సూరి, సతీష్‌ల ద్వారా రైలులో పిల్లలను పంపించింది. ఈ నేపథ్యంలో వీరిని కూడా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు. పాత కేసులో కిరణ్‌శర్మతో పాటు దిల్లీకి చెందిన అనిల్ ప్రమేయమూ ఉంది. దీంతో వీరందరిని అరెస్టు చేసి కేసు మూలాల్లోకి వెళ్లేందుకు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. వీరంతా ఎలా పిల్లల్ని కొనుగోలు చేశారు? లేదా ఎక్కడైనా కిడ్నాప్ చేశారా? అన్నది తేలాల్సి ఉంది.

## రీసర్వే చిక్కుముడులు

☛ వైకాపా పాలనలో అడ్డగోలుగా వ్యవహారం
☛ దరఖాస్తులు ఇస్తున్నా కొలిక్కిరాని సమస్యలు

ఈనాడు, అమరావతి, హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

**వై**కాపా వేసిన రీసర్వే చిక్కుముడులు ఏళ్లు గడుస్తున్నా కొలిక్కి రావడం లేదు. జాయింట్ ఎల్పీఎంలు, విస్తీర్ణాలలో వ్యత్యాసాలు, ప్రైవేటు భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడం వంటి సమస్యల సుడి గుండాల్లో అన్నదాతలు అల్లాడుతున్నారు. మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా పరిష్కారాలు కనిపించడం లేదు.

★ **ఎందెందు వెతికినా..** ఉమ్మడి జిల్లాలో వైకాపా పాలనలో 365 గ్రామాల్లో, 5లక్షల ఎకరాల్లో పైగా రీసర్వే చేపట్టారు. 6,753 జాయింట్ ఎల్పీ నంబర్లు ఉండగా ఇందులో దాదాపు లక్ష ఎకరాల వరకు ఇరుక్కుపోయాయి. దీంతో రుణాలు రావడం లేదు. పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదు. క్రయ విక్రయాలకు అవకాశం లేక రైతులు అల్లాడుతున్నారు. నమూనా గ్రామంగా రీసర్వే చేసిన బాపులపాడు మండలం రేమల్లెలో ఒకరి భూమి మరొకరి పేరుతో నమోదు చేయడం, విస్తీర్ణాలు తగ్గడం, జాయింట్ ఎల్పీఎం నంబర్లు కేటాయించడం వంటి సమస్యలు కోకొల్లలు..3సార్లు గ్రామసభలు పెట్టినా ఫలితం లేదు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సర్వే ఏడీలు మోహన్‌రావు, జోషిలా మాట్లాడుతూ..సమస్యపై వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరిస్తామని తెలిపారు.



గ్రామసభలో అర్జీలు సమర్పిస్తున్న రైతులు

★ మైలవరం మండలం దాసుల పాలెంలో రీసర్వేలో 100 మందికి పైగా జాయింట్ ఎల్పీఎంల సమస్య వచ్చింది. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో కూటమి సర్కారు అధికారం చేపట్టిన తర్వాత పెట్టిన గ్రామసభలను సైతం గ్రామస్థులు బహిష్కరించారు.

★ **ఇక్కట్లు:** వీరులపాడు మండలం పెద్దాపురానికి చెందిన నిమ్మల సూర్యావతికి 9.58 ఎకరాల భూమి ఉంది. వైకాపా సమయంలో జరిగిన రీసర్వేలో 9.28 ఎకరాలే వచ్చినట్లు తేల్చారు. దాదాపు 30సెంట్లు వ్యత్యాసం వచ్చింది. సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పరిష్కారం లేదు. పెద్దాపురంలో రీసర్వే సమస్యలే పెద్ద సంఖ్యలో ఉన్నాయని, కలెక్టర్ మళ్లీ సర్వే చేయాలని ఆదేశించినా ఇప్పటికీ మొదలుకాలేదు.



# ఈఎస్‌ఎల్ క్రీడా సంబరానికి సై

**నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు**

న్యూస్‌టుడే-విజయవాడ (క్రీడలు): తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రజెంట్స్) ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్)-2025'కు రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిభావంతుల్ని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ఈఎస్‌ఎల్' పండగకు సమయం ఆసన్నమైంది. వర్ధమాన క్రికెటర్ల ప్రతిభకు వేదికగా నిలుస్తూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న 'ఈనాడు క్రికెట్ సోమవారం ప్రారంభం కానుంది. ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ మ్యాచ్‌లకు కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్ క్రికెట్ మైదానం వేదిక కానుంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, మెడికల్, ఫార్మా కళాశాలల జట్లు క్రికెట్ టోర్నీలో తమ అదృష్టం పరీక్షించుకోనున్నాయి. తొలుత జిల్లా స్థాయిలో మ్యాచ్‌లు జరుగుతాయి. సోమవారం జిల్లా స్థాయి మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అనంతరం ప్రాంతీయ స్థాయిలో మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయిలో కూడా పోటీలు జరుగనున్నాయి.

EENADU SPORTS LEAGUE 2025

KAMINENI HOSPITALS VIJAYAWADA

వేదిక: కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్, కానూరు.

షెడ్యూల్ ఇలా.. 22.12.2025 (మొదటి మ్యాచ్) సీనియర్ విభాగంలో కేబీఎన్ డిగ్రీ కళాశాల X ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల 22.12.2025 (రెండవ మ్యాచ్) జూనియర్ విభాగంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (విజయవాడ) X ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల



# విజయవాడలో ఎండీఎంఏ పట్టివేత

- 10 గ్రాములు స్వాధీనం, ముగ్గురి అరెస్టు
- పోలీసుల నిర్లక్ష్యంతో పారిపోయిన నిందితుడు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పటమట: విజయవాడలో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. బెంగళూరు నుంచి ఎండీఎంఏ తీసుకొచ్చి విజయవాడలోని ఓ హోటల్‌లో విక్రయించేందుకు సిద్ధమైన ముగ్గురిని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరి నుంచి మత్తుమందు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి వారు ఉపయోగించిన కారుతో సహా స్టేషన్‌కు తరలించారు. కారు పార్కు చేసి రావాలని నిందితుడికే తాళాలు అప్పగించడంతో అతడు పరారయ్యాడు.

**వ్యసనాలకు బానిసలై.. తరచూ బెంగళూరుకు:** విజయవాడలోని మధురానగర్‌కు చెందిన వెంకట జగదీష్‌కుమార్, సింగ్‌నగర్‌కి చెందిన అఖిలేష్ అలియాస్ అఖిల్ ఇంటర్ తర్వాత చదువు మానేశారు. వీరు చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. స్నేహితుల పార్టీల్లో ఎండీఎంఏ అలవాటైంది. తరచూ బెంగళూరు వెళ్లి అక్కడ కొని విజయవాడ తెచ్చి స్నేహితులతో కలిసి తీసుకునేవారు. ఈనెల 19న కారులో వీరిద్దరూ బెంగళూరుకు బయలుదేరారు. 20న అక్కడకు చేరుకున్నారు. మహేష్ వద్దకు వెళ్లి రూ.36వేలు చెల్లించి 19 గ్రాముల డ్రగ్స్ కొనుగోలు చేశారు.

**హోటల్‌లో మత్తులో జోగుతూ..** వీరు బెంగళూరు వెళ్లిన విషయాన్ని జగదీష్ స్నేహితుడు జక్కర్ ద్వారా నెల్లూరుకు చెందిన రాజేష్ తెలుసుకున్నాడు. వెంటనే జగదీష్‌కుమార్‌కు ఫోన్ చేసి తనకు తెలిసిన తేజ అనే వ్యక్తి నుంచి 2 గ్రాముల ఎండీఎంఏ తీసుకురావాలని కోరాడు.

**రాజేష్ పరారీ..** టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను తీసుకుని మాచవరం స్టేషన్‌లో కారుతో సహా అప్పగించారు. కారును బయట పార్క్ చేసే సమయంలో డోర్ లాక్ పడలేదు. దీంతో నిందితుడు రాజేష్‌ను లాక్ వేయమని పోలీసులు చెప్పడంతో అతను కారు స్టార్ట్ చేసుకుని రివ్వుగాలా స్టేషన్ నుంచి పరారయ్యాడు. తర్వాత అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రాజేష్ కోసం గాలిస్తున్నారు. మిగిలిన నిందితులు జగదీష్‌కుమార్, అఖిలేష్‌లను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వీరికి ఎండీఎంఏ అమ్మిన మహేష్, తేజ కోసం మరో బృందం బెంగళూరు వెళ్లింది.

పాత బకాయి కూడా ఇవ్వాల్సి ఉందని చెప్పి రూ.20వేలు జగదీష్‌కు మార్ యూపీఐ ఖాతాకు బదిలీ చేశారు. దీనిని జగదీష్ తలుపు తిరస్కరించారు. పోలీసుల నిఘా ఉందని చెప్పి, ఆ రూ.20వేలను తిరిగి రాజేష్ ఖాతాకు వెనక్కి పంపించారు. తర్వాత బకిలిందని జగదీష్‌ను ఒప్పించి డబ్బులు పంపించారు. తర్వాత తేజ వద్ద రెండు గ్రాములు తీసుకుని కారులో బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో నెల్లూరులో దిగి రాజేష్‌కు ఎండీఎంఏ ఇచ్చారు. అక్కడివారు కొంత డ్రగ్స్ తీసుకున్నారు. జగదీష్ కారు మొరాయించడంతో అక్కడే వదిలేసి, రాజేష్ కారులో ముగ్గురూ విజయవాడ చేరుకుని మాచవరం స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో దిగారు. అక్కడ ముగ్గురూ డ్రగ్స్ తీసుకుని మత్తులో మునిగి తేలారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు హోటల్‌పై దాడి చేసి, వీరిని పట్టుకుని 10 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు.

# పేదరిక రహితంగా ఎన్టీఆర్ జిల్లాను తీర్చిదిద్దాలి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పేదరిక రహితంగా ఎన్టీఆర్ జిల్లాను తీర్చిదిద్దాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఛాంబర్ ఆఫ్ రియల్టర్స్ అండ్ బిల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అమరావతి విశిష్ట సేవా పురస్కారాలను ఎంపీ కేశినేని చిన్ని, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 విధానంతో రాష్ట్రంలో పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నారన్నారు. వంద మంది మార్గదర్శకులు వెయ్యి కుటుంబాలను దత్తత తీసుకొని ఆ నాండి పలికారన్నారు. ఎంపీ దాస్ వంటి విద్యావేత్తలు తమ ప్రసంగాల ద్వారా ఎందరిలో చైతన్యం పెంచారని చెప్పారు. మార్గదర్శకులను గౌరవించడం సామాజిక బాధ్యతగా భావించాలన్న భావం కలిగించేందుకు కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు మాట్లాడుతూ నగర ప్రముఖులు ఎందరో విద్యావేత్తల్ని రూ.కోట్లు విలువ చేసే ఆస్తులను విరాళంగా అందజేశారని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు 1995లో జన్మభూమి పేరుతో శ్రమదానంలో ప్రజలను భాగస్వామ్యం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అత్తలూరి నాగమల్లేశ్వరరావు, సారేపల్లి శరత్, జెడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, జనచేతన్యర్తు, విశ్వనాథ్, రామకృష్ణ, రామారావు, యారంకర్ ఉదయభాను పాల్గొన్నారు. రాగా నిలవడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ ఆనాడు ముందుచూపుతో కొండలపై విత్తనాలు చల్లించి పర్యావరణ పరిరక్షణకు


జంధ్యాల శంకర్‌ను సత్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు తదితరులు

# 'వాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాల్సిందే'

గాంధీనగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వాలిడేషన్ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీ జేసీసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆలిండియా రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని ఒక హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఇలాంటి చట్టాల వల్ల భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. ఓపీఎస్ పింఛనర్లకు దిగజారే పరిస్థితి తలెత్తుతోందని, కేంద్ర, రాష్ట్ర పే కమిషన్ సిఫార్సుల అమలు చేయకుండా ఉండేందుకు కుట్ర పన్నారని ధ్వజమెత్తారు. దీన్ని తిప్పికొట్టేందుకు దేశం, రాష్ట్ర స్థాయిల్లో ఐక్య ఉద్యమాలు చేసేందుకు ఏకం కావాలని పిలుపునిచ్చారు. 35, 40 సంవత్సరాలపాటు సుదీర్ఘంగా ప్రభుత్వానికి సేవలు అందించిన పింఛనర్లకు పింఛను ఇచ్చేందుకు ఎందుకు వెనుకాడుతున్నారని బొప్పరాజు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శర్మ మాట్లాడుతూ.. కేంద్ర సంఘం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా రాష్ట్ర సంఘంగా కట్టుబడి ఉంటుందన్నారు. ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ వి.కె.శర్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పింఛనర్ల వాయిస్ పత్రిక చీఫ్ ఎడిటర్ ఎన్.ఎస్.డబ్ల్యు, సెక్రటరీ జనరల్ బి.సుధాకర్, ఏపీ ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు జి.పి.రావు, ఎ.రాజేంద్ర ప్రసాద్, ఎం.సి.లింగన్న, పీవీఎస్ఎన్ శాస్త్రి, లవకుమార్, ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, సైకం శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, పక్కన శర్మ, సుధాకర్

## 23న కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్

సీతారాంపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పనశాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన కొత్తపేటలోని వర్ధమాన పద్మశ్రీ జిల్లా ఉపాధి కార్యాలయంలో 'కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్' నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్‌రావు తెలిపారు. పీపుల్ మార్ట్, వర్ధమాన శ్రీ ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగాల ఖాళీలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ పూర్తిచేసినవారు అర్హులన్నారు. రూ.12వేల నుంచి రూ.18వేల వరకు వేతనం ఇస్తారు. వివరాలకు ఫోన్ 89779 39475, 90326 33548 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# కథలు స్ఫూర్తిదాయకంగా ఉంటే మేలు



సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, పూర్ణచంద్, సాంబశివరావు తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: కథలు స్ఫూర్తిదాయకంగా, సామాజిక ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శ్రీకంఠస్ఫూర్తి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో శ్రీకంఠస్ఫూర్తి రచించిన 'కథ మళ్లీ మొదలయింది' కథల సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు కథలో కాలానుగుణమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలియజేశారు. రచయిత కంఠస్ఫూర్తి సమాజంలో వస్తున్న మార్పులకు అక్షర రూపం ఇచ్చారని వివరించారు. కథల సంపుటిని డాక్టర్ గుమ్మా సాంబశివరావు పరిచయం చేయగా.. ఆచార్య మసన చెన్నప్ప సమీక్షించారు. తెలి ప్రతిని సాహితీవేత్త ఎల్.శ్రీనివాసరావు స్వీకరించారు. డాక్టర్ జి.వి.పూర్ణచంద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ ప్రముఖులు పాణ్యం దత్తాత్రేయశర్మ, రసరాజు, డాక్టర్ ఎం.సురేంద్రనాథ్, ఆచార్య కొప్పర్తి నారాయణమూర్తి, డాక్టర్ సాదనాల వెంకటస్వామి నాయుడు, ఎల్.శివరామకృష్ణ, విజయ కనకదుర్గ, వంశీ కంఠస్ఫూర్తి పాల్గొన్నారు.

## జగన్నాథ సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి, స్థానాచార్య శివప్రసాద శర్మ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

# రెండు చుక్కలతో చక్కని ఆరోగ్యం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రెండు చిన్న పోలియో చుక్కలు.. ఆరోగ్య కరమైన భవిత బాటలు వేస్తాయని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. సుసంపన్న, ఆరోగ్య, ఆనందకర ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఆదివారం గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూలులోని పోలియో బూత్‌ను ఆయన సందర్శించారు. చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర, విజన్ భారత్ లక్ష్యాలను చేరుకునే క్రమంలో ఆరోగ్య ఆంధ్ర సాకారానికి సమిష్టి కృషి జరుగుతున్నాయని తెలిపారు. పోలియోను అంతమొందించిన ఘనతను పొందినప్పటికీ.. అప్రమత్తంగా ఉంటూ 5ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా.. చుక్కలు వేయించాలని సూచించారు. ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటింటి సర్వే చేసి, మిగిలిపోయిన చిన్నారులకు చుక్కలు వేస్తామని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డీఐవో శరత్‌బాబు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, 29వ డివిజన్ కార్పొరేటర్ సిద్ధాబత్తుల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.


పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ. చిత్రంలో డీఎంహెచ్‌వో సుహాసిని, కార్పొరేటర్ బాలస్వామి

## 97 శాతం నమోదు

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమం విజయవంతం అయిందని, 97 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని తెలిపారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. 1,62,265 మంది చిన్నారులకు గాను 1,57,574 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. నేడు (సోమవారం), రేపు (మంగళవారం) కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# సమాజ సేవకులను గుర్తించడానికే సత్కారాలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజం కోసం కృషి చేసే వారిని గుర్తించడానికే సత్కార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిరిడీ గెంటెల వెంకటరమణ తెలిపారు. సద్గురు శివానందమూర్తి భగవానుల జయంతిని పురస్కరించుకుని జగ్గయ్యపేట మండలం బలుసుపాడు గ్రామంలోని గురుధామ్ దర్శక్షేత్రంలో ఆదివారం శివానంద ఎమినెంట్ సిటిజన్ పురస్కారాలను ప్రదానం చేశారు. గెంటెల వెంకటరమణ-వసంతలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి చెందిన ఆంకాలజిస్ట్ డా.సి.కె.నాయుడు, విజయవాడ ఆర్థో ఆసుపత్రికి చెందిన ఆర్.ఈశ్వర్, జగ్గయ్యపేట శ్రీరామ ఆసుపత్రికి చెందిన డా.బి.యోగిరాంలకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ జలవనరులశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గురుధామ్ దర్శక్షేత్రంలో జరిగే సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎస్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, వైద్యులు వి.ఎన్.ఎస్.రావు, ఎన్.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రామచంద్రం పాల్గొన్నారు. దివంగత సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన కవితలతో స్వరపరచిన సీడీని ఆవిష్కరించారు. సిరివెన్నెల తనయుడు యోగేశ్వర్ స్వరపరిచారు. సిరివెన్నెల సతీమణి పద్మావతిని సత్కరించారు.


యోగిరాం దంపతులకు పురస్కారం అందిస్తున్న వెంకటరమణ. చిత్రంలో ఉదయభాను, సి.కె.నాయుడు, ఈశ్వర్, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

## ధర వరలు

వంకాయలు-30/26, టమాటా-47, బెండ-36, పచ్చిమిర్చి-38, కాకర-44, బీర-40, క్యాలీ ఫ్లవర్-30/25, క్యాబేజీ-24, క్యారెట్-38, దొండ-34, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-30, గోరుచిక్కుడు-42, దోస-30/36, సొర-18/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-74, మునగ-20/18, ఆకుకూరలు (కట్ట)-3, కంద-40, బీట్ రూట్-34, కీరదోస-44, బీన్స్-70/86, క్యాప్సికమ్-64, చింతకాయలు-60, కొత్తిమీర-8/15, పుదీనా-5/15 (సిన్నవి). - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ


సాధన చేస్తున్న కిదాంబి శ్రీకాంత్

## నేటి నుంచి జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు యోనెక్స్ సన్‌రైజ్ 78వ జాతీయ అంతర్ రాష్ట్ర, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ జరుగుతుంది. ఆదివారం రాష్ట్ర స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ స్టేడియంలో సాధన చేశారు. స్టార్ షట్లర్లు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ వ్యక్తిగత, డబుల్స్ విభాగాల్లో తలపడనున్నారు. సోమవారం రాష్ట్ర మహిళా జట్టు ఉత్తరాఖండ్ జట్టుతో, రాష్ట్ర పురుషుల జట్టు తమిళనాడు జట్టుతో తలపడుతుందని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పోలిరెడ్డి అంకమ్మచౌదరి తెలిపారు. సోమవారం జరిగే పోటీల ప్రారంభోత్సవానికి ఏపీ శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, బీజేపీ ప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు హాజరవుతారని పేర్కొన్నారు.

## చదరంగం విజేత హరీష్ సాయిరామ్

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: నగరంలోని శ్యామ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో పుచ్చలపల్లి హరీష్ సాయిరామ్ విజేతగా నిలిచారు. మొత్తం ఆరు రౌండ్ల పాటు నిర్వహించిన ఈ పోటీలో హరీష్ సాయిరామ్ ఆరు పాయింట్లతో ప్రథమ, మీసాల ఈశ్వరరావు ఐదున్నర పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలవగా.. నారాయణ రిషిత తృతీయ స్థానంలో నిలిచింది. చిన్నారులను ప్రోత్సహించేందుకు పలు వయసు విభాగాల్లో బాలబాలికలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమానికి కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, డాక్టర్ రాణి నరసింహమూర్తి, సిటీ కేబుల్ ఎండీ దండమూడి కృష్ణమోహన్, రాష్ట్ర సిటీ కేబుల్ అపరేటర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి దేవి శ్రీనివాసరావు, వి.వెంకట్ హాజరయ్యారు. విజేతలను డి విజయవాడ చెస్ సంఘం అధ్యక్షుడు ఎండీ అక్బర్ పాషా, కార్యదర్శి ఎం.రాజేష్ అభినందించారు.


విజేతలతో అతిథులు

# 'సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ రాయాలనడం తగదు'

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరులోని లక్ష్మీపురం మను గార్డెన్స్‌లో ఆదివారం యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ స్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సర్వీస్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ రాయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన నాలుగు డీఏలతో పాటు ఒక డీఏ సరిపెట్టారని, కనీసం వచ్చే విద్యా ఏడాది నుంచి అయినా సంవత్సరానికి రెండు డీఏలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించిన యూటీఎఫ్ కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య, కార్యవర్గ సభ్యులుగా 18 మందిని ఎన్నుకున్నారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, వేదికపై సంఘ నాయకులు

# అదృశ్యం కేసు.. పోక్సోగా మార్పిడి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను ప్రేమ పేరుతో వల వేసి.. కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన యువకుడిని నున్న పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన బాలిక (17) విజయవాడ, నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే పెదనాన్న ఇంట్లో ఉంటోంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో రాహుల్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పాడు. వాటిని నమ్మిన బాలిక.. ఈ నెల 18న రాత్రి యువకుడితో కలిసి వెళ్లిపోయింది. 19న బాలిక కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

**పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు...:** అదృశ్యం కేసు పై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బాలిక కిడ్నాప్ బారి నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పోలీసులు తీసుకువచ్చారు. దర్యాప్తులో ఆమెపై అత్యాచారం చేసినట్లు తేలింది. దీంతో మిస్సింగ్ కేసు సెక్షన్లను మార్చారు. రాహుల్ పక్కా ప్రణాళిక ప్రకారం హైదరాబాద్ నుంచి ఆర్థిక కారు తీసుకొచ్చాడు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు నంబరు ప్లేటు మార్చాడు. స్నేహితుడు అనే కలిసి ఆమెను కిడ్నాప్ చేశాడు. సత్తెనపల్లిలోని ఓ లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆధునిక పరిజ్ఞానం సహాయంతో స్నేహితుడు ఇస్మాయిల్ కూడా పట్టుబడ్డాడు. ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరించిన ఇద్దరు స్నేహితులను నున్న పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

**బ్రాయిలర్ ధరలు** (కేజీ రూ.ల్లో)
విజయవాడ: బ్రాయిలర్ ఫారం లైవ్ ధర -138 లైవ్ ధర 160 డ్రెస్డ్ స్కిన్ -232, విత్ ఔట్ స్కిన్ -264. అమలాపురం: రాష్ట్ర ఫౌల్ట్రీ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బ్రాయిలర్ ఫారం లైవ్ ధర -150, 159, 170 డ్రెస్డ్ స్కిన్ -280 విత్ ఔట్ స్కిన్ -300.

# వన్య ప్రాణుల విక్రయం.. నిందితుల అరెస్టు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: శేషాచలం అడవుల పరిధిలో అరుదైన ప్రాణులను చంపి వాటితో వ్యాపారం నిర్వహిస్తున్న ఏడుగురిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు రేంజ్ ఫారెస్ట్ అధికారి రామ్‌సుందర్ వివరాల మేరకు.. ఈ నెల 19న రాజంపేట డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, విజయవాడకు చెందిన వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారుల సూచనల మేరకు ఓ లాడ్జిలో సోదాలు చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్‌కు చెందిన జె.రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు గుర్తించారు. అతనితో పాటు ప్రకాశం జిల్లాకు చెందిన పుష్పలత, రైల్వేకోడూరు, పప్పుల జయరామ్, రైల్వేకోడూరుకు చెందిన మొరకల సుబ్రహ్మణ్యం, కంభపాటి శ్రీనివాసులు ఆచారి, రాజంపేటకు చెందిన ఉప్పు రాజా రవికుమార్‌లను పట్టుకున్నారు. శనివారం రాత్రి నిందితులను రాజంపేట కోర్టులో హాజరుపరచగా వారికి వచ్చే నెల 2వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు రేంజర్ వివరించారు.



## తార వెలిసింది..

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వీధుల్లో సందడి వాతావరణం నెలకొంటోంది. గొల్లపూడి, పరిసరాల గ్రామాల్లో క్రీస్తు జననం తెలిపేలా పశువుల పాకలు, పెద్ద నక్షత్రాలు, విద్యుత్తుదీపాలతో అలంకరణ చేస్తున్నారు. దీంతో వీధులు కోలాహలంగా మారాయి. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

# తిరువూరు

• తిరువూరు • మైలవరం

## ఘనంగా నారా బ్రాహ్మణి జన్మదిన వేడుక



విస్సన్నపేట మండల కేంద్రంలోని తెదేపా కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు కొంగల శ్రీనివాసరావు, రాయల కిట్టు, రాంబాబు, శివబాజీ, అశోక్, మల్లి, తేజ ప్రవీణ్, కోలేటి రంగారావు తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



✦ తిరువూరు 18వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు రామకిషోర్ సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. **– న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

✦ కొండపల్లి బ్యాంకు కూడలిలో కాలువకు చెత్త అడ్డుపడి మురుగు రోడ్డుపైకి వస్తుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించారు.

**- న్యూస్‌టుడే, కొండపల్లి**

? కపులూరులోని ముస్లిం బజార్‌లో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయి అవస్థలు పడుతున్నాం. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. **- మౌలాలీ గ్రామస్థుడు** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సంబంధిత సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం. **- సరోజా, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

## టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

**విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే:** బెంగళూరులోని జైన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ మహిళల టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో తలపడే డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి ఆదివారం వెల్లడించారు. ఎంపికైన జట్టు సభ్యులను ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధిక రెడ్డి అభినందించారు. జట్టులో భూమి శేఖర్, బి.లక్ష్మీ సాయి రితిక, ఎ.యశస్వి, కె.చరిష్మా నాగరాణిలకు స్థానం దక్కింది. జట్టుకు కె.నాగరాజు (పీడీ, కోనసీమ వైద్య కళాశాల, అమలాపురం) మేనేజరుగా నియమితులయ్యారు.

## ప్రత్యేక తరగతులు.. నీరసంతో చదువులు

జి.కొండూరు, న్యూస్‌టుడే

పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డిసెంబరు మాసం మొదటి వారం నుంచి అదనపు తరగతుల నిర్వహణ చేపట్టి వంద రోజుల పాఠ్య ప్రణాళిక అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పది విద్యార్థులు ఉదయం 8 గంటలకు పాఠశాలకు హాజరై సాయంత్రం అయిదున్నర వరకు ఉంటారు. నిత్యం ఓ సబ్జెక్టు ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతిని నిర్వహించి, దానిపై పరీక్ష పెట్టి వారి పురోగతిని ఉన్నతాధికారులకు తెలియపరచాలి. వెనకబడిన వారికి సైతం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు అధిక ఒత్తిడి, అలసటకు గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు



గంగినేని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఉపాధ్యాయులు

గతంలో ప్రభుత్వమే విద్యార్థులకు అల్పాహారం అందించేదని పలువురు వెల్లడిస్తున్నారు. దీంతో వారు కొంత శక్తిని పొంది మరింత చదువుకునే వారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ అల్పాహారం లేకపోవడంతో విద్యార్థులు నీరసంగా ఉంటున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు తరగతులకు హాజరైన వారికి అల్పాహారం ఏర్పాటు చేస్తే మేలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### సొంత నిధులు సమకూర్చి..

మండలంలోని గంగినేని జడ్పీ ఉన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులు అదనపు తరగతులకు హాజరవుతున్నారు. వీరికి ఆ బడిలోని ఉపాధ్యాయులే స్వయంగా నిధులు సమకూర్చి అల్పాహారం అందించేందుకు శ్రీకారం చుట్టారు. తమ విద్యార్థులు అధిక శాతం ఉత్తీర్ణత సాధించాలంటూ ప్రతి రోజు గోధుమ రవ్వతో ఉప్మా, శనగలు అందిస్తున్నారు. ఇదే కాక మరొక రోజు బిస్కెట్ ప్యాకెట్లు కూడా అందించాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

### గతంలో మాదిరిగా..

ఉపాధ్యాయులు స్వయంగా నిధులు సమకూర్చి అల్పాహారం ఏర్పాటు చేయడంతో విద్యార్థులు శ్రద్ధతో చదువుతున్నారు. ఉపాధ్యాయులకు శ్రమ కలుగకుండా గతంలో మాదిరిగా ప్రభుత్వమే అల్పాహారం ఏర్పాటు చేస్తే మేలు కలుగుతోంది. **- కొమ్మిన బోయిన రజని, గంగినేని పీఎంసీ ఛైర్మన్**

### ఉత్తీర్ణత పెరుగుతోంది

విద్యార్థులకు అల్పాహారం అందిస్తే వారు ఎక్కువ శ్రద్ధతో చదివి అధిక మార్కులు పొంది ఉత్తీర్ణత శాతం పెరుగుతోంది. ప్రభుత్వం అల్పాహారం ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

**- బండారు బాలాకుమారి, చెవుటూరు పీఎంసీ ఛైర్మన్**

## సాగర్ జలాలు విడుదల

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** ఎన్నెస్పీ రెండో జోన్‌లోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక 72వ కి.మీ నుంచి ఆదివారం 1034 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 497 క్యూసెక్కులు చేరాయని, అక్కడ నుంచి దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కి 60, పెదకొమిర 30, మధిర 50, నిదానపురం 60 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

## వృద్ధురాలి నేత్రదానం

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే :** మండల కేంద్రానికి చెందిన బొమ్మిన దమయంతి(80) వృద్ధాప్యంతో శనివారం మృతి చెందగా.. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు కరుణా ఐ బ్యాంకుకు దానం చేశారు. ఐ బ్యాంకు నిపుణులు ఆదివారం వచ్చి ఆమె కార్నియాలను తీసుకెళ్లినట్లు ఆమె కుమారుడు బొమ్మిన వెంకటరమణ తెలిపారు. గతంలో తన తండ్రి నేత్రాలు దానం చేసినట్లు ఆయన చెప్పారు.



దమయంతి (పాత చిత్రం)

## సీలింగ్ భూముల ఆక్రమణలకు తావు లేదు



రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లతో కలిసి మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి

**విస్సన్నపేట, న్యూస్‌టుడే :** విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామ పంచాయతీ పరిధిలోని సీలింగ్ భూములను తిరువూరు ఆర్డీవో కె.మాధురి, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణితో కలిసి ఆదివారం పరిశీలించారు. సీలింగ్ భూములు ప్రభుత్వ భూములుగా ఉంటాయని, వాటి ఆక్రమణలకు ఎలాంటి తావులేదని ఆర్డీవో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 1175.175 ఎకరాల సీలింగ్ భూములను గాను ప్రభుత్వం హక్కుదారులైన పేదలకు పట్టాలు ఇవ్వగా కొండపర్వలో 328.7 ఎకరాల భూమి ఉందన్నారు. త్వరలో వీటికి హద్దులు నిర్ణయించి ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తామన్నారు. ఆర్ఐ సుజాత, మండల సర్వేయర్ శంకరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ లక్ష్యానికి సహకరిద్దాం

**కొండపల్లి, న్యూస్‌టుడే :** పోలియో మహమ్మారి రాష్ట్రంలో మళ్లీ చూడకూడదన్న ప్రభుత్వ సంకల్పానికి తల్లిదండ్రులందరూ పూర్తి సహాయ సహకారాలు అందించాలని పల్స్ పోలియో కార్యక్రమ నోడల్ అధికారి, ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ నిర్మల గ్లోరి అన్నారు. ఆదివారం పల్స్ పోలియో పర్యవేక్షణలో భాగంగా ఇబ్రహీంపట్నం రింగుసెంటర్‌లో చిన్నారులకు ఆమె పోలియో చుక్కలు వేశారు. అధికారులు శ్రీనివాస్, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న నిర్మల గ్లోరి

## బ్రాహ్మణులకు సంక్షేమ పథకాల పునరుద్ధరణ



సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చి రాంప్రసాద్

**మైలవరం, న్యూస్‌టుడే :** రాష్ట్రంలోని బ్రాహ్మణుల కోసం అనేక సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ పేర్కొన్నారు. మైలవరంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ ఆత్మీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పథకాలకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు పొందేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్పొరేషన్ డైరెక్టర్ ఫణిమూర్తి, క్రెడిట్ సొసైటీ ఎండీ శ్రీనివాస్, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వి.బాలాజీ ప్రసాద్, సతీష్, శర్మ, మారుతీ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా సూర్యనారాయణ

**విస్సన్నపేట, న్యూస్‌టుడే :** యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శిగా బీసీ హెచ్‌వీ సూర్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా పి.రామకృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరువూరు మను గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా సమావేశంలో వీరు ఎన్నిక అయినందుకు యూటీఎఫ్ విస్సన్నపేట శాఖ తరఫున మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.చంటిబాబు, ఎ.మురళీ కృష్ణ అభినందనలు తెలిపారు.

## సెక్యూరిటీ స్థానే పీటీడీ కానిస్టేబుల్‌గా మార్చండి

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా శాఖ (ఏపీ పీటీడీ/ఆర్టీసీ)లో సెక్యూరిటీ కానిస్టేబుల్ పేరును పీటీడీ కానిస్టేబుల్‌గా మార్చి, గౌరవాన్ని కాపాడాలని ఏపీ పీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో విజిలెన్స్, సెక్యూరిటీ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు డి.అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.వెంకటేశ్వరరావుల నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ.. సెక్యూరిటీ కానిస్టేబుల్ సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అండగా ఉంటుందన్నారు. పేరు (డిసిగ్నేషన్) మార్పు, గత 5 స్కేల్ కానిస్టేబుల్ కేడర్‌కు జరిగిన అన్యాయం, ట్రావెల్, సమరుస్తుల అలవెన్సులు తదితరాలపై సమావేశంలో చర్చించారు.

## ప్రతి జీవిలో దైవాన్ని చూడటమే సనాతన ధర్మం

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీశ్రీశ్రీ పీఠాధిపతి ఆదిత్యానంద భారతీ స్వామి పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం వందేళ్ల ఉత్సవం సందర్భంగా ఆదివారం గంపలగూడెం సీతా రామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దైవం, ధర్మం ఒక్కటేనని, ప్రతి జీవిలో దైవాన్ని చూడటమే సనాతన ధర్మమన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు వంశీధర్ ప్రభుజీ, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంగళరావు, స్థానిక హిందూ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఆదిత్యానంద భారతీ స్వామి

## గోదారంగ నాయకులకు ధనుర్మాస పూజలు

**గంపలగూడెం, న్యూస్‌టుడే :** ధనుర్మాసం సందర్భంగా ఆదివారం తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో గోదారంగ నాయక స్వామికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, విశేషాలంకరణలు చేశారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం గోదాదేవి ఆలపించిన తిరుప్పావై పాశురాలను పఠించారు.



పాత తిరువూరు: ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

## గుంతలు.. రాకపోకలకు ఇక్కట్లు



శ్రీరాంపురం నుంచి పేర్వంచ వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ముచ్చినపల్లి గ్రామంలోని ఊర చెరువు వద్దపై గోతులు పడి ప్రమాదాలకు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో స్థానికులు వాటి వద్ద ప్లాస్టిక్ డబ్బా పెట్టిన ఉపయోగం లేకుండా పోయింది. వాహనాల రాకపోకలకు అది కూడా పగిలిపోయింది. దీంతో రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణాలు చేసే వారు చప్టాపై వాహనాలు అదుపు చేయలేక పడిపోతున్నారు. అధికారులు స్పందించి దీనికి మరమ్మతులు చేయించి రాకపోకలు సజావుగా సాగే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

## చెత్త పేరుకుంది.. వాసన వీడనంటోంది!



ఇబ్రహీంపట్నం సడక్ రోడ్డు నివాస ప్రాంతాల వద్ద చెత్త పేరుకుంది. కొండరు మట్టు పక్కల నుంచి వ్యర్థాలను తెచ్చి కాలువ వద్ద వేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రోజూ చెత్త కుండి శుభ్రం చేయక పోవడంతోనే సమస్య వస్తోందని ఆవేదన చెందుతున్నారు. చెత్త మురుగులో కలిసిపోవడంతో కాలువ పారుదల లేదని, అటు వైపు రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. దీనిపై పురపాలిక పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి మధు స్పందిస్తూ చెత్తను రోజూ తొలగిస్తున్నా, చెత్త కుండి పరిసరాలలోనే వేస్తున్నారని, అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

## పగుళ్లిచ్చి.. ప్రమాదకరంగా మారి..

జి.కొండూరులోని పులివాగు వంతెన పక్కన శివాలయానికి వెళ్లే సీసీ రోడ్డు మధ్యమ పగుళ్లిచ్చి ప్రమాదకరంగా మారింది. దీంతో అటుగా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదమరిస్తే పక్కనే ఉన్న పులివాగులో పడిపోయే ప్రమాదముందని గ్రామస్థులు వాపోతున్నారు. నిత్యం శివాలయానికి వెళ్లే భక్తులు అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యమని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారికి మరమ్మతులు చేయించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



## పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యం



విస్సన్నపేట బస్టాండ్‌లో చిన్నారికి మందు వేస్తున్న మాధురి



గంపలగూడెం మండలం గోసవీడులో..



ఓబులాపురంలో..



జి.కొండూరులో..



మైలవరంలో..

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కేంద్రాల ద్వారా తల్లిదండ్రులు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, బృందం**

## డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి



రెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో సమావేశమైన నాయకులు

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే :** మండల పరిధిలోని గ్రామాల్లో డ్రెయినేజీల సమస్యను పరిష్కరించాలని తీర్మానించినట్లు సీపీఎం మండల కమిటీ నాయకులు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీహెచ్.విజయ్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో మండల కార్యదర్శి టి.వీరాస్వామి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో డ్రెయినేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎం.మాధవరెడ్డి, వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ కమిటీ ఛైర్మన్ పదవి ఇవ్వాలని వినతి

**పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే :** పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ పదవి మున్నంగి నాయకుడు శివపురం గ్రామానికి చెందిన లగడపాటి శంకర్‌కు ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు ఆదివారం వినతిపత్రం అందజేశారు.

## ఆదమరిస్తే అంతే సంగతులు



విస్సన్నపేట- సత్తుపల్లి రోడ్డులో ఆర్యవైశ్య కల్యాణ మండపం సమీపంలో రహదారి పక్కనున్న డ్రెయినేజీ ప్రమాదకరంగా మారింది. లోతుగా ఉండి దానిపైన ఎటువంటి రక్షణ చర్యలు లేకపోవడంతో నిత్యం అటు వైపు రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో దీనికి రక్షణగా సిమెంట్ స్తంభాలు సరిహద్దుగా ఏర్పాటు చేశారు. కానీ అవి శిథిలావస్థకు చేరి విరిగిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

## వైద్య శిబిరాలకు విశేష స్పందన

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే :** అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 80 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు సంఘ అధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. కంటి ఆపరేషన్ అవసరమైన 15 మందిని నూజివీడు అమెరికన్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వివరించారు.

**తిరువూరు టౌన్, న్యూస్‌టుడే :** స్థానిక నాగార్జున పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో రక్తపోటు, మధుమేహం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యులు సత్యతేజ, రవీంద్ర, లక్ష్మణరావు, ఆనిషా రాయ్ తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..



రెడ్డిగూడెం : నేత్ర పరీక్షలు చేస్తున్న లక్ష్మీకుమారి

## తెల్లారిందోయ్.. చలి మంటలు వేయండోయ్!

శీతాకాలం మొదలైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మైలవరం ప్రాంతంలో 16 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో రహదారులు కన్పించని విధంగా మంచు పడటంతో ఉదయం 9.30 గంటల వరకు వాహనాలు నడపడానికే భయపడాల్సి వచ్చింది. దీంతో జనాలు కూడళ్లలో మంటలేసి చలి నుంచి ఉపశమనం పొందారు. **- న్యూస్‌టుడే, మైలవరం**



## వేడుకల పేరుతో ట్రాఫిక్‌కు అంతరాయం

**మైలవరం, న్యూస్‌టుడే :** మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మైలవరంలో ఆదివారం నిర్వహించారు. జోగి రమేష్ తనయుడు రాజీవ్ ఆధ్వర్యంలో స్థానిక ఇంజినీరింగ్ కళాశాల వద్ద నుంచి ద్విచక్ర వాహనాల ప్రదర్శన చేపట్టారు. ప్రవాసాంధ్రుడు లకిరెడ్డి హనిమిరెడ్డితో కలిసి కేకు కోశారు. బైక్ ర్యాలీలో వైకాపా కార్యకర్తలు హంగామా చేయడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పామర్తి శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, తిరుపతిరావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే :** రెడ్డిగూడెం కూడలిలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పి.విజయ భాస్కరరెడ్డి, సర్పంచి ఎం.రాణి, నాయకులతో కలిసి కేకు కోశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వి.భరత్‌కుమార్‌రెడ్డి, టి.రవిబాబు, పి.సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో సత్తా

**వీరులపాడు :** జిల్లా స్థాయిలో పురుష ఉపాధ్యాయుల విభాగంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వీరులపాడు జట్టు విజేతగా నిలిచింది. మైలవరంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన ఫైనల్‌లో తిరువూరు డివిజన్ నుంచి ఏ.కొండూరు మండలం జట్టు, నందిగామ డివిజన్ నుంచి వీరులపాడు మండల జట్టు తలపడ్డాయి.

# తితిదే విద్యాసంస్థలకు డిజిటల్ కళ!

- కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతులు
- రూ. 5.20 కోట్లతో డిజిటల్ తరగతి గదులు
- రూ. 3.25 కోట్లతో కంప్యూటర్లు
- ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ శిక్షణ
- విద్యా ఉపసంఘం సిఫార్సులకు తితిదే పాలకమండలి ఆమోదం

ఈనాడు డిజిటల్, తిరుపతి: పేద విద్యార్థులకు సరస్వతీ నిలయాలుగా ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) విద్యాసంస్థలు ఇకపై కొత్త హంగులతో కళకళలాడనున్నాయి.. ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ నిధుల సహకారంతో విద్యాసంస్థలను డిజిటలైజేషన్‌తో పాటు మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి తితిదే పాలకమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో, విద్యా ఉపసంఘం (ఎడ్యుకేషన్ సబ్-కమిటీ) చేసిన సిఫార్సులను పాలక మండలి ఆమోదం తెలిపింది. వివరాలు ఇలా ఉన్నాయి.

✦ తితిదే పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లోని 260 తరగతి గదులను 'డిజిటల్ క్లాస్‌రూమ్'లుగా మార్చనున్నారు. ఇందుకోసం రూ.5.20 కోట్లతో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) బోర్డులు ఏర్పాటుచేస్తారు.

✦ విద్యార్థులకు కంప్యూటర్ విద్యను మరింత చేరువ చేసేందుకు సుమారు రూ.3.25 కోట్లతో 650 కొత్త కంప్యూటర్లు కొంటారు. దాతల సహకారంతో కొన్ని కంప్యూటర్లు సమకూర్చేందుకు బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి హామీ ఇచ్చారు.

## విద్యార్థుల భద్రత.. ఆరోగ్యం

✦ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థుల భద్రత, ఆస్తుల రక్షణ కోసం రూ.కోటి వ్యయంతో 1,014 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

✦ ఎస్వీడబ్ల్యూ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా 'మొబైల్ మెడికల్ యూనిట్ (క్లినిక్ ఆన్ వీల్స్)'ను అందుబాటులోకి తెస్తున్నారు. ఇందులో మహిళా డాక్టర్, నర్సు ఉంటారు. ఈ వాహనాన్ని దాతల ద్వారా సమకూర్చేందుకు బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి చొరవ తీసుకోనున్నారు.

✦ బాలికల వసతిగృహాలు, పాఠశాలల్లో రూ.30 లక్షలతో 150 ఇన్సినరేటర్లను (వ్యర్థాల నిర్మూలన యంత్రాలు) ఏర్పాటు చేయనున్నారు.

## విద్యా ప్రమాణాలు.. శిక్షణ

✦ తితిదే జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఇంటర్‌తో పాటే ఐఐటీ, నీట్, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు.

✦ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా జాబ్ ఓరియెంటెడ్, నైపుణ్యాభివృద్ధి, వృత్తివిద్య కోర్సులను ప్రవేశపెట్టనున్నారు.

✦ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 'డొక్కా సీతమ్మ' పథకం తరహాలో.. తితిదే జూనియర్ కళాశాలల్లోనే డే-స్కాలర్లకూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేసే ప్రతిపాదనను పరిశీలించనున్నారు.



## మౌలిక వసతులు.. ఇతర అభివృద్ధి పనులు

✦ ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల వసతిగృహంలో ఆదనంగా 300 సీట్లను పెంచనున్నారు. తిరుపతిలోని ఎస్వీ సంప్రదాయ శిల్ప కళాశాల విద్యార్థులకు ప్రత్యేక వసతిగృహ భవనాన్ని నిర్మించనున్నారు.

✦ హాస్టళ్లలో విద్యార్థుల కోసం రూ.55 లక్షలతో 180 సోలార్ వాటర్ హీటర్లను అమర్చనున్నారు.

✦ అడ్మిషన్ల నుంచి టీసీ వరకు.. హాజరు, పరీక్షలు, హాస్టల్ నిర్వహణ వంటి సమస్త సమాచారాన్ని నిర్వహించేందుకు సమగ్ర సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు.

✦ విద్యార్థుల క్షేత్ర పర్యటనల కోసం రూ.30 లక్షలతో ప్రత్యేక బస్సు కొనుగోలు చేయనున్నారు.

## మరికొన్ని ముఖ్యాంశాలు

✦ పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్స్ సమయంలో పాలు, అల్పాహారం పంపిణీ.

✦ వెల్లూరులోని ఎస్వీ హయ్యర్ సెకండరీ పాఠశాల 150 ఏళ్లు (1876-2026) పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఘనంగా ఉత్సవాల నిర్వహణ.

✦ ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి కమిటీ ద్వారా చర్యలు.

✦ అలిపిరి వద్ద శ్రవణం, బాలమందిర్, బధిర పాఠశాలల కోసం ప్రతిపాదించిన 'ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్' నిర్మాణ పనుల వేగవంతం.

✦ విద్యాసంస్థల ప్రహరీలపై స్ఫూర్తిదాయక చిత్రాలతో 'వాల్ మ్యూరల్స్' ఏర్పాటు.

✦ ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ నిధుల వినియోగం, గత ఐదేళ్ల ఆదాయ వ్యయాల పత్రీకను తదుపరి బోర్డు సమావేశంలో ఉంచాలని పాలకమండలి నిర్ణయించింది.



పెమ్సాఫ్ట్ సంస్థకు చెందిన రిదిష్ సోనికి జ్ఞాపిక అందిస్తున్న సీఎండీలు శివశంకర్, పృథ్వీతేజ్, సూర్యచంద్ర ప్రవీణ్‌చంద్

## హ్యాకథాన్ విజేతలకు విద్యుత్ సంస్థల్లో ప్రాజెక్టులు

'ఎలక్ట్రాన్ వైబ్-హ్యాక్ ఏపీ-2025' పోటీల ఫలితాలు విడుదల

ఈనాడు, అమరావతి: విద్యుత్ సంస్థలు ఆసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, డేటా, ఏఐ ఆధారిత పరిష్కారాల అభివృద్ధే లక్ష్యంగా 'ఎలక్ట్రాన్ వైబ్- హ్యాక్ ఏపీ-2025' పేరిట హ్యాకథాన్ నిర్వహించినట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ పేర్కొన్నారు. డిస్కంలు ఎదుర్కొంటున్న సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు చూపే లక్ష్యంతో దాన్ని చేపట్టామని తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, క్లీన్ క్లైమేట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని సాగర్‌నగర్‌లో డిస్కంలు సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల ఫలితాలను ఆదివారం వెల్లడించారు. 'సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు 2024 నుంచి హ్యాకథాన్లు నిర్వహిస్తున్నాం. విజేతలుగా నిలిచిన అంకురసంస్థలకు విద్యుత్‌సంస్థల్లో పైలట్ ప్రాజెక్టులు కేటాయిస్తాం. ఈ పోటీలకు 45 స్టార్టప్‌లు నుంచి ప్రతిపాదనలు రాగా, తుది జాబితాలో ఎంపికైన 9 సంస్థలు తమ పరిష్కారాలను విద్యుత్ నిపుణుల సమక్షంలో ప్రదర్శించాయి' అని వివరించారు. విజేతలను ఎస్‌పీడీసీఎల్ సీఎండీ శివశంకర్, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌లు జ్ఞాపికలు అందజేశారు.

స్టార్టప్ సంస్థల పరిష్కారాలిలా..

✦ ప్రమాదాలను ముందస్తుగా గుర్తించే వ్యవస్థ: డ్రోన్ ఆధారిత తనిఖీలు, ఏఐ విశ్లేషణల ద్వారా విద్యుత్ మౌలిక సదుపాయాల స్థితిని అంచనా వేసి, పరిస్థితి ఆధారిత సంరక్షణ విధానాన్ని ప్రవేశపెట్టడం.

✦ స్మార్ట్‌మీటర్ డేటా విశ్లేషణతో ఆదాయ సంరక్షణ: ప్రతి 15 నిమిషాలకు డేటాను విశ్లేషించి.. విద్యుత్ చౌర్యం, బిల్లింగ్ లోపాలు, రెవెన్యూ లీకేజీలను గుర్తించడం. ✦ ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్ ప్రిడిక్షన్: స్మార్ట్ మీటర్ అవుట్‌పుట్ డేటా ఆధారంగా ట్రాన్స్‌ఫార్మర్ లోడ్, వనితీరు, ఫాల్ట్ ప్యాటర్న్‌ల విశ్లేషణ.. ముందస్తు హెచ్చరికలు.

✦ హైటెన్షన్ లైన్లలో ఇన్సులేటర్ లోపాల గుర్తింపు: డర్టల్, ఆప్టికల్, అల్ట్రావైలెట్, అకౌస్టిక్ సెన్సింగ్ సాంకేతికతల ద్వారా పగలు, రాత్రి వేళల్లో ఇన్సులేటర్ లోపాల గుర్తింపు.

విజేతలకు పైలట్ ప్రాజెక్టుల కేటాయింపు ఇలా..

✦ పెమ్సాఫ్ట్: ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఎస్‌పీడీసీఎల్ ✦ ఐ సెన్సెస్: ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ ✦ ఏడోవిన్: ఏపీఎస్‌పీడీసీఎల్ ✦ స్మార్ట్‌గ్రిడ్: ఏపీఈపీడీసీఎల్ ✦ వోల్ట్‌వైజ్: ఏపీ ట్రాన్స్‌కో.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

## మల్లిక స్పైన్‌సెంటర్ చీఫ్ డాక్టర్ నరేష్‌బాబుకు జాతీయ అవార్డులు

గుంటూరు (గోరంట్ల), న్యూస్‌టుడే: గుంటూరులోని మల్లిక స్పైన్‌సెంటర్ చీఫ్, సర్జన్ డాక్టర్ నరేష్‌బాబుకు మూడు జాతీయస్థాయి అవార్డులు లభించాయి. 'సర్వైకల్ స్పాండిలైటిస్-సరలపై ఒక్కటి' గురించి చేసిన పరిశోధనకు 'గోల్డెన్ జూబ్లీ ఓరేషన్ అవార్డు-2025', 'వెన్నునొప్పి బాధితులు- ఎండోస్కోపిక్ స్పైన్‌సర్జరీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు 'హెచ్.టి.ఎల్ రావు గోల్డ్‌మెడల్-2024' వరించాయి. ఈ రెండింటినీ గువాహటిలో ఇటీవల జరిగిన ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్(ఐఓఏ) వార్షిక సదస్సులో నరేష్‌బాబు అందుకున్నారు. వీటితోపాటు 'వైద్యంలో పనులు.. కణజాలంలోని డిస్క్, నడుమునొప్పి ప్రభావం' అనే అంశంపై చేసిన పరిశోధనకు 'ఎస్.పి.మండల్ గోల్డ్‌మెడల్-2025' వరించింది. ఈ అవార్డు వచ్చే ఏడాది అహ్మదాబాద్‌లో జరిగే ఐఓఏ వార్షిక సదస్సులో నరేష్‌బాబు అందుకోనున్నట్లు మల్లిక స్పైన్ సెంటర్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

## జగన్‌కు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్ పుట్టినరోజు సందర్భంగా సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్‌లో వేర్వేరుగా పోస్టులు పెట్టారు. జగన్ నిండునూరేళ్లు పరిపూర్ణ జీవితం గడపాలని వారు ఆకాంక్షించారు.

ఆయురారోగ్యాలతో ఉండాలి: షర్మిల

వైకాపా అధ్యక్షుడు జగన్‌కు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆయన సోదరి షర్మిల పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. 'భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

కేసీఆర్, కేటీఆర్ శుభాకాంక్షలు

ఈనాడు, హైదరాబాద్: జగన్‌కు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, భారాస అధ్యక్షుడు కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కూడా జగన్‌కు ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పారు.

శుభాకాంక్షలు తెలిపిన వారికి జగన్ ధన్యవాదాలు

ఈనాడు, అమరావతి: తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ వైకాపా అధినేత జగన్ ధన్యవాదాలు తెలియజేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తెలంగాణ మాజీముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులకు ఎక్స్‌వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. వారి పోస్టులను రీట్వీట్ చేశారు.

ప్రభుత్వ నిర్ణయాలతో అభివృద్ధి: క్రెడాయ్

ఈనాడు, అమరావతి: భవన నిర్మాణ నిబంధనల సవరణ, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు స్థిరాస్తి వ్యాపార రంగం అభివృద్ధికి దోహదం చేయనున్నాయని క్రెడాయ్ రాష్ట్ర ఛాప్టర్ అభిప్రాయపడింది. భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ సులభతరం అవుతుందని, ఆయా ఉల్లోనూ పారదర్శకత పెరుగుతుందని క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి రాంబాబు, బయనా శ్రీనివాసరావు, బుడ్డిగ శ్రీనివాసరావు ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, పురపాలక శాఖ మంత్రి నారాయణకు క్రెడాయ్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# కొరవడిన కసరత్తు

- పెండింగ్‌లో నియామకాలు
- వర్సిటీల్లో 3 వేల పోస్టుల భర్తీ ప్రశ్నార్థకం..
- ఏపీపీఎస్సీ గ్రూప్-1, 2 ప్రకటనలకు రెండేళ్లు పూర్తి
- డీఎస్సీలో చూపిన స్ఫూర్తి ఇతర వాటిల్లో ఏదీ?

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం.. ఎలాంటి ముందస్తు కసరత్తు లేకుండా ఇస్తున్న ఉద్యోగ ప్రకటనలతో పోస్టుల భర్తీ ప్రశ్నార్థకంగా మారుతోంది. రిజర్వేషన్ రోస్టర్ అమలుపై శాఖల మధ్య సమన్వయం కొరవడుతోంది. హడావుడిగా ప్రకటనలు ఇవ్వడం తప్పితే ప్రభుత్వ పోస్టుల భర్తీలో ఎలాంటి ఇబ్బందులు వస్తాయనే దాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో వందల పోస్టులు కొన్నేళ్లుగా భర్తీకి నోచుకోవడం లేదు. రిజర్వేషన్ రోస్టర్ అమలు, తలెత్తిన సమస్యలపై న్యాయ వివాదాలు ఏర్పడితే వాటిని పరిష్కరించడంలో సంబంధిత విభాగాలు సకాలంలో స్పందించడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉంటోంది.. అభ్యర్థులు ఉద్యోగాల కోసం పోటీ పడుతున్నారు. కానీ, ఈ మధ్యలో ఉద్యోగ ప్రకటన నుంచి పోస్టుల భర్తీ వరకు జరుగుతున్న ప్రక్రియలో ఏర్పడుతున్న లోపాలు నియామక ప్రక్రియనే ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నాయి. పాఠశాల విద్యాశాఖ 16,347 పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటించిన ప్పటినుంచి 150 రోజుల్లో నియామకాలు పూర్తి చేసింది. దాదాపు వంద కేసులు పడినా ఎక్కడా నియామకాలకు ఇబ్బందులు లేకుండా ఉద్యోగాలు ఇచ్చింది. ఈ స్ఫూర్తి మిగతా నియామకాల్లో కనిపించడం లేదు.





### ఏపీపీఎస్సీ గ్రూప్స్‌లోనూ..

గ్రూప్-1, 2 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ 2023లో ప్రకటనలు ఇచ్చింది. గ్రూప్-2లో 905, గ్రూప్-1లో 81 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి రెండేళ్లు పూర్తయినా న్యాయ వివాదాలతో ఇంతవరకు భర్తీ ప్రక్రియ పూర్తి కాలేదు. చివరిసారిగా 2018 డిసెంబరులో గ్రూప్-2 ప్రకటన వచ్చింది. ఆ తర్వాత ఐదేళ్లకు ఈ ప్రకటన వచ్చింది. 2023 ప్రకటనలో రిజర్వేషన్ల అమలుపై పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తీర్పు వెలువడాల్సి ఉంది.

✦ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఫిబ్రవరిలో జరగగా.. గ్రూప్-1 మెయిన్స్ మేలో జరిగాయి.

✦ క్రీడా కోటా సర్టిఫికెట్ల పరిశీలనకు శాప్ ఇచ్చే నెలలకు పైగా సమయం తీసుకుంది. క్రీడా కోటాలో ఉండే అభ్యర్థులే తక్కువ.. కానీ, వాటిని పరిశీలించడానికి శాప్ నెలలకు నెలలు సమయం తీసుకుంటోంది.

## వర్సిటీ నియామకాల పరిస్థితి మరీ ఘోరం..

విశ్వవిద్యాలయాల్లో శాశ్వత అధ్యాపక పోస్టులు 76 శాతానికిపైగా ఖాళీగా ఉన్నాయి. వర్సిటీల్లో రెగ్యులర్ అధ్యాపక పోస్టుల భర్తీ ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

✦ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి తెదేపా ప్రభుత్వ హయాంలో 2017, 2018లో మొదట ప్రకటనలు ఇచ్చారు. 91 ఆచార్య, 1,109 సహాయ, 56 అసోసియేట్ ఆచార్యుల పోస్టుల భర్తీకి ఈ ప్రకటనలు ఇచ్చారు. సహాయ ఆచార్యుల పోస్టులకు ఏపీపీఎస్సీ ద్వారా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. ఇందులో 3,436 మంది అర్హత సాధించారు. వర్సిటీల్లో పోస్టుల హేతుబద్ధీకరణ, స్క్రీనింగ్ పరీక్ష, రిజర్వేషన్లపై హైకోర్టులో 75 పిటిషన్లు వేశారు. 2021లో ఈ నోటిఫికేషన్లను హైకోర్టు రద్దు చేసింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. 2023లో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. దీనిపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.


✦ వైకాపా హయాంలో మరోసారి 2023లో వర్సిటీల్లో 3,220 పోస్టుల భర్తీకి ప్రకటన ఇచ్చింది. రిజర్వేషన్ల విషయంలో లోపాలున్నాయని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ ప్రకటన నిలిచిపోయింది.

✦ న్యాయ వివాదాలు పరిష్కరించి, నియామకాలు చేపట్టాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇంతవరకు దీనిపై పురోగతి లేదు. ఈ పోస్టులు ఎప్పటికి భర్తీ అవుతాయో తెలియని పరిస్థితి. గత ఏడెనిమిదేళ్లుగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

# సబర్మతి అప్పుడో లెక్క.. ఇప్పుడో లెక్క!



అహ్మదాబాద్ నగరంలో సబర్మతి నదీ తీరం



నదిపై అటల్ వంతెన



నదిలో లాంచీ

- మురుగును కట్టడిచేసి.. జీవం పోసిన యంత్రాంగం
- ఆహ్లాదం.. వినోదానికి చిరునామాగా రివర్‌ఫ్రంట్

గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

నాడు: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని సబర్మతి నది ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురై, అడుగడుగునా ఆక్రమణలు, వ్యర్థాలతో అధ్వాన స్థితిలో కనిపించేది. పారిశ్రామిక వ్యర్థాలు భారీగా కలిసిపోయి తీవ్ర ఆరోగ్య, పర్యావరణ సమస్యలు ఉత్పన్నమయ్యేవి. వరదల కారణంగా నది కట్టలు కోతకు గురయ్యేవి.

నేడు: స్వచ్ఛమైన నదీతీరం, రెండు వైపులా పటిష్ఠ వరద రక్షణ గోడలు, గట్లు వెంబడి పరుచుకున్న పచ్చదనం, అనేకచోట్ల జలక్రీడల సౌకర్యాలు, నదీతీరం వెంబడి సందడి చేసే వలస పక్షులు.. విద్యుత్తు దీపాల వెలుగుల్లో ఆకట్టుకునే అటల్ వంతెన ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ప్రత్యేకతలున్నాయి.

### అధ్వానం నుంచి ఆహ్లాదంగా..

అధ్వాన స్థితి నుంచి అద్భుతమైన రీతిలో తీర్చిదిద్దడానికి అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాటికేళ్లుగా చేసిన కృషి కనిపిస్తోంది. సబర్మతి నది పునరుజ్జీవానికి కంకణం కట్టుకున్న అధికారులు 1997లో నదీ ముఖద్వారం అభివృద్ధి సంస్థ పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేశారు. అహ్మదాబాద్ నగరం మధ్యలోంచి ప్రవహిస్తున్న నదీ తీరాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. రెండువైపులా గట్ల పరిరక్షణపై తొలుత దృష్టి పెట్టారు. 10 మీటర్ల కంటే ఎక్కువ లోతులో నదీగర్భంలో రిటైనింగ్ గోడలు నిర్మించారు. ఆకస్మిక వరదల నుంచి లోతట్టు ప్రాంతాలను రక్షించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. నది ప్రవాహ మార్గానికి అనుగుణంగా 263 మీటర్ల వెడల్పుతో విస్తరించారు. ఈ ప్రయత్నం వల్ల నగరంలోకి వరద వెళ్లకుండా అడ్డుకట్ట పడింది. నదిలో 4.75 లక్షల క్యూసెక్కుల నీరు కిందికి ప్రవహించేలా దోహదపడింది.

### పక్కాగా మురుగునీటి మళ్లింపు

మురుగునీరు నదిలోకి రాకుండా కట్టడి చేయడం, పారిశ్రామిక వ్యర్థాలు సబర్మతిలో పడకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. మురుగునీరు ప్రవహించే కాలువలను నదికి రెండు వైపులా ఉన్న కాలువలకు అనుసంధానం చేసి 38 పాయింట్లలో మురుగునీటిని సేకరించి వాస్నా బ్యారేజీ దక్షిణంగా ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి ప్లాంట్లకు తరలిస్తున్నారు. సబర్మతి నది పరీవాహకంలోకి నర్మదా కాలువ నుంచి నీరు నిరంతరం ప్రవహించేలా ఏర్పాటు చేయడం వల్ల నది జీవంతో కనిపిస్తోంది. ఏడాది పొడవునా నదిలో నీటిని పారించడం ఒక సమగ్ర వ్యూహాన్ని రూపొందించారు. వాస్నా బ్యారేజీ కట్టి నీరు నిల్వ ఉండేలా చేశారు. అహ్మదాబాద్‌కు దిగువన ఉన్న వాస్నా బ్యారేజ్, నగరంలో నది పొడవునా మొత్తం 15 కిలోమీటర్ల మేర నీరు నిల్వ ఉండేలా జలసిరితో అలరారుతోంది. నీటి నిల్వతో వినోద కార్యకలాపాలకు వీలు కలగడమే కాకుండా, భూగర్భ జలాలు పెరుగుతున్నాయని అక్కడి అధికారులు వివరిస్తున్నారు.

### వినోదం.. వలస పక్షుల ఆవాసం

నదిలో చిన్నపాటి వ్యర్థాలనీ ఆస్కారం లేకుండా ఫ్లోటింగ్ ట్రాష్ స్కిమ్మర్ మెషిన్ ద్వారా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నారు. దీంతో ఎటుచూసినా సుందర దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. రెండువైపులా గట్ల వెంబడి వివిధిగా మొక్కలు నాటడంతో పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. అక్కడక్కడా బెంచీలు, వాకింగ్‌ట్రాక్‌లు ఏర్పాటు చేయడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికుల రద్దీతో సందడి వాతావరణం నెలకొంటోంది. నదీతీరం నుంచి రోడ్లకు మధ్యలో 20 మీటర్లకుపైగా వెడల్పు ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దారు. మొక్కలు పెంచి విద్యుత్తు దీపాలతో అలంకరించడంతో రాత్రివేళ అత్యంత సుందరంగా కనిపిస్తోంది. నదిపై నిర్మించిన అటల్ వంతెనపై వివిధ రంగులలో వెలిగే విద్యుత్తు దీపాలు, వంతెన ఆకృతి ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. అనేక రకాల వలస పక్షులకు ఆవాస ప్రాంతమై జీవ వైవిధ్యానికి నెలవుగా తయారైంది.

## యూరియా ధర మార్కెట్లో రూ.350పైనే

- వ్యవసాయశాఖ ద్వారా కొన్ని ఆర్‌ఎస్‌కే, పీఏసీఎస్‌లకే సరఫరా
- సరిపడా నిల్వలు ఉన్నా.. అన్నిచోట్లా దొరకని పరిస్థితి

ఈనాడు, అమరావతి: బహిరంగ మార్కెట్లో యూరియా ధర తగ్గడం లేదు. సరిపడా నిల్వలున్నాయని వ్యవసాయశాఖ చెబుతున్నా.. కొన్నిచోట్ల కొరత వెన్నాడుతోంది. గరిష్ఠ అమ్మకపు ధర రూ.267 ఉంటే.. ప్రకాశం జిల్లాలో కొన్నిచోట్ల ప్రైవేటు దుకాణాల్లో బస్తా రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. చాలా జిల్లాల్లో సగటున బస్తాకు రూ.350 చొప్పున వసూలు చేస్తున్నారు. రైతు సేవాకేంద్రాలు (ఆర్‌ఎస్‌కే), ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లకు వెళ్తే యూరియా దొరుకుతుందో తెలియదంటున్నారని రైతులు పేర్కొంటున్నారు. చిత్తూరు జిల్లాలోనూ యూరియా ఇబ్బందులున్నాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అవసరం మేరకు ఎక్కువగా నిల్వలున్నాయని అధికారులు నివేదికలిస్తున్నా.. క్షేత్రస్థాయిలో కొరత నెలకొంది. దగదర్తి మండలంలోని గ్రామాల్లో కొన్నిచోట్ల రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కావలి, కందుకూరు ప్రాంతాలలోని దుకాణాల్లో బస్తాకు రూ.100 అదనంగా తీసుకుంటున్నారు. పల్నాడు, బాపట్ల జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. అప్పుడు వరిసాగుతో మొక్కజొన్నకూ యూరియా వేయాల్సి ఉండటంతో డిమాండు పెరుగుతోంది.

ఒకటి, రెండు బస్తాల నిల్వలు.. రైతులకు ఇబ్బందులు

రబీ అవసరాలకు 9.38లక్షల యూరియా అవసరమని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో ఇప్పటికే 5.25లక్షల టన్నులకు పైగా నిల్వలు వచ్చాయి. డిసెంబరు వరకు 3.93లక్షల టన్నులు కావాల్సి ఉండగా.. 3.23 లక్షల టన్నులు అమ్మకాలు జరిగాయి. ఇంకా 2లక్షల టన్నులకు పైగానే నిల్వలున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కొన్ని పీఏసీఎస్‌లు, ఆర్‌ఎస్‌కేల్లోనే రైతులకు యూరియా అందుబాటులో ఉంటోంది. అదీ ఎప్పుడు ఉంటుందో ముందస్తు సమాచారం రైతులకు తెలియట్లేదు. తీరా రైతుకు తెలిసి అక్కడకు వెళ్లేసరికి అమ్మకాలు అయిపోతున్నాయి. తర్వాత మళ్లీ ఎన్నాళ్లకు ఇస్తారనే సమాచారం ఉండట్లేదు. సరిపడా నిల్వలున్నాయని.. రైతు ఎక్కడికైనా వెళ్లి డబ్బు ఇచ్చి యూరియా కొనుక్కోవచ్చని అని రైతులు పేర్కొంటున్నారు. కర్షకులు కొరతను ఎదుర్కొనే పరిస్థితి కల్పించిందని అంటున్నారు. తద్వారా అధికారులు కృత్రిమ కొరతకు పరోక్షంగా కారణమవుతున్నారనే విమర్శలున్నాయి. వ్యవసాయశాఖ అధికారులైనా యూరియా క్రమబద్ధీకరణపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

## ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో ఆదివారం ఏపీ ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సమ్మేకంగా తీర్మానించిన అంశాలను యథాతథంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. పదేళ్లుగా చాలీచాలని జీతాలు, పనిభారం లాంటి సమస్యలతో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సతమతం అవుతున్నారని వెల్లడించారు. త్వరలో అధికారులు, మంత్రులను కలిసి సమస్యలు పరిష్కారమయ్యేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

## నా వెంట నిలిచిన శక్తి బ్రాహ్మణి

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్

ఈనాడు, అమరావతి: "సుఖదుఃఖాల్లో నా వెంట నిలిచిన శక్తి. దేవాంశ్‌కు తల్లిగా, హెరిటేజ్ సీఈవోగా ప్రతి అడుగులోనూ నాతో కలిసి నడిచావు" అని నారా బ్రాహ్మణిని ఉద్దేశించి లోకేశ్ పేర్కొన్నారు. బ్రాహ్మణి పుట్టినరోజు సందర్భంగా ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

## దుబాయ్‌లో 'ఎన్టీఆర్ సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ

పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు, టీడీ జనార్దన్

ఈనాడు, అమరావతి: దుబాయ్‌లో నిర్వహించిన తెలుగువారి ఆత్మీయ సమావేశంలో 'ఎన్టీఆర్ సజీవ చరిత్ర' పుస్తకం, దాని ఆడియో వెర్షన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తెలుగువారు రాజకీయాలు ఎన్టీఆర్‌కు ముందు, ఆ తర్వాత అన్నట్లు సాగాయని వారు పేర్కొన్నారు. ప్రవాసాంధ్రులు శ్రీనివాస్ రామమూర్తి, సల్లూరి శేషయ్య, రవి గుత్తా, శ్రీనివాసరావు నాద ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తెదేపా ఎన్నారై యూఏఈ విభాగం కార్యదర్శి సభ్యులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ సజీవ చరిత్ర పుస్తకాన్ని టీడీ జనార్దన్, మండలి కృష్ణారావు అధికార భాషాసంఘం ఛైర్మన్ విక్రమ్ పూల రచించారు.



'ఎన్టీఆర్ సజీవ చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిమ్మల రామానాయుడు, టీడీ జనార్దన్ తదితరులు

## యాదగిరి క్షేత్రంలో తోమాల, సహస్ర దీపాలంకరణ సేవలు

త్వరలో నూతన కైంకర్యాలు ప్రారంభం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: భక్తుల ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు నూతన కైంకర్యాల నిర్వహణకు యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నిర్ణయించింది. దేవస్థానానికి చెందిన వైదిక కమిటీ, వివిధ విభాగాల అధికారులతో ఆలయ ఈవో వెంకట్రావు ఆదివారం ప్రత్యేక సమీక్ష నిర్వహించి, నూతన సేవా కైంకర్యాలు అమలు చేయాలని నిర్ణయించారు. గిరి ప్రదక్షిణ ప్రారంభ స్థలంలో శ్రీనరసింహస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వైదిక కమిటీ సూచనల మేరకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలో ప్రారంభించనున్న సేవలివి..

✦ సహస్ర దీపాలంకార సేవ: స్వాతి నక్షత్రం, ఏకాదశి రోజున సాయంత్రం 6 గంటలకు ప్రారంభిస్తారు. టికెట్ రుసుం దంపతులకు రూ.500, రెండు లడ్డూలు అందజేస్తారు.

✦ తోమాల సేవ: ప్రతి బుధవారం ఉదయం 6:15 నుంచి 6:45 గంటల వరకు ఉంటుంది. టికెట్ రుసుం దంపతులకు రూ.500, వైకుంఠ ఏకాదశి రోజున ప్రారంభిస్తారు.



✦ తులాభారం సేవ: రోజూ దర్శన సమయంలో ఉంటుంది. బెల్లం, కలకండ, కనుము అందిస్తారు. తూకం కొలిచేందుకు నాణేలు, బెల్లం ఏర్పాటు చేస్తారు. భక్తులు తూకానికి సమానమైన విలువను చెల్లించాలి. వైకుంఠ ఏకాదశి రోజున ప్రారంభిస్తారు.

✦ కొత్త వాహన సేవలు: సూర్యప్రభ వాహన సేవ ప్రతి ఆదివారం, రథసప్తమి రోజు, ఉదయం 7 నుంచి 7:30 గంటల వరకు, దంపతులకు టికెట్ రుసుం రూ.1000, ఒక లడ్డూ, కనుము అందజేస్తారు. 2026 ఫిబ్రవరి 1 మాఘ పౌర్ణమి రోజున ప్రారంభిస్తారు.

✦ చంద్రప్రభ వాహన సేవ: ప్రతి పౌర్ణమి రోజు సాయంత్రం ఉంటుంది. టికెట్టు రూ.1000 చెల్లించాలి. 2026 ఫిబ్రవరిలో ప్రారంభిస్తారు.

# వసుంధర

vasundhara@eenadu.in

# ఇంటి ఆరోగ్యానికి పంచ సూత్రాలు!



కొత్త ఏడాది వస్తోందంటే చాలు... ఇల్లంతా శుభ్రం చేద్దాం, కొత్తగా అలంకరిద్దాం అనుకుంటాం. కానీ ఇంట్లో పేరుకుపోయిన పాత సామాను దుస్తుల్నీ తీయడానికి ఓ పట్టాన మనసు రాదు. ఎలాగో గుండె దిటవు చేసుకుని తీద్దాం అనుకున్నా... ఎక్కడ మొదలుపెట్టాలో తెలియదు. అందుకే ఇలా చేద్దాం..!

పిల్లలు పుట్టినప్పటి నుంచి వాళ్లకోసం రకరకాల దుస్తులు, ఫర్నిచర్, ఆటవస్తువులు, బొమ్మలు, పుస్తకాలు కొంటుంటాం. ఇల్లు సగం వాటితోనే నిండిపోతుంది. వీటికితోడు మన జ్ఞాపకాలు మరికొన్ని. చిన్ననాటి పుస్తకాల నుంచి స్నేహితులు ఇచ్చిన కానుకలు, పెళ్లయిన కొత్తల్లో శ్రీవారు ప్రేమతో కొనిచ్చినవి నాన్న తెచ్చినవీ అమ్మ అల్లినవీ... ఇలా ఒకటా రెండా... కబోర్డులన్నీ తెరిచి చూడాలే కానీ మన ఇల్లే ఓ చిన్నపాటి మ్యూజియం.

ఇవి చాలవన్నట్లు నిత్యం కొత్తగా వస్తోన్న గృహోపకరణాలతో పాతవి కొన్ని అటకెక్కుతాయి, మరికొన్ని సెల్లార్లోకి చేరతాయి. వేటినీ పారేయలేం. దాంతో ఇల్లు సర్దడం వాయిదా వేస్తుంటాం. ఫలితం... ఇల్లంతా సామాన్లతో నిండి, గందరగోళంగా అనిపిస్తుంది. అది మనసుపై తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. పైగా ఆ పాత సామాన్ల నిండా దుమ్ముధూళీ చేరి లేనిపోని అనారోగ్య సమస్యలు. నిజానికి ఇలా పాతవాటిని దాచడం ఒక రకమైన మానసిక వ్యాధే. ఇది ముదిరితే మరీ కష్టం. ఎందుకంటే జ్ఞాపకాలు మనలో ఉండాలి కానీ వాటితోనే ఇంటిని నింపేయకూడదు కదా. కాబట్టి కాసేపు గుండె రాయి చేసుకుని వాటిమీద మమకారం చంపుకొని పేరుకుంటోన్న వస్తువుల్ని ఎప్పటికప్పుడు తీసేయండి. దానికిదే మంచి సమయం... అయితే ఎక్కడ మొదలెట్టాలి, వాటిని ఎలా పంచివ్వాలి అన్నదే సమస్యా... అందుకే ఈ పంచ సూత్రాల్ని అనుసరించేయండి.

**1 అవుట్ బాక్స్:** ప్రతి గదిలో నాలుగు బాక్సులు పెట్టుకోండి. వాటిమీద చెత్త, విరాళం, తెలిసిన వాళ్లకివ్వడం, స్వచ్ఛందం అని రాయండి. అంటే, అస్సలు పనికిరావు అనుకున్న పాత్రలు, దుస్తులు, సౌందర్య ఉత్పత్తులు ట్రాష్‌లో వేసేయండి. బాగున్నాయి కానీ వాడటం లేదు అనుకున్నవి ఏమాత్రం ఆలోచించకుండా తెలిసినవాళ్లకో లేదంటే విరాళం బాక్సులో వేసి ఏ ఆశ్రమానికో స్వచ్ఛంద సంస్థలకో ఇచ్చేయండి.

● మరికొన్ని ఉంటాయి. వాటిని ఎవరికీ ఇవ్వలేం. ఉదాహరణకు పుస్తకాల మీదున్న మమకారంతో చిన్నప్పటి నోట్సుల నుంచి దాచి పెట్టుకుంటాం. అలాగే ఒకప్పటి టేప్ రికార్డర్, కెమెరా, పేజర్, వాల్ క్లాక్... వంటివీ ఉంటాయి. ఇవన్నీ ఎవరికీ పనికిరావు. అలాగని పారేయలేం. ఇలాంటివి సేకరించేవాళ్లకు ఇవ్వండి.

● గాజు, పింగాణీ వస్తువులు ఎక్కడ పగులుతాయో అన్న భయంతో దాచిపెడుతుంటాం. ఎన్నాళ్లని అలా... తీసి వాడటం మొదలుపెట్టండి. లేదంటే అవి ఎప్పటికీ అల్మరాల్లో మిగిలిపోతాయి.

**2 80/20:** దుస్తులు, కిచెన్ ఉపకరణాల్లో 20 శాతం మాత్రమే వాడుతుంటాం. మిగిలినవి ఎప్పుడోగానీ వాడం. అవన్నీ తీసేస్తే ఇల్లు విశాలంగా కనిపిస్తుంది, మనసుకీ ప్రశాంతతే. ఫోన్ యాప్స్‌కీ ఈ సూత్రం వర్తిస్తుంది.

**3 రివర్స్ హ్యాంగర్ ట్రిక్:** వార్డ్‌రోబ్‌లో వేలాడదీసినవన్నీ హ్యాంగర్ గోడవైపు తిప్పి పెట్టండి. వాడినది ముందువైపునకు ఉంచండి. ఆరునెలల తరవాత మీరు ఎన్ని వాడుతున్నారో తెలిసిపోతుంది. ఈలోగా అస్సలు తీయనివి ఉంటే ఏమాత్రం తటపటాయించకుండా ఇచ్చేయండి.

**4 తీసేయండి:** సొరుగుల్లో పేరుకున్నవన్నీ తీసేయాలి అని పెట్టుకోండి. ఓసారి బయటకు తీయండి. వాటినో ప్లాస్టిక్ డబ్బాలో వేసి కనిపించేలా పెట్టండి. మూడునెలల్లో వాటిల్లో వాడినవే డ్రాలో పెట్టి మిగిలినవన్నీ నిర్మొహమాటంగా తీసేయండి.

**5 వాడేయండి:** కొనుక్కున్నవన్నీ వాడేయాలి అన్న నియమాన్ని ముందే పెట్టుకోండి. అవి అయ్యేవరకూ వేరేవి కొనకండి. సౌందర్య ఉత్పత్తులకి ఈ సూత్రం చక్కగా సరిపోతుంది.

### ఎలా ప్రారంభించాలి?

**టైమ్ సెట్ చేసుకోండి:** చేద్దాంలే అనుకుంటూ వాయిదా వేసేవాళ్లే ఎక్కువ. అందుకే ఈ పాతవి తీసేయడానికి రోజుకి 5- 10 నిమిషాలు పెట్టుకోండి. ఇదో అలవాటుగా మారుతుంది.

**స్నో బాల్ పద్ధతి:** ముందు ఒక్క వస్తువుతో ప్రారంభించండి. ఇప్పుడు అలాంటి వస్తువులు ఇంకేం ఉన్నాయో అని చూడండి. మెల్లగా దీన్ని ఓ ఉద్యమంలా ప్రారంభించండి.

**5-5-5 సూత్రంతో:** ఐదు అల్మరాలు లేదా డ్రాల్ని ఎంపిక చేసుకోండి. ఐదు రోజులు కేటాయించండి. ఐదేసి వస్తువులు చొప్పున తీసేయండి.

**2-2-2 సూత్రంతో:** రెండు వస్తువులు పారేయండి. రెండు దానం చేయండి. మరో రెండు మళ్లీ వాడండి. దుస్తులకిది తీసేయాలి అనుకున్నప్పుడు ఈ ట్రిక్ పాటించండి.

**కనిపించేవి:** ఇంట్లో వస్తువులు తీసేటప్పుడు ముందు కిచెన్ గట్టుమీద డ్రెస్సింగ్ టేబుల్, టీవీ షెల్ఫ్... బయటకు కనిపించేవన్నీ తీసేయండి. తేడా మీకే తెలుస్తుంది. కొన్నిరోజుల్లోనే ఇల్లంతా క్లీన్ అండ్ గ్రీన్!

## చెయ్యినే కత్తిలా చేసుకుని...

రక్ష

ఆకస్మికదాడుల సమయంలో చేతులూ, కాళ్లనే ఆయుధాలుగా మార్చుకోవాల్సి వస్తుంది. దుండగుడు మనపైకి వస్తుంటే బెదిరిపోకుండా చేయినే కత్తిగా భావించండి. కత్తితో నరికినట్లు మెడమీద చేత్తో బలంగా కొట్టండి. వేళ్లు, మణికట్టు మధ్యన ఉండే భాగాన్ని ఇందుకు ఉపయోగించండి. ఈ సమయంలో అరచేయి పైకి చూస్తున్నట్లుగా ఉండాలి. మెడ చాలా సున్నితమైన భాగం కాబట్టి దెబ్బ గట్టిగా తగులుతుంది. దీన్ని ప్రయోగించేటప్పుడు బలంతోపాటు వేగమూ తోడవ్వాలి. దీనికి ప్రాక్టీసు చాలా అవసరం. ప్రాక్టీసు సమయంలో అవతల వ్యక్తికి దెబ్బలు తగలకుండా చూసుకోండి.

పోషకాహారం, నిద్ర, వ్యాయామంతోనే కిక్, పంచ్‌లను బలంగా ఇవ్వొచ్చు.



– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

## చెల్లెలంటే విసుక్కుంటోంది!

**మా పిల్లలిద్దరికీ 14 ఏళ్లు తేడా. పెద్దమ్మాయికి 16 ఏళ్లు. ఇంటర్ చదువుతోంది. చెల్లి పుట్టినప్పుడు చాలా ఆనందంగా ఉంది. ఈ మధ్య చెల్లెలంటే విసుక్కుంటోంది. చేయి చేసుకుంటోంది. మేమేమైనా అంటే నేనంటే మీకు ఇష్టం లేదని ఏడుస్తోంది. అలాంటిదేమీ లేదంటే వినట్లేదు. ఎందుకిలా తయారైంది? తనని మార్చేదెలా?**

**- ఓ సోదరి**

పిల్లల మధ్య వయసులో అంతరం ఎక్కువగా ఉన్నప్పుడు ఈ పరిస్థితి సహజమే. పాపాయి పుట్టిన తొలిరోజుల్లో కొంచెం కొత్తదనం, తనకీ చెల్లి రూపంలో ఓ తోడు దొరికిందని మీ పెద్దమ్మాయి సంతోషపడి ఉండొచ్చు. అయితే చిన్నదని పాపాయికే ఎక్కువ సమయం కేటాయించడం, పెద్దమ్మాయితో ఇదివరకులా గడపకపోవడం వంటివి చెల్లెలి పట్ల తనకి అసహనం, అసూయ వంటివి ఏర్పడటానికి కారణమై ఉండొచ్చు. కొన్ని సందర్భాల్లో స్నేహితులూ 'నీకు ఇంత చిన్న చెల్లి ఉందా' అని టీజ్ చేసినా కూడా దాన్నో అవమానంలా భావించే ఆస్కారముంది. ఫలితమే కోపం. ఇలాంటి పరిస్థితి రావొద్దనే పెద్ద పిల్లల్ని ముందు నుంచి రాబోయే చిన్నారి విషయంలో సిద్ధం చేయాలని చెబుతారు. రాబోయే తోబుట్టువును చూసుకోవడం, వాళ్లతో ప్రేమగా ఉండటం వంటి విషయాల్ని చర్చిస్తే వాళ్లూ అందుకు సిద్ధమై ఉంటారు. 14 ఏళ్లు ఇంటికి మహారాణిలా పెరిగి, తల్లిదండ్రుల ప్రేమనంతా పొంది... ఒక్కసారిగా మరొకరితో ఇవన్నీ పంచుకోవాలంటే తట్టుకోవడం కష్టమే. కాబట్టే, మీ పెద్దమ్మాయి ఇలా ప్రవర్తిస్తూ ఉండి ఉండవచ్చు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. ఓసారి తనని కూర్చోబెట్టుకుని ఆమె ప్రవర్తనకు కారణాలు కనుక్కోండి. తనపై మీ ప్రేమను వ్యక్తపరచండి. అలాగే తనతో మీరు గత ప్రవర్తనకీ ప్రస్తుతానికీ మధ్య తేడాలున్నాయా? విసుక్కోవడం, అన్ని పనులూ తననే చేయమనడం వంటివి ఏమైనా చేశారా అన్నదీ గమనించుకుని మార్చుకోవాలి. ఆపై నెమ్మదిగా అక్కగా చెల్లెలి పట్ల తన బాధ్యత, చిన్నారిని ఎలా అపురూపంగా చూసుకోవాలి... దానివల్ల వాళ్ల మధ్య ఏర్పడే అనుబంధం వంటివి అర్థమయ్యేలా చెప్పండి. చిన్న పాపకి సంబంధించిన పనులు, కొనే వస్తువులు వంటి అన్ని విషయాల్లో మీ పెద్దమ్మాయినీ భాగస్వామిని చేయండి. తన అభిప్రాయానికీ ప్రాధాన్యం ఇవ్వండి. అప్పుడు క్రమంగా మార్పు వస్తుంది. అయితే ఇక్కడ మీరు చాలా సహనంతో, తన మీదా ఇదివరకటిలానే ప్రేమ ఉందన్న భావన కలిగేలా ప్రవర్తించాలి మరి!

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

## బాధ్యతే అసలైన గౌరవం..!



**ప్లాట్‌ఫామ్‌పై నిలబడి రైలు కోసం ఎదురుచూస్తున్న జనంలో ఆమె ఒకరు. కానీ, తను రైలు ఎక్కడానికి కాదు. ఆ ట్రైన్ నుంచి దిగే ప్రయాణికుల కోసం. వాళ్లిచ్చే సామాన్లు మోస్తేనే ఆమె పిల్లల కడుపు నిండుతుంది. తనే సంధ్యా మారవి. భర్త మరణంతో పిల్లల భవిష్యత్తు కోసం రైల్వే కూలీగా మారారీమె.**

జీవితం ఎప్పుడు ఎలాంటి మలుపు తిరుగుతుందో ఎవరికీ తెలీదు. 2016లో భర్త మరణం సంధ్యా మారవిని కుదిపేసింది. చేతిలో చిల్లిగవ్వలేదు. ముగ్గురు పిల్లలు. తను బాధ పడుతూ కూర్చుంటే వారి కడుపు నిండేదెలా అనుకున్నారామె. దాంతో కుటుంబ భారాన్ని భుజాలపై వేసుకున్నారు. ఎప్పుడూ ఇంటి నుంచి బయటికి వెళ్లింది లేదు. పెద్దగా చదువు లేదు. ఏ పని చేయాలో తెలియలేదు. అలాగని ఎవరి దగ్గరా చేయి చాచలేదు. కష్టాన్నే నమ్ముకున్నారు సంధ్య. కుటుంబాన్ని పోషించడానికి మగవాళ్లు మాత్రమే చేయగలిగే రైల్వే కూలీనే వృత్తిగా ఎంచుకున్నారు. జబల్‌పూర్ రైల్వే స్టేషన్‌లో బ్యాడ్జ్ నెంబర్ 36, ఎరుపు చొక్కా ధరించి కూలీగా మారారీమె. 400మంది పురుషుల మధ్యలో ఒక్కరే మహిళ. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతిసారీ సుమారు 45కేజీల బరువుని భుజాలపై మోసుకెళ్లాలి. అయినా భయపడలేదీమె. 'మొదటిసారి నేను స్టేషన్‌లో పనిచేయడానికి నిలబడినప్పుడు అందరూ వింతగా చూశారు. మగవాళ్లు మాత్రమే చేసే పని నీవల్ల అవుతుందా? ఇంత బరువు మోయగలవా అన్నట్లు చూశారు. వాళ్ల ముందే లగేజీని మోసి చూపించా. పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నా సంకల్పం బలంగా ఉంటే ఏదీ అసాధ్యం కాదు' అంటారు సంధ్య. రోజూ కట్నీ నుంచి జబల్‌పూర్‌నకు 45కి.మీ ప్రయాణించి ప్రయాణికుల పిలుపుకోసం ఎదురు చూస్తుంటారీమె.

### అమ్మ మేల్కొంటుంది...

స్టేషన్‌లో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లగానే ఆమెలోని కూలీ నిద్రపోయి అమ్మ మేల్కొంటుంది. పిల్లలకి అన్నం తినిపించి, చదువు చెప్పి, నిద్రపుచ్చే వరకూ విశ్రాంతి తీసుకోరామె. 'భుజాన మోసేది ప్రయాణికుల బరువులు కాదు, నా ముగ్గురు పిల్లల భవిష్యత్తు' అంటారు సంధ్య. కష్టాలకు కుంగిపోకుండా... నేను వాటిని గెలవగలను అని నిరూపించుకున్నారు. చేసే పని ఎలాంటిది అని ఆలోచించకుండా బాధ్యతే అసలైన గౌరవం అనుకున్న సంధ్య ఈతరం మహిళలకి స్ఫూర్తిదాయకమే కదూ!



## 'వాబీ-సబీ' ఏం చెబుతోంది!

'ఏ పని చేసినా... ఎదుటివాళ్లకీ, పైవాళ్లకీ ఎత్తి చూపే అవకాశం ఇవ్వకూడదు' ఇది చాలా మంది ఉద్యోగినుల తాపత్రయం. 'ఎక్కడ పెట్టిన వస్తువు అక్కడే ఉండాలి, శుభ్రత తగ్గకూడదు. పిల్లలూ, ఆయనా వచ్చేసరికి కావాల్సినవన్నీ తయారుచేయాలి' ఇది గృహిణుల ఆకాంక్ష. 'పరీక్షల్లో అందరికన్నా నేనే ముందుండాలి. నాకే మంచి మార్కులు రావాలి' దీనిమీదే విద్యార్థినుల ధ్యాసంతా. ఇలా అందరూ వాళ్ల కర్తవ్యాల్లో బెస్ట్ ఇవ్వాలనే కోరుకుంటారు. అందుకు అనుగుణంగానే పనులూ చేస్తారు. కానీ ఈ ప్రక్రియలో అంతరాయం ఏర్పడినా, ఏ చిన్న తప్పు జరిగినా తమని తాము నిందించుకుంటూ ఉంటారు. పైగా, ఈ పర్ఫెక్ట్‌నెస్ వల్ల వచ్చే ఒత్తిడీ, ఆందోళనలతో సతమతం అవుతుంటారు. మీరూ ఈ కోవకు చెందిన వారేనా? అయితే మీకు జపనీయుల వాబీ-సబీ పద్ధతి గురించి తెలియాల్సిందే. ప్రతి విషయంలోనూ ఈ పరిపూర్ణత అవసరం లేదన్నదే దీని సారం. కొన్ని తప్పులూ, లోపాలతోనే మనుషుల్నీ, పనుల్నీ స్వీకరించడం నేర్చుకోమంటున్నారు. అప్పుడే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండగలం అంటున్నారు. లోపాలు లేని వ్యక్తి ఉండరు. మన బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నించాలే తప్ప ఫలితాల్ని తలుచుకుని ఒత్తిడికి గురి కాకూడదనీ చెబుతుంది వాబీ-సబీ. అంతేనా, తప్పులు చేస్తేనే కదా, ఒప్పేంటో తెలిసేది. మంచిచెడులూ, కష్టనష్టాలూ సమపాళ్లలో స్వీకరించగలిగినప్పుడే కదా జీవితం ముందుకు వెళుతుంది అన్నదే దీని ఉద్దేశం. జపనీయులు సానుకూల దృక్పథంతో అన్నీ ఆలోచించడానికి ఇదే కారణమట. మీరేం అంటారు?

## స్నోమ్యాన్... శాంటా హ్యాట్.. అన్నీ అలంకరణలే!





క్రిస్మస్... పిల్లలకి ఎంతో ఇష్టమైన పండుగ! అంతేనా ఆరోజు క్రిస్మస్ ట్రీని అలంకరిస్తే రాత్రి శాంటాక్లాజ్ వచ్చి బహుమతులు ఇస్తాడంటూ సంబరపడిపోతారు. అందుకే మతాలకతీతంగా చాలా మంది ముఖ్యంగా పిల్లలున్నవాళ్లు క్రిస్మస్‌కి రంగురంగుల దీపాలతో ఇంటిని అలంకరిస్తుంటారు. బదులుగా ఈసారి ఇలా చేసి చూడండి... ఎవరైనా ఇంటికి రాగానే స్వాగతం పలికేది ముందున్న ద్వారమే కదా. దానికి స్నోమ్యాన్, శాంటా హ్యాట్‌లు సరిగ్గా సరిపోతాయి. వీటిని తలుపునకు వేలాడదీస్తే సరి. ఇంటికొచ్చే స్నేహితులు, బంధువులు కలిసి భోజనం చేయాలంటే అంతా చేరిపోయేది డైనింగ్ టేబుల్ దగ్గరకే! అక్కడ పైన్ కోన్ షాండ్లియర్లు, రంగురంగుల గొడుగులకు ఫెయిరీ లైట్లు, క్యాండీ కేన్స్, కలర్ బంతులను వేలాడదీస్తే ఇంటికి పార్టీ లుక్ వచ్చేస్తుంది. కిటికీలు, అల్మరాలకు క్రిస్మస్ గ్లౌజుల్ని హ్యాంగ్ చేస్తే కొత్తగా కనిపిస్తాయి. పైన్ కోన్లను గాజు గ్లాసుల్లో వేసి ఎల్ఈడీ లైట్లతో టీపాయ్ మీద పెడితే వచ్చినవారిని ఇట్టే ఆకర్షిస్తాయి. ఆ రోజు బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం తెలిసిందే. ఈసారి చక్కగా శాంటాక్లాజ్‌తో తయారైన గిఫ్ట్ బ్యాగులు ఇచ్చి చూడండి. అందరి ముఖాల్లోనూ ఆనందం వెల్లివిరియడం ఖాయం!





## వేడి ఆవిర్లు తగ్గించే వెల్లుల్లి..!

వెల్లుల్లికి వంటింటి ఔషధంగా పేరు. ఘాటైన వాసనతోపాటు శక్తిమంతమైన యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలెన్నో దీన్లో ఉంటాయి. ఇది ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. అవేంటంటే...

● రోజూ వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకుంటే పెద్ద పేగు క్యాన్సర్ ముప్పు తగ్గుతుందట. ఇది కొలెస్ట్రాల్ స్థాయుల్ని నియంత్రించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది.



● శీతకాలంలో వచ్చే శ్వాసకోస సమస్యల్నే కాదు... రోగాలను అడ్డుకునే ఇమ్యూనిటీని వెల్లుల్లి బలపరుస్తుంది. ఇందుకు ఇందులోని అల్లిసినే కారణమట. ఇది ఎముకల బలం తగ్గడాన్ని నివారిస్తుంది.

● మగవాళ్లతో పోల్చితే మహిళల్లో నిద్రలేమి సమస్యలు, కీళ్ల నొప్పులూ ఎక్కువే. వీటి నుంచి వెల్లుల్లి ఉపశమనం కలిగిస్తుంది.

● ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు... మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజన్ లోపం వల్ల వచ్చే సమస్యల్నీ తగ్గిస్తుంది. ముఖ్యంగా వేడి ఆవిర్లు, మూడ్ స్వింగ్స్ అదుపులో ఉంటాయి.

గెలుపు మంత్ర - 2025

## ఈ ఏడాది నా విజయం!



కొద్దిరోజుల్లో 2025కి వీడ్కోలు చెబుతాం. మరో ఏడాదిని స్వాగతిస్తాం. ఎన్ని అడ్డంకులొచ్చినా ఈ ఏడాది నేను ఇది సాధించాల్సిందే అంటూ ఎన్ని తీర్మానాలు చేసుకునుంటాం? కానీ చాలావరకూ పదిరోజులకే అన్నీ పాతబడిపోతాయి. కానీ కొందరుంటారు. పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు. మీదీ అదే కోవా? వ్యాయామం, కొత్త స్కిల్స్ నేర్చుకోవడం, పొదుపు... ఇలా ఏదైనా కావొచ్చు. ఈ ఏడాది మీరు ఏదైనా సాధించినా, మీలో మార్పు తెచ్చుకోగలిగినా... మాతో పంచుకోండి. అందుకోసం మీరు పడిన శ్రమ, అనుసరించిన ప్రణాళికల గురించి చెప్పండి. మరో ఏడాదిలోకి అడుగుపెడుతోన్న సమయంలో మరికొందరికి అవి స్ఫూర్తిగా నిలుస్తాయి. ఇంకేం... మెయిల్(vasundhara @eenadu.in), వాట్సాప్(9154091911)లకు 'ఈ ఏడాది నా విజయం' అని శీర్షిక పెట్టి, రాసేయండి మరి.


## రంగవల్లిక

17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకూ




మునిగంటి మాధవి, కూకట్‌పల్లి, హైదరాబాద్

వై. కీర్తి రెడ్డి
పురంధరపురం, నెల్లూరు జిల్లా



11 చుక్కలు
11 వరుసలు




16 చుక్కలు
సరిచుక్క
2 వచ్చేవరకూ

టీడీ శిరీష
అనంతపురం

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

**మా చిరునామా:**
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్
మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

" స్టార్టప్‌ల వ్యవస్థలో మహిళా వ్యవస్థాపకుల సంఖ్య పెరగాలంటే... విజయవంతమైన మహిళా ఆంత్రప్రెన్యూర్ల గురించి అందరికీ తెలియజేయాలి. అలాగే ఎక్కువమంది మహిళా పెట్టుబడిదారులు రావాల్సిన అవసరమూ ఉంది. ప్రస్తుతం మనదేశంలోని మొత్తం పెట్టుబడిదారుల్లో వీళ్లు ఒక్కశాతమైనా లేరు. వ్యవస్థాపకులుగా విజయవంతమైన మహిళలు పెట్టుబడులు పెడితే వాళ్ల అనుభవ పాఠాలూ కొత్తతరానికి ఉపయోగపడతాయి.

\- పద్మజా రూపారెల్, సహ వ్యవస్థాపకురాలు, ఇండియన్ ఏంజెల్ నెట్‌వర్క్ గ్రూప్



## ఆసుపత్రిలో చిన్నారి మృతి..
## సంచిలో తరలించిన తండ్రి



ప్రభుత్వ వైద్యవ్యవస్థలోని లోపాలు, నిరుపేదల పాట్లను వెల్లడి చేసే హృదయ విదారక ఘటన ఒకటి ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. బాల్‌జోడి గ్రామానికి చెందిన డింబా ఛటోంబా అనే గిరిజనుడు అనారోగ్యంతో ఉన్న తన కుమారుణ్ని (4) చాయిబాసా సదర్ ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అక్కడి వైద్యులు ఆ చిన్నారిని కాపాడలేకపోయారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తండ్రి మృతదేహం తరలింపునకు అంబులెన్సు సమకూర్చాలని ప్రాధేయపడినా ఎవరూ సానుకూలంగా స్పందించలేదు. ప్రయివేటు వాహనంలో తీసుకువెళ్లే ఆర్థికస్తోమత లేనందున.. కుమారుడి మృతదేహాన్ని ఓ సంచిలో వేసుకొని బస్సులో గ్రామానికి తీసుకువెళ్లాల్సి వచ్చింది. చాయిబాసా సదర్ ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ భారతీ మింజ్ దీనిపై స్పందిస్తూ.. "మృతదేహాల రవాణాకు అంబులెన్సులు కేటాయించడం లేదు. జిల్లా మొత్తానికి ఒకటే శవాల వాహనం ఉంది. రెండు మూడు గంటలు వేచి చూడమన్నాం. వారు వినలేదు" అన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై చర్య తీసుకొంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ 'ఈటీవీ భారత్'కు తెలిపారు.

## నక్సలైట్లకు అన్నం పెట్టిన గ్రామం..
## నేడు ప్రభుత్వ కొలువుల కేంద్రం

బిహార్‌లోని గయా జిల్లా దేవ్‌జరా ఒకప్పుడు నక్సలైట్ల అడ్డా. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకు చిరునామాగా మారిపోయింది. ఈ గ్రామస్థులు నక్సలైట్లకు తరచూ భోజనాలు పెట్టేవారు. ఆ క్రమంలో ఊరి యువతకు పెన్ను పట్టుకోవాలా.. తుపాకీ ఎంచుకోవాలా అనేది పెద్ద సందేహంగా ఉండేది. ఇటువంటి గ్రామం నుంచి 2005లో ఆర్మీలో చేరిన నరేశ్ ప్రసాద్ ఊరి యువతకు ప్రేరణగా నిలిచి మార్పు తెచ్చాడు. పేద కుటుంబానికి చెందిన నరేశ్ చొరవ తమ ఊరి ముఖచిత్రాన్నే మార్చేసిందని దేవ్‌జరా గ్రామపెద్ద సుధామ ప్రసాద్ తెలిపారు. ఈ గ్రామ యువత ప్రస్తుతం పోలీసు, రైల్వే, బోధన, సైన్యం, బ్యాంకింగు తదితర ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్నారు. "ఇప్పుడు మా ఊరు నక్సలైట్ ప్రభావిత గ్రామం కాదు. ప్రభుత్వ సర్వీసులో పనిచేస్తున్న గ్రామానికి చెందిన ప్రతి వ్యక్తి ఇతర విద్యార్థులకు సాయం చేస్తున్నారు. పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి వంటి విషయాలను నేర్పుతున్నారు" అని ఎస్.ఐ.గా ఎంపికైన యువకుడి తండ్రి కమలేశ్ చెప్పారు.






# వీబీ-జీ రాం జీ బిల్లుకు చట్టరూపం

- రాష్ట్రపతి ఆమోద ముద్ర
- ఏయే పనులు చేపట్టొచ్చంటే..

ఈనాడు, దిల్లీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో మోదీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వికసిత భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ రాం జీ) బిల్లు చట్టంగా మారింది. పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందిన ఈ బిల్లుకు ఆదివారం రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది. దీనిద్వారా ప్రతి ఏటా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు 125 పని దినాలకు హామీ లభిస్తుంది. వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడకుండా పంటల విత్తనాలు, నూర్పిళ్లు ఎక్కువగా ఉండే 60 రోజులపాటు ఈ పథకాన్ని నిలిపేస్తారు. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన తేదీ నుంచి ఈ చట్టం అమల్లోకి వస్తుంది. దీనికింద చేపట్టే పనుల ప్రణాళిక, పర్యవేక్షణ అంతా గ్రామ పంచాయతీల ద్వారానే జరుగుతుంది. ఇందులో ప్రధానంగా నాలుగు రకాల పనులకే వీలు కల్పిస్తారు.




మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పును నిరసిస్తూ పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ర్యాలీ చేపట్టిన కాంగ్రెస్ నేతలు

### 1 జల సంరక్షణ

ఇందులో నీటి సంరక్షణ, సాగు నీరు, భూగర్భ జలాల రీఛార్జి, నీటి వనరుల మూలాల పునరుద్ధరణ, చెరువులు, కుంటలు, ఇతర జలాశయాల పునరుజ్జీవం, వాటర్‌షెడ్ అభివృద్ధి, అటవీకరణ, కాలువల నిర్మాణం, వరద నీటి మళ్లింపు కాలువలు, చెక్‌డ్యాంల నిర్మాణం, సాగునీటి కోసం బావుల తవ్వకం, మైక్రో ఇరిగేషన్ ఛానళ్లు, ఫీల్డ్ వాటర్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తారు. ముంపునకు గురైన సామాజిక భూముల పునరుద్ధరణ, భూసారం, భూమిలో తేమ సంరక్షణ కోసం అడవులు, మొక్కల పెంపకం చేపడతారు. ఇళ్ల పైకప్పుల నుంచి వచ్చే వాన నీటి సంరక్షణ, ఇతర వికేంద్రీకృత భూగర్భ జలాల సంరక్షణ విధానాలకు ప్రాధాన్యం ఇస్తారు. సమీకృత నీటి వనరుల నిర్వహణ విధానం ద్వారా నీటి భద్రతను బలోపేతం చేస్తారు.

### 2 గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక మౌలిక వసతుల అభివృద్ధి

విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, అనుసంధానత, పునరుత్పాదక ఇంధనం, సామాజిక సేవలకు ప్రాధాన్యం ఇస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రోడ్లు, కల్వర్టులు, క్రాస్ డ్రైనేజీ నిర్మాణం, ఇప్పటికే ఉన్నవాటి ఆధునికీకరణ చేపడతారు. గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ సెంటర్లు, గ్రామీణ గ్రంథాలయాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపడతారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు, కిచెన్ షెడ్లు, అదనపు తరగతి గదులు, ప్రయోగ శాలలు, ప్రహరీ గోడలు, క్రీడా మైదానాలు, శ్మశానాలు, సామూహిక మౌలిక వసతుల నిర్మాణం చేపడతారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నిర్మాణాలు, సామూహిక పారిశుద్ధ్య కాంప్లెక్సులు, వ్యర్థాలను వేరుచేసే, సేకరించే కేంద్రాలు నిర్మిస్తారు. సోలార్ లైటింగ్ వ్యవస్థ, ఇతర పునరుత్పాదక ఇంధన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తారు. పార్కింగ్ ప్రాంతాలు, ట్రాన్స్‌పోర్టు షెడ్లు, ఇతర ఉమ్మడి సౌకర్యాలు కల్పిస్తారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ్) కేంద్ర ప్రాయోజిత పథకానికి సంబంధించిన ఇతర గృహ నిర్మాణ పనులు చేపట్టడానికి అనుమతిస్తారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద తీసుకున్న పనుల మరమ్మతులు, నిర్వహణ చేపట్టవచ్చు.

### 3 జీవనోపాధి కల్పించే వసతులు

వ్యవసాయం, పశు సంవర్ధకం, చేపల పెంపకం, విలువ జోడింపు, నైపుణ్య శిక్షణ, ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో పనులు చేపట్టడానికి వీలు కల్పిస్తారు. ఇందులో ప్రధానంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, వర్క్ షెడ్లు, గ్రామీణ మార్కెట్లు, వారపు సంతలు, ఇతర మార్కెటింగ్‌పరమైన మౌలిక వసతుల నిర్మాణం చేపట్టవచ్చు. ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజీలు, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించే మౌలిక వసతుల పనులు ఈ పథకం కింద చేపట్టడానికి వీలుంటుంది. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లు, ఫెడరేషన్ల భవనాల నిర్మాణం చేపట్టవచ్చు. కంపోస్ట్ వర్మీ కంపోస్ట్ నిర్మాణాలు చేసుకోవచ్చు. గడ్డి మైదానాల అభివృద్ధి, డెయిరీ మౌలిక వసతులు, పశువులు, మేకలు, గొర్రెలు, పందులు, కోళ్లు, ఇతర పశు సంపద కోసం షెల్టర్లు నిర్మించుకోవచ్చు. చేపల ఉత్పత్తి, పెంపకానికి సంబంధించిన మౌలిక వసతులు, చేపలు ఎండబెట్టడానికి అవసరమైన యార్డుల పనులు చేపట్టవచ్చు. నర్సరీల పెంపకం, బిల్డింగ్ మెటీరియల్ తయారీ పనులు చేసుకోవచ్చు. సర్క్యులర్, సైక్లింగ్ ఎకానమీ మోడల్ అభివృద్ధి చేయొచ్చు.

### 4 ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులు

తుపాను, వరద, ఇతర బహుళ ఉపయోగ షెల్టర్లు నిర్మించుకోవచ్చు. వరదనీటి మళ్లింపు కాలువలు, గట్లు, వైపరీత్యాలను ఎదుర్కొనే ఇతర రక్షణ పనులు చేసుకోవచ్చు. వరదల నివారణ కోసం స్టెబిలైజింగ్ పాండ్స్, ఇతర నిర్మాణాలు చేయొచ్చు. ప్రకృతి వైపరీత్యాల తర్వాత పునర్నిర్మాణం, పునరుద్ధరణ, గ్రామీణ రోడ్లు, సామాజిక ఆస్తుల మరమ్మతు పనులు చేయొచ్చు. గాలులను ఆపే చెట్లను పెంచొచ్చు. అటవీ అగ్నిప్రమాదాల నివారణ పనులు చేయొచ్చు. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన మౌలిక వసతులను గ్రామాల్లో కల్పించొచ్చు. ఇవి కాకుండా కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ఇతర పనులను చేపట్టవచ్చు.

## వికలాంగుడని తండ్రి వదిలేసినా..
## భారత కీర్తిపతాకతో 'లక్ష్య'సాధన

ఈటీవీ భారత్: దుబాయిలో డిసెంబరు 14తో ముగిసిన 'పారా యూత్ ఏషియన్ గేమ్స్ 2025'లో కాంస్య పతకం గెలిచిన లక్ష్య గుప్తా 2028లో జరగనున్న పారాలింపిక్స్‌లో దేశానికి స్వర్ణం సాధించడమే లక్ష్యంగా కఠోర సాధన చేస్తున్నాడు. బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఈ యువకుడు ప్రతిభా పాటవాలతో పరిస్థితులను అధిగమించి జీవితాన విజయం సాధించుకుంటూ ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.



వికలాంగుడని పుట్టిన వెంటనే లక్ష్యతోపాటు అతడి తల్లి నిషా గుప్తాను కూడా తండ్రి వదిలేశారు. ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ కుమారుడి ఎదుగుదలకు అమ్మ తోడు నిలిచారు. సాటి విద్యార్థులతో కూర్చోలేని పాఠశాలలో ప్రవేశం నిరాకరిస్తే పట్టువదలని సహనంతో స్కూలుకు చేర్చారు. ఏడో ఏట నుంచి టేబుల్ టెన్నిస్ బ్యాటుతో సాధన చేస్తున్న లక్ష్యను చూసి అతడి భవిష్యత్తును నిషా ముందే ఊహించి, ప్రోత్సహించారు. దాతల సాయంతో కుమారుడికి శిక్షణ ఇప్పించారు. టేబుల్ టెన్నిస్‌లో ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించాడు. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన బ్రిక్స్ క్రీడల్లోనూ కాంస్యం గెలుచుకున్నాడు.

### జీవితం.. కొన్ని సత్యాలు



జీవితంలో ఎదురయ్యే పరీక్షలు మీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. జీవిత పాఠాలు నిరంతరం మారుతుంటాయి. జీవితంలో మీ ఎంపికలే మీ భవితను నిర్ణయిస్తాయి. జీవితంలో ఎదురయ్యే ప్రతి వైఫల్యం ఓ పాఠం. నేర్చుకోవడానికి సిద్ధంగా ఉంటే ఎదుగుదల సర్వసాధారణమవుతుంది.

– గౌర్ గోపాల్ దాస్, ఆధ్యాత్మికవేత్త

## బంగ్లా తప్పుడు ప్రచారంపై భారత్ ఆగ్రహం

- దీపూ దాస్ చంద్ర హత్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- చటోగ్రామ్‌లో వీసా సర్వీసుల నిలిపివేత

ఢాకా: దేశరాజధాని దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌లోకి కొందరు చొరబడటానికి ప్రయత్నించారంటూ బంగ్లాదేశ్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. నిరసనల్లో కేవలం 20 నుంచి 25 మంది మాత్రమే పాల్గొన్నారని, ఎలాంటి భద్రతా ఉల్లంఘన జరగలేదని స్పష్టంచేసింది. వారంతా దీపూ చంద్ర దాస్ హత్యపై నిరసన తెలిపారని, నినాదాలకే పరిమితమయ్యారని పేర్కొంది. వారు హైకమిషన్ ప్రాంగణంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారంటూ బంగ్లాదేశ్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆగ్రహం వ్యక్తంచేసింది. అలాంటిదేమీ జరగలేదని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ ఆదివారం తెలిపారు. 25 ఏళ్ల దీపూ చంద్ర దాస్ గురువారం రాత్రి బంగ్లాదేశ్‌లోని మయమన్‌సింగ్ జిల్లాలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ క్రూర హత్యకు పాల్పడిన హంతకులను చట్టం ముందు నిలబెట్టాలని భారత్ డిమాండ్ చేసింది. దీన్ని బంగ్లాదేశ్ తోసిపుచ్చింది. తమ మీడియా వాస్తవాలనే ప్రచురించిందని పేర్కొంది.



రణధీర్ జయస్వాల్

■ బంగ్లా యువనేత షరీఫ్ ఉస్మాన్ హాదీ మరణానంతరం చెలరేగిన అలర్ల నేపథ్యంలో చటోగ్రామ్ దౌత్య కేంద్రంలో వీసాల మంజూరును నిరవధికంగా నిలిపివేస్తూ భారత్ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఆదివారం నుంచే అమల్లోకి రానున్నాయి. హాదీ మరణం తర్వాత చటోగ్రామ్‌లోని అసిస్టెంట్ ఇండియన్ కమిషనర్ నివాసంపై రాళ్ల దాడి జరిగిన విషయం తెలిసిందే. తదుపరి ఉత్తర్వుల వెలువడే వరకు వీసాల మంజూరుపై నిషేధం కొనసాగుతుందని ఇండియా వీసా అప్లికేషన్ సెంటర్(ఐవీఏసీ) ఒక ప్రకటనలో తెలిపింది.


## అదుపు తప్పిన స్టార్‌లింక్

- భూమివైపు దూసుకొస్తున్న ఉపగ్రహం

ఇంటర్నెట్‌డెస్క్: ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ప్రాజెక్టులోని ఉపగ్రహాల్లో ఒకటి ఇటీవల అంతరిక్షం నుంచి అదుపుతప్పి భూమివైపు వస్తోంది. ఈ నెల 17న శాటిలైట్-35956 భూమి నుంచి 418 కిలోమీటర్ల ఎత్తులో ఉండగా హఠాత్తుగా పడిపోవడం ప్రారంభించింది. దానిపై నియంత్రణను స్పేస్ఎక్స్ కోల్పోయింది. దీనిపై ఆ సంస్థ వివరణ ఇచ్చింది. "హఠాత్తుగా ఉపగ్రహంలో సాంకేతిక లోపం తలెత్తి ప్రొపెల్షన్ ట్యాంక్‌లో గ్యాస్ అత్యంత శక్తిమంతంగా బయటకు వెలువడింది. దీంతో ఒక్కసారిగా అది నాలుగు కిలోమీటర్లు కిందకు దూసుకొచ్చింది. ఆ తర్వాత కొన్ని భాగాలు విడిపోయి మెల్లగా కదలడం మొదలుపెట్టాయి. వారం రోజుల్లోగా భూవాతావరణంలోకి వచ్చి కాలిపోవచ్చు" అని ఎక్స్‌లో పోస్టు చేసింది. శనివారం ఈ ఉపగ్రహ శకలాలు అమెరికాలోని అలాస్కా సమీపంలో గగనతలంలో ప్రయాణిస్తుండగా.. వెంటోర్‌టెక్ సంస్థకు చెందిన వర్ల్డ్‌వ్యూ-3 అనే ఉపగ్రహం 241 కిలోమీటర్ల దూరం నుంచి హైరిజల్యూషన్ చిత్రాలను తీసింది. ఈ ఉపగ్రహం నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి లేదా భూమికి ఎటువంటి ముప్పు లేదని స్పేస్ఎక్స్ చెబుతోంది.



## ఎప్‌స్టీన్ కుంభకోణం..
## ట్రంప్ ఫొటో సహా 16 ఫైళ్లు మాయం



న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫొటోతో పాటు 16 ఫైళ్లు మాయమయ్యాయి. శుక్రవారం విడుదలచేసిన ఫైళ్లు మరుసటి రోజే అమెరికా న్యాయశాఖ వెబ్‌పేజీ నుంచి అదృశ్యమయ్యాయి. ప్రజలకు ఎటువంటి వివరణ కానీ, నోటీసు కానీ లేకుండానే ఫైళ్లు కనిపించకుండా పోవడంతో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. మాయమైన ఫైళ్లలో ట్రంప్‌తో పాటు ఆయన సతీమణి మెలనియా, ఎప్‌స్టీన్, ఆయన సన్నిహితురాలు గిస్లైన్ మాక్స్‌వెల్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు బాధితుల నుంచి ఎఫ్‌బీఐ తీసుకున్న వాంగ్మూలాలు, అంతర్గత న్యాయశాఖ మెమోలు వంటి కేసుకు సంబంధించిన సున్నితమైన అంశాలు ఉన్న వేల పేజీలు కనిపించడం లేదు. వీటిని ఉద్దేశపూర్వకంగానే తొలగించారా? అనుకోకుండా జరిగిందా? అనే విషయాన్ని న్యాయశాఖ స్పష్టం చేయలేదు. హౌస్ ఓవర్‌సైట్ కమిటీలోని డెమోక్రాట్లు ఈ విషయంపై తీవ్రంగా మండిపడుతున్నారు. అటార్నీ జనరల్ పామ్ బోండీ పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. 'ఇంకేం కప్పిపుచ్చాలనుకుంటున్నారు? అమెరికా ప్రజలకు, మాకు పారదర్శకత అవసరం' అని ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు.

## ఆత్మాహుతి డ్రోన్లతో ఆర్మీలో 'అశనీ దళం'

ఇంటర్నెట్ డెస్క్: భారత్ 850 ఆత్మాహుతి డ్రోన్లను సమకూర్చుకోబోతోంది. వీటి కొనుగోలు ప్రక్రియ తుదిదశలో ఉంది. త్వరలో జరగనున్న రక్షణ మంత్రిత్వశాఖ ఉన్నతాధికారుల సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. భారత్ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ స్వీయ బలగాలకు ప్రాణనష్టం జరగకుండా.. శత్రు మూకల్ని అంతం చేసేందుకు ఆత్మాహుతి డ్రోన్లను సమకూర్చుకుంటోంది. త్రివిధ దళాల్లోకి 30వేల డ్రోన్లను చేర్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగానే తొలి విడతగా 850 డ్రోన్ల కొనుగోలు ప్రక్రియ ఊపందుకుంది. ఈ ఆత్మాహుతి డ్రోన్లను నేషనల్ ఏరోస్పేస్ లాబొరేటరీస్ అభివృద్ధి చేస్తోంది. వెయ్యి కిలోమీటర్ల దాకా ఎగరగలవు. రాడార్ల కళ్లుగప్పి.. లక్ష్యాలను ఛేదించగలవు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోనూ ఇలాంటి డ్రోన్లను వినియోగిస్తున్నారు. భారత్ తన పదాతి దళం ఈ రకం డ్రోన్ల వినియోగాన్ని గణనీయంగా పెంచాలని భావిస్తోంది. క్రమంగా వీటిని వాయుసేన, నేవీలోనూ వినియోగించేందుకు అవకాశాలను పరిశీలిస్తోంది. వీటిని ఒక్కొక్కటిగా ప్రయోగిస్తే పెద్దగా ప్రయోజనం ఉండదు. ఒక్కో ప్లటూన్‌లో కనీసం 10 డ్రోన్లు ఉంటాయి. దీనిని అశనీ దళంగా ఆర్మీ చెబుతోంది. వీటన్నింటినీ ఒకేసారి గుంపుగా ప్రయోగిస్తారు. వీటిలో కొన్ని నిఘా పని చేపడతాయి. మిగతావి శత్రు లక్ష్యాలను ఛేదిస్తాయి. పేలుడు పదార్థాలు మోసుకెళ్తున్న డ్రోన్లు. . శత్రు రాడార్లకు దొరక్కుండా నిఘా డ్రోన్లు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తాయి. సరైన అవకాశం లభించే వరకు వేచి చూసి దాడి చేయడం ఈ లోహ విహంగాల ప్రత్యేకత.



## అంధకారంలోకి శాన్‌ఫ్రాన్సిస్కో

- 1.30 లక్షల గృహాలపై ప్రభావం

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరం శనివారం చీకట్లోకి వెళ్లిపోయింది. ముఖ్యంగా నగరంలోని ఉత్తరభాగంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో 1.30 లక్షల గృహాలు, వాణిజ్య సముదాయాలపై తీవ్ర ప్రభావం పడింది. రిచ్‌మండ్, ప్రెసిడో ప్రాంతాలతో మొదలుకొని గోల్డెన్ గేట్ పార్క్ వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో క్రిస్మస్ కోసం ముస్తాబు చేసిన వీధులన్నీ విద్యుత్ లేక వెలవెలబోయాయి. చాలావరకు రెస్టారెంట్లు, దుకాణాలను మూసివేశారు. నగరవ్యాప్తంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనవసర ప్రయాణాలను రద్దు చేసుకోవాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని శాన్‌ఫ్రాన్సిస్కో అత్యవసర నిర్వహణ విభాగం 'ఎక్స్'లో నగరవాసులకు సూచనలు చేసింది. 8వ, మిషన్ వీధిలోని ఓ సబ్‌స్టేషన్‌లో సాయంత్రం 3.15 గంటలకు జరిగిన అగ్నిప్రమాదం కారణంగానే పలు చోట్ల విద్యుత్‌కు అంతరాయం కలిగిందని అగ్నిమాపక అధికారులు 'ఎక్స్'లో పోస్టు చేశారు. విద్యుత్తును వెంటనే పునరుద్ధరించగలమో లేదో చెప్పలేమని పోస్టులో పేర్కొన్నారు.



## ఆరావళిలో 90% రక్షిత ప్రాంతమే: కేంద్రం

దిల్లీ: గనుల తవ్వకం కోసమే ఆరావళి పర్వతాల నిర్వచనాన్ని మార్చినట్లు వస్తున్న ఆరోపణల్ని కేంద్రం తోసిపుచ్చింది. 90% విస్తీర్ణం ఇప్పటికీ రక్షిత ప్రాంతంగానే ఉందని స్పష్టంచేసింది. సమగ్ర నిర్వహణ ప్రణాళిక ఖరారయ్యేవరకు ఆ ప్రాంతంలో కొత్తగా గనుల తవ్వకానికి లీజులు ఇవ్వకుండా సుప్రీం కోర్టు నిషేధం విధించిన విషయాన్ని గుర్తుచేసింది. కోర్టు ఆమోదించిన నిర్వచనం ప్రకారం ఆరావళిలో 90% పైగా రక్షిత ప్రాంతంగా ఉంటుందని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి



భూపేందర్ యాదవ్ తెలిపారు. ఆరావళిపై అసత్యాలు వ్యాప్తిలో ఉన్నాయని చెప్పారు. 1.44 లక్షల చదరపు కి.మీ. మేర విస్తరించిన పర్వతాల్లో 0.19 శాతాన్నే మైనింగ్ కోసం వాడుకునే వీలుందని తెలిపారు. ప్రమాదకరంగా పర్వత సానువుల్లో తవ్వకాలు చేస్తుండటం వంటివి నిలుపుచేయడానికి, సందిగ్ధత తొలగించడానికి ఆరావళి నిర్వచనాన్ని ప్రామాణీకరించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

## ప్రయాణికుడి మీద పైలట్ దాడిపై అంతర్గత విచారణ కమిటీ

దిల్లీ: విధుల్లో లేని పైలట్ వీరేందర్ సెజ్వాల్.. దిల్లీ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడిపై భౌతిక దాడికి పాల్పడిన ఘటనపై అంతర్గత విచారణ కమిటీని ఏర్పాటుచేయాలని 'ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్' నిర్ణయించింది. భద్రతాపరమైన తనిఖీ కోసం క్యూలో నిల్చొని ఉన్న ప్రయాణికుడు అంకిత్ దివాన్‌పై సెజ్వాల్ దాడి చేసినందుకు అతడిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా విచారణ కమిటీ ఏర్పాటవుతోంది. ఎందుకు చర్యలు తీసుకోకూడదో సంజాయిషీ ఇవ్వాలని పైలట్‌కు షోకాజ్ నోటీసు జారీచేశారు.

## ముజీబుర్ రెహమాన్ హాల్ పేరు మార్పు

ఢాకా: ఢాకా యూనివర్సిటీలోని బంగబంధు షేక్ ముజీబుర్ రెహమాన్ హాల్ పేరును షరీఫ్ ఉస్మాన్ హాదీ మద్దతుదారులు మార్చేశారు. హాల్ ప్రవేశ ద్వారం దగ్గర ఉన్న ముజీబుర్ రెహమాన్ నామఫలకాన్ని తొలగించారు. ఆ స్థానంలో 'షహీద్ షరీఫ్ ఉస్మాన్ హాదీ హాల్' అనే కొత్త నామఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 12న ముసుగు ధరించిన ఓ వ్యక్తి హాదీపై కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే.

## కశ్మీర్‌లో భారీగా హిమపాతం

శ్రీనగర్: ఉత్తర భారతాన్ని చలి పులి వణికిస్తోంది. జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో హిమపాతం మొదలైంది. ఎత్తయిన భూభాగాల్లో హిమపాతం పెరిగి లోయలోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నీటి ఘనీభవన స్థానం కంటే దిగువకు పడిపోయాయి. జల వనరుల ఉపరితల భాగాల్లో పలుచని మంచు పొరలు కనిపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో సున్నా డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. గుల్మార్గ్‌లోని స్కై రిసార్ట్, సోనామార్గ్ సహా దక్షిణ, ఉత్తర కశ్మీర్‌లోని ఎత్తయిన ప్రాంతాల్లో భారీగా మంచు కురుస్తుండటంతో ఆ ప్రాంతాలు శ్వేత వర్ణంలోకి మారిపోయాయి. శ్రీనగర్‌లో వచ్చే 48 గంటల్లో మోస్తరు నుంచి భారీగా వర్షం, మంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. మంచువల్ల క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల సమయంలో పర్యాటకం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



జమ్మూకశ్మీర్‌లోని గుల్‌మార్గ్‌లో విస్తారంగా కురుస్తున్న మంచు

### దిల్లీలో 110 విమానాల రద్దు

దిల్లీ: దేశ రాజధానిలో పొగమంచు కారణంగా ఆదివారం 110 విమానాల రాకపోకలు రద్దయ్యాయి. దృశ్య స్పష్టత లోపించడంతో 200 పైగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. మరోవైపు విమాన కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయని దిల్లీ విమానాశ్రయ నిర్వాహకులు సాయంత్రం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దిల్లీలో పొగమంచు కారణంగా చాలా రోజులనుంచి విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

## 7 ఉన్నత విద్యాసంస్థల్లో అంతరిక్ష ప్రయోగశాలలు

- ఇన్‌స్పేస్ ప్రతిపాదన

దిల్లీ: దేశవ్యాప్తంగా ఏడు ఉన్నత విద్యా సంస్థల్లో అంతరిక్ష ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలని రోదసి రంగ ప్రోత్సాహక సంస్థ 'ఇన్‌స్పేస్' ప్రతిపాదించింది. దీనివల్ల అంతరిక్ష పరిజ్ఞాన రంగంలో కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ప్రత్యక్ష శిక్షణ పొందడానికి వీలవుతుందని పేర్కొంది. దేశంలో ఇప్పుడిప్పుడే వేళ్లూనుకుంటున్న ప్రైవేటు అంతరిక్ష రంగానికి అవసరమైన నిపుణులను అందించడానికి ఇది దోహదపడుతుందని పేర్కొంది. పరిశ్రమలు- విద్యా సంస్థల మధ్య అర్థవంతమైన భాగస్వామ్యానికి ఇది వీలు కల్పిస్తుందని ఇన్‌స్పేస్ ఉన్నతాధికారి వినోద్ కుమార్ తెలిపారు. అగ్రశ్రేణి అంతరిక్ష ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న భారత దీర్ఘకాల లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు. దేశంలోని ఏడు జోన్ల నుంచి ఏడు విద్యా సంస్థలను దశలవారీగా ఎంపిక చేస్తామన్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 75 శాతాన్ని (గరిష్ఠంగా ఒక్కో విద్యా సంస్థకు రూ.5 కోట్లు) ఇన్‌స్పేస్ సమకూరుస్తుందని చెప్పారు.



క్రిస్మస్ తాతల పరుగు

క్రిస్మస్‌ను పురస్కరించుకొని స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో ఆదివారం నిర్వహించిన పరుగు పందెంలో శాంటాక్లాజ్ వేషధారణలో పాల్గొన్న స్థానికులు

## శాంతి ప్రణాళికపై నిర్మాణాత్మక చర్చలు సాగుతున్నాయ్

### రష్యా వెల్లడి

మయామీ: అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై చర్చలు నిర్మాణాత్మక దిశలో సాగుతున్నాయని రష్యా వెల్లడించింది. అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు కుష్నర్‌లతో చర్చలు జరిపేందుకు ఫ్లోరిడా వచ్చిన రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి కిరిల్ దిమిత్రీవ్ శనివారం మీడియాతో మాట్లాడారు. మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ చర్చలపై టెలిగ్రామ్ యాప్‌లో స్పందించారు. చర్చలు వేగంగా సాగుతున్నాయని, అమెరికాతో కలిసి తమ బృందం పని చేస్తోందని తెలిపారు.

■ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో మాట్లాడేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ సుముఖంగా ఉండటాన్ని ఫ్రాన్స్ అధ్యక్ష కార్యాలయం స్వాగతించింది. రానున్న రోజుల్లో ఎలా ముందుకు సాగాలో ఈ చర్చలు నిర్ణయిస్తాయని తెలిపింది.

## ఆసియాలో మొదటి రేడియో సేవలకు 100 ఏళ్లు

### 1925లో శ్రీలంకలో ప్రారంభం

కొలంబో: భారతదేశంలో ఒకప్పుడు రేడియో సిలోన్‌గా గుర్తింపు పొందిన శ్రీలంకలోని రేడియో సర్వీసు 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. శ్రీలంక ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఆసియాలోని షార్ట్ వేవ్ స్టేషన్లలో ఇది మొదటిది. హిందీ పాటల వీక్లీ కౌంట్‌డౌన్ షో అయిన బినాకా గీతమాలను ఈ రేడియో ప్రాచుర్యంలోకి తెచ్చింది. ఈ రేడియో ఆసియాలోనే అతి పెద్ద రికార్డెడ్ పాటల లైబ్రరీని కలిగి ఉందని శ్రీలంక బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ఎస్ఎల్‌బీసీ) తెలిపింది. అందులో భారతదేశంలో లభించని అరుదైన హిందీ పాటల రికార్డులు, ప్రపంచ నాయకుల వాయిస్ రికార్డింగుల ప్రత్యేక సేకరణలున్నాయని పేర్కొంది.

## రెండో ప్రపంచ యుద్ధ వీరుడు ఇరా 'ఐకే' మృతి

వాషింగ్టన్: పెరల్ హార్బర్‌పై జపాన్ చేసిన దాడి నుంచి బతికి బయటపడ్డ చివరి వ్యక్తుల్లో ఒకరైన రెండో ప్రపంచ యుద్ధ నౌకాదళ వీరుడు ఇరా 'ఐకే' షాబ్ (105) మరణించారు. శనివారం తెల్లవారుజామున షాబ్ తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమార్తె కింబర్లీ హెయిన్రిక్స్ వెల్లడించారు. షాబ్ మరణంతో 1941లో పెరల్ హార్బర్‌పై జపాన్ చేసిన ఆకస్మిక దాడి నుంచి ప్రాణాలతో బయటపడి జీవిస్తున్న వారిలో ఇంకా 12 మందే మిగిలారు. దాడి జరిగిన సమయంలో షాబ్ వయసు కేవలం 21 మాత్రమే. ఆయన 1920 జులై 4న జన్మించారు. 18 ఏళ్లకే నౌకాదళంలో చేరారు.

# అనాథల చదువుకు చుక్కాని.. హీల్

- ఇక్కడ ఉచిత విద్య, వసతి, భోజన సౌకర్యాలు
- హీల్ ప్యారడైజ్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆఖరు తేదీ 2026 ఫిబ్రవరి 15



హీల్ పాఠశాల

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** చదువుకునే వయసులో తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరిని.. లేదా ఇద్దరినీ కోల్పోవడం భరించలేని విషాదం. అలాంటి సందర్భాల్లో చదువు ఆపేయాల్సిన దుస్థితి కూడా చాలామందికి ఏర్పడుతుంది. ఇలాంటి నిరుపేద చిన్నారులు చదువుకు దూరం కాకూడదన్న ఉన్నత లక్ష్యంతో డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ ఏర్పాటుచేసిన విద్యా సంస్థే.. హీల్ ప్యారడైజ్. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో 90 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఉన్న ఈ పాఠశాలలో ఉచితంగా నాణ్యమైన విద్య, వసతి, భోజనం అందిస్తారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికతో కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ఇక్కడ బోధిస్తున్నారు. ఇది గన్నవరం విమానాశ్రయానికి 12 కి.మీ. దూరంలో ఉంది.

**2026-27 ప్రవేశాలకు వేళాయె**

ఈ విద్యా సంవత్సరం ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు, 11వ తరగతి (ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం) ఎంపీసీ, బైపీసీ, ఎంఈఏ కోర్సులకు, హీల్ అంధుల పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

## 15 వేల పుస్తకాలతో గ్రంథాలయం



పాఠశాలలో 15 వేల పుస్తకాలతో అతి పెద్ద గ్రంథాలయం అందుబాటులో ఉంది. విద్యార్థుల ఆసక్తి మేరకు కళల్లోనూ ప్రోత్సహిస్తున్నారు. త్రీడీ చిత్రలేఖనం, క్రాఫ్ట్, సంగీతం, నృత్యం, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో 400 మీటర్ల ట్రాక్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్ కోర్టులూ ఉన్నాయి.

## అద్భుతమైన వసతులు

బాలబాలికలకు వేర్వేరుగా ఆధునిక హంగులతో వసతి గృహాలు ఉన్నాయి. విద్యార్థులకు అందించే భోజనానికి సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలను వినియోగిస్తున్నారు. విశాలమైన భోజనశాల, సోలార్ వంటగది, విద్యార్థులు తాగేందుకు ఆర్వో శుద్ధ జలం, వేడినీరు అందుబాటులో ఉన్నాయి. స్మార్ట్ గదుల్లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తారు. కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్ బయాలజీ, ఆర్ట్స్, కంప్యూటర్ ల్యాబ్స్ ఉన్నాయి. అద్భుతమైన క్రీడా సౌకర్యాలు, ఇండోర్ స్టేడియం ఉన్నాయి. జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడల్లో విద్యార్థులు సత్తా చాటుతున్నారు. ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ కేంద్రం, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఎక్సలెన్స్, సైబర్ సెక్యూరిటీ కేంద్రం, 3డీ ప్రింటింగ్, డిజైన్ థింకింగ్ ఉన్నాయి. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు మెడికల్, ఇంజినీరింగ్ ఇతర కోర్సుల్లో ఉన్నత చదువులకూ హీల్ సంస్థే సహకరిస్తుంది. విద్యార్థుల కోసం పాఠశాల ప్రాంగణంలోనే ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. అత్యుత్తమ అర్హత పొందిన ఉపాధ్యాయులు, అంతర్జాతీయ దూర విద్యా ఫ్యాకల్టీ ద్వారా శిక్షణ అందిస్తారు.

## తల్లిదండ్రులను కోల్పోతే అన్నీ కోల్పోయినట్లే..

'నిస్సహాయ స్థితిలో ఉన్న చిన్నారులకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాం. హీల్ ద్వారా చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే మా ధ్యేయం. దేశంలోని ఏ ప్రాంతం వారైనా ఇక్కడ చేరవచ్చు'. అని హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈవో కె. అజయ్ కుమార్ తెలిపారు.

**దరఖాస్తు చేసేందుకు స్కాన్ చేయాల్సిన క్యూఆర్ కోడ్**

## ప్రవేశాలకు ఇవీ అర్హతలు

**1-9 తరగతులకు..**

- తల్లిదండ్రులు ఇద్దరినీ, లేదా ఎవరినో ఒకరిని కోల్పోయి ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన 6 నుంచి 15 ఏళ్ల వయసు ఉన్న విద్యార్థులు
- మరణ ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి
- హీల్ ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత తప్పనిసరి.

**11వ తరగతి (ఎంపీసీ, బైపీసీ, ఎంఈఏ)లో**

- ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు పదో తరగతిలో 480 మార్కులు, సీబీఎస్ఈ (లేదా) ఐసీఎస్ఈలో 400 పైన మార్కులు సాధించిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- తెల్లరేషన్ కార్డు, ఆదాయ ధ్రువ పత్రం తప్పనిసరి.

**అంధ పాఠశాలకు అర్హత ఇలా..**

- 1-8 తరగతుల విద్యార్థులు ప్రవేశాలకు అర్హులు
- ఆర్థికంగా వెనుకబడి, 40శాతం కంటే ఎక్కువ అంధత్వ ధ్రువపత్రం ఉన్నవారు అర్హులు

**దరఖాస్తు చేయడం ఇలా..:**

దరఖాస్తుకు ఆఖరి తేది: 2026 ఫిబ్రవరి15

దరఖాస్తు విధానం:
క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి దరఖాస్తు చేయవచ్చు.

దరఖాస్తు లింక్:
https://tinyurl.com/Heal-Admission

వివరాలకు:
https://healschool.org
info@healparadise.org

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
91000 24438, 91000 24435


వేదికపై బ్రాహ్మణి, రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు, సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ శ్రీనివాసరావు, తితిదే పాలకమండలి సభ్యురాలు జానకీదేవి, భూలక్ష్మి

## మంగళగిరి అభివృద్ధి చూస్తే ఆనందంగా ఉంది: నారా బ్రాహ్మణి


బ్యాటింగ్ చేసి.. క్రికెట్ పోటీలను ప్రారంభించిన నారా బ్రాహ్మణి

**మంగళగిరి, తాడేపల్లి, న్యూస్‌టుడే:** గుంటూరు జిల్లా మంగళగిరిలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తుంటే.. ఆనందంగా ఉందని మంత్రి లోకేశ్ సతీమణి బ్రాహ్మణి పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ ఇక్కడివారిని తమ కుటుంబసభ్యులుగా భావించి, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలు కూడా ఆయన్ను అదే స్థాయిలో ఆదరిస్తున్నార న్నారని చెప్పారు. జనవరి 23న లోకేశ్ జన్మదినం నేపథ్యంలో 'మంగళగిరి ప్రీమియర్ లీగ్-4' పేరిట క్రికెట్ పోటీలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సినీహీరో నిఖిల్ సిద్ధార్థ, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అతిథులుగా హాజరయ్యారు. మంగళగిరిలో వచ్చే నెల 21 వరకు ఈ టోర్నీ కొనసాగనుంది. తొలుత బ్రాహ్మణి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. క్రీడాకారుల పరిచయం తరువాత ఆమె మైదానంలో కొద్దిసేపు క్రికెట్ ఆడారు. ఇటీవల 'బిజినెస్ టుడే' మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్ అవార్డును సొంతం చేసుకోవడంతో పాటు పుట్టినరోజు సందర్భంగా ఆమెకు కూటమి నాయకులు, తెలుగు మహిళలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. సానా సతీష్‌బాబు మాట్లాడుతూ.. యువతలో క్రీడా నైపుణ్యాలను ప్రోత్సహించే సంకల్పంతో మంత్రి లోకేశ్ సొంత నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. నిఖిల్ సిద్ధార్థ మాట్లాడుతూ.. తనకు మంత్రి లోకేశ్ అన్నా, క్రికెట్ అన్నా చాలా ఇష్టమన్నారు. 125 జట్లతో పోటీలు నిర్వహించడం గొప్ప విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పార్లమెంటు స్థానం తెదేపా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తితిదే పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఆరుద్ర భూలక్ష్మీ, ముమ్మిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఈతకొలనులో పడి యువకుడి మృతి

మాజీ ఎంపీ, వైకాపా నేత మోదుగుల నివాసంలో ఘటన


హర్షవర్ధన్ మృతదేహం

**గుంటూరు రూరల్, న్యూస్‌టుడే:** మాజీ ఎంపీ, వైకాపా నేత మోదుగుల వేణుగోపాలరెడ్డి నివాసంలోని ఈతకొలనులో పడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నగరం కొరిటెపాడులో తల్లితో కలిసి నివాసం ఉంటున్న హర్షవర్ధన్ (18) రెడ్డిపాలెంలోని మోదుగుల నివాసంలో పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం పనికి వెళ్లిన అతడు అక్కడున్న ఈతకొలను శుభ్రం చేస్తుండగా నీటిలో పడిపోయాడు. కాసేపటికి తోటి పనిమనుషులు గమనించి.. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. నల్లపాడు ఎస్సై రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కాగా, యువకుడు ప్రమాదవశాత్తు కొలనులో పడ్డాడా..? లేక ఎవరైనా అతడిని నెట్టారా.. అనే కోణంలో సమగ్రంగా దర్యాప్తు చేసి బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని పోలీసులు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తూ ఈతకొలనులో పడిపోయి ఉండొచ్చని, లోతు ఎక్కువగా ఉండటం, ఈత రాకపోవడంతో మృతిచెంది ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



### కిలకిలరావాలతో ఆందోళనలు దూరం

పక్షుల కిలకిలరావాలను కొద్ది సమయం వినడం ద్వారా మనుషుల్లో భయాందోళనలు దూరం అవుతాయని తాజా అధ్యయనం తేల్చింది. మానసిక ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని న్యూరో సైన్స్ న్యూస్ తన తాజా ప్రచురణలో పేర్కొంది. తరచూ పక్షులు చేసే ధ్వనులను వినడం ద్వారా జీవితంలో సానుకూల మార్పు అనివార్యమని స్పష్టం చేసింది.

– క్రిస్టీ లియాంగ్, ఫిజీషియన్

## 'బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించాలి'

**ఈనాడు, అమరావతి:** కూటమి ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జి నూకానమ్మ కోరారు. గత వైకాపా ప్రభుత్వం 34% ఉన్న బీసీ రిజర్వేషన్లను 24%కు తగ్గించి, వెనుకబడిన వర్గాల రాజకీయ ఎదుగుదలను దెబ్బతీసిందన్నారు. ఆ నష్టాన్ని పూడ్చి, బీసీలకు వెన్నెముకగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలవాలని విన్నవించారు. విజయవాడలోని బీసీ భవన్‌లో ఆదివారం బీసీ నేతలు సమావేశమయ్యారు.

# విచారణలు సామాన్యులకు అర్థమవ్వాలి

- అప్పుడే న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరుగుతుంది
- అట్టడుగు వర్గాలకు న్యాయాన్ని చేరువ చేయడం రాజ్యాంగ మౌలిక లక్ష్యం
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర
- ఏపీ జ్యుడీషియల్ అకాడమీలో నిర్వహించిన సెమినార్‌లో ప్రసంగం


కార్యక్రమంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర. చిత్రంలో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ రవినాథ్ తిల్హరి, జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ పురుషోత్తంకుమార్ ◆ కార్యక్రమానికి హాజరైన హైకోర్టు న్యాయమూర్తులు, వివిధ జిల్లాల పీడీజేలు, న్యాయాధికారులు

**ఈనాడు, అమరావతి, మంగళగిరి-న్యూస్‌టుడే:** న్యాయస్థానాల్లో జరిగే విచారణలు సామాన్యులకు సైతం అర్థమవ్వాలని, అప్పుడే న్యాయవ్యవస్థపై విశ్వాసం, నమ్మకం పెరుగుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు, అట్టడుగువర్గాలకు న్యాయాన్ని చేరువ చేయడం రాజ్యాంగ మౌలిక లక్ష్యమన్నారు. సామాన్యుడికి న్యాయం చేరువకావడమనేది న్యాయవ్యవస్థ పనితీరుపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. 'రాజ్యాంగ దృక్పథాన్ని పరిరక్షించడం- జిల్లా న్యాయ వ్యవస్థ పాత్ర' (అప్‌హోల్డింగ్ ద కాన్‌స్టిట్యూషనల్ విజన్ - ద రోల్ ఆఫ్ డిస్ట్రిక్ట్ జ్యుడీషియరీ) అనే అంశంపై మంగళగిరిలోని ఏపీ జ్యుడీషియల్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర ముఖ్య అతిథిగా పాల్గొని కీలకోపన్యాసం చేశారు. న్యాయమూర్తులు విలువలు పాటించాలని, క్రమశిక్షణ, న్యాయ పరిజ్ఞానం కలిగి ఉండాలని ఉద్బోధించారు.

### జిల్లా న్యాయ వ్యవస్థ మూలస్తంభం

న్యాయవ్యవస్థకు జిల్లా న్యాయవ్యవస్థ మూలస్తంభమని జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర పేర్కొన్నారు. పోటీతత్వంలో విజయం సాధించే దిశగా ప్రతి న్యాయమూర్తి తయారు కావాలన్నారు. తీర్పులు ఇవ్వడం ఒక్కటే న్యాయ వ్యవస్థ ప్రక్రియ కాదని, ఆ తీర్పులో నిబద్ధత ఉండాలన్నారు. కక్షిదారుడు మొదటగా జిల్లా న్యాయ వ్యవస్థను మాత్రమే ఆశ్రయిస్తారని గుర్తుచేశారు. జిల్లా న్యాయవ్యవస్థ ఇచ్చిన అనేక తీర్పులు పౌరుల నమ్మకాన్ని చూరగొన్నాయన్నారు.

### సాంకేతికత ఎంత వచ్చినా..

సాంకేతికత ఎంత వచ్చినప్పటికీ న్యాయం అనేది మానవతా దృక్పథంపై ఆధారపడిందని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర చెప్పారు. అత్యుత్తమ తీర్పులు (ల్యాండ్ మార్క్ జడ్జిమెంట్స్) ఇవ్వడం ఒక్కటే పనితీరుకు నిదర్శనం కాదని, కక్షిదారుల విశ్వాసాన్ని పొందేలా వ్యాజ్యాలను పరిష్కరించడంలో కలిగే సంతృప్తి గొప్పదన్నారు.

### సక్రమంగా పరిరక్షించుకోవడమే రాజ్యాంగానికి ఇచ్చిన విలువ: జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే), రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ పాట్రన్ ఆఫ్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ మాట్లాడుతూ.. జీవించే హక్కు కలిగి ఉండడం అంటే వ్యక్తి జీవించడం ఒకటే కాదని, మంచి జీవనాన్ని గడిపే హక్కు కలిగి ఉండడమని స్పష్టం చేశారు. పౌరుల హక్కులను కాపాడడంలో ప్రతి ఒక్కరు తనదైన పాత్ర పోషించాలన్నారు. రాజ్యాంగాన్ని సక్రమంగా పరిరక్షించుకోవడమే రాజ్యాంగానికి ఇచ్చిన విలువ అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి, జ్యుడీషియల్ అకాడమీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ అధ్యక్షులు జస్టిస్ రవినాథ్ తిల్హరి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులు ఇచ్చిందన్నారు. మహిళలు, చిన్నారుల విషయంలో తలెత్తుతున్న వివాదాలు చాలా మేరకు సున్నితమైనవని, సరైన ప్రక్రియ ద్వారా వాటిని పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు రిజిస్ట్రార్లు, జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ పురుషోత్తంకుమార్, న్యాయాధికారులు పాల్గొన్నారు.

# మళ్లీ వస్తే 30 ఏళ్లు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తాం

- ఈసారి 200 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తాం
- వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి



**ఈనాడు, అమరావతి, తిరువూరు టౌన్ న్యూస్‌టుడే:** ఈసారి ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ అత్యధిక మెజారిటీతో 200 కంటే (డీలిమిటేషన్ అయితే) ఎక్కువ సీట్లు గెలిచి అధికారం చేపడతామని వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఒకవేళ 175 సీట్లే ఉంటే 151 కంటే ఎక్కువ సీట్లు సాధిస్తామని తెలిపారు. '2019-24 మధ్య రాష్ట్రాన్ని అభివృద్ధిలో 15-20 ఏళ్లు ముందుకు తీసుకెళ్లాం. ఈసారి 30 ఏళ్లు ముందుకు తీసుకెళ్లేలా జగన్ పాలనను ప్రజలే తెచ్చుకుంటారు' అని పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైకాపా కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ జన్మదిన వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ 'సమకాలీన రాజకీయచరిత్రలో తల ఎగరేసుకుని పొగడాల్సిన నాయకుడు జగన్. తన ఐదేళ్ల పాలనలో ఐదు దశాబ్దాల్లో జరగాల్సిన అభివృద్ధిని చేసి చూపించారు. ప్రజలు తమ తలరాతల్ని తామే రాసుకునేలా చేశారు. అప్పులు తెచ్చి పంచలేదు. జగన్ రాష్ట్రంలోనే కాదు.. దేశ రాజకీయాల్లోనూ కీలకపాత్ర పోషిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలి' అని సజ్జల ఆకాంక్షించారు.

### అభిమానం పేరుతో అత్యుత్సాహం.. తిరువూరులో పలువురిపై కేసు

జగన్ పుట్టినరోజు సందర్భంగా వైకాపా నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం పేరుతో హల్‌చల్ చేశారు. దీనికి పెద్దఎత్తున జనాన్ని సమీకరించారు. ఆసుపత్రిలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జై జగన్ అంటూ కేకలు, ఈలలు వేస్తూ గోలగోల చేశారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ ఘటనపై వైకాపా నియోజకవర్గ కన్వీనర్ స్వామిదాస్, మరో 20 మంది వైకాపా నాయకులపై తిరువూరు పోలీసులు కేసు నమోదుచేశారు.

✦ శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోటలో వైకాపా నాయకులు వేట కొడవళ్లతో పొట్టేళ్ల తలలు నరికి వాటి రక్తంతో జగన్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చిత్రపటాలకు అభిషేకం చేశారు. అనంతపురం జిల్లా విడపనకల్లులోనూ ఇదే తరహాలో సంబరాలు చేసుకున్నారు.

✦ తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద పార్టీ కార్యాలయానికి కట్టినట్లు జగన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. దీనిపై ప్రజలు, విద్యార్థుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి.


జగన్ పుట్టినరోజు సందర్భంగా తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద పార్టీ కార్యాలయానికి కట్టినట్లు వైకాపా నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు

## పేదలకు మెరుగైన వైద్య సేవలు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు లక్ష్యం

మెగా వైద్య శిబిరంలో నారా భువనేశ్వరి


వైద్య శిబిరంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న నారా భువనేశ్వరి

**రంపచోడవరం, న్యూస్‌టుడే:** పేదలందరికీ మెరుగైన వైద్యసేవలు అందించడమే ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు లక్ష్యమని మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో జీఎస్ఎల్ అండ్ జీఎస్ఆర్ హాస్పిటల్స్ సహకారంతో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం ఏర్పాటైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె వైద్యశిబిరాన్ని ప్రారంభించి పల్స్ పోలియో సందర్భంగా ఓ చిన్నారికి చుక్కలమందు వేశారు. అనంతరం ప్రసంగిస్తూ.. 'ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో 16,365 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాం. 22.64 లక్షలమందికి రూ.2.97 కోట్ల విలువైన మందులు పంపిణీ చేశాం. లోతట్టు ప్రాంతాల్లో సంచార వైద్య శిబిరాల నిర్వహణకు బస్సులను ఏర్పాటు చేశాం. 2,183 సంచార శిబిరాల ద్వారా 4.5 లక్షలమంది వైద్య సేవలు పొందారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా పేద పిల్లలకు భోజనం, వసతి కల్పించి ఉచితంగా విద్యనందిస్తున్నాం. హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం, రాజమహేంద్రవరంలలో రక్తనిధి కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు ఐదు లక్షల యూనిట్ల రక్తాన్ని సేకరించాం' అని చెప్పారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పుడు మావోయిస్టులకు సీపీఎం దిక్కైంది

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు


చింతూరులో అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు

**చింతూరు, న్యూస్‌టుడే:** పేద, బడుగు, బలహీనవర్గాల హక్కుల కోసం పోరాడుతున్న తమ నాయకులను పొట్టనపెట్టుకున్న మావోయిస్టులకు ప్రస్తుతం తమ పార్టీయే దిక్కైందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో ఆదివారం సీపీఎం నేతలు అమరవీరుల సంస్మరణసభ నిర్వహించారు. సభలో రాఘవులు మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలోని భద్రాచలం డివిజన్‌లో సీపీఎం పేదల పక్షాన పోరాడుతుంటే మావోయిస్టులు తమ నాయకులను ఇన్‌ఫార్మర్ల పేరుతో హతమార్చారని చెప్పారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులను ఎన్‌కౌంటర్ చేస్తుంటే.. వారు ప్రభుత్వాన్ని నిలదీయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. ఇప్పుడు తమ పార్టీయే వారి తరఫున ప్రభుత్వం తీరు తప్పని నిలదీస్తోందని చెప్పారు. తుపాకీ ద్వారా సాధించేది ఏం లేదని.. తుపాకీ పట్టుకున్న మావోయిస్టులు తుపాకీ తూటాలకే బలవుతున్నారని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ చర్యలతో మావోయిస్టులు లొంగుబాటు దారి పట్టారని, ప్రజల పక్షాన పోరాడుతున్న సీపీఎం నాయకులు ఏ ప్రభుత్వానికీ లొంగిపోలేదని పేర్కొన్నారు. వైకాపా, కూటమి ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## 18 మంది మావోయిస్టులపై రూ.8.40 కోట్ల రివార్డు

**రాయగడ పట్టణం, న్యూస్‌టుడే:** ఒడిశాలో మావోయిస్టు కార్యకలాపాల అణచివేతకు ఆ రాష్ట్ర పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 18 మంది మావోయిస్టులపై రూ.8.40 కోట్ల రివార్డు ప్రకటించింది. ఇందుకు సంబంధించి బౌద్ధ్ జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పోలీసులు పోస్టర్లు అతికించారు. అందులో 'మావోయిస్టులను అరెస్టు చేసేందుకు మాకు సహకరించండి, బహుమతులను గెలుపొందండి' అని రాసి ఉంది. వీరిలో మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు గణేష్ ఉయికేపై అధికంగా రూ.1.20 కోట్లు ప్రకటించారు. ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యులు సుదర్శన్ అలియాస్ బికాష్, నిరంజన్‌రౌత్ (నిఖిల్), రశ్మిత లెంక (అంకిత), కృష్ణ అలియాస్ సుకరు, సీతూలపై రూ.65 లక్షల చొప్పున రివార్డు ఉందన్నారు. మరో ఇద్దరు మిలిటరీ ప్లటూన్ కమాండర్లపై రూ.37.5 లక్షల చొప్పున, మరో 10 మంది డివిజనల్ కమిటీ సభ్యులపై రూ.32 లక్షల చొప్పున రివార్డు ప్రకటించారు. మావోయిస్టుల సమాచారం అందించేవారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు అందులో పేర్కొన్నారు. పోలీసు హెల్ప్‌లైన్ నంబరు 94376 43839ను సంప్రదించి సమాచారం అందించాల్సిందిగా కోరారు.

## కిమ్స్‌లో అందుబాటులోకి స్పైన్ రోబో


స్పైన్ రోబో ఆవిష్కరణలో డా.బొల్లినేని భాస్కరరావు, డా.గురవారెడ్డి, డా.సౌమ్యజిత్ బసు తదితరులు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చే సరికొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకోవడంలో కిమ్స్ ఆసుపత్రి ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా స్పైన్ రోబోను కిమ్స్ ఆసుపత్రి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో స్పైన్ రోబోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వెన్నెముక శస్త్రచికిత్సలను ఈ రోబోతో అత్యంత కచ్చితత్వంతో నిర్వహించవచ్చన్నారు. కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ.. మోకాళ్ల మార్పిడికి, ఇతర శస్త్రచికిత్సలకు రోబోలు వాడే వాళ్లమని, ఇప్పుడు వెన్నెముక శస్త్రచికిత్సలోనూ వినియోగించడం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. కోల్‌కతా కొఠారీ మెడికల్ సెంటర్ స్పైన్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సౌమ్యజిత్ బసు, కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రి న్యూరో సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ మానస్ కుమార్ పాణిగ్రాహి, కిమ్స్ ఆసుపత్రి వైద్యులు కె.శ్రీకృష్ణచైతన్య, బి.వి.సవిత్ శాస్త్రి, సుధీర్ విన్నమాల, సూర్యప్రకాశ్, రవికుమార్, నరేశ్, సమిత్ పాల్గొన్నారు.

## ఆర్థిక సంఘం నిధులకు సర్పంచుల అడ్డదార్లు!

- 3 నెలల్లో పదవీకాలం ముగియనుండటంతో తప్పుడు బిల్లులు
- రూ.200 కోట్లు డ్రా చేసేందుకు కార్యదర్శులపై ఒత్తిడి

**ఈనాడు, అమరావతి:** మరో మూడు నెలల్లో పదవీకాలం పూర్తికానున్న నేపథ్యంలో సర్పంచులు కొందరు ఆర్థిక సంఘం నిధులను అడ్డగోలుగా డ్రా చేసేందుకు యత్నిస్తున్నారు. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శులపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో బిల్లులు పెట్టొద్దని పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం మౌఖిక ఆదేశాలిచ్చింది. అధికారికంగా సోమవారం ఉత్తర్వులివ్వనుంది.

◆ రాష్ట్రవ్యాప్తంగా రూ.700 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల్లో ఉన్నాయి. ఈ నిధుల్లో 30% పారిశుద్ధ్యం, మరో 30% తాగునీటి సరఫరా, మిగతా 40% ఇతరత్రా పనులకు వినియోగించాలని కేంద్రం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. వీటిని తుంగలో తొక్కి కార్యదర్శుల సహకారంతో నిధులు డ్రా చేయాలని పలువురు సర్పంచులు ప్రయత్నిస్తున్నారు.

◆ పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పనుల్లో కమీషన్లకు దొంగ లెక్కలు చూపించి నిధులు డ్రా చేసేందుకు అవకాశాలు ఎక్కువ. అలాంటివి రూ.200 కోట్లకుపైగా విలువైన బిల్లులు ప్రస్తుతానికి సిద్ధం చేశారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు, పశ్చిమగోదావరి, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల నుంచి అత్యధికంగా బిల్లులు డ్రా చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి.

◆ పంచాయతీ కార్యదర్శులు కొందరు బిల్లులు ప్రాసెస్ చేసేందుకు సిద్ధమవుతున్న దశలో విషయం తెలిసిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఆర్థిక సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా బిల్లుల చెల్లిస్తే కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించడంతో వెనక్కి తగ్గారు.

# అక్కడికి వెళితే.. టైం మిషన్ ఎక్కినట్లే!

**తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో అరుదైన 'జీవ శిలాజాల'గని ● ధరణి చరిత్ర చెప్పే సజీవ సాక్ష్యాలు**

భూమి తన అత్యంతమైన రహస్యాలని పొరల్లో దాచుకుంది. వాటిని తరచి చూసే కొద్దీ శిలాజాలు బయటపడుతూ ఉంటాయి. కోట్ల ఏళ్ల చరిత్రకు సాక్ష్యమైన ఆ ఒక్కో శిల.. రత్నంలా.. సగరంలా.. వజ్రంలా మారి మనిషికి ఉత్సుకతను రేపుతున్నాయి. అందుకే.. ఆ అపురూప శిలా సంపదను తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయం ఒక్కచోట చేర్చింది. జియాలజీ(భూగర్భ శాస్త్ర) మ్యూజియంను 'సేవకు' రేపటి తరానికి పరిచయం చేస్తోంది. ఈ మ్యూజియంలోకి వెళ్తే టైం మిషన్‌పై ఎక్కి 450 కోట్ల ఏళ్ల వెనక్కి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. జియాలజీతో అతిపెద్దదిగా 'స్టాక్ నుంచి గుర్తింపు పొందిన ఈ సంగ్రహణ శాలలోని విశేషాలను ఆధ్యాపకులు మధు, సుబ్బారెడ్డి 'ఈనాడు'తో పంచుకున్నారు.


వివిధ రంగుల్లోకి మారిన క్వార్ట్జ్‌లను విద్యార్థులకు చూపిస్తున్న ఆధ్యాపకులు మధు, సుబ్బారెడ్డి

### 3 వేల రకాల రాళ్లు..

1959లో ప్రారంభమైన ఈ మ్యూజియంలో ప్రపంచంలోని అన్ని వైవిధ్య ప్రాంతాల నుంచి సేకరించిన 3 వేల రకాల రాళ్లు (స్పెసిమెన్స్) ఉన్నాయి. వీటన్నింటినీ పరిశీలనాత్మకంగా చూస్తే.. ఒకప్పుడు ఖండాలన్నీ ఒకటిగా ఉండేవని అర్థమైపోతుంది. ఏళ్ల క్రితం భూమి ఎలా ఉండేది? ఖండాలు ఎలా విడిపోయాయి? సముద్ర గర్భంలోని జీవులు రాళ్లుగా ఎలా మారాయి? అగ్నిపర్వతాల లావా ఏమైంది? అనే ప్రశ్నలన్నింటికీ సమాధానాలు దొరుకుతాయి.


మ్యూజియంలో భద్రపరిచిన మినరల్స్, క్వార్ట్జ్

### చమురు నిల్వలు చూపే శిలాజాలు

సముద్ర జీవులైన గవ్వలు, శంఖువులు, అతి సూక్ష్మజీవులైన ఫోరా మినిఫెరా వంటివి చనిపోయాక భూమి పొరల్లో ఉండిపోతాయి. ఈ శిలాజాలు లభించే ప్రాంతాల్లోనే చమురు నిక్షేపాలు ఉంటాయని ప్రొఫెసర్లు చెబుతారు. అంటే.. చమురు దొరికే ప్రాంతాల్లో ఒకప్పుడు సముద్రం ఉండటమే కారణమని ఈ శిలాజాలు రుజువు చేస్తున్నాయి.


ఒకే రాయిపై సముద్ర జీవుల శిలాజాలు

– ఈనాడు డిజిటల్, తిరుపతి

### వజ్రాల గనులకు దారి

అనంతపురం జిల్లా వజ్రకరూర్‌లో లభించే వజ్రాలకు తల్లిలాంటి రాయి 'కింబర్లైట్'. భూగర్భంలో అత్యంత లోతున ఉండే ఈ రాయిని డ్రిల్లింగ్ ద్వారా వెలికితీస్తారు. వీటిని విశ్లేషించి వజ్రాల గనులను గుర్తిస్తారు. ఇక్కడ ప్రదర్శించిన కింబర్లైట్ నమూనాలు అరుదైనవి. గాజు పరిశ్రమలో వాడే స్వచ్ఛమైన తెల్లటి క్వార్ట్జ్‌తో పాటు, మలినాలు చేరడం వల్ల ఊదా, పింక్ రంగులోకి మారినవి, పొగచూరిన 'స్మోకీ క్వార్ట్జ్' వంటివి ఇక్కడ కనువిందు చేస్తాయి.


వజ్రానికి తల్లి లాంటి రాయి.. కింబర్లైట్

### శిలగా మారిన చెట్టు!

మ్యూజియంలోని ప్రధాన ఆకర్షణ 'సిలిసిఫైడ్ వుడ్' (శిలాజంగా మారిన చెట్టు). కొన్ని కోట్ల ఏళ్ల క్రితం వృక్షాలు భూమిలో కూరుకుపోయినప్పుడు.. వాటి కణజాలంలోని సెల్యులోజ్ స్థానంలో ఇసుక చేరి, రసాయనిక చర్య జరిగి రాయిలా మారుతుంది. ఆకారం మాత్రం చెక్కుచెదరకుండా చూసేందుకు చెట్టు కాండంలాగే ఉంటుంది.


శిలాజంగా మారిన చెట్టు కాండం

### నీటిలో తేలే రాళ్లు..

గుహల్లో నీరు ఆవిరైనప్పుడు కాల్షియం కార్బొనేట్ గడ్డకట్టి ఏర్పడే అద్భుత ఆకృతులు మ్యూజియంలో చూడొచ్చు. గుహపైభాగం నుంచి కిందికి వెళ్లే 'స్టాలక్టైట్', నేల నుంచి పైకి పెరిగే 'స్టాలగ్మైట్' నమూనాలు ఉన్నాయి.

- నీటిలో తేలియాడే 'ఫ్లోటింగ్ రాక్' ఇక్కడి మరో ప్రత్యేకత.
- 'కోరల్స్' (పగడపు దిబ్బలు) నమూనాలు, ఇనుము, అల్యూమినియం, మైకా, సిమెంటు ఉత్పత్తికి వాడే ఖనిజాల ముడి రూపాలు విద్యార్థులను ఆలోచింపజేస్తాయి.
- ఒకే గ్రానైట్‌లో మైకా, పెగ్మటైట్, గార్నెట్ అనే 3 ఖనిజాలు కలిసి ఉన్న అరుదైన నమూనా ఇక్కడ ఉంది.


కాల్షియం కార్బొనేట్ గడ్డకట్టి ఏర్పడిన ఆకృతులు




## కోనసీమ వైభోగం

నింగి, నేల పోటీపడి పంచుకున్న కోనసీమ అందమిది. వరి చేలు ఇప్పుడిప్పుడే గింజపోసి బంగారు వర్ణంలోకి మారుతున్నాయి. ఆ పక్కనే ఉన్న కొబ్బరి తోట తమనూ గాలుల నుంచి వరికి భరోసా ఇస్తున్నట్లుగా ఉంది. ఆకాశానికి రివ్వున దూసుకెళ్తున్న కొబ్బరి చెట్లు, పుడమికి కొత్తదనాన్ని తెచ్చిన వరి మధ్యలో ఓ చిన్న బడ్డీ.. చూడటానికి కాన్వాసుపై మాయ చేసినట్లుగా ఉన్నా ఇది నిజం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామం వెళ్తే ఈ సుందర దృశ్యాన్ని చూడొచ్చు. చుట్టూ పచ్చదనం మధ్య రైతు కట్టుకున్న విశ్రాంతి భవనం చూడముచ్చటగా ఉంది కదా!

– న్యూస్‌టుడే, అంబాజీపేట

## బొప్పాయి బాతు!



పొడవైన మెడ.. ఓ రెక్క లాంటి నిర్మాణంతో బాతులా కనిపిస్తున్న ఈ బొప్పాయి కాయ కృష్ణాజిల్లా పామర్రులోని పొలిమేర బేబి, శ్రీహరి దంపతుల ఇంటి పెరట్లో కాసింది. వెరైటీగా ఉండటంతో స్థానికులు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పామర్రు ఉద్యాన శాఖాధికారి కార్తీ స్పందిస్తూ జన్యుపరమైన కారణాలు, పోషకాల లోపం వల్ల కాయల్లో ఇలాంటి మార్పులు వస్తాయని తెలిపారు.

– న్యూస్‌టుడే, పామర్రు గ్రామీణం



## ప్రకృతి దిద్దిన జెట్టీ!

జెట్టీలా కనిపిస్తున్న ఈ రాళ్ల నిర్మాణాన్ని ఎవరూ నిర్మించలేదు. విశాఖ సాగర తీరంలో కైలాసగిరి సమీపంలో సీతకొండ మలుపు వద్ద సహజంగా ఏర్పడింది. ఈ రాళ్లకు అలలు తాకి అంతెత్తున ఎగిసిపడుతుంటే పర్యాటకులు చూసి ఎంతో ముచ్చటపడుతుంటారు. అక్కడ ఫొటోలు తీసుకునేందుకు పోటీపడుతుంటారు. ప్రకృతి కట్టిన ఈ నిర్మాణాన్ని నిత్యం చూడలేం. వాతావరణ మార్పుల వల్ల సముద్ర జలాలు వెనక్కి వెళ్తే.. అప్పుడే ఇది బయటపడుతుంది. విశాఖ తీరానికి ఈ రాళ్ల సేతువు అదనపు ఆకర్షణగా నిలిచింది.

– ఈనాడు, విశాఖపట్నం



## వేళ్లూనుకొన్న చరిత్ర!

కూలిపోతున్న చారిత్రక నిర్మాణాలను తనలో కలుపుకొని పెరుగుతున్న ఈ రావి చెట్టు ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి కోటపై ఉంది. రేపటి తరానికి సాక్ష్యాలుగా మిగిలే రాళ్లను వేళ్లతో పొదివి పట్టి తన మనుగడ సాగిస్తోంది. ప్రధాన కోట నుంచి రాణీమహల్‌కు వెళ్లే దారిలో ఉన్న చెట్టు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హర్రర్ సినిమాల్లో కనిపించే ఇలాంటి వృక్షాలు రాణీమహల్, టీవీ టవర్, కోట ఎడమ రాళ్ల మార్గం, బురుజులు, ఆంజనేయ స్వామి ఆలయ సమీపాల్లో కనిపిస్తాయి. కోట పరిరక్షణకు చర్యలు తీసుకోకపోతే చారిత్రక ఆధారాల కోసం భవిష్యత్తులో ఇలాంటి చెట్ల వేళ్లల్లోనే వెతుక్కోవాల్సి ఉంటుంది.

– న్యూస్‌టుడే, కొండపల్లి

## ఇది బలిమెల చేప



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సీలేరు నదిలో గిరిజనులకు భారీ చేప చిక్కింది. 55 కిలోల బరువున్న ఈ చేప బలిమెల వద్ద వలలో పడింది. పెద్ద తల ఉండే ఇలాంటివాటిని స్థానికంగా దోబీ రకం చేపలు అంటారని గిరిజనులు తెలిపారు. ఈ భారీ చేపను కర్రకు కట్టుకొని ఇద్దరు గిరిజనులు మోసుకుంటూ ఆదివారం సీలేరులోని సంతకు తీసుకొచ్చారు. రూ.15 వేలకు విక్రయించారు.

–న్యూస్‌టుడే, సీలేరు

## గురువుకు రక్త తులాభారం!



బెల్లంతోనో, బియ్యంతోనో తులాభారం వేయడం చూస్తుంటాం.. స్తోమత ఉంటే బంగారమో, వెండో తూస్తారు. కానీ విద్యనేర్పిన గురువును ప్రత్యేకంగా గౌరవించాలని ఏకంగా రక్తంతో తులాభారం తూచారు ఆయన విద్యార్థులు. కర్ణాటకలోని హావేరి జిల్లాకు చెందిన పి.ఆర్.మఠ్.. అక్కి ఆలూరు గ్రామంలో 35 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవీవిరమణ చేశారు. ఈ ఏడాది ఆయన 80వ పడిలోకి అడుగుపెట్టడంతో తమ గురువును గౌరవించుకోవాలని మఠ్ పూర్వ విద్యార్థులు భావించారు. శనివారం రాత్రి గురువందన కార్యక్రమం ఏర్పాటుచేసి వినూత్నంగా రక్త తులాభారాన్ని నిర్వహించారు. మఠ్ సుమారు 48 కేజీల బరువు తూగగా.. అందుకు సమానంగా మొత్తం 112 మంది 142 యూనిట్ల రక్తం దానం చేశారు. హావేరి జిల్లా ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. సేకరించిన రక్తాన్ని బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది తీసుకున్నారు. దీంతోపాటు పుస్తకాలంటే అమితంగా ఇష్టపడే ఆయనకు పుస్తకాల తులాభారాన్నీ ఆయన శిష్యులు సమర్పించారు. విద్యార్థులు తనపై చూపించిన అభిమానానికి మఠ్ చెమర్చిన కళ్లతో కృతజ్ఞతలు చెప్పారు.

– న్యూస్‌టుడే, హొసపేటె (హావేరి)


సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిరాంప్రసాద్, తదితరులు

## మటన్ దుకాణాల కోసం బ్రాహ్మణ కార్పొరేషన్‌కు దరఖాస్తులా!

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: వ్యాపారాలు చేసుకునేందుకు రుణాల కోసం బ్రాహ్మణ కార్పొరేషన్‌కు వచ్చిన దరఖాస్తుల్లో ఓ నాలుగు.. మటన్ దుకాణాల కోసం రావడం విడ్డూరంగా ఉందని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చిరాంప్రసాద్ అన్నారు. ఇది వైకాపా అరాచక కృత్యాల్లో ఒకటిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై వాస్తవాలు తెలుసుకునేందుకు విచారణ చేయిస్తామని చెప్పారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆదివారం బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. బ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. వైకాపా హయాంలో నిలిపివేసిన అన్ని పథకాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టంచేశారు.

# ఆరెంజ్ సంకేతం.. స్పందించు తక్షణం

- సమస్య తీవ్రతను బట్టి పురమిత్ర యాప్‌లో సంకేతాలు
- హాట్ స్పాట్‌లకు కమిషనర్లు వెళ్లేలా ప్రభుత్వం ఆదేశాలు

ఈనాడు, అమరావతి: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన పురమిత్ర యాప్‌లో ప్రభుత్వం పలు మార్పులు చేస్తోంది. ప్రజలకు మరింత చేరువయ్యేలా, సమస్యల పరిష్కారంలో మున్సిపల్ కమిషనర్లు క్రియాశీలంగా స్పందించేలా చర్యలు తీసుకుంటోంది. యాప్‌లో ప్రజలు అప్‌లోడ్ చేసిన సమస్యల్లో ఒకే అంశంపై ఐదుకుపైగా ఉంటే కమిషనర్ల లాగిన్‌లో అవి నారింజ (ఆరెంజ్) రంగులో హాట్‌స్పాట్లుగా కనిపించనున్నాయి. క్షేత్ర పర్యటనల్లో కమిషనర్లు వీటికి తొలి ప్రాధాన్యమిచ్చి పరిష్కార చర్యలు చేపట్టాలి. వీటిపై రాష్ట్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. కమిషనర్లు క్షేత్రస్థాయికి వెళ్తున్నారో, లేదో తెలుసుకునే వ్యవస్థనూ ఏర్పాటుచేస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో సమస్యలను ఫొటోలతో సహా ప్రజలు అప్‌లోడ్ చేసేలా ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను తీసుకొచ్చింది. దీనిలో ఐదు నెలల్లో 13.87 లక్షల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన 71,061 సమస్యల్లో 69,315 పరిష్కారమయ్యాయి.



### ఇకపై ఇలా..

- పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల కమిషనర్లను ఇందులో పూర్తిస్థాయిలో భాగస్వాములను చేస్తున్నారు. సమస్య తీవ్రత వారు తెలుసుకునేలా యాప్‌లో వీటిని హాట్ స్పాట్స్‌గా చూపించనున్నారు. ఉదాహరణకు విజయవాడలోని పటమట ప్రాంతంలో దోమల బెడదపై ఐదుకు పైగా ఫిర్యాదులొచ్చాయంటే అక్కడ సమస్య తీవ్రంగా ఉన్నట్లుగా గుర్తించి నారింజ రంగులో హాట్ స్పాట్‌గా చూపిస్తుంది.
- కమిషనర్లు రోజూ ఉదయం క్షేత్ర పర్యటనకు వెళ్లేటప్పుడు వారి లాగిన్‌లో హాట్ స్పాట్స్‌ను గుర్తించి తొలుత ఆయా ప్రాంతాలకు వెళ్లాలి. ఆర్థికేతర అంశమైతే తక్షణమే పరిష్కారం చూపించాలి. కమిషనర్లు క్షేత్రస్థాయికి వెళ్లినట్లు ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. సమస్య పరిష్కరించాక ఆరెంజ్ రంగులోని హాట్ స్పాట్ గ్రీన్ రంగులోకి మారుతుంది.
- వీధి దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, కుక్కలు, దోమల బెడద వంటి సమస్యలు కమిషనర్ల స్థాయిలోనే పరిష్కరించాలి. రోడ్లు, కాలువలకు మరమ్మతులు, కొత్త నిర్మాణాలకు ఇంజినీర్లు అంచనాలు వేయాలి. కౌన్సిల్ అనుమతి మేరకు నిర్దేశిత గడువులోగా ఆ పనులు చేయాలి. రోడ్లపై గుంతలు పూడ్చటం వంటివి ఒకట్రెండు రోజుల్లో పూర్తిచేయాలి. ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిర్దేశిత గడువులోగా కమిషనర్ల ఆధ్వర్యంలో వివిధ విభాగాల అధికారులు పరిష్కరించాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. సిటిజన్ ఛార్టర్‌ను పక్కాగా అనుసరించాల్సిందేనని సూచిస్తోంది. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి తాఖీదులిచ్చి చర్యలు తీసుకోనుంది.


మాట్లాడుతున్న స్వర్ణభారతి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్

## కలమల్ల తొలి తెలుగు శాసనానికి ప్రాచుర్యం తీసుకొస్తాం

- స్వర్ణభారతి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్


కడప (వైవీయూ), న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కలమల్లలోని తొలి తెలుగు శిలాశాసనాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె, స్వర్ణభారతి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తెలిపారు. ఆదివారం కడపలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో తెలుగు శిలాశాసనం నమూనాను ఆవిష్కరించారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దీపా వెంకట్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కలమల్ల తెలుగు శాసనాన్ని ప్రపంచానికి చాటిచెప్పే అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. శిలాశాసన నమూనాను తన ట్రస్టు ద్వారా సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నెలకొల్పడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. సాహిత్యాన్ని ఔపోసన చేసుకునే స్ఫూర్తినిచ్చింది తన తండ్రేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండలి కృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షుడు త్రివిక్రమరావు, వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, జానమద్ది సాహితీ పీఠం ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య పార్వతి, అధ్యాపకులు, రచయితలు పాల్గొన్నారు. అంతకుముందు దీపా వెంకట్ స్థానిక బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించారు.


తెలుగు శిలాశాసన నమూనాను ఆవిష్కరిస్తున్న దీపా వెంకట్

# చరిత్రను శోధించి.. భావితరాలకు పంచి!

- స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లింల పాత్రపై 26 పుస్తకాలు ● సయ్యద్ నజీర్ అహ్మద్ కృషి

ఈనాడు, అమరావతి: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వెలుగులోకి రాకుండాపోయిన ఎన్నో కీలక ఘట్టాలు, ప్రముఖుల జీవిత విశేషాలను నేటి తరానికి తెలియజేసేందుకు పాతికేళ్లుగా అవిరళ కృషి చేస్తున్నారు గుంటూరుకు చెందిన సయ్యద్ నజీర్ అహ్మద్. 70 ఏళ్ల జీవితంలో 50 ఏళ్లుగా రచనా వ్యాసంగంలోనే నిమగ్నమైన నజీర్ అహ్మద్.. మనమెరగని, మరుగునపడిన మహానుభావుల త్యాగనిరతిని అక్షరబద్ధం చేస్తున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్రపై 26 పుస్తకాలు రాశారు. ఓ ప్రత్యేక అంశంపై ఆసక్తి పెంచుకొని, అనుక్షణం అదేపనిగా పరిశోధన చేస్తున్న నజీర్ అహ్మద్ ప్రస్థానం.. స్ఫూర్తిదాయకం!





వివిధ భాషల్లోకి అనువాదమైన నజీర్ అహ్మద్ పుస్తకాలు ✦ రచయిత నజీర్ అహ్మద్

నెల్లూరు జిల్లా అల్లూరు తాలూకా పురిణిలో 1955 డిసెంబర్ 22న నజీర్ అహ్మద్ జన్మించారు. ఎంకామ్, సాహిత్యరత్న (హిందీ)తో పాటు న్యాయ, జర్నలిజం కోర్సులను అభ్యసించిన ఆయన పలు సంస్థల్లో పాత్రికేయుడిగా పనిచేశారు. 20 ఏళ్ల వయస్సులో 'మరో ప్రపంచం' లిఖిత మాసపత్రికలో తన తొలి కవితా రచనను చూసుకున్నారు. ఆ తర్వాత ఆయన రాసిన కవితలు, కథానికలు, గేయాలు, సమీక్ష వ్యాసాలు, కార్టూన్లు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. సొంతంగా రెండు మాస పత్రికలూ వెలువరించారు. స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్రను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో చరిత్ర అధ్యయనం మొదలుపెట్టారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం-ముస్లింలు, ముస్లిం మహిళలు, గాంధీజీ ప్రాణరక్షకుడు బతఖ్‌మియా అన్సారి, పండిత రాంప్రసాద్ బిస్మిల్ అష్ఫాఖుల్లాఖాన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం హిందూ-ముస్లిం ఐక్యత, అండమాన్ జైలు- ముస్లిం సమరయోధులు, ఆజాద్ హింద్ ఫౌజ్, చరితార్థులు-1, 2.. ఇలా పాతికేళ్లలో 26 పుస్తకాలను 7,368 పేజీల్లో రచించారు. ఇవి ఆంగ్లం, హిందీ, ఉర్దూ, తమిళం, కన్నడ, గుజరాతీ భాషల్లోకి అనువాదమయ్యాయి. వాటిని దాతల సాయంతో ప్రచురించి దేశవ్యాప్తంగా గ్రంథాలయాలు, సాహితీసంస్థలు, ప్రచార సంస్థలు, విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నారు. పీడీఎఫ్ ఫైల్స్‌ను సామాజిక మాధ్యమాల్లో పాఠకులకు చేరువ చేస్తున్నారు. చరితార్థులు పేరిట 155 మంది మహానుభావుల చిత్రాలతో ఆల్బం రూపొందించి, దేశవ్యాప్తంగా 57 ప్రదర్శనల్లో ఉంచారు. ఆ మహనీయుల వర్ణచిత్రాలు, సంక్షిప్త వివరాలతో నేమ్ స్టిక్కర్లు తయారుచేసి, విద్యార్థులకు అందిస్తున్నారు. విదేశాల్లోని భారతీయ చిన్నారులకూ పంపిస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, వారి విశిష్టతను క్లుప్తంగా విజిటింగ్ కార్డుల సైజులో 50 వేల కార్డులపై ముద్రించి పంచారు. నజీర్ అహ్మద్ కృషికి గుర్తింపుగా 2004లో వి.ఆర్.నార్ల విశిష్ట జర్నలిస్టు అవార్డు వరించింది. ఈ ఏడాది రాష్ట్ర ఉర్దూ అకాడమీ నుంచి జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. కళాభారతి, జ్ఞానజ్యోతి, జాతీయ సమైక్యత, కళారత్న తదితర 29 పురస్కారాలు పొందారు.

## పిండ మార్పిడి విధానంలో గిర్‌జాతి పెయ్యదూడ జననం




పిండ మార్పిడి విధానంలో పుట్టిన గిర్‌జాతి పెయ్య దూడ ✦ డాక్టర్ వెంకటరెడ్డి

ఉరవకొండ, బొమ్మనహాల్, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా బొమ్మనహాల్‌లో ఒంగోలు జాతి ఆవుకు పిండ మార్పిడి విధానంలో గిర్‌జాతి పెయ్య(ఆడ) దూడ పుట్టింది. మండల పశువైద్యాధికారి వెంకటరెడ్డి కొన్నాళ్ల కిందట గుంటూరులోని పశుసంవర్ధక ప్రయోగశాల లామ్‌ఫామ్‌లో పశుసంపద పెంపు, పెయ్య(ఆడ) దూడల ఉత్పత్తిపై శిక్షణ పొందారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని జాతీయ కామధేను బ్రీడింగ్ సెంటర్(ఎన్‌కేబీసీ)లో తయారుచేసిన గిర్‌జాతి పెయ్యదూడ పిండాన్ని వైద్యుడు 9 నెలల కిందట బొమ్మహాళ్‌లోని రైతు నాగప్పకు చెందిన ఒంగోలు జాతి ఆవు గర్భంలో ప్రవేశపెట్టారు. ఇది ఆరోగ్యంగా పెరిగి రెండు రోజుల కిందట 33 కిలోల బరువుతో పెయ్య జన్మించింది. గిర్‌జాతి పశుసంపద అధిక పాల ఉత్పత్తిలో దేశంలోనే పేరుపొందిందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ వెంకటేశ్ పేర్కొన్నారు. పశువులు ఎదకు వచ్చినపుడు రైతులు దగ్గర్లోని వైద్యశాలకు సమాచారం ఇస్తే సిబ్బంది పిండ మార్పిడికి తగిన ఏర్పాట్లు చేస్తారని చెప్పారు.

## చింత లేకుండా అలల చెంతకు..

చెన్నై మెరినా బీచ్ అంటే మనసు పడనివారెవరు? కానీ బీచ్ రోడ్డు నుంచి సముద్ర తీరం వరకు వెళ్లాలంటే కనీసం 300 మీటర్లకు పైగా ఇసుకలో నడవాలి. దివ్యాంగులు, వృద్ధులకు ఈ నడక చాలా కష్టం కావడంతో సందర్శకుల్లో వారి సంఖ్య తక్కువగా ఉండేది. అందుకే చెన్నై మహానగర పాలక సంస్థ (జీసీసీ) రోడ్డు నుంచి 352 మీ. పొడవైన భారీ మ్యాట్‌ను ఇసుకపై పరిచి బిగించారు. హైడెన్సిటీ పాలీ ఇథిలిన్‌తో తయారైన ఈ మ్యాట్‌పై బీచ్ వీల్‌ఛైర్ సాయంతో సులువుగా తీరానికి చేరుకోవచ్చు. నడిచి వెళ్లే వారికీ సౌకర్యంగా ఉంటుంది. ఇది వరకు దీని స్థానంలో చెక్క బాట ఉండగా అది వర్షాలకు తరచూ పాడవుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని జీసీసీ కమిషనర్ జె.కుమారగురుబరన్ తెలిపారు.



– ఈనాడు, చెన్నై

## పరమపావనం.. కూర్మావతార దర్శనం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతా రామచంద్రస్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాల్లో రెండో రోజైన ఆదివారం దివ్య ప్రబంధాన్ని పారాయణం చేశారు. నామార్చన పఠించి రామయ్యకు ధూపదీపాలను సమర్పించారు. కూర్మావతారంలో దర్శనమిచ్చిన స్వామివారిని కోలాటాలు భజనలతో మిథిలా మండపానికి తీసుకెళ్లడంతో భక్తులు పరవశించిపోయారు. మండపంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



EENADU Vol: 52, Issue: 132 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

రీల్ రివైండ్ 2025

కథానాయికలంతా కళ్ల ముందుకొచ్చారు. అందంతో కవ్వించారు, కనువిందు చేశారు. కొద్ది మంది నటనతోనూ కట్టిపడేశారు. ఫలితాలతో సంబంధం లేకుండా ఇటు ప్రేక్షకుల్నీ... అటు పరిశ్రమనీ ఆకర్షించారు. అది అతిథి పాత్ర కావొచ్చు, పూర్తిస్థాయి కథానాయిక పాత్ర కావొచ్చు.... ఒకరిద్దరు మినహా ఎప్పట్నుంచో తెలుగు సినిమాలకు దూరంగా ఉంటున్న కథానాయికలు సైతం ఈ ఏడాది తెరపై మెరిశారు.

# మెరిశారు అందరూ...

# అదిరింది గ్లామరు...




ఇంతకుముందు ఒక భాష నుంచి అవకాశం వచ్చిందంటే... మరో భాషకు దూరం కావల్సి వచ్చేది. దాంతో ఎక్కడ మంచి అవకాశం వచ్చిందనిపిస్తే అక్కడ సినిమాలు చేస్తూ కథానాయికలు బిజీ అయిపోయేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏ భాషలో సినిమా చేసినా సరే, అది రెండు మూడు భాషల్లో విడుదల కావడం ఇప్పుడు చాలా సాధారణమైన విషయంగా మారింది. పాన్ ఇండియా ట్రెండ్ పుణ్యమే అదంతా. అందుకే కథానాయికలు ఎక్కడ సినిమా చేసినా సరే... పొరుగు భాషలోనూ వాళ్ల హాజరు పడిపోతుంటుంది. దాంతో 2025లో కథానాయికలంతా మన కళ్ల ముందు ఉన్నట్టే అనిపించారు.

## అందం... అభినయం

కొత్తతరం కథానాయికలైన శ్రీనిధిశెట్టి, మీనాక్షి చౌదరి, భాగ్యశ్రీ బోర్సే, ఐశ్వర్య రాజేశ్ ఈ ఏడాది పలు కీలకమైన సినిమాలతో మెరిశారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. కొత్త అవకాశాల్నీ అందుకున్నారు. శ్రీనిధి శెట్టి 'హిట్ 3', 'తెలుసు కదా' సినిమాలతో ఆకట్టుకుంది. ప్రస్తుతం వెంకటేశ్‌తో కలిసి 'ఆదర్శకుటుంబం హౌస్ నెంబర్: 47'లో నటిస్తోంది. భాగ్యశ్రీ బోర్సే 'కాంత', 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రాలతో అటు అందంతోనూ, ఇటు నటనతోనూ కట్టిపడేసింది. ఈ ఏడాది ఎక్కువగా మాట్లాడుకునేలా చేసిన కథానాయిక రుక్మిణీ వసంత్. 'కాంతార: చాప్టర్ 1'తో కట్టిపడేయడంతోపాటు, ఆమె తెలుగులో ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కలయికలో వస్తున్న సినిమాలో నటిస్తుండడమే అందుకు కారణం. ఆమె శివకార్తికేయన్‌తో కలిసి నటించిన 'మదరాసి', విజయ్ సేతుపతితో చేసిన 'ఏస్' సినిమాలు తెలుగు ప్రేక్షకుల ముందుకూ వచ్చాయి. పవన్‌కల్యాణ్‌తో కలిసి 'ఓజీ'లో నటించిన ప్రియాంక మోహన్ మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. సంయుక్త 'అఖండ2: తాండవం'తో మెరిసింది. సంక్రాంతికి 'నారీ నారీ నడుమ మురారి'తో సందడి చేయనున్న ఆమె ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో సినిమా చేస్తోంది. 'మిరాయ్' భామ రితికా నాయక్ ఓ భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో ఆమెకు గుర్తింపు లభించినట్టైంది. ప్రస్తుతం వరుణ్‌తేజ్‌తోనూ, ఆనంద్ దేవరకొండతోనూ కలిసి నటిస్తోంది. నిధి అగర్వాల్ 'హరి హర వీర మల్లు'తో సందడి చేసింది. కొన్నేళ్లుగా తెలుగుకు ప్రాధాన్యమిస్తూ ప్రయాణం చేస్తున్న కియారా ఈ ఏడాది 'గేమ్ ఛేంజర్'తో తెలుగులో మెరిసింది. ఆమె హృతిక్, ఎన్టీఆర్ సినిమా 'వార్ 2'తోనూ తెలుగు ప్రేక్షకులపై ప్రభావం చూపించింది.

## ఎక్కువ సినిమాలు వీళ్లవే...

2025లో ఎక్కువ సినిమాలతో సందడి చేసిన కథానాయిక... రష్మిక. నేరుగా ఆమె తెలుగులో చేసిన సినిమాలు 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలే అయినా, హిందీలో ఆమె చేసిన 'ఛావా' తెలుగు ప్రేక్షకుల్నీ అలరించింది. 'సికందర్', 'థమ్మా' చిత్రాలు కూడా తెలుగులో విడుదలయ్యాయి. ఇలా మొత్తం ఆమె ఖాతాలో ఈ ఏడాది ఐదు సినిమాలు పడిపోయాయి. ప్రస్తుతం తెలుగులో 'మైసా', హిందీలో 'కాక్‌టెయిల్ 2' సినిమాలు చేస్తున్నారు. అలా సంఖ్య పరంగా చూస్తే ఆ తర్వాత స్థానం అనుపమ పరమేశ్వరన్ సొంతం. తెలుగులో ఆమె చేసిన 'పరదా', 'కిష్కింధపురి' చిత్రాలు ప్రేక్షకుల ముందుకొచ్చాయి. అనువాదాలుగా విడుదలైన 'డ్రాగన్', 'బైసన్' చిత్రాలూ తెలుగు ప్రేక్షకుల దృష్టిని ప్రముఖంగా ఆకర్షించాయి. శ్రీలీల నేరుగా తెలుగులోనే మూడు సినిమాలు చేశారు. అందులో ఒకటి 'రాబిన్‌హుడ్', మరొకటి 'మాస్ జాతర'. మూడవది 'జూనియర్'. అంచనాల మేరకు ఫలితాలు రాకపోయినా శ్రీలీల అవకాశాల విషయంలో మాత్రం జోరును ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా ఆమె హిందీలో ఎక్కువ అవకాశాల్ని సొంతం చేసుకొంటోంది.

## సీనియర్లంతా వచ్చారు...

రకుల్‌ప్రీత్ సింగ్ హిందీలోనే బిజీ కావడంతో ఈసారి తెలుగు తెరపై కనిపించలేదు కానీ, అనుష్క మాత్రం మళ్లీ తన మార్క్ సినిమా 'ఘాటి'తో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. చాలా రోజులుగా తెరపై కనిపించని సమంత 'శుభం' సినిమాలో అతిథి పాత్రతో సందడి చేసింది. ఆ చిత్రానికి ఆమే నిర్మాత. కాజల్ అగర్వాల్ 'కన్నప్ప'లో పార్వతిగా నటించారు. సల్మాన్‌ఖాన్ 'సికందర్'లో ఓ పాత్ర చేశారు. తమన్నా 'ఓదెల 2'తో మెరిసింది. శ్రుతిహాసన్ 'కూలీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. అందులోనే పూజా హెగ్డే ప్రత్యేక గీతం చేసి అలరించారు. ఆమె ఈ ఏడాది సూర్యతో కలిసి చేసిన 'రెట్రో' తెలుగులోనూ విడుదలైంది. నాయికా ప్రధానమైన కథలతో తెరకెక్కిన 'రివాల్వర్ రీటా', 'ఉప్పు కప్పురంబు' చిత్రాలతో కీర్తి సురేశ్ ప్రేక్షకుల ముందుకొచ్చారు. ప్రస్తుతం విజయ్ దేవరకొండతో కలిసి నటిస్తున్నారు. 'డాకు మహారాజ్' చిత్రంతో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, కొన్ని అనువాద చిత్రాలతో నిత్యమేనన్ సందడి చేశారు.







# లెట్స్ డ్యాన్స్ ఛాంపియన్

'ఛాంపియన్'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు రోషన్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మించాయి. అనస్వర రాజన్ కథానాయిక. నందమూరి కల్యాణ్ చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే నటి సమంత ఈ చిత్రంలోని "కమ్ కమ్ ఛాంపియన్.. లెట్స్ డ్యాన్స్ ఛాంపియన్" అంటూ సాగిన గీతాన్ని విడుదల చేశారు.



అనస్వర, రోషన్, ఊహ, జెమిని కిరణ్

- ఆదివారం రాత్రి వైజాగ్‌లో 'ఛాంపియన్ నైట్' వేడుక సందడిగా జరిగింది. ఈ కార్యక్రమంలో చిత్ర బృందంతో పాటు ఊహ, జెమిని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 'టాక్సిక్'లో నదియాగా కియారా

యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. కియారా కథానాయిక. ఆమె ఈ సినిమాలో నదియా అనే పాత్రలో కనిపించనుందని తెలియజేస్తూ చిత్రబృందం ఆదివారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. అందులో తను పైకి గ్లామర్ లుక్‌లో కనిపించినా.. ముఖంలోని హావభావాలు చూస్తుంటే ఏదో విషాదంలో ఉన్నట్లు అర్థమవుతోంది. ఈ సందర్భంగా దర్శకురాలు గీతూ మోహన్ దాస్ మాట్లాడుతూ.. "కొన్ని పాత్రల్లో నటించినప్పుడు అవి సినిమాకే పరిమితం కావు. యాక్టర్స్‌కు సరికొత్త గుర్తింపును తీసుకొస్తాయి. నదియా పాత్రలో కియారా నటన విభిన్నంగా ఉంటుంది. ఆ అభినయాన్ని చూసి నేను చాలా గర్వంగా ఫీలవుతున్నా" అన్నారు. వచ్చే ఏడాది మార్చి 19న రానుంది.


కియారా

# మా అంచనాల్ని నిజం చేసే ఈషా


**ఈ ఏడాది తాము విడుదల చేసిన 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాల తరహాలోనే 'ఈషా' తమ అంచనాల్ని తప్పక నిజం చేస్తుందన్నారు వంశీ నందిపాటి, బన్నీ వాస్. ఆ ఇద్దరూ కలిసి ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న చిత్రమే 'ఈషా'. అఖిల్‌రాజ్, త్రిగుణ్ కథానాయకులు. హెబ్బా పటేల్ కథానాయిక. శ్రీని వాస్ మన్నె దర్శకత్వం వహించారు. చిత్రం విడుదలను పురస్కరించుకుని వంశీ నందిపాటి, బన్నీ వాస్ ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.**

"ఒకపక్క భయపెడుతూ, మరో పక్క థ్రిల్‌ని పంచే చిత్రమిది. తొలి పది నిమిషాల తర్వాత ఈ సినిమాని మేం ఎందుకు తీసుకున్నామో అందరికీ అర్థం అవుతుంది. గతంలో మేం విడుదల చేసిన 'లిటిల్‌హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాల కథలకీ, 'ఈషా' కథకీ ఏమాత్రం పొంతన ఉండదు. భిన్నమైన జానర్స్. అయితే మేం ఆ రెండు చిత్రాల కంటెంట్ విషయంలో ఎంత నమ్మకంగా ఉన్నామో, ఈ సినిమా విషయంలోనూ అంతే! సినిమాని చూడగానే నచ్చేసింది. కథపై నమ్మకంతోనే విడుదల చేయాలని నిర్ణయించాం. మేం ఇద్దరం కలిసి విడుదల చేసిన సినిమాలన్నీ విజయవంతమయ్యాయి. 'ఈషా' కూడా మా అంచనాల్ని నిజం చేస్తుంది. చివరి 20 నిమిషాల సన్నివేశాలు ఈ సినిమా ప్రత్యేకమైన అనుభూతిని పంచుతుంది".


వంశీ, బన్నీ వాస్

- "సొంతంగా నిర్మించే సినిమాల విషయంలో కొన్నిసార్లు జరిగిందేమో కానీ, పంపిణీదారుగా మాత్రం ఎప్పుడూ మావైపు నుంచి తప్పు జరగలేదు. సినిమా దాదాపుగా పూర్తయ్యాక చూసినప్పుడు దానిపై ఓ కచ్చితమైన అంచనాకి వస్తుంటాం. అందుకే మేం విడుదల చేసే సినిమాల గురి తప్పలేదు. 'ఈషా'ని కూడా తొలి కాపీ చూసే తీసుకున్నాం. మేం తీసుకునే సినిమాలతో మా ప్రయాణం ఎడిట్ రూమ్ దగ్గర్నుంచి మొదలవుతుంది. నిర్మాణానంతర పనులు ఎలా జరుగుతున్నాయో చూసుకుంటూ, పక్కా ప్రణాళికలతో సినిమాని మార్కెట్ చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. పంపిణీదారుల్ని మించిన బాధ్యతలు మావి. మాదొక కొత్త ట్రెండ్ అని చెప్పొచ్చు. ఇకపై కూడా ఇలాగే మా ప్రయాణం కొనసాగుతుంది. ఈటీవీ విన్‌తో కలిసి భవిష్యత్తులోనూ సినిమాలు చేస్తాం".

# మమ్ముట్టి మాస్ ఎంటర్‌టైనర్


మమ్ముట్టి

'కలాంకావల్' సినిమాతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు మలయాళ అగ్రహీరో మమ్ముట్టి. ఇందులో ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనువిందు చేసిన ఆయన.. ఇప్పుడు మరో మాస్ ఎంటర్‌టైనర్‌తో రాబోతున్నారు. 'మార్కో' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న నిర్మాణ సంస్థ క్యూబ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ సినిమా కోసం మమ్ముట్టితో చేతులు కలిపింది. 'అలప్పుజా జింఖానా' ఫేమ్ ఖలీద్ రెహమాన్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు మమ్ముట్టి.

# హిట్ బొమ్మ

బాల నటుడిగా పలు విజయవంతమైన చిత్రాల్లో అలరించిన అభినవ్ మణికంఠ ఇప్పుడు 'బొమ్మ హిట్' అనే సినిమాతో హీరోగా తెరకు పరిచయమవుతున్నారు. ఆయన. . పూజా యడం జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రాజేశ్ గడ్డం తెరకెక్కిస్తున్నారు. గుర్రాల సంధ్యారాణి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఇటీవల హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా హీరో అభినవ్ మణికంఠ మాట్లాడుతూ.. "మంచి వినోదంతో పాటు సందేశమున్న చిత్రమిది" అన్నారు.


పూజ, అభినవ్


అర్చన, నాని, ఆది సాయికుమార్

# పంచభూతాల్ని శాసిస్తుంది

'శంబాల' చిత్రంతో క్రిస్మస్ బరిలో అలరించనున్నారు ఆది సాయికుమార్. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని యుగంధర్ ముని తెరకెక్కించారు. అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. అర్చన అయ్యర్ కథానాయిక. స్వసిక, రవి వర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర మిస్టిక్ ట్రైలర్‌ను హీరో నాని ఆదివారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "ట్రైలర్ చాలా అద్భుతంగా ఉంది. సినిమాపై నమ్మకాన్ని పెంచుతోంది. ప్రస్తుతం ప్రేక్షకులు ఇలాంటి జానర్ చిత్రాల్నే కోరుకుంటున్నారు. ఈ సినిమాతో ఆదికి విజయం దక్కాలని కోరుకుంటున్నా" అన్నారు. ఇక ట్రైలర్ విషయానికొస్తే.. ఆకాశం నుంచి ఓ ఉల్క రాలిపడటం.. "పంచభూతాల్ని శాసిస్తుందంటే ఇది సాధారణమైనది కాదు" అంటూ ఆ ఉల్క శక్తిని చూపించడం ఆసక్తిరేకెత్తించింది. మరి ఉల్క పడిన తర్వాత నుంచి ఆ ఊరి ప్రజలకు ఎదురైన వింత సమస్యలేంటి? దాన్ని అడ్డుకునేందుకు నాస్తికుడైన హీరో ఎందుకు రంగంలోకి దిగాల్సి వచ్చింది? ఆ సమస్యకు పరిష్కారం కనుగొనే క్రమంలో తను ఎదుర్కొన్న సవాళ్లేంటి? అన్నది మిగిలిన కథ. "విధి నిన్నిక్కడికి రప్పించింది. నువ్వే ఈ సమస్యకి కొత్త పరిష్కారం కనిపెడతావేమో" అంటూ ట్రైలర్‌లో హీరోని ఉద్దేశిస్తూ వినిపించిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి సంగీతం: శ్రీచరణ్ పాకాల, ఛాయాగ్రహణం: ప్రవీణ్ కె. బంగారి.

# 'పతంగ్' పండగ

పండగ ఆనందాల్ని రెట్టింపు చేసే సినిమానే మా 'పతంగ్' అంటున్నారు వంశీ పూజిత్, ప్రణవ్ కౌశిక్, ప్రీతి పగడాల. ఈ ముగ్గురూ ప్రధాన పాత్రధారులుగా... ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మకా, సురేశ్ కొత్తింటి, నాని బండ్రెడ్డి, రమ్య నిర్మాతలు. కామెడీ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం ఈనెల 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఆదివారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. ఈ సందర్భంగా కథానాయకుడు వంశీ పూజిత్ మాట్లాడుతూ "యువతరం అభిరుచులకు తగ్గట్టుగా కలర్‌ఫుల్‌గా సాగే చిత్రమిది. పతంగ్ పోటీలు, ఆ నేపథ్యంలోని విజువల్స్ అంతర్జాతీయ ప్రమాణాలతో అలరిస్తాయి" అన్నారు. ప్రీతి పగడాల మాట్లాడుతూ "ప్రేమ, స్నేహం మేళవింపుగా రూపొందిన ఇలాంటి ఓ మంచి చిత్రంలో భాగం కావడం ఆనందంగా ఉంది" అన్నారు. "విభిన్నమైన స్పోర్ట్స్ డ్రామా చిత్రమిది. గాలిపటాల పోటీ నేపథ్యంలో సాగే ఇలాంటి సినిమాని తీయడం అంత సులభం కాదు. దర్శకనిర్మాతలు ఎంతో శ్రమించి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ట్రైలర్‌కి మంచి స్పందన లభించింది. చిత్రం అందుకు దీటుగా ఉంటుంద"న్నారు ప్రణవ్ కౌశిక్. ఆలస్యమైనా ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని, ఈ ఏడాది విడుదలై విజయవంతమైన చిత్రాల జాబితాలో 'పతంగ్' తప్పకుండా చోటు సంపాదిస్తుందన్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.


ప్రణవ్, ప్రీతి, వంశీ

# హ్యాపీ రాజ్.. చేస్తాడు మ్యాజిక్

"మన పెళ్లి గుడిలో జరుగుతుంది.. లేదు స్టార్ హోటల్‌లోనే జరగాలి... నువ్వు మన పెళ్లిలో పట్టు చీర కట్టుకోవాలి.. లేదు లెహంగానే వేసుకుంటా. వివాహ వేడుకలో సాంప్రదాయ వంటకాలతో విందు ఇద్దాం.. లేదు మెక్సికన్ బఫే పెడదాం..." ఇదంతా త్వరలో ఏడడుగుల బంధంలోకి అడుగు పెట్టబోతున్న ఓ జంట మధ్య జరుగుతున్న చర్చ. మరి వీళ్లు పెళ్లి పీటలెక్కారా? లేదా అనేది తెలుసుకోవాలంటే 'హ్యాపీ రాజ్' సినిమా చూడాల్సిందే. సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్, శ్రీగౌరీ ప్రియ జంటగా నటిస్తున్న చిత్రమిది. మరియా రాజా ఎలాంచెజియన్ దర్శకత్వం వహిస్తున్నారు. 'ప్రేమదేశం' ఫేమ్ అబ్బాస్ ఈ చిత్రంతో రీఎంట్రీ ఇవ్వడం విశేషం. తాజాగా ఈ సినిమా నుంచి ఓ ప్రోమోను విడుదల చేసింది చిత్ర బృందం. 'హ్యాపీ రాజ్.. మ్యాజిక్ చేస్తాడు' అంటూ ఆసక్తికర సంభాషణలతో ఆద్యంతం నవ్వులు పూయించేలా సాగుతోందీ వీడియో. గీతా కైలాసం, దేవి మహేశ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని జై వర్ధ నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల తేదీని వెల్లడించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.


జీవీ ప్రకాశ్

## చెన్నైలో 300 పడకల ఆసుపత్రికి కిమ్స్ సన్నాహాలు

హైదరాబాద్: కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) తన సేవలను తమిళనాడుకు విస్తరించనుంది. చెన్నైలోని డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ రోడ్డులో 300 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన 1.168 ఎకరాల భూమిని లీజుపై తీసుకునేందుకు ఆంధ్ర మహిళా సభతో కిమ్స్ హాస్పిటల్స్ ఒప్పందం చేసుకుంది. ఈ ఆసుపత్రి నిర్మాణం కోసం దాదాపు రూ.300 కోట్లు పెట్టుబడి పెడతామని కిమ్స్ హాస్పిటల్స్ ప్రకటించింది. ఇందులో కొంతమేర అంతర్గతంగా సమకూర్చుకుంటామని, మరికొంత మొత్తాన్ని బ్యాంకుల నుంచి రుణంగా సమీకరిస్తామని వెల్లడించింది. మూడేళ్లలో ఈ ఆసుపత్రి నిర్మాణం ప్రారంభించాలన్నది సంస్థ ప్రణాళిక. ప్రస్తుతం సంస్థ ఆధ్వర్యంలో 8,800 పడకలున్న ఆసుపత్రులున్నాయి.

## విమాన ఇంజిన్ ఎంఆర్‌ఓ సేవల్లోకి అదానీ గ్రూప్



ముంబయి: విమానాల ఇంజిన్ ఎంఆర్‌ఓ (నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాలింగ్) సేవల్లోకి ప్రవేశించాలని అదానీ గ్రూప్ ప్రణాళిక రూపొందించింది. ప్రయాణికుల విమానాలను సరకు రవాణా విమానాలుగా (పీ2ఎఫ్) మార్చే సేవలూ అందించాలని నిర్ణయించింది. దేశీయ విమానయాన రంగం శరవేగంగా వృద్ధి చెందుతున్న రంగంలో.. ఇప్పటికే విమానాశ్రయాలను నిర్వహిస్తున్న అదానీ గ్రూప్, ఈ కొత్త సేవల్లోకి రావాలని నిర్ణయించిందని అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ (ఏఏహెచ్‌ఎల్) డైరెక్టర్ జీత్ అదానీ వెల్లడించారు. ఇప్పటికే తాము పైలట్ల శిక్షణ సంస్థలు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. తమ విమానయాన వ్యాపారాన్ని 2 విభాగాలుగా నిర్వహించనున్నట్లు జీత్ వివరించారు. విమానాశ్రయాల మౌలిక సదుపాయాలు ఒకటైతే, విమానాలకు పలు సేవలు అందించడం రెండోదన్నారు.

● ఎంఆర్‌ఓ రంగంలో సేవలందిస్తున్న ఎయిర్‌వర్క్స్‌ను ఈ ఏడాదిలో రూ.400 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువకు కొనుగోలు చేయడం ద్వారా, రక్షణరంగ విమానాలకూ ఎంఆర్‌ఓ సేవలందించేందుకు అదానీ గ్రూప్ సిద్ధమైంది.

● గత నెలలో ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్‌లో 72.8% వాటాను రూ.820 కోట్లకు కొనుగోలు చేయడం ద్వారా, పైలట్ల శిక్షణ రంగంలోకీ అదానీ గ్రూప్ ప్రవేశించింది. తమ ఆధ్వర్యంలో 15 సిమ్యులేటర్లు ఉన్నాయని, మన దేశానికి 40-50 సిమ్యులేటర్ల అవసరం ఉందనేది తన భావనగా వివరించారు. రెండు, మూడేళ్లలో ఇంత సామర్థ్యాన్ని సమకూర్చుకుంటామని తెలిపారు.

## ఏఐ భవిష్యత్తుకు మేధస్సు, నైపుణ్యాలే కీలకం

**మైక్రోసాఫ్ట్ ఇండియా అధిపతి పునీత్ చందోక్**

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)లో భారీ మార్పులు వస్తున్న నేపథ్యంలో అవధుల్లేని మేధస్సు, మానవ పర్యవేక్షణతో 'డిజిటల్ సహోద్యోగులు', నైపుణ్యాల కలబోతతో కొనసాగింపు వంటివి రక్షణగా నిలుస్తాయని మైక్రోసాఫ్ట్ అధ్యక్షుడు (ఇండియా, దక్షిణాసియా) పునీత్ చందోక్ అభిప్రాయపడ్డారు. మన దేశంలో ఏఐ మౌలిక సదుపాయాలు, సార్వభౌమ సామర్థ్యాల కోసం 17.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.58 లక్షల కోట్ల) పెట్టుబడులను ఈ నెల ప్రారంభంలో భారత పర్యటన సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పునీత్ తన అంచనాలు తెలిపారు. ప్రస్తుతం ఏఐ అంచనాలను మించిందని, అసలైన ప్రభావాన్ని చూపుతోందని చందోక్ అన్నారు. మనం ఎంత బాధ్యతాయుతంగా, సమగ్రంగా, ఆలోచనాత్మకంగా ముందుకు వెళ్తామనే దాని బట్టి ఏఐ తదుపరి దశ ఉంటుందని స్పష్టం చేశారు.

### మానవుల నియంత్రణలోనే ఏఐ ఏజెంట్లు

నైపుణ్యాల కొరత నుంచి సమ్మతిగా లభించడం, సంస్థలకు నేరుగా సమాచారం లభించడం సహా ప్రపంచంలో పలు మార్పులను ఆయన అంచనా వేశారు. భవిష్యత్తులో ప్రజలతో పాటు ఏఐ 'ఏజెంట్లు' కలిసి పనిచేస్తాయి. టాస్కులను కూడా పూర్తిచేస్తాయి. అయితే మానవుల నియంత్రణలోనే మొత్తం ఉంటుందని చందోక్ వెల్లడించారు.

● భారత డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలతో భారీగా ఏఐ వినియోగం పెరుగుతుందని, ఇది అంతర్జాతీయ స్థాయికి చేరుతుందన్నారు. ఉద్యోగుల పద్ధతులు టాస్కులుగా మారతాయి. ఉద్యోగి తీరులో మరిన్ని మార్పులు వస్తాయి. ఏఐ యుగంలో నైపుణ్యాలు అత్యంత కీలకమని వివరించారు.



### కీలక రంగాల్లో వినియోగం

మన దేశంలో ప్రయోగాల దశ నుంచి పలు కీలక రంగాల్లో ఏఐ ని వినియోగించడం మొదలైంది. విమానయానం, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక సేవలు, తయారీ రంగాల్లో ఏఐ మార్పులు తీసుకొస్తోంది. వినియోగదారుల సేవల్లో ఎయిరిండియా, వైద్యులకు తోడ్పాటు ఇచ్చేందుకు అపోలో హాస్పిటల్స్, వ్యవసాయ మార్కెట్లలో ఐసీఐసీఐ లాంబార్డ్, వినూత్న ఆవిష్కరణలకు ఏషియన్ పెయింట్స్ ఏఐని వినియోగించాయని చందోక్ వివరించారు. రాబోయే రోజుల్లో ఈ జోరు కొనసాగుతుందని తెలిపారు.

### నైపుణ్యాల అభివృద్ధి తప్పనిసరి

ఏఐ వినియోగ ప్రపంచంలో మనుగడకు, నైపుణ్యాలను పెంచుకోవడం ఉద్యోగులకు తప్పనిసరి. ఉద్యోగార్థులు కూడా అధునాతన సాంకేతికతలను నేర్చుకోవాలి. భారత్‌లో 2030 కల్లా 2 కోట్ల మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలని మైక్రోసాఫ్ట్ ప్రతిన బూనిందని పునీత్ గుర్తు చేశారు

## ఎస్‌ఎంసీ బిల్లుతో సెబీ అధికారాలకు కళ్లెం

- తనిఖీలు, దర్యాప్తునకు 8 ఏళ్ల కాలపరిమితి
- మార్కెట్ వర్గాలకు నియంత్రణపరమైన ఇబ్బందులు తగ్గుతాయ్



దిల్లీ: మార్కెట్ వర్గాలకు నియంత్రణ పరమైన ఇబ్బందులు తగ్గించే ప్రతిపాదనలను సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ (ఎస్‌ఎంసీ) బిల్లులో ప్రభుత్వం చేసింది. ఈ బిల్లు చట్టమైతే.. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తనిఖీలు, దర్యాప్తునకు 8 ఏళ్ల చట్టబద్ధమైన కాలపరిమితి ఉంటుంది. సెక్యూరిటీల మార్కెట్‌పై వ్యవస్థాగత ప్రభావాన్ని చూపే కేసులకు మాత్రం ఈ 8 ఏళ్ల పరిమితి వర్తించదు. ఈ కాలపరిమితితో పాటు నిర్దేశిత సమయంలోగా నియమావళి అమలును కూడా బిల్లులో ప్రవేశపెట్టారు. దీని ప్రకారం.. 180 రోజుల్లోగా దర్యాప్తులను సెబీ పూర్తి చేయాలి. ఇదే సమయంలో అంబుడ్స్‌పర్సన్ నేతృత్వంలో ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ప్రవేశపెట్టడం ద్వారా, మదుపర్ల భద్రతను బలోపేతం చేయాల్సి ఉంటుంది. 8 ఏళ్ల కాలపరిమితి వల్ల పాత లావాదేవీలకు చట్టపరమైన కచ్చితత్వాన్ని తీసుకొస్తుందని సంబంధిత వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పాత కేసుల్లో సంస్థలను నిరవధికంగా వెంటాడకుండా ఉండేలా చూస్తుందని తెలిపాయి. దర్యాప్తును కాలపరిమితిలో పూర్తిచేయడం, అంబుడ్స్‌మన్ విధానాన్ని ఏర్పాటు చేయడం వంటి మార్పుల కోసం సెబీకి అదనపు మానవ వనరులు అవసరమయ్యే అవకాశం ఉంది. సామర్థ్యాలను పుంచుకోవడం, తగినంత శిక్షణ పొందినవారిని నియమించుకోవాల్సి ఉంటుంది.

### 3 చట్టాల స్థానంలో

గతవారం లోక్‌సభలో ఎస్‌ఎంసీ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీని ప్రకారం.. సెబీ తన వార్షిక మిగులులో 25 శాతాన్ని రిజర్వ్ ఫండ్‌లో ఖర్చుల కోసం కేటాయించాలి. మిగిలిన మొత్తాన్ని కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియాకు బదిలీ చేయాలి. తదుపరి సంప్రదింపుల కోసం ఈ బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపారు. ప్రస్తుతం ఉన్న మూడు సెక్యూరిటీల చట్టాలు- 1956 సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం, 1992 సెబీ చట్టం, 1996 డిపాజిటరీల చట్టంను కొత్త చట్టం ఏకీకృతంతో పాటు భర్తీ చేయనుంది.

### కాలపరిమితులు ఇలా

ఈ బిల్లు ప్రకారం.. ఒక చర్యకు దిశానిర్దేశం, 8 సంవత్సరాల కంటే ముందు జరిగితే సెబీ దానిపై తనిఖీ లేదా దర్యాప్తు చేయడానికి వీలుండదు. 180 రోజుల్లోగా దర్యాప్తును సెబీ పూర్తిచేయాలి. ఒకవేళ జాప్యం జరిగితే, సెబీ లిఖితపూర్వకంగా సమాధానాలు ఇవ్వాలి. అనంతరం పూర్తికాల సభ్యుడి నుంచి పొడిగింపు కోరవచ్చు. మధ్యంతర ఉత్తర్వుల కాలవ్యవధి కూడా 180 రోజులకు పరిమితం చేశారు. తీర్పు, తనిఖీ లేదా దర్యాప్తు పెండింగ్‌లో ఉంటే అటువంటి ఉత్తర్వులను రెండు సంవత్సరాల వరకు పొడిగించొచ్చు.

### అంబుడ్స్‌పర్సన్ బాధ్యతలివీ

సెబీ తన అధికారుల్లో ఒకరిని లేదా అంతకంటే ఎక్కువ మందిని అంబుడ్స్‌పర్సన్‌లుగా నియమించొచ్చు. మదుపర్ల ఫిర్యాదులు పెరిగే అవకాశం ఉండటంతో సెబీకి అదనపు సిబ్బంది అవసరమని భావిస్తున్నారు. మదుపర్ల ఫిర్యాదులను స్వీకరించడం, పరిశీలించడం, పరిష్కరించడం వంటివి అంబుడ్స్‌పర్సన్ ప్రాథమిక బాధ్యత. ప్రస్తుతం ఫిర్యాదులను సెబీ స్కోర్స్, ఓడీఆర్ ప్లాట్‌ఫామ్ ద్వారా పరిష్కరిస్తున్నారు. ఇప్పటికే స్కోర్స్, ఓడీఆర్ స్థాయుల్లో భారీగా కేసులు పేరుకుని ఉన్నాయి. వీటికి అంబుడ్స్‌పర్సన్ ఆదేశాలు తోడైతే, సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్)పై అధిక భారం పడే అవకాశం ఉంది.

## ద్రవ్యోల్బణ గణనకు మార్పులు సూచించిన ఐఐటీ-బాంబే




ముంబయి: వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం గణనకు లెక్కలోకి తీసుకునే గృహ సేవల విభాగంలో మార్పులు చేయడానికి ప్రతిపాదించిన సవరణలకు, కొన్ని మార్పులను ఐఐటీ-బాంబే రూపొందించిన ఒక సాంకేతిక పత్రం సూచించింది. ప్రొఫెసర్ ఆశిష్ దాస్‌తో పాటు గతంలో రిజర్వ్‌బ్యాంక్ ద్రవ్య విధాన విభాగంలో పని చేసిన ప్రజ్ఞా దాస్ ఈ పత్రాన్ని రాశారు.

● ప్రాతిపదిక సంవత్సరాన్ని (బేస్ ఇయర్) 2024కు మార్చాల్సిన అవసరం వంటి అనేక అంశాలను స్వాగతిస్తున్నా, కొన్ని ఆందోళనలనూ ఈ పత్రం వ్యక్తం చేస్తోంది. ప్రస్తుత 6 నెలల మూవింగ్ ప్యానెల్ పద్ధతిని కొనసాగించడాన్ని సమర్థించింది. కానీ గణకులు ప్రతి నెలా ఒక ఇంటిని సందర్శించే పద్ధతిగా మార్చడాన్ని వ్యతిరేకించింది. ప్రతి నెలా అన్ని నివాసాలను కవర్ చేయడం మంచి ఆలోచన కాదని సాంకేతిక పత్రం పేర్కొంది. సీపీఐ ద్రవ్యోల్బణంలో గృహ సేవలకు 10% పాయింట్లకు పైగా వెయిటేజీ ఉంది.

● ఇళ్ల అద్దెలు ప్రతి నెలా మారవు. అయినా కూడా నెలకు 4,000 నివాసాలకు బదులు, 25,000కు పైగా నివాసాల నుంచి ప్రతి నెలా అద్దె వివరాలు సేకరించాలనే ప్రతిపాదన.. వ్యయం పెరుగుదలకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఖజానాపై అనవసర భారాన్ని మోపడమే కాకుండా, సిబ్బందిలో అలసటను పెంచుతుందని, వివరాల సేకరణ నాణ్యతలో రాజీ పడే ప్రమాదం కూడా ఉందని పేర్కొంది. వనరులు అందుబాటులో ఉంటే, ప్రతి నెలా గృహాలను సందర్శించే బదులు, 6 నెలల ప్యానెళ్లలో గృహాల కవరేజీని పెంచడం శ్రేయస్కరం అని దాస్ తెలిపారు. ప్రస్తుత గృహ సూచిక సంకలన పద్ధతిలో లోపాలున్నాయని భావిస్తున్నందున గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ ఈ మార్పులకు మద్దతు ఇస్తోందని ఆ పత్రం పేర్కొంది.

● మెరుగైన డేటా ద్వారా సమస్యలను పరిష్కరించవచ్చని, దీనికి పద్ధతిలో సమూల మార్పులు అవసరం లేదని తేల్చి చెప్పింది.

## 11.25 లక్షల ఎంఎస్ఈలకు రూ.7.44 లక్షల కోట్ల ప్రభుత్వ ఆర్డర్లు



ప్రభుత్వరంగ సంస్థలకు అవసరమైన సేవలు, వస్తు సామగ్రి ని సమీకరించేందుకు నిర్వహిస్తున్న ది గవర్నమెంట్ ఇ-మార్కెట్ ప్లేస్ (జెమ్) ద్వారా ఇప్పటివరకు 11.25 లక్షలకు పైగా ఎంఎస్ఈ (సూక్ష్మ, చిన్న సంస్థ)లకు రూ.7.44 లక్షల కోట్లకు పైగా విలువైన ఆర్డర్లు లభించాయి. వాణిజ్య - పరిశ్రమల శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. జెమ్ సమీకరించే ఉత్పత్తుల్లో, ఎంఎస్ఈల వాటా 25% తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నిర్దేశించగా, అంతకుమించి ఈ సంస్థల నుంచి సమీకరణ గత నెలకే 44.8 శాతానికి చేరింది. ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్తు సేకరణలో పారదర్శకత పెంచడంతో పాటు కొన్ని సంస్థలపైనే ఆధారపడటాన్ని తగ్గించేందుకు జెమ్ విధానాన్ని ఆవిష్కరించారు. శుద్ధ ఇంధనం నుంచి టెక్నాలజీ అంకురాల వరకు ఎన్నోరకాల విలువైన సేవలను కూడా ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా అందిస్తున్నాయి. 2 లక్షల మంది మహిళలు నిర్వహిస్తున్న ఎంఎస్ఈలు కూడా జెమ్ ప్లాట్‌ఫామ్ ద్వారా రూ.78,000 కోట్ల విలువైన వస్తు సేవలను సరఫరా చేశాయి.

## ఎలాన్ మస్క్ సంపద 749 బిలియన్ డాలర్లు



డెలావేర్ సుప్రీంకోర్టు 139 బిలియన్ డాలర్ల (రూ.12.51 లక్షల కోట్ల) విలువైన టెస్లా స్టాక్ ఆప్షన్లను పునరుద్ధరించడంతో పాటు, 2018లో ఎలాన్ మస్క్‌కు ప్రకటించిన 55 బి.డాలర్ల (రూ.4.95 లక్షల కోట్ల) వేతన ప్యాకేజీకి అనుకూలంగా తీర్పు వెలువరించడంతో.. ఆయన సంపద విలువ ఏకంగా 749 బి.డాలర్ల (రూ.67.41 లక్షల కోట్ల)కు చేరింది. ప్రపంచంలోనే తొలిసారిగా 700 బి.డాలర్లకు పైగా నికర సంపద కలిగిన వ్యక్తిగా మస్క్ రికార్డు సాధించారు. మన దేశంలోని 4 అతి పెద్ద నమోదిత కంపెనీల మార్కెట్ విలువను కలిపినా, మస్క్ సంపద విలువే అధికంగా ఉండటం గమనార్హం. దేశంలో (రిలయన్స్ ఇండస్ట్రీస్ 236 బి.డాలర్లు-రూ.21.24 లక్షల కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 184 బి.డాలర్లు-రూ.16.56 లక్షల కోట్లు, భారతీ ఎయిర్‌టెల్ 142 బి.డాలర్లు-రూ.12.78 లక్షల కోట్లు, టీసీఎస్ 132 బి.డాలర్లు-రూ.11.88 లక్షల కోట్లు).. మొత్తం మార్కెట్ విలువ 694 బిలియన్ డాలర్లు (సుమారు రూ.62.46 లక్షల కోట్ల) కంటే మస్క్ సంపద ఎక్కువ. గూగుల్ సహ వ్యవస్థాపకుడు లారీ పేజ్ ప్రపంచంలోనే రెండో అత్యంత సంపన్నుడిగా (సుమారు 500 బి.డాలర్లు-రూ.45 లక్షల కోట్లు) ఉన్నారు. 600 బి.డాలర్ల సంపద విలువను అధిగమించిన తొలి వ్యక్తిగా రికార్డులకెక్కిన 4 రోజుల్లోపే, మస్క్ సంపద 700 బి.డాలర్ల (రూ.63 లక్షల కోట్ల)ను అధిగమించడం విశేషం.

## ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ చేతికి వైబ్రెంట్ ఎనర్జీ విద్యుత్ విభాగం

**లావాదేవీ విలువ రూ.5,000 కోట్లు!**

దిల్లీ: 1337 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్లను కలిగి ఉన్న వైబ్రెంట్ ఎనర్జీని కొనుగోలు చేయడానికి, ఆస్ట్రేలియాకు చెందిన ఆ కంపెనీ మాతృసంస్థ మాక్వేరీ కార్పొరేట్ హోల్డింగ్, ఇతర వాటాదార్లతో కచ్చితమైన ఒప్పందాలను ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ లిమిటెడ్ చేసుకుంది. నోయిడాకు చెందిన ఐనాక్స్‌జీఎఫ్‌ఎల్ గ్రూప్ కంపెనీ అయిన ఐనాక్స్ క్లీన్ ఎనర్జీ, ఈ ఒప్పంద విలువను వెల్లడించలేదు. పరిశ్రమ వర్గాలు మాత్రం ఈ ఒప్పంద విలువ సుమారు రూ.5,000 కోట్లని చెబుతున్నారు. వైబ్రెంట్ ఎనర్జీ 1337 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉండగా, ఇందులో 800 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. ఈ ప్లాంట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఉన్నాయి.

### కోడి గుడ్లు

22న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 670 | తూ/ప గోదావరి | 690 |
| వరంగల్ | 672 | విశాఖపట్నం | 702 |
| విజయవాడ | 715 | చిత్తూరు | 703 |

## పసిడికి విక్రయాల ఒత్తిడి!

**కమొడిటీస్ ఈ వారం**

### పసిడి



పసిడి ఫిబ్రవరి కాంట్రాక్టుకు ఈవారం రూ.1,33,857 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే. ఒకవేళ రూ.1,33,139 కంటే దిగువన ట్రేడయితే రూ.132,082; రూ.1,30,857కు దిగిరావచ్చు. రూ.1,35,421 స్థాయిని అధిగమిస్తే రూ.1,36,646; రూ.1,37,703 వరకు రాణించొచ్చు. అధిక స్థాయుల వద్ద పసిడి కాంట్రాక్టు విక్రయాల ఒత్తిడిని ఎదుర్కోవచ్చు.

### వెండి



వెండి మార్చి కాంట్రాక్టుకు రూ.1,98,931 వద్ద మద్దతు ఉంది. దీన్ని కోల్పోతే రూ.1,89,424; రూ.1,84,588 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.2,13,274 స్థాయిని అధిగమిస్తే రూ.2,18,100; రూ.2,27,617 వరకు రాణించొచ్చు. రూ.2,03,767 పైన షార్ట్ సెల్లింగ్‌కు వెళ్లకపోవడమే మంచిది.

### ప్రాథమిక లోహాలు



● రాగి డిసెంబరు కాంట్రాక్టు రూ.1,099 కింద ట్రేడయితే.. రూ.1,083.15; రూ.1,070.40 వరకు దిగిరావచ్చు. రూ.1,127.60 ఎగువన ట్రేడయితే మాత్రం రూ.1,140.35; రూ.1,156.20 వరకు పెరగొచ్చు.

● సీసం డిసెంబరు కాంట్రాక్టుకు రూ.182.95 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, రూ.181.95 దిగువన షార్ట్‌సెల్ చేయడం మంచిదే.

● జింక్ డిసెంబరు కాంట్రాక్టుకు రూ.294.35 వద్ద మద్దతు ఉంది. ఈ స్థాయిని కోల్పోతే రూ.287.35; రూ.274.65 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.314.05 స్థాయిని అధిగమిస్తే రూ.326.70; రూ.333.75 వరకు రాణించొచ్చు.

● అల్యూమినియం డిసెంబరు కాంట్రాక్టుకు రూ.286.05 వద్ద నిరోధం ఉంది. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.288.05; రూ.292.15 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.279.85 కంటే కిందకు వస్తే రూ.275.85; రూ.273.75 వరకు దిగిరావచ్చు.


### ఇంధన రంగం



● ముడి చమురు జనవరి కాంట్రాక్టుకు రూ.4,991 వద్ద మద్దతు ఉంది. ఈ స్థాయిని కోల్పోతే రూ.4,878; రూ.4,751 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.5,232 కంటే పైకి వెళితే రూ.5,361; రూ.5,474 వరకు పెరగొచ్చు.

● సహజవాయువు డిసెంబరు కాంట్రాక్టు రూ.319.15 కంటే కింద ట్రేడయితే, రూ.306.40; రూ.287.30 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.351.05 కంటే పైకి వెళితే రూ.370.15; రూ.382.95 వరకు పెరగొచ్చు.

### వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు ఏప్రిల్ కాంట్రాక్టు రూ.15,296 కంటే కిందకు వస్తే రూ.14,936; రూ.14,414 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.16,178 కంటే పైకి వెళితే రూ.16,700; రూ.17,060 వరకు పెరగొచ్చు.

● జీలకర్ర జనవరి కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.21,405 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.21,745; రూ.22,090 వరకు పెరగొచ్చు. ఒకవేళ కిందకు వస్తే రూ.20,720 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.20,375; రూ.20,035 వరకు దిద్దుబాటు కావచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

### గతవారం కదలికలు ఇలా

| కమొడిటీ | ప్రారంభం | ముగింపు | వృద్ధి/క్షీణత |
|---|---|---|---|
| | (రూ.లలో) | | (శాతంలో) |
| పసిడి (ఫిబ్రవరి) | 1,34,204 | 1,34,196 | -0.01 |
| వెండి (మార్చి) | 1,94,747 | 2,08,349 | 7.03 |
| రాగి (డిసెంబరు) | 1,104.25 | 1,114.85 | 0.96 |
| సీసం (డిసెంబరు) | 182.30 | 181.80 | -0.27 |
| జింక్ (డిసెంబరు) | 318.65 | 301.40 | -5.41 |
| అల్యూమినియం (డిసెంబరు) | 278.70 | 283.90 | 1.87 |
| ముడి చమురు (జనవరి) | 5,229 | 5,105 | -2.37 |
| సహజ వాయువు (డిసెంబరు) | 356.10 | 332.00 | -6.77 |
| పసుపు (ఏప్రిల్) | 15,950 | 15,656 | -1.84 |
| జీలకర్ర (జనవరి) | 21,555 | 21,065 | -0.61 |

# సానుకూలతలున్నాయ్ కానీ..

**స్టాక్ మార్కెట్ ఈ వారం**

- స్థిరీకరణకే అవకాశం
- టెలికాం, ఔషధ షేర్లు రాణించొచ్చు
- విశ్లేషకుల అంచనాలు ● 25న క్రిస్మస్ సెలవు

**ఈ వారం ట్రేడింగ్ 4 రోజులే**



దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు ఈ వారం సానుకూల ధోరణితో స్థిరీకరణకు లోనుకావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కంపెనీల ఆదాయ వృద్ధి పుంజుకుంటుండడం, స్థూల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతుండడం ఇందుకు నేపథ్యం. అయితే సమీప భవిష్యత్తులో ఊగిసలాటలు కనిపించొచ్చంటున్నారు. రూపాయి క్షీణతపై ఆందోళనలు, అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం మరింత ఆలస్యమవుతుండడం ప్రభావం చూపించొచ్చని చెబుతున్నారు. ఈ ఏడాది 10% వరకు లాభాలిచ్చిన నిఫ్టీ-50, 2026లో 10-12% రాణించొచ్చని ఓ బ్రోకరేజీ అంచనా వేసింది. ఈ వారం నిఫ్టీ-50కి 25,700 పాయింట్ల వద్ద మద్దతు; 26,200-26,300 వద్ద నిరోధం కనిపించొచ్చని సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా గురువారం సెలవు కావడంతో, ఈ వారం ట్రేడింగ్ 4 రోజులకే పరిమితం కానుంది. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● పెరుగుతున్న ముడి పదార్థాల వ్యయాలు, తగ్గుతున్న ఉక్కు ధరల నేపథ్యంలో **లోహ** సూచీ స్వల్పకాలంలో ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. ఇటీవలి యాంటీ డంపింగ్ డ్యూటీ వల్ల జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్‌కు ప్రయోజనం కలగొచ్చు.

● గత వారం నష్టాల అనంతరం నిఫ్టీ **బ్యాంక్** సూచీ తక్కువ శ్రేణికే పరిమితం కావొచ్చు. తాజా సానుకూల సంకేతాలు లేకపోవడంతో మదుపర్లు అప్రమత్తత పాటించొచ్చు. సూచీకి 58,700 వద్ద మద్దతు ఉంది. 58,470 స్థాయి పైన ఉన్నందున బులిష్ సెంటిమెంటు కొనసాగొచ్చు.

● **టెలికాం** కంపెనీల షేర్లు రాణించొచ్చు. భారతీ ఎయిర్‌టెల్ రూ.2,200 వరకు వెళ్లొచ్చని అంచనా. రూ.2100, రూ.2120 స్థాయుల్లో నిరోధం ఎదురు కావొచ్చు. వొడాఫోన్ ఐడియా షేరు రూ.10.74 పైన ఉన్నందున రూ.12ను మించొచ్చని చెబుతున్నారు.

● **ఐటీ** కంపెనీల షేర్లు చాలా తక్కువ శ్రేణిలో చలించొచ్చు. అమెరికా-భారత్ వాణిజ్య చర్చల పరిణామాలు, రూపాయి కదలికలను మదుపర్లు సునిశితంగా పరిశీలించొచ్చు. యాక్సెంచర్ తన ఆదాయ వృద్ధి అంచనాలను కొనసాగించడం, మన దేశీయ ఐటీ కంపెనీలపై సెంటిమెంటును మెరుగుపరచవచ్చు.

● **ఎఫ్ఎంసీజీ** కంపెనీల షేర్లు కనీసం 10 రోజులు స్థిరీకరణకు లోనుకావొచ్చు. జీఎస్‌టీ తగ్గినా, విక్రయ పరిమాణాల వృద్ధిపై ఆందోళనలు ఇందుకు నేపథ్యం. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ సూచీ 54,000-55,500 శ్రేణిలో కదలాడొచ్చు.

● రూపాయి క్షీణత కాస్తా **చమురు** రిఫైనింగ్ కంపెనీలకు సానుకూలతలను తెచ్చిపెట్టొచ్చు. అయితే మార్కెటింగ్ కంపెనీలైన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీలకు ఇది ప్రతికూల పరిణామమే. చమురు ధరలపై ఒత్తిడి కూడా ఈ రంగ షేర్లపై ప్రభావం చూపించొచ్చు.

● బలహీన సెంటిమెంటు కారణంగా **సిమెంటు** కంపెనీల షేర్లు వచ్చే 2-3 వారాల్లో 5-6% నష్టపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. శ్రీసిమెంట్‌లో విక్రయాల ఒత్తిడి కొనసాగొచ్చని చెబుతున్నారు. అక్టోబరులో సిమెంటు ధరల తగ్గింపు, పెట్ కోక్ ధరల పెరుగుదల వల్ల కంపెనీలకు డిసెంబరు త్రైమాసికంలో తక్కువ లాభాలు రావొచ్చని అంచనా.

● లైసెన్సింగ్ ఒప్పందాలు, ఉత్పత్తి ఆవిష్కరణలు, అమెరికాలో విధాన పరిణామాల వంటివి **ఔషధ** షేర్లకు సానుకూలతలు తీసుకురావొచ్చు. ఈ షేర్లపై మధ్య నుంచి దీర్ఘకాలానికి విశ్లేషకులు బులిష్ ధోరణిలో ఉన్నారు.

● పండగ సీజనులో విక్రయాలు రాణించినా, **వాహన** కంపెనీల షేర్లు స్వల్పకాలంలో హెచ్చుతగ్గులను కొనసాగించొచ్చు. నిఫ్టీ ఆటో సూచీ వరుస నాలుగు వారాల లాభాల అనంతరం గత వారం నష్టాలపాలైంది. 27,250 వద్ద మద్దతు కనిపిస్తోంది.

● ఇప్పటికే అధిక ధరల వద్ద ఉన్నందున **యంత్రపరికరాల** కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. వచ్చే 2-3 ఏళ్లలో బలమైన వృద్ధి కనిపిస్తున్నా.. లాభాలు పరిమితంగానే ఉండొచ్చు. ధరల దిద్దుబాటుకూ అవకాశం లేకపోలేదు.

| వాహన | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| అశోక్ లేలాండ్ | 173.56 | 176.80 | 169.10 |
| బజాజ్ ఆటో | 9002.00 | 9130.70 | 8762.70 |
| ఐషర్ మోటార్స్ | 7217.00 | 7345.00 | 7011.00 |
| హీరో మోటోకార్ప్ | 5781.00 | 5840.30 | 5695.30 |
| ఎం అండ్ ఎం | 3603.60 | 3647.90 | 3537.90 |
| మారుతీ | 16414.00 | 16552.00 | 16260.00 |
| టీవీఎస్ మోటార్ | 3666.00 | 3726.70 | 3561.90 |

| ఎఫ్ఎంసీజీ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| బ్రిటానియా ఇండస్ట్రీస్ | 6103.00 | 6194.00 | 5947.00 |
| కోల్గేట్ పామోలివ్ | 2111.10 | 2137.50 | 2064.90 |
| డాబర్ ఇండియా | 493.95 | 497.10 | 489.90 |
| ఇమామీ | 519.25 | 538.20 | 506.80 |
| హిందుస్థాన్ యునిలీవర్ | 2280.00 | 2297.30 | 2255.10 |
| ఐటీసీ | 401.05 | 403.70 | 398.90 |
| మారికో | 741.20 | 750.00 | 728.20 |

| యంత్రపరికరాలు | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| భెల్ | 275.75 | 280.80 | 270.00 |
| సీజీ పవర్ | 671.60 | 682.30 | 654.30 |
| ఎల్ అండ్ టీ | 4073.50 | 4119.80 | 4017.00 |
| సీమెన్స్ | 3111.60 | 3156.50 | 3042.50 |
| థెర్మాక్స్ | 2869.90 | 2899.30 | 2831.10 |

| బ్యాంకింగ్ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 985.50 | 993.40 | 974.80 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 1354.10 | 1364.70 | 1345.50 |
| ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ | 84.68 | 85.80 | 83.10 |
| ఇండస్ఇండ్ బ్యాంక్ | 844.70 | 858.10 | 824.30 |
| కోటక్‌మహీంద్రా బ్యాంక్ | 2159.50 | 2185.60 | 2143.20 |
| పీఎన్‌బీ | 119.82 | 120.90 | 118.00 |
| ఎస్‌బీఐ | 980.30 | 984.70 | 974.80 |

| ఔషధ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| అరబిందో ఫార్మా | 1225.10 | 1255.20 | 1196.00 |
| బయోకాన్ | 398.55 | 405.90 | 389.80 |
| సిప్లా | 1517.10 | 1535.50 | 1486.30 |
| డాక్టర్ రెడ్డీస్ | 1278.20 | 1304.00 | 1256.00 |
| గ్లెన్‌మార్క్ ఫార్మా | 1992.10 | 2023.90 | 1936.70 |
| నాట్కో ఫార్మా | 916.75 | 955.30 | 893.70 |

| లోహ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| హిందాల్కో | 852.00 | 871.50 | 837.80 |
| హిందుస్థాన్ జింక్ | 588.75 | 600.20 | 572.30 |
| ఎన్ఎండీసీ | 76.30 | 77.30 | 75.20 |
| సెయిల్ | 125.91 | 129.60 | 122.10 |
| టాటా స్టీల్ | 168.69 | 170.50 | 166.90 |
| వేదాంతా | 581.60 | 590.70 | 566.90 |

| చమురు | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 1565.10 | 1586.60 | 1540.20 |
| బీపీసీఎల్ | 365.95 | 370.50 | 359.80 |
| హెచ్‌పీసీఎల్ | 469.75 | 475.40 | 459.70 |
| ఐఓసీఎల్ | 162.60 | 164.50 | 159.50 |
| ఓఎన్‌జీసీ | 232.89 | 234.60 | 230.60 |
| ఆయిల్ ఇండియా | 405.05 | 412.20 | 396.90 |

| ఐటీ | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| హెచ్‌సీఎల్ టెక్ | 1642.40 | 1700.50 | 1603.50 |
| ఇన్ఫోసిస్ | 1638.70 | 1666.20 | 1616.00 |
| పర్సిస్టెంట్ సిస్టమ్స్ | 6358.00 | 6481.70 | 6228.70 |
| టీసీఎస్ | 3282.00 | 3332.00 | 3253.80 |
| టెక్ మహీంద్రా | 1612.50 | 1639.50 | 1581.50 |
| విప్రో | 264.45 | 268.60 | 261.20 |

| సిమెంటు | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| ఏసీసీ | 1751.50 | 1779.20 | 1733.20 |
| అంబుజా సిమెంట్స్ | 539.65 | 544.40 | 532.80 |
| ఇండియా సిమెంట్స్ | 438.00 | 458.90 | 416.20 |
| శ్రీ సిమెంట్ | 25600.00 | 25913.30 | 25203.30 |
| అల్ట్రాటెక్ సిమెంట్ | 11496.00 | 11576.00 | 11402.00 |

| టెలికాం | ప్రస్తుత ధర | నిరోధం | మద్దతు |
|---|---|---|---|
| భారతీ ఎయిర్‌టెల్ | 2,097.70 | 2,131.20 | 2,065.20 |
| ఎంటీఎన్ఎల్ | 36.05 | 37.10 | 35.20 |
| టాటా కమ్యూనికేషన్స్ | 1,824.70 | 1,863.60 | 1,772.60 |
| వొడాఫోన్ ఐడియా | 11.96 | 12.50 | 11.00 |

# అవుతారా దేశ రక్షణ అధికారి!

**ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో అధికారిగా సేవలందించే అవకాశం వచ్చింది. ఇందుకు పెద్ద విద్యార్హతలు అవసరం లేదు. సాధారణ డిగ్రీ చాలు. పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి. ఎంపికైనవారికి ప్రతి నెలా స్టైపెండ్ చెల్లిస్తూ శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత లెవెల్-10 వేతనంతో విధుల్లోకి తీసుకుంటారు. దేశ రక్షణలో భాగం కావాలనుకున్న వారికి కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ) దారి చూపుతుంది. ఇటీవలే ఈ ప్రకటన వెలువడింది.**

రక్షణ రంగంలో అత్యున్నత ఉద్యోగాలు ఆశించేవారు రాయాల్సిన పరీక్షల్లో ముఖ్యమైంది సీడీఎస్ఈ. యూపీఎస్సీ ఏడాదికి రెండు సార్లు దీన్ని నిర్వహిస్తుంది. అందువల్ల నిబద్ధతతో కృషిచేస్తే తక్కువ ప్రయత్నాల్లోనే ఎంపిక కావచ్చు. మొదటి ప్రయత్నంలోనే విజయవంతమైనవారూ ఉన్నారు. పరీక్ష, ఇంటర్వ్యూల్లో 45 శాతం మార్కులు పొందితే కొలువు ఖాయమైనట్లే. 2024(2) రాత పరీక్షలో 300కు ఇండియన్ మిలిటరీ అకాడెమీ(ఐఎంఏ) 117, ఇండియన్ నేవల్ అకాడెమీ(ఐఎన్ఏ) 90, ఎయిర్ ఫోర్స్ అకాడెమీ(ఏఎఫ్ఏ) 126, ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడెమీ(ఓటీఏ) 81 మార్కులు పొందినవారు ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. తుది ఎంపికలో (పరీక్ష+ ఇంటర్వ్యూ) 600కు ఐఎంఏ 241, ఐఎన్ఏ 220, ఏఎఫ్ఏ 248, ఓటీఏ మెన్ 161, ఓటీఏ విమెన్ 166 మార్కుల వరకు అవకాశం లభించింది.



## పరీక్ష

పేపర్‌కు వంద మార్కులు చొప్పున ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ విభాగాల్లో ప్రశ్నపత్రాలు ఉంటాయి. ఒక్కో పేపర్ వ్యవధి 2 గంటలు. మ్యాథ్స్‌లో వంద, మిగిలిన రెండు పేపర్లలోనూ 120 చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. ప్రతి తప్పు సమాధానానికీ ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కుల్లో మూడో వంతు తగ్గిస్తారు. పరీక్షలో అర్హతకు ప్రతి పేపర్‌లోనూ కనీస మార్కులు పొందాలి. ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడెమీ (ఓటీఏ) పోస్టులకే దరఖాస్తు చేసుకున్నవారు మ్యాథ్స్ పేపర్ రాయనవసరం లేదు. అర్హత మార్కులు పొంది మెరిట్‌లో ఉన్నవారిని ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు.

## ఇంటర్వ్యూ

పరీక్షతో సమానంగా ఈ విభాగానికి 300 మార్కులు ఉన్నాయి. ఓటీఏ పోస్టులకే దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూ 200 మార్కులకు ఉంటుంది. ఐదు రోజులపాటు కొనసాగే ముఖాముఖిలో రెండు దశలు ఉంటాయి. మొదటి దశలో అర్హత సాధిస్తేనే రెండో అంకానికి అనుమతిస్తారు. ఇందులోనూ విజయవంతమైతే వైద్య పరీక్షలు నిర్వహించి పరీక్ష, ఇంటర్వ్యూ మార్కుల మెరిట్ ప్రాతిపదికన శిక్షణలోకి తీసుకుంటారు.

## శిక్షణ, ఉద్యోగం

ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడెమీ(ఓటీఏ) ఏ విభాగానికి ఎంపికైనప్పటికీ శిక్షణ వ్యవధిలో ప్రతి నెలా రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. సంబంధిత అకాడెమీల్లో సుమారు 18 నెలల శిక్షణ ఉంటుంది. ఆఫీసర్స్ ట్రెయినింగ్ పోస్టులకు మాత్రం ఈ వ్యవధి 11 నెలలు. శిక్షణ అనంతరం ఆర్మీ, ఓటీఏలో లెఫ్టినెంట్, నేవీలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్ ఫోర్స్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో కెరియర్ ప్రారంభమవుతుంది. ఇవన్నీ సమాన హోదా (లెవెల్ 10) ఉద్యోగాలే. వీరు మొదటి నెల నుంచే అన్నీ కలిపి సుమారు 1.40 లక్షల వేతనం అందుకోవచ్చు. తక్కువ వ్యవధిలో పదోన్నతులుంటాయి. ప్రతిభ, పనితీరు, అనుభవంతో అత్యున్నత స్థాయికీ చేరుకోవచ్చు.

## ప్రణాళిక ఇలా



పరీక్ష తేదీకి ఇప్పటి నుంచీ సుమారు 110 రోజుల వ్యవధి ఉంది. ప్రతి పేపర్‌కూ రోజుకు కనీసం 2 గంటలు చొప్పున కేటాయిస్తూ 80 రోజుల్లో అన్ని అంశాలూ పూర్తయ్యేలా చదవాలి. ఆ తర్వాత గత ప్రశ్నపత్రాలన్నీ తప్పనిసరిగా 10 రోజుల్లో సాధన చేయాలి. తర్వాత రోజుకొకటి చొప్పున 10 రోజులు మాక్ టెస్టులు రాసి, ఫలితాలు సమీక్షించుకుని, సన్నద్ధత మెరుగుపరుచుకోవాలి. చివరి 10 రోజులూ పునశ్చరణ, సందేహ నివృత్తికే కేటాయించాలి.

- ప్రకటనలో పేపర్లవారీ సిలబస్ వివరాలు ఉన్నాయి. వాటినే బాగా చదవాలి.
- పరీక్షలో ఎక్కువ ప్రాధాన్యమున్న, సులువుగా ఉండే అంశాలను ముందుగా నేర్చుకోవాలి.
- పేపర్లవారీగా ఏదో ఒక పుస్తకాన్నే తీసుకుని, బాగా చదివి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేయాలి.
- సులువుగా, తక్కువ వ్యవధిలో సమాధానం ఇవ్వగలిగే ప్రశ్నలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎక్కువ సమయం అవసరమయ్యే ప్రశ్నలను చివరిలోనే ప్రయత్నించాలి. రుణాత్మక మార్కులు ఉన్నాయి కాబట్టి, తెలియని ప్రశ్నలు వదిలేయాలి.

## పేపర్ల వారీ

**మ్యాథ్స్:** 8, 9, 10 తరగతుల గణితం పాఠ్య పుస్తకాలు బాగా చదవాలి. ఆర్ట్స్ విద్యార్థులు మ్యాథ్స్‌లో రాణించడానికి అదనపు సమయం కేటాయించుకోవాలి. ప్రాథమికాంశాలు బాగా చదివి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.

**జనరల్ నాలెడ్జ్:** భారతదేశ చరిత్ర, భౌగోళికశాస్త్రం, పాలిటీ సబ్జెక్టులకు ఎన్‌సీఈఆర్‌టీ 8, 9, 10 తరగతుల పుస్తకాలు మేలు. లూసెంట్ లేదా అరిహంత్ జీకే వీటిలో ఏదైనా సంప్రదించాలి.



సైన్స్ విభాగంలోని ప్రశ్నలకు ఎన్‌సీఈఆర్‌టీ 6-10 తరగతుల పుస్తకాల్లోని ముఖ్యాంశాలు బాగా చదవాలి.

**ఇంగ్లిష్:** 8, 9, 10 తరగతుల ఆంగ్ల పుస్తకాల్లోని వ్యాకరణాంశాలపై దృష్టి సారించాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.

## వివరాలు

**ఖాళీలు:** 451. **విద్యార్హత:** మిలిటరీ అకాడెమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడెమీ పోస్టులకు ఏదైనా డిగ్రీ చాలు. నేవల్ అకాడెమీ ఉద్యోగాలకు బీఈ/బీటెక్ ఉండాలి. ఎయిర్ ఫోర్స్ పోస్టులకు ఏదైనా డిగ్రీతోపాటు ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ అవసరం. డిగ్రీ చివరి ఏడాది విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.

**వయసు:** ఐఎంఏ, ఐఎన్ఏలకు జనవరి 2, 2003 - జనవరి 1, 2008 మధ్య జన్మించినవారు అర్హులు. ఏఎఫ్ఏకు జనవరి 2, 2003 - జనవరి 1, 2007 మధ్య జన్మించాలి. కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్నవారికి గరిష్ఠ వయసులో రెండేళ్ల మినహాయింపు వర్తిస్తుంది. ఓటీఏకు జనవరి 2, 2002 - జనవరి 1, 2008 మధ్య జన్మించినవారు అర్హులు.

**ఆన్‌లైన్ దరఖాస్తులు:** 30.12.2025 సాయంత్రం 6 వరకు స్వీకరిస్తారు.

**దరఖాస్తు ఫీజు:** రూ.200. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ఉండదు.

**పరీక్ష తేదీ:** 12.04.2026. **వెబ్‌సైట్:** https://upsconline.nic.in/

## జీఆర్ఎస్ఈలో అప్రెంటిస్‌లు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్(జీఆర్ఎస్ఈ), కోల్‌కతా.. అప్రెంటిస్‌ల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

▸ ట్రేడ్ అప్రెంటిస్: 120 ▸ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 40
▸ టెక్నీషియన్ అప్రెంటిస్: 60

**ట్రేడులు/విభాగాలు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెకానిక్, సివిల్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్.

**అర్హత:** సంబంధిత విభాగం, ట్రేడ్‌లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉండాలి.

**స్టైపెండ్:** నెలకు ట్రేడ్ అప్రెంటిస్ ఫ్రెషర్లకు మొదటి ఏడాది రూ.8,200, రెండో ఏడాది రూ.9,020. ట్రేడ్ అప్రెంటిస్ ఎక్స్-ఐటీఐకి రూ.9,600 లేదా రూ.10,560. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.12,500- రూ.15,000. టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.10,900. **వయసు:** 01.12.2025 నాటికి ట్రేడ్ అప్రెంటిస్ ఎక్స్-ఐటీఐకి 14- 25 ఏళ్లు, ఐటీఐ ఫ్రెషర్లకు 14- 20 ఏళ్ల మధ్య ఉండాలి. గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌కు 14- 26 ఏళ్ల మధ్య ఉండాలి. **పని ప్రదేశాలు:** కోల్‌కతా, రాంచీ.

**ఎంపిక:** విద్యార్హతల మెరిట్‌తో.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 10-01-2026.

**వెబ్‌సైట్:** https://jobapply.in/grse2025/

## నాన్ టీచింగ్ కొలువులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(ఐఐఎస్ఈఆర్), తిరుపతి.. నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

▸ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్: 01 ▸ మెడికల్ ఆఫీసర్: 01
▸ అసిస్టెంట్ రిజిస్ట్రార్: 01 ▸ నర్సు: 01 ▸ ప్రైవేట్ సెక్రటరీ: 01
▸ సూపరింటెండెంట్: 02 ▸ టెక్నికల్ అసిస్టెంట్: 04
▸ జూనియర్ లైబ్రరీ సూపరింటెండెంట్: 01 ▸ జూనియర్ ట్రాన్స్‌లేటర్: 01 ▸ జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్: 06 ▸ ల్యాబ్ అసిస్టెంట్: 03

**అర్హతలు:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో యూజీ లేదా పీజీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

**మూల వేతనం:** నెలకు గ్రూప్-ఏ పోస్టులకు రూ.56,100, గ్రూప్-బీ పోస్టులకు రూ.35,400, నర్సు, ప్రైవేటు సెక్రటరీ (గ్రూప్-బీ) పోస్టులకు రూ.44,900; గ్రూప్ సీ పోస్టులకు రూ.21,700. జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్(గ్రూప్-సీ) పోస్టుకు రూ.25,500.

**దరఖాస్తు ఫీజు:** గ్రూప్-ఏ పోస్టులకు రూ.1000 (ఎస్సీ/ఎస్టీలకు రూ.500); గ్రూప్-బీ, సీ పోస్టులకు రూ.750 (ఎస్సీ/ఎస్టీలకు రూ.350).

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02-02-2026.

**వెబ్‌సైట్:** https://www.iisertirupati.ac.in/

## ఐఐఎంసీలో నాన్ టీచింగ్ పోస్టులు

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఐఐఎంసీ).. 51 నాన్-టీచింగ్ పోస్టులను భర్తీచేయనుంది. రాత పరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.**

ఉద్యోగాలను మూడు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఏ పోస్టులకు రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలు ఉంటాయి. రాత పరీక్ష, స్కిల్ టెస్టుల్లో ప్రతిభ చూపినవారిని ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. గ్రూప్-బీ, సీ పోస్టులకు రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఉంటాయి. రాత పరీక్షలో అర్హత పొందినవారికి స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు.

మొత్తం పోస్టుల్లో ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న గ్రూప్-బీ, సీ ఉద్యోగాల వివరాలు..

**సెక్షన్ ఆఫీసర్:** ఏదైనా డిగ్రీ, మూడేళ్ల అనుభవం లేదా ఎల్‌డీసీగా ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో ఎనిమిదేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, నోటింగ్ డ్రాఫ్టింగ్ నైపుణ్యాలు ఉండాలి.

**అసిస్టెంట్:** డిగ్రీ, యూడీసీగా మూడేళ్ల అనుభవం ఉండాలి. టైపింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం, నోటింగ్, డ్రాఫ్టింగ్ నైపుణ్యాలు ఉండాలి.

**ప్రొఫెషనల్ అసిస్టెంట్:** లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, రెండేళ్ల అనుభవం ఉండాలి. లేదా లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ, మూడేళ్ల అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.

**జూనియర్ ప్రోగ్రామర్:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌తో బీఈ/బీటెక్. లేదా ఎంసీఏ/ ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్), రెండేళ్ల ప్రోగ్రామింగ్ అనుభవం ఉండాలి. సీ/ సీ++/ జావా లాంగ్వేజస్, మైఎస్‌క్యూఎల్/ ఒరాకిల్ పరిజ్ఞానం ఉండాలి.



**అప్పర్ డివిజన్ క్లర్క్:** డిగ్రీ, ఎల్‌డీసీగా రెండేళ్ల అనుభవం ఉండాలి. ఇంగ్లిష్ టైపింగ్‌లో నిమిషానికి 35 పదాలు లేదా హిందీలో 30 పదాలు టైప్ చేయగలగాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.

**స్టెనోగ్రాఫర్:** డిగ్రీ, ఇంగ్లిష్/హిందీ స్టెనోగ్రఫీలో నిమిషానికి 80 పదాలు రాయగలగాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు/ హిందీలో నిమిషానికి 30 పదాలు టైప్ చేయగలగాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నవారికి ప్రాధాన్యం.

◆ స్కిల్ టెస్ట్‌లో భాగంగా పది నిమిషాల డిక్టేషన్ ఇస్తారు. నిమిషానికి 80 పదాల డిక్టేషన్ తీసుకుని.. దాన్ని 50 నిమిషాల్లో ఇంగ్లిష్‌లోకి, 65 నిమిషాల వ్యవధిలో హిందీలోకి ట్రాన్‌స్క్రిప్ట్ చేయగలగాలి.

◆ ఎంపికైనవారిని దిల్లీ, అమరావతి, ఒడిశా, మిజోరం, కేరళ, జమ్మూలో ఎక్కడైనా నియమించే అవకాశం ఉంటుంది.

**వయసు:** యూడీసీ, స్టెనోగ్రాఫర్ పోస్టులకు 32 సంవత్సరాలు, మిగతా వాటికి 35 ఏళ్లు మించకూడదు.

**దరఖాస్తు ఫీజు:** గ్రూప్-ఏ పోస్టులు: జనరల్/ఓబీసీలకు రూ.1500. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు రూ.750. గ్రూప్-బీ పోస్టులు: జనరల్/ఓబీసీలకు రూ. 1000. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు రూ.500. గ్రూప్-సీ పోస్టులు: జనరల్/ ఓబీసీలకు 500. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు రూ.250.

◆ డీడీని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్' పేరున న్యూదిల్లీలో చెల్లుబాటయ్యే విధంగా తీయాలి. ◆ ముందుగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. దరఖాస్తు కాపీకి సంబంధిత ధ్రువపత్రాలు, డీడీని జతచేసి.. డిప్యూటీ రిజిస్ట్రార్, ఐఐఎంసీ, అరుణా అసఫ్ అలీ మార్గ్, జేఎన్‌యూ న్యూ క్యాంపస్, న్యూదిల్లీ-110067 చిరునామాకు పోస్టులో పంపాలి.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 12.01.2026 **హార్డ్ కాపీల స్వీకరణకు చివరి తేదీ:** 19.01.2026 **వెబ్‌సైట్:** https://iimcnt.samarth.edu.in/

## వర్క్ ఫ్రమ్ హోమ్

### డిజిటల్ మార్కెటింగ్

**సంస్థ:** ఆర్క్‌స్కేల్ గిల్డ్
**నైపుణ్యాలు:** అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కేన్వా, ఫిగ్మా, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, మోషన్ గ్రాఫిక్స్
**స్టైపెండ్:** రూ.5,000-8,000
**దరఖాస్తు గడువు:** జనవరి 16
https://tinyurl.com/ycy3mxnb

### టెలికాలింగ్

**సంస్థ:** సీబీఎస్ వెంచర్స్
**నైపుణ్యాలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, మార్కెట్ అనాలిసిస్, ఎంఎస్-ఎక్సెల్ **స్టైపెండ్:** రూ.4,000-5,000
**దరఖాస్తు గడువు:** జనవరి 16
https://tinyurl.com/5f53c9mm

### ఏఐ వీడియో క్రియేటర్

**సంస్థ:** ఎస్‌సీజీ ఫౌండేషన్ (ఎన్జీవో)
**నైపుణ్యాలు:** ఏఐ ఇమేజ్ జనరేషన్, వీడియో జనరేషన్, వాయిస్‌ఓవర్, చాట్‌జీపీటీ, ఫిల్మోరా, జనరేటివ్ ఏఐ టూల్స్, వీడియో ఎడిటింగ్, వీడియో మార్కెటింగ్
**స్టైపెండ్:** రూ.8,000-10,000

## ఇంటర్న్‌షిప్స్

**దరఖాస్తు గడువు:** జనవరి 16
https://tinyurl.com/4aetusuy

### సోషల్ మీడియా మార్కెటింగ్

**సంస్థ:** ఫిట్‌బే హెల్త్‌కేర్ ప్రై.లి.
**నైపుణ్యం:** ఇంగ్లిష్ రాయడం
**స్టైపెండ్:** రూ.1,000-2,000
**దరఖాస్తు గడువు:** జనవరి 16
https://tinyurl.com/y36u2vy3

### రిటెన్షన్ మార్కెటింగ్

**సంస్థ:** టాపోసెల్
**నైపుణ్యాలు:** అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కేన్వా, క్యాప్‌కట్, కంటెంట్ ఎడిటింగ్, ఫిగ్మా, గ్రాఫిక్ డిజైన్ **స్టైపెండ్:** రూ.7,000-10,000
**దరఖాస్తు గడువు:** జనవరి 16
https://tinyurl.com/263dy6cz

### వీడియో ఎడిటింగ్

**సంస్థ:** ఓంవిన్ **నైపుణ్యాలు:** అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, అడాసిటీ, ఫైనల్ కట్ ప్రో, వీడియో ఎడిటింగ్
**స్టైపెండ్:** రూ.5,000-8,000
**దరఖాస్తు గడువు:** జనవరి 16
https://tinyurl.com/mrbzr2d5

### యూఐ/యూఎక్స్ డిజైన్

**సంస్థ:** అక్రాస్ ద గ్లోబ్ (ఏటీజీ)
**నైపుణ్యాలు:** ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, యూఐపాత్, యూజర్ ఇంటర్‌ఫేస్ డెవలప్‌మెంట్ **స్టైపెండ్:** రూ.2,500-10,000
**దరఖాస్తు గడువు:** జనవరి 16
https://tinyurl.com/4bktrusn

### జాబ్ అప్లికేషన్ కోఆర్డినేటర్

**సంస్థ:** ఏస్ ఫైనాన్షియల్ కన్సల్టింగ్
**నైపుణ్యాలు:** సేల్స్ అండ్ సేల్స్ మేనేజ్‌మెంట్
**స్టైపెండ్:** రూ.5,000-7,000
**దరఖాస్తు గడువు:** జనవరి 16
https://tinyurl.com/3rsuykay

### మాన్యువల్ టెస్టింగ్

**సంస్థ:** ఆర్ఎస్‌వీఆర్ టెక్నాలజీ ప్రై.లి.
**నైపుణ్యాలు:** లాజికల్ రీజనింగ్, మాన్యువల్ టెస్టింగ్ **స్టైపెండ్:** రూ.15,000
**దరఖాస్తు గడువు:** జనవరి 16
https://tinyurl.com/8sz7zpxp

### కాపీరైటింగ్

**సంస్థ:** ఇన్‌అమిగోస్ ఫౌండేషన్ (ఎన్జీవో)
**నైపుణ్యాలు:** కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
**స్టైపెండ్:** రూ.4,000-6,000
**దరఖాస్తు గడువు:** జనవరి 15
https://tinyurl.com/cc3p5zpt

## ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్‌లో..

ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్, న్యూదిల్లీ.. ఇంజినీర్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది.

▸ అసిస్టెంట్ జనరల్ మేనేజర్: 02 ▸ సీనియర్ మేనేజర్: 06
▸ మేనేజర్: 08 ▸ డిప్యూటీ మేనేజర్: 06

**విభాగాలు:** మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, మెటలర్జీ, ఇండస్ట్రియల్, ప్రొడక్షన్.

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో బీఎస్సీ లేదా బీటెక్/బీఈతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

**వేతన శ్రేణి:** అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000-2,60,000. సీనియర్ మేనేజర్‌కు రూ.90,000-2,40,000. మేనేజర్‌కు రూ.80,000- 2,20,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.70,000- 2,00,000.

**వయసు:** అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 44 ఏళ్లు; సీనియర్ మేనేజర్‌కు 40 ఏళ్లు; మేనేజర్‌కు 36 ఏళ్లు; డిప్యూటీ మేనేజర్‌కు 32 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూలతో.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 02.01.2026.

**వెబ్‌సైట్:** https://engineersindia.com/Index

## ఆపరేటర్లు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్), నాసిక్.. తాత్కాలిక ప్రాతిపదికన ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

▸ ఆపరేటర్: 11 పోస్టులు

**విభాగాలు:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఫిట్టర్.. మొదలైనవి.

**అర్హత:** పోస్టులను అనుసరించి పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, జనరల్ నర్సింగ్.

**వయసు:** డిసెంబరు 10, 2025 నాటికి 28 ఏళ్ల లోపు ఉండాలి.

**వేతన శ్రేణి:** నెలకు రూ.22,000 - రూ.23,000.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 31.

ఎంపిక: రాత పరీక్షతో.

**పరీక్ష తేదీ:** జనవరి 11.

వెబ్‌సైట్: https://hal-india.co.in/home

చదువు


కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
**చదువు,** ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

## విదేశాల్లో యూజీకి ఎలాంటి ప్రోత్సాహకాలు?

ఎంపీసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. విదేశాల్లో డిగ్రీ కోర్సులు చదవాలనుంది. ఏ పరీక్షలు రాయాలి? ఉచితంగా చదువుకోవడానికి స్కాలర్‌షిప్పులు లేదా ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ప్రవేశ పరీక్షల మార్కుల మెరిట్‌తో ఫీజు రాయితీ ఇలాంటివి ఏమైనా ఉంటాయా? - శ్రీనివాస్

- ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడే విదేశాల్లో అండర్ గ్రాడ్యుయేషన్ చదవాలన్న ఆలోచన అభినందనీయం. అక్కడ నాణ్యమైన విద్య, పరిశోధనా దృక్పథం, మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వివిధ దేశాల వారితో కలిసి చదవడం వల్ల భిన్న సంస్కృతుల పట్ల అవగాహన ఏర్పడుతుంది. విదేశీ విద్యకు సరైన సమాచారంతో పాటు, ముందస్తు ప్రణాళిక కూడా అవసరం.
- విదేశాల్లో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు దరఖాస్తు చేయాలంటే ప్రధానంగా రెండు రకాల పరీక్షలు అవసరం అవుతాయి. మొదటిది అకడమిక్ అడ్మిషన్ పరీక్షలు. వీటిలో ముఖ్యమైనది స్కొలాస్టిక్ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎస్ఏటీ). అమెరికా, కెనడా, సింగపూర్, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లోని అనేక యూనివర్సిటీలు ఎస్ఏటీ స్కోరుతో అవకాశమిస్తున్నాయి. ఇందులో మ్యాథ్స్, ఇంగ్లిష్ రీడింగ్, రైటింగ్ అంశాలపై ప్రశ్నలుంటాయి. కనీసం 1500 స్కోరు సాధిస్తే అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం లభిస్తుంది. అలాగే స్కాలర్‌షిప్పులకూ అవకాశం ఉంటుంది. కొన్ని అమెరికన్ యూనివర్సిటీలు అమెరికన్ కాలేజ్ టెస్టింగ్ (ఏసీటీ) స్కోరుతోనూ ప్రవేశం కల్పిస్తున్నాయి.



- విదేశీ విద్యకు ఇంగ్లిష్ భాషలో సామర్థ్యం ఉందని నిరూపించుకోవాలి. అందుకోసం ఐఈఎల్‌టీఎస్, టోఫెల్ లాంటి పరీక్షలు రాయాలి. సాధారణంగా ఐఈఎల్‌టీఎస్‌లో కనీసం 7 స్కోరు ఉంటే మేటి సంస్థల్లో ప్రవేశం ఆశించవచ్చు.
- విదేశాల్లో డిగ్రీకి మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో బలమైన పునాది ఏర్పరచుకోవాలి. అదే సమయంలో ఎస్ఏటీ కోసం సన్నద్ధమవుతూ, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. ఇంటర్ రెండో సంవత్సరానికి వచ్చేప్పటికే అంతర్జాతీయ పరీక్షలు రాసి, యూనివర్సిటీలను ఎంపిక చేసుకొని, అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకుంటే విదేశాల్లో డిగ్రీ చదవడం సులభమవుతుంది.
- పలు విశ్వవిద్యాలయాలు మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్పులు ఇస్తున్నాయి. ఇంటర్మీడియట్ మార్కులు, ఎస్ఏటీ స్కోరు, విద్యార్థి అకడమిక్ ప్రొఫైల్ ఆధారంగా ట్యూషన్ ఫీజులో కొంత మినహాయింపు కల్పిస్తారు. అత్యుత్తమ స్కోరు ఉన్న విద్యార్థులకు కొన్ని యూనివర్సిటీల్లో పూర్తి ట్యూషన్ ఫీజు మినహాయింపు కూడా లభిస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించే వివిధ పథకాలను ప్రవేశపెట్టాయి. విద్యార్థులు బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాలకు వడ్డీ సబ్సిడీ అందించే కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉన్నాయి. అలాగే నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ప్రతిభావంతులైన, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు పరిమిత సంఖ్యలో ప్రోత్సాహకాలు అందుబాటులో ఉంటాయి. ఇవి కొంత రుణ భారాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.


సరైన ప్రణాళిక, అకడమిక్ ప్రతిభ, ఎస్ఏటీ వంటి పరీక్షల్లో ఉత్తమ స్కోరు సాధిస్తే, స్కాలర్‌షిప్పులు, ఫీజు రాయితీలతో తక్కువ ఖర్చుతో విదేశీ విద్యను పొందవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

## కరెంట్ అఫైర్స్

### మాదిరి ప్రశ్నలు

◆ అణుశక్తితో నడిచే క్రూయిజ్ క్షిపణి 9M730 బ్యూరెవెస్ట్నిక్‌ను విజయవంతంగా పరీక్షించినట్లు ఇటీవల ఏ దేశ అధ్యక్షుడు ప్రకటించారు? (ఈ క్షిపణి 15 గంటల పాటు నిరంతరం గాల్లోనే ఉండి, 14 వేల కి.మీ. ప్రయాణించినట్లు అధికారులు ప్రకటించారు)



జ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్

◆ అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?

జ: అక్టోబరు 28 (అసోసియేషన్ ఇంటర్నేషనల్ డు ఫిల్మ్ డీ యానిమేషన్ - ASIFA 2002లో అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవాన్ని ప్రారంభించింది.)

◆ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) 2025 గణాంకాల ప్రకారం దేశంలో అత్యంత పరిశుభ్రమైన నగరాల్లో తొలి మూడు స్థానాల్లో ఏవి వరుసగా ఉన్నాయి? జ: పుణె, ముంబయి, నాసిక్

మరింత సమాచారం

◆ మహారాష్ట్రలోని ఏ నగరంలోని రైల్వేస్టేషన్‌కు ఇటీవల ఛత్రపతి శంభాజీనగర్ రైల్వే స్టేషన్ అని పేరు పెట్టారు?

జ: ఔరంగాబాద్ (2022లో ఔరంగాబాద్ నగరం పేరును అధికారికంగా ఛత్రపతి శంభాజీ నగర్‌గా మార్చారు. రైల్వేస్టేషన్ పేరును మాత్రం తాజాగా మార్పు చేశారు.)

# సామాజిక సంబంధాల అల్లిక!

మనిషి సామాజిక జీవి. కానీ ఆ సమాజానికి వేళ్లు, కొమ్మలే బంధుత్వాలు. పుట్టగానే ప్రతి మనిషికీ తన ప్రమేయం లేకుండానే కొన్ని రక్తసంబంధాలు ఏర్పడిపోతాయి. మరికొన్ని పెళ్లి ద్వారా సంక్రమిస్తాయి. ఒక వ్యక్తికి సమాజంలో గుర్తింపును, రక్షణను, బాధ్యతలను పంచే అదృశ్య సూత్రమే బంధుత్వం. అది పుట్టుక నుంచి మరణం వరకు ఒక మనిషిని మరో మనిషితో ముడివేసే సామాజిక గొలుసు. సమాజ నిర్మాణంలో ప్రధాన భాగమైన ఈ బంధుత్వం ప్రాముఖ్యత, ఇందులోని రకాలు, ముఖ్యమైన పదజాలాలపై, ఉదాహరణలతో సహా పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సహజంగా అందరికీ తెలిసిన ఈ అంశాన్ని నిర్మాణాత్మకంగా, శాస్త్రీయ వర్గీకరణల పరంగా అర్థం చేసుకోవాలి.



ఏపీపీఎస్సీ
భారతీయ సమాజం

## బంధుత్వం

ప్రపంచంలోని అన్ని సమాజాల్లో వివాహం, కుటుంబం, బంధుత్వ వ్యవస్థలు ఉంటాయి. ఇవి విశ్వజనీనమైనవి. వాటిలో ఒకదానితో మరొకదానికి అవినాభావ సంబంధం ఉంటుంది. బంధుత్వ వ్యవస్థ వ్యక్తుల మధ్య పరస్పర సంబంధాలను, ప్రేమానురాగాలను పెంపొందించి, సమాజంలో ప్రజలంతా కలిసి కట్టుగా ఉండేందుకు దోహదం చేస్తుంది.

బంధుత్వం అనేది వాస్తవికమైన రక్త బాంధవ్యం మీద లేదా కల్పిత రక్త బాంధవ్యం మీద ఆధారపడిన సామాజిక సంబంధం. సమకాలీన సమాజంలో ఒకే పూర్వీకుడి వంశంలో పుట్టిన వాళ్లను బంధువులుగా లెక్కిస్తారు.

**అర్థం, నిర్వచనం**
రక్త బంధం లేదా వైవాహిక బంధం వల్ల ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడే సంబంధాన్ని బంధుత్వం అంటారు.

బంధుత్వం రెండు రకాలు.. 1) వైవాహిక బంధుత్వం 2) రక్త బంధుత్వం.

వివాహం ద్వారా వైవాహిక బంధుత్వం ఏర్పడుతుంది. ఒక పురుషుడు ఒక స్త్రీని వివాహం చేసుకున్నప్పుడు అది ఇద్దరు సభ్యుల సంయోగం మాత్రమే కాదు, రెండు కుటుంబాల సంయోగం అవుతుంది. అంటే ఒక వివాహం జరిగిన వెంటనే రెండు కుటుంబాల మధ్య బంధుత్వం ఏర్పడుతుంది. ఒక కుటుంబంలో వివాహం ద్వారా బయటి నుంచి కుటుంబంలోకి వచ్చిన సభ్యులు తప్ప మిగతా వాళ్లందరూ రక్త బంధువులు అవుతారు. భార్యాభర్తల మధ్య ఉన్న సంబంధం వైవాహిక బంధుత్వమైతే, తల్లిదండ్రులు వారి పిల్లల మధ్య, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, అన్నచెల్లెళ్లు మొదలైన వారి మధ్య రక్త బంధుత్వం ఉంటుంది. ఒక వంశానుక్రమంలో జన్మించిన వ్యక్తులందరినీ రక్త బంధువులుగా, సజాతీయ బంధువులుగా పరిగణిస్తారు. ఈ సజాతీయ బంధువులు తమ వంశకర్త పురుషుడని భావించినప్పుడు ఆ వంశానుక్రమంలోని బంధుత్వాన్ని పితృ వంశ బంధుత్వం అంటారు. అదేవిధంగా తమ వంశకర్త స్త్రీ అని భావించినప్పుడు, అ వంశానుక్రమాన్ని మాతృవంశ బంధుత్వం అని పిలుస్తారు.

**బంధుత్వ స్థాయి:** బంధుత్వ స్థాయి ఆధారంగా ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

**1) ప్రాథమిక బంధుత్వం:** రక్తసంబంధం ద్వారా లేదా వైవాహిక సంబంధం ద్వారా ఒక వ్యక్తికి, మరొకరికి ప్రత్యక్ష బంధుత్వం ఉంటే వారిద్దరిది ప్రాథమిక బంధుత్వం అవుతుంది. ఇలాంటి బంధువులను ప్రాథమిక బంధువులు అంటారు. ప్రతి వ్యక్తికి ఏడుగురు ప్రాథమిక బంధువులు ఉంటారు. ఒక ప్రాథమిక కుటుంబాన్ని తీసుకుంటే అందులో ప్రధానంగా భార్య-భర్త, తల్లి-కూతురు, అక్క-చెల్లెలు, అన్న-చెల్లెలు, అక్క-తమ్ముడు అనే తొమ్మిది రకాల ప్రాథమిక బంధుత్వ సంబంధాలు ఉంటాయి.

**2) గౌణ బంధుత్వం:** ఒక వ్యక్తి ప్రాథమిక బంధువులకు సంబంధించిన ప్రాథమిక బంధువులే గౌణ బంధువులు లేదా ద్వితీయ బంధువులు అవుతారు. వారి మధ్య ఉన్న సంబంధాన్ని గౌణ బంధుత్వం అంటారు. ఒక వ్యక్తికి మొత్తం మీద 33 మంది ద్వితీయ బంధువులు ఉంటారు. ఉదాహరణకు ఒక కుటుంబంలో తాత-మనవడు, మామ-కోడలు, అత్త-కోడలు, మామ-అల్లుడు లాంటి సంబంధాలన్నీ గౌణ బంధుత్వ సంబంధాలు.

**3) తృతీయ బంధుత్వం:** ఒక వ్యక్తి ద్వితీయ బంధువులకు సంబంధించిన ప్రాథమిక బంధువులు.. ఆ వ్యక్తికి తృతీయ బంధువులు అవుతారు. అలాగే ఒక వ్యక్తి ప్రాథమిక బంధువుకు చెందిన ద్వితీయ బంధువులు.. తృతీయ బంధువులవుతారు. ప్రతి వ్యక్తికి మొత్తంగా 151 మంది తృతీయ బంధువులు ఉంటారు. తాత-మనవడి భార్య, తాత-మునిమనవడు, తాత-మునిమనవరాలు లాంటివన్నీ తృతీయ బంధుత్వాలు.




### బంధుత్వ పరిభాష - వర్గీకరణ

సమాజంలో ప్రతి వ్యక్తికి బంధువర్గం ఉంటుంది. ఒక్కో బంధువుతో ఒక్కో రకమైన బంధుత్వ సంబంధం ఉంటుంది. అతడు ఒక్కో బంధువును ఒక్కో పదంతో సంబోధిస్తాడు. అది వారిద్దరి మధ్య ఉన్న బంధుత్వ సంబంధాన్ని సూచిస్తుంది. ఈ విధంగా వ్యక్తుల మధ్య ఉన్న బంధుత్వ సంబంధాన్ని సూచించే పదజాలాన్ని బంధుత్వ పరిభాష అంటారు. ఈ పదజాలం వ్యక్తుల మధ్య బంధుత్వ సంబంధాల స్వభావాన్ని వ్యక్తీకరిస్తుంది. బంధుత్వ పదజాలాన్ని జార్జి పీటర్ మార్డక్ అనే మానవ శాస్త్రవేత్త మూడు రకాలుగా వర్గీకరించాడు.

**1) ఉపయోగించే విధానం ఆధారంగా..:** ఇందులో బంధుత్వ పదాలను సంబోధన, అన్వయ పదాలుగా వర్గీకరించవచ్చు. ఒక బంధువు మరొక బంధువుతో నేరుగా మాట్లాడుతూ ఉపయోగించేది సంబోధన పదం. అమ్మ, నాన్న, అన్న, అక్క, అత్త అనేవి సంబోధన పదాలు. ఒక బంధువు వేరొక బంధువు గురించి మూడో వ్యక్తితో మాట్లాడుతూ వాడేదే అన్వయ పదం.

**2) భాషా నిర్మితి ఆధారంగా..:** జార్జి పీటర్ మార్డక్ అనే మానవ శాస్త్రవేత్త భాషా నిర్మితి ప్రకారం బంధుత్వ పదాలను వర్గీకృత, వివరణాత్మక, ఉత్పన్న అనే మూడు రకాలుగా వర్గీకరించాడు. **ఎ) వర్గీకృత పదజాలం:** సమాజంలోని విభిన్న వ్యక్తులను వారు రక్త బంధువులైనా లేదా వైవాహిక బంధువులైనా ఒకే బంధుత్వ పదంతో విభిన్న అర్థాలు స్ఫురించే విధంగా సంబోధించవచ్చు. ఉదాహరణకు అంకుల్ అనే పదం వర్గీకృత పదం. ఈ పదాన్ని ఉపయోగించి మామను, చిన్నాన్నను, ఇతర బంధువులను కూడా పిలవవచ్చు.

**బి) వివరణాత్మక పదం:** సంభాషణ జరిపే ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న కచ్చితమైన బంధుత్వాన్ని సూచిస్తుంది. అమ్మ, నాన్న అనే పదాలు వివరణాత్మక బంధుత్వ పదాలు.



మార్డక్

**సి) ఉత్పన్న పదం:** రెండు బంధుత్వ పదాల కలయికతో మరో అర్థాన్ని సూచించే పదం ఉత్పన్నమవుతుంది. తెలుగులో పినతల్లి, పినతండ్రి ఉత్పన్న పదాలు.

**3) అనుబంధ పరిధి ఆధారంగా..:** దీని ప్రాతిపదికగా బంధుత్వ పదాలను సూచిక, వర్గాత్మక పదాలుగా మార్డక్ వర్గీకరించాడు. తల్లి, తండ్రి, భార్య, భర్త అనేవి సూచిక పదాలు. ఈ పదాలు ఒక్కో వ్యక్తికే వర్తిస్తాయి. పిన్ని, తాత, బావ, మామ పదాలు వర్గాత్మక పదాలు. వీటిని ఒకరికంటే ఎక్కువమంది బంధువులను పిలవడానికి వాడతారు.



రచయిత: బద్దం పురుషోత్తంరెడ్డి

## JUNIOR INTER Zoology — THE LIVING WORLD

Final Exams-2026 IMPORTANT Q & A

**2 Marks**

1. **What does ICZN stands for?**

A: International code of zoological nomenclature.

2. **What is biodiversity?**

A: The variation of life at various levels of biological organisation is termed as 'biodiversity'.

3. **What are the basic processes in taxonomy?**

A: The basic processes in taxonomy are....
1. Characterisation
2. Identification
3. Nomenclature and
4. Classification

4. **What is nomenclature in taxonomy, and which process precedes it?**

A: a) The process of naming of animals with universally acceptable scientific name is called nomenclature.

b) The process of precedes the nomencleature is identification.

5. **Define the word systematics. What is the title of Publication of Linnaeus?**

A: a) The branch of Science that deals with the **'vast diversity of life'** is known as systematics.

b) The title of publication of Linnaeus is **Systema Naturae**.

6. **What is binomial nomenclature? Give an example.**

A: a) A type of nomenclature in which each organism is provided with an appropriate scientific name consisting of two components (words) is called binomial nomenclature. b) In the **'Binomen'**, the first word denotes **'Genus'** and the second word denotes **'Species'.e.g.:** *Panthera leo*
Genus species

**1 Mark**

1. **What is the first process in taxonomy?**

A: Characterisation.

2. **The second word in binomial nomenclature represents.**

A: Species.

For more IMP Q & A



Writer: Ravi Charan Kanti

# సాధారణ పనితీరుకు ఆకస్మిక అంతరాయం!

మానవ సమాజ సాధారణ కార్యకలాపాలకు తీవ్రమైన ఆటంకం కలిగించే ప్రధాన సంఘటనలే విపత్తులు. ప్రకృతిపరంగా సంభవించే భూకంపాలు, తుపానులు, సునామీలు, భూపాతాలు, వాతావరణ కారణాలతో వచ్చే వరదలు, దుర్భిక్షాలతో పాటు మానవకారక చర్యలు కూడా విపత్తులుగా పరిణమిస్తుంటాయి. ఆస్తి, ప్రాణ నష్టాలతో పాటు సామాజికంగా, పర్యావరణ పరంగా చేటు చేసే ఈ విపత్తులకు కారణాలు, వాటిని ఎదుర్కొనే చర్యలు, నష్టనివారణ యంత్రాంగం, వ్యవస్థల గురించి పోటీ పరీక్షార్థులకు తగిన పరిజ్ఞానం ఉండాలి. ప్రపంచవ్యాప్తంగా పెను విపత్తుల సంభావ్యత, దేశంలో అందుకు అధిక అవకాశం ఉన్న ప్రాంతాలు, నష్ట తీవ్రతను పెంచే దుర్బలత్వ అంశాలు, ఇప్పటి వరకు ఎదుర్కొన్న అతిపెద్ద వైపరీత్యాల గురించి తెలిసి ఉండాలి.



### విపత్తు నిర్వహణ

## మాదిరి ప్రశ్నలు

1. 'విపత్తు' అనే పదాన్ని ఏ భాష నుంచి గ్రహించారు?
   1) అరబిక్ 2) గ్రీకు 3) లాటిన్ 4) ఫ్రెంచ్

2. "ఒక సమాజ మౌలిక నిర్మాణానికి, సాధారణ పనితీరుకు అంతరాయం కలిగించే ఆకస్మిక లేదా తీవ్ర దురదృష్టమే విపత్తు". ఈ నిర్వచనాన్ని ఎవరు పేర్కొన్నారు.
   1) ప్రపంచ బ్యాంకు
   2) యూఎన్‌ఓ
   3) ఎన్‌డీఎంఏ
   4) ఏడీబీ

3. కింది వాటిలో నిరూపాకార చలనాల వల్ల ఏర్పడే వైపరీత్యానికి ఉదాహరణ...
   1) హిమపాతాలు 2) చక్రవాతాలు
   3) భూకంపాలు 4) వరదలు

4. కింది వాటిలో పర్వత ప్రాంతాల్లో ఏర్పడే వైపరీత్యం ఏది?
   1) భూకంపాలు 2) భూపాతాలు
   3) కుండపోత వర్షాలు 4) పైవన్నీ


5. కింది వాటిలో పర్యావరణ క్షీణత వల్ల ఏర్పడే వైపరీత్యం ఏది?
   1) వరదలు 2) దుర్భిక్షం
   3) భూపాతం 4) భూకంపాలు

6. కింది వాటిలో ప్రకృతిపర, మానవ ప్రేరేపితమైన విపత్తు కానిది ఏది?
   1) అడవుల కార్చిచ్చు 2) దుర్భిక్షం
   3) భూపాతం 4) అగ్నిపర్వతాలు

7. కింది వాటిలో ఆకస్మాత్తుగా సంభవించే (ర్యాపిడ్ ఆన్ సెట్) వైపరీత్యం ఏది?
   1) భూకంపం 2) అగ్నిపర్వతాలు
   3) సునామీ 4) పైవన్నీ

8. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం 1992 నుంచి 2000 మధ్య ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి సగటున ఎన్ని విపత్తులు సంభవించాయి?
   1) 100 2) 300 3) 500 4) 800

9. 1999లో కె.సి.పంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'అత్యున్నతాధికార కమిటీ' దేశంలో ఎన్నిరకాల విపత్తులు గుర్తించింది?
   1) 20 2) 10
   3) 31 4) 21



10. ఏదైనా భౌగోళిక ప్రాంతంలో ప్రజాజీవనానికి, ఆస్తులకు నష్టాన్ని కలగజేసే శక్తి కలిగిన ఆకస్మిక సంఘటన..
    1) విపత్తు 2) దుర్బలత్వం
    3) వైపరీత్యం 4) పైవన్నీ

11. పేదరికం, మౌలిక వసతుల లేమి, భౌతిక వనరుల కొరత లాంటి కారణాల వల్ల ఏదైనా భౌగోళిక ప్రాంతంలో నష్ట తీవ్రతను పెంచే పరిస్థితుల సమూహాన్ని ఆ ప్రాంత ...... అంటారు.
    1) విపత్తు 2) వైపరీత్యం
    3) దుర్బలత్వం 4) పైవన్నీ

12. ఆపద అనే ఫలితాన్ని కింది విధంగా వ్యక్తపరచవచ్చు.
    1) (వైపరీత్యం x సామర్థ్యం)/దుర్బలత్వం
    2) (వైపరీత్యం x దుర్బలత్వం)/సామర్థ్యం
    3) (వైపరీత్యం x సామర్థ్యం/విపత్కర స్థితి
    4) (విపత్కర స్థితి x సామర్థ్యం)/వైపరీత్యం

13. విపత్తు అనేది కింది వాటిలో దేని ఫలితం?
    1) వైపరీత్యం 2) దుర్బలత్వం
    3) విపత్కర స్థితి 4) 1, 2

14. కింది ఏ సందర్భాల్లో వైపరీత్యం విపత్తుగా మారుతుంది?
    1) సమాజంలోని ఒక వర్గ ప్రజల ఆస్తి, ప్రాణ నష్టాలకు వైపరీత్యం కారణమైనప్పుడు.
    2) వైపరీత్యం మానవ సంచారం లేని ప్రాంతాల్లో సంభవించినా, దీర్ఘకాలంలో సమీప మానవ సమాజంలో దాని ప్రభావం ఉన్నప్పుడు.
    3) ప్రభావిత ప్రాంత ప్రజల జీవనోపాధులు దెబ్బతిని నిరాశ్రయులైనప్పుడు.
    4) పైవన్నీ

15. అత్యంత దుర్బలత్వ ప్రాంతంలో, అతితీవ్రత గల వైపరీత్యం సంభవిస్తే అది దేనికి దారితీస్తుంది?
    1) బలమైన విపత్తు 2) బలహీన విపత్తు
    3) ఏ ప్రమాదం ఉండదు 4) చెప్పలేం

16. అంతర్జాతీయ విపత్తు కుదింపు దినోత్సవాన్ని ఏటా ఎప్పుడు నిర్వహిస్తారు?
    1) అక్టోబరు 2
    2) అక్టోబరు 3
    3) అక్టోబరు 12 4) అక్టోబరు 13

INTERNATIONAL DAY FOR DISASTER RISK REDUCTION

17. భారతదేశంలో విపత్తు కుదింపు నిర్వహణ దినోత్సవంగా ఏ రోజును నిర్వహిస్తారు?
    1) అక్టోబరు 18 2) అక్టోబరు 23
    3) అక్టోబరు 26 4) అక్టోబరు 29

18. సార్క్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెంటర్ (SDMC) కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?




    1) ట్రింకోమలై 2) ఢాకా
    3) న్యూదిల్లీ 4) లాహోర్

19. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ స్ట్రాటజీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్ (UNISDR) కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) ప్యారిస్ 2) న్యూయార్క్
    3) టోక్యో 4) జెనీవా

20. కింది వాటిలో దేశంలో తీవ్రమైన భూకంప దుర్బలత్వ ప్రాంతంలోని ప్రదేశాలు..
    1) హిమాలయాలు
    2) గంగా సింధు మైదాన ప్రాంతం
    3) గుజరాత్‌లోని అలియాబండ్ భ్రంశరేఖ
    4) పైవన్నీ

21. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖ పరిధిలో ఉండే బిల్డింగ్ మెటీరియల్స్, టెక్నాలజీ ప్రమోషన్ కౌన్సిల్.. దేశంలోని వైపరీత్య ప్రాంతాల వివరాలతో 'వల్నరబిలిటీ అట్లాస్'ను ఎప్పుడు రూపొందించింది?
    1) 1996 2) 1997 3) 1998 4) 1999

22. బిల్డింగ్ మెటీరియల్స్, టెక్నాలజీ ప్రమోషన్ కౌన్సిల్ (బీఎంటీపీసీ) కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) లఖ్‌నవూ 2) రూర్కి 3) న్యూదిల్లీ 4) చెన్నై

23. కింది వాటిలో ఒక సమాజం 'దుర్బలత్వాన్ని' తెలిపే అంశానికి సంబంధించి సరికానిది?
    ఎ) జనసాంద్రత తక్కువగా ఉండటం.
    బి) మౌలిక వసతులు అధికంగా అభివృద్ధి చెంది ఉండటం.
    సి) ఆ సమాజంలోని నివాస ప్రాంతాలు ఎక్కువ ఎత్తులో ఉండటం.
    డి) పేదరికం, నిరుద్యోగిత స్థాయి తక్కువగా ఉండటం, అక్షరాస్యత స్థాయి అధికంగా ఉండటం.
    ఇ) వైపరీత్య భరిత ప్రాంతానికి దూరంగా ఉండటం.
    1) ఎ, బి, డి 2) ఎ, డి
    3) బి, సి, డి 4) ఏదీకాదు

24. భారతదేశంలో ఏ నెలల్లో వరదలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది?



    1) ఏప్రిల్ - జూన్ 2) జూన్ - డిసెంబరు
    3) మే - అక్టోబరు 4) జూన్ - సెప్టెంబరు

25. ఏదైనా సమాజం ఆ ప్రాంతంలో సంభవించిన వైపరీత్యంతో నష్టపోయిన ఆస్తులు, వనరులు, జీవనోపాధిని పునరుద్ధరించుకోగల నైపుణ్యాలను .... అని పిలుస్తారు.
    1) వైపరీత్యం 2) విపత్తు
    3) దుర్బలత్వం 4) సామర్థ్యం

26. భారతదేశంలో వరదల వల్ల ఏ సంవత్సరంలో దాదాపు 11 వేల మంది మరణించారు?
    1) 1966 2) 1977 3) 1988 4) 1999

27. ఆంధ్రప్రదేశ్‌లో తరచూ వరదలకు లోనయ్యే ప్రాంతాలు?
    1) ఉత్తరకోస్తా ప్రాంతాలు
    2) పెన్నా, డెల్టా ప్రాంతం
    3) సువర్ణముఖి నదీ లోయ ప్రాంతాలు
    4) కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాలు

28. వరద హెచ్చరిక సమాచారాన్ని, వరద ప్రభావిత ప్రాంతాలకు కింది వాటిలో ఏ సాధనాల ద్వారా చేరవేస్తారు?
    1) టెలివిజన్ 2) రేడియో
    3) వార్తాపత్రికలు 4) పైవన్నీ

29. దేశంలో ఎంత శాతం భూభాగం వరదల దుర్బలత్వంలో ఉంది?
    1) 10% 2) 11% 3) 12% 4) 13%

30. దేశంలో ఏ నదీ పరివాహక ప్రాంతం ఎక్కువగా వరద దుర్బలత్వంలో ఉంది?
    1) గంగా 2) యమున
    3) బ్రహ్మపుత్ర 4) గోదావరి

31. బ్రహ్మపుత్ర నదీ వరదలకు ఎక్కువగా ప్రభావితమయ్యే రాష్ట్రం?
    1) అరుణాచల్ ప్రదేశ్ 2) మణిపుర్
    3) అస్సాం 4) పశ్చిమ బెంగాల్

32. దేశంలో భూపాతాల దుర్బలత్వంలో ఎంత శాతం భూభాగం ఉంది?



    1) 15% 2) 16% 3) 18% 4) 17%

33. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా దుర్భిక్షానికి గురయ్యే జిల్లా?
    1) కడప 2) విజయనగరం
    3) ప్రకాశం 4) అనంతపురం

34. ఏజియన్ సముద్రపు ప్రాంతంలో ఏ సంవత్సరం మొదటిసారిగా సునామీ వచ్చినట్లు ఆధారాలున్నాయి?
    1) క్రీ.పూ. 370 2) క్రీ.పూ. 450
    3) క్రీ.పూ. 412 4) క్రీ.పూ. 379

35. భారతదేశంలో తీరప్రాంత దుర్బలత్వ సూచీని ఏ సంస్థ తయారు చేస్తుంది?
    1) ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియానిక్ సర్వీసెస్ (INCOIS)
    2) ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సెంటర్
    3) రియల్ టైం సెస్మిక్ మానిటరింగ్ నెట్‌వర్క్
    4) ఇండియన్ మెటెరోలాజికల్ డిపార్ట్‌మెంట్

36. 'సైక్లోన్' అనేది ఏ పదం నుంచి ఏర్పడింది?
    1) సైక్లాస్ అనే ఫ్రెంచ్ పదం
    2) సైక్లాస్ అనే లాటిన్ పదం
    3) సైక్లాస్ అనే గ్రీకు పదం
    4) సైక్లాస్ అనే అరబిక్ పదం

37. దేశంలో మొత్తం ఎన్ని రాష్ట్రాలు సైక్లోన్ దుర్బలత్వ పరిధిలో ఉన్నాయి?
    1) 15 2) 16 3) 13 4) 14

38. దేశంలో ఎంతశాతం భూభాగం సైక్లోన్ దుర్బలత్వంలో ఉంది?
    1) 4% 2) 9% 3) 10% 4) 11%

**సమాధానాలు**

1-4; 2-2; 3-3; 4-4; 5-2; 6-4; 7-4; 8-2; 9-3; 10-3; 11-2; 12-2; 13-4; 14-4; 15-1; 16-4; 17-4; 18-3; 19-4; 20-4; 21-2; 22-3; 23-4; 24-4; 25-4; 26-2; 27-4; 28-4; 29-3; 30-3; 31-3; 32-1; 33-4; 34-4; 35-1; 36-3; 37-3; 38-1.

ఈనాడు
ప్రతిభ
■ e-mail: support@epratibha.net
17
సోమవారం డిసెంబరు 22, 2025

# మిశ్రమాలు

## ముఖ్యాంశాలు

- రెండు లేదా అంతకంటే ఎక్కువ పరిమాణాలను కలపడం వల్ల ఏర్పడేదే మిశ్రమం.
- ఈ మిశ్రమ పరిమాణాలను శాతాలు లేదా నిష్పత్తిగా తెలపవచ్చు.
- మిశ్రమం యూనిట్ పరిమాణం ధరను 'సగటు ధర'గా పేర్కొంటారు.
- రూ. x కిలో బియ్యాన్ని, రూ. y కిలో బియ్యంతో కలిపి ఏర్పర్చిన మిశ్రమాన్ని రూ. z కిలో బియ్యంగా అమ్మాల్సి వస్తే ఆ రెండు బియ్యాలను కలపాల్సిన నిష్పత్తి $\left(\frac{y-z}{z-x}\right)$

x : y
z (సరాసరి)
y − z : z − x

### మాదిరి ప్రశ్నలు

**1.** 16 లీటర్ల నీళ్లతో గల పాల విలువ లీటర్ రూ.90. స్వచ్ఛమైన పాలు లీటర్‌కు రూ. 108. అయితే ఆ మిశ్రమంలో పాల పరిమాణం ఎంత? (లీటర్లలో)

1) 75 2) 70 3) 85 4) 80

**సాధన:** పాల పరిమాణం x లీటర్లు అనుకుందాం.

$(x + 16) \times 90 = x \times 108$

$90x + 16 \times 90 = 108x$

$16 \times 90 = 18x$

$x = \frac{16 \times 90}{18} = 80$ లీటర్లు.

**అలిగేషన్ పద్ధతి:**

సగటు పాల విలువ రూ. 90, నీటి ధర రూ. 0

పాలు 108 నీరు 0
90
$90 - 0 = 90$ $108 - 90 = 18$

$90 : 18 \Rightarrow 5 : 1$

పాలు, నీటి నిష్పత్తి = 5 : 1

1 నిష్పత్తి = 16 అయితే

5 నిష్పత్తులు $5 \times 16 = 80$

**సమాధానం: 4**

**2.** ఒక క్రికెటర్ పరుగుల సగటు ఇన్నింగ్‌కు 72. తర్వాతి 4 ఇన్నింగ్స్‌ల్లో అతడు 80 పరుగులు మాత్రమే చేయడంతో అతడి బ్యాటింగ్ సగటు 2 మేర తగ్గింది. అయితే చివరి మ్యాచ్ వరకు అతడు ఆడిన మ్యాచ్‌లు ఎన్ని?

1) 104 2) 72 3) 88 4) 90

**సాధన:** చివరి 4 ఇన్నింగ్స్‌లో సగటు పరుగులు $= \frac{80}{4} = 20$


క్రితం సగటు కంటే తక్కువ = 72 − 20 = 52

తరుగుదల = 52 × 4 = 208

తరుగుదల పరుగులు = 2

ఆడిన మొత్తం మ్యాచ్‌లు $= \frac{52 \times 4}{2} = 104$

**సమాధానం: 1**



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

# చివరికి నష్టం వాటిల్లితే.. లాభానికి అమ్మిన బియ్యం?

**3.** ఒక వ్యాపారి 25%, 13% ఆల్కహాల్ కలిగిన మద్యాన్ని ఒక మిశ్రమంగా చేశాడు. ఫలితంగా వచ్చిన మిశ్రమంలో 17% ఆల్కహాల్ ఉంటుంది. మొదటి మిశ్రమం నుంచి 8 లీటర్లు తీసుకుంటే రెండో మిశ్రమం నుంచి ఎంత తీసుకోవాలి?

1) 10 లీ. 2) 16 లీ. 3) 8 లీ. 4) 12 లీ.

**సాధన:** మిశ్రమం I మిశ్రమం II
25% 13%
17%
4% 8%

రెండు మిశ్రమాల నిష్పత్తి = 4 : 8 = 1 : 2

మొదటి మిశ్రమం = 1 నిష్పత్తి = 8 లీటర్లు.

రెండో మిశ్రమం = 2 నిష్పత్తి = 2 × 8 = 16 లీటర్లు.

**సమాధానం: 2**

**4.** ఒక వ్యాపారి 50 కిలోల బియ్యంలో కొంత భాగాన్ని 14% లాభానికి, మిగిలిన దాన్ని 6% నష్టానికి అమ్మాడు. మొత్తం మీద అతడికి 4% నష్టం వచ్చినట్లయితే 14% లాభానికి అతడు ఎన్ని కేజీల బియ్యం అమ్మాడు? (కిలోల్లో)

1) 5 2) 45 3) 8 4) 42

**సాధన:** 14% (−6%)
(−4)
(−4) − (−6) = 2 14 − (−4) = 18

14% లాభానికి, 6% నష్టానికి అమ్మిన బియ్యాల నిష్పత్తి = 2 : 18 = 1 : 9

14% లాభానికి అమ్మిన బియ్యం $= 50 \times \frac{1}{10} = 5$ కిలోలు

**సమాధానం: 1**

**5.** 300 గ్రాముల పంచదార ద్రావణంలో 40% పంచదార ఉంది. ఆ ద్రావణంలో 50% పంచదార ఉండాలంటే ఎంత పంచదార కలపాలి? (గ్రాముల్లో)

1) 40 2) 50 3) 60 4) 70

**సాధన:** 40% 100
50%
50% 10%

ఈ రెండు ద్రావణాలను 5 : 1 నిష్పత్తిలో కలపాలి.

కలపాల్సిన చక్కెర $= \frac{300}{5} \times 1 = 60$ గ్రాములు

**సమాధానం: 3**

**6.** ఒక పాత్రలో 7 భాగాల పాలు, 3 భాగాల నీరు ఉన్నాయి. ఎన్ని భాగాల మిశ్రమం తీసేసి, నీరు కలిపితే ఆ పాత్రలో సగం పాలు, సగం నీళ్లు ఉంటాయి?

1) $\frac{7}{5}$ 2) $\frac{2}{7}$ 3) $\frac{3}{7}$ 4) $\frac{4}{7}$

**సాధన:** తొలుత పాత్రలో x లీటర్ల మిశ్రమం ఉందని అనుకుందాం

పాలు : నీరు $= \frac{7x}{10} : \frac{3x}{10} = 7 : 3$

మిశ్రమం నీరు
$\frac{3}{10}$ 1
$\frac{1}{2}$
$\frac{1}{2}$ $\frac{1}{5}$

లెక్కప్రకారం, నీరు కలిపిన భాగం $= \frac{2}{7}$

**సమాధానం : 2**



రచయిత
హెచ్. అరుణ శివప్రసాద్,
విషయ నిపుణులు

## Word of the Day 868

### *Grisly*

**Telugu meaning:** భీకరమైన, భయపెట్టే

**English meaning:** The word grisly (గ్రిస్లీ) is an adjective that describes something extremely unpleasant, horrifying, or shocking.

**Synonyms:** Ghastly, Horrifying

**Antonyms:** Pleasant, Delightful


**Usage:** 1. The newspaper carried grisly details of the accident that disturbed many readers.

2. Investigators were shocked by the grisly scene revealed during the inquiry.

## కరెంట్ అఫైర్స్



ప్రముఖ భారత శిల్పి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత రామ్ వాంజీ సుతార్ (100) 2025, డిసెంబరు 18న మరణించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన విగ్రహం 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' (సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్)తో పాటు స్టాచ్యూ ఆఫ్ ప్రాస్పరిటీ (కెంపెగౌడ)ల శిల్పాలను ఈయనే రూపొందించారు. పార్లమెంటు ముందు కూర్చొని ఉండే గాంధీ విగ్రహం, ఛత్రపతి శివాజీ విగ్రహం లాంటి ఎన్నో ప్రసిద్ధ శిల్పాలకు రూపకర్త సుతార్.



ప్రముఖ దినపత్రిక ది ఎకనమిక్ టైమ్స్ ఏటా అందించే ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వరించింది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలు, రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు ఆయన్ను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు 'ది ఎకనమిక్ టైమ్స్' ప్రకటించింది. 2026 మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా సీఎం ఈ అవార్డును అందుకోనున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో వన్యప్రాణులు, ప్రజల మధ్య సంఘర్షణను నియంత్రించేందుకు అమలు చేయనున్న హీలింగ్ అండ్ నర్చరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్ ఎయిడ్ అండ్ నర్సింగ్ వైల్డ్‌లైఫ్ (హనుమాన్) ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేసింది. దీనికి 'ఆంధ్రప్రదేశ్ హ్యూమన్-వైల్డ్‌లైఫ్ కాన్‌ఫ్లిక్ట్ మిటిగేషన్ ఫౌండేషన్' అని నామకరణం చేసింది.

తెలంగాణ వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలిగా జస్టిస్ డా. గురజాల రాధారాణి 2025, డిసెంబరు 18న నియమితులయ్యారు. జస్టిస్ జైశ్వాల్ పదవీ విరమణ చేసిన 22 నెలల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆమెను ఈ పదవిలో నియమించింది. జస్టిస్ రాధారాణి తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేశారు. రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలిగా ఆమె పేరును ఎంపిక కమిటీ సిఫారసు చేయగా... హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆమోదించి ప్రభుత్వానికి పంపారు. దీంతో ఆమెను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## శ్రీనివాస రామానుజన్

### శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన భారతదేశానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త. ప్రధానంగా సంఖ్యావాదానికి సంబంధించిన అంశాలపై పరిశోధనలు చేశారు. మ్యాథమెటిక్స్‌లో రామానుజన్‌కు శాస్త్రీయపరమైన శిక్షణ లేనప్పటికీ గణిత విశ్లేషణ, సంఖ్యా సిద్ధాంతం, అనంత శ్రేణి, భిన్నాలు లాంటి విభాగాల్లో పనిచేశారు. తన సొంత ఆలోచనలు, పద్ధతులతో సంక్లిష్టమైన అనేక సమస్యలను పరిష్కరించారు. చిన్నతనంలోనే ఆయిలర్ సూత్రాలు, త్రికోణమితికి చెందిన దత్తాంశాలను స్వయంగా సాధించారు. డిసెంబరు 22న రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



**బాల్యం**


- శ్రీనివాస రామానుజన్ 1887, డిసెంబరు 22న తమిళనాడులోని ఈరోడ్‌లో జన్మించారు. 1892లో ఆయన స్థానిక పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రారంభించారు. మాధ్యమిక విద్యను అభ్యసించేందుకు కుంభకోణంలోని టౌన్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో చేరారు. అక్కడే ఆయనకు గణితం పట్ల ఆసక్తి కలిగింది. సమస్య సాధనకు ఉపయోగించే ఫార్ములాలు, అనుసరించే విధానం మొదలైనవన్నీ ఆయనకు బాగా నచ్చాయి.
- తన గణిత నైపుణ్యాలను ఎక్కువగా స్వీయ శిక్షణ ద్వారానే అభివృద్ధి చేసుకున్నారు. స్థానిక లైబ్రరీలోని గణిత పుస్తకాలను రిఫర్ చేయడం ఆయన రోజువారీ కార్యక్రమం. ఆ క్రమంలోనే సంఖ్యలు, నమూనాల (patterns) పట్ల ఆకర్షితులయ్యారు.

**చివరగా**

గణిత శాస్త్ర అభివృద్ధికి రామానుజన్ ఎనలేని కృషి చేశారు. ఆయన రూపొందించిన 'మ్యాజిక్ స్క్వేర్', 'ప్యూర్ మ్యాథ్స్‌కు చెందిన నంబర్ థియరీ', 'మాక్ తీటా ఫంక్షన్స్' చాలా ప్రసిద్ధి చెందాయి. రామానుజన్ గణిత సిద్ధాంతాలపై నేటికీ ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఆయన 1920, ఏప్రిల్ 26న 32 ఏళ్ల వయసులో మరణించారు. రామానుజన్ గణిత సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం 2012ను 'గణిత సంవత్సరం'గా ప్రకటించింది. అదే ఏడాది నుంచి డిసెంబరు 22న 'నేషనల్ మ్యాథమెటిక్స్ డే'గా నిర్వహిస్తున్నారు.

రామానుజన్ పొందిన అవార్డులు - గౌరవాలు, ముఖ్యమైన పరిశోధనలు తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర




### 1857 సిపాయిల తిరుగుబాటు

**ఆధునిక భారతదేశ చరిత్రలో అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్న చరిత్రాత్మక సంఘటన 1857 తిరుగుబాటు. ప్లాసీ యుద్ధం ముగిసిన వందేళ్లకు ఈ తిరుగుబాటు జరిగింది. దీన్నే చరిత్రకారులు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా, సిపాయిల పితూరీగా, సైనిక-పౌర తిరుగుబాటు పరంపర కలయికగా, విప్లవోద్యమంగా అభివర్ణించారు.**

**రాజకీయ కారణాలు**

- ఆంగ్లేయ అధికారులు తమ పరిపాలనా వ్యవస్థలో భాగంగా భారతదేశంలో ప్రవేశపెట్టిన అనేక విధానాలు, మార్పులు స్వదేశీయుల్లో అనేక మందికి అసంతృప్తిని మిగిల్చాయి.
- ప్రజల విశ్వాసాన్ని పొందడంలో విఫలమైన కంపెనీ పాలనను అంతమొందించడానికి సిపాయిల నేతృత్వంలో తిరుగుబాటు ప్రారంభమైంది.

**తక్షణ కారణం**

1856లో బ్రిటిష్ వారు రాయల్ ఎన్‌ఫీల్డ్ తుపాకులను ప్రవేశపెట్టారు. వీటిలో వాడే తూటాల చివరి భాగాన్ని నోటితో కొరికి ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే ఈ తూటాల చివర ఆవు, పంది కొవ్వు పూసినట్లు వదంతులు వ్యాపించాయి. ఈ కారణంగా భారత సైనికులు తూటాల వినియోగాన్ని వ్యతిరేకించారు.

వివిధ ప్రాంతాల్లో తిరుగుబాటు జరిగిన తీరు, బ్రిటిష్ ప్రభుత్వ విధానంలో మార్పులు, తిరుగుబాటు వైఫల్యానికి కారణాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## Latest Updates

### Graduate Apprentice Posts

Bharat Electronics Limited (BEL), Ghaziabad unit, is inviting applications for the filling of Graduate Apprentice posts in various departments. The total no. of posts is 84. Eligible candidates can apply online before 25 December 2025.

### Jobs In DCIL

Dredging Corporation of India Limited (DCIL), Visakhapatnam, invites applications for the Hydrographic Surveyor, Consultant, etc posts on a contract basis. The total no. of posts is 25. The last date for online applications is 23 December 2025.

### Diploma Apprentice Posts

Bharat Electronics Limited (BEL) is inviting applications for Diploma apprentice posts in various departments at its Ghaziabad unit. The total no. of posts is 90. Eligible candidates can apply online before 30 December 2025.

### Did You Apply..?

*Today (December 22) is the last date for the following Jobs*

- 124 Junior Assistant posts in CBSE. ***Eligibility:*** Inter, Degree, PG, MBA, MA, ICWA.
- 30 Scientist Posts in CSIR-SERC, Chennai. ***Eligibility:*** BE/B.Tech, ME/M.Tech, PG.
- Senior Engineer Jobs in BEL. ***Eligibility:*** BE/B.Tech.

*For more information and other notifications - scan QR code*

## SSC Exams English

### Cloze Test

***Directions (1 - 10):*** *In the following passage, some words have been deleted. Read the passage carefully and select the most appropriate option to fill in each blank.*

Recent scientific studies have revealed a growing environmental and public health concern in India: the presence of inhalable microplastics in the air of major cities such as Delhi, Mumbai, and Bengaluru.

Microplastics are tiny plastic particles measuring less than five millimetres, and their airborne presence indicates that plastic pollution is no longer limited to land and water bodies. Researchers conducting air-quality assessments found that microplastics originate from multiple sources, including vehicle tyre wear, synthetic textile fibres, construction activities, and improper plastic waste disposal. Due to their extremely small size and lightweight nature, these particles can remain ...... (1) ...... in the atmosphere for extended periods and travel long distances. This makes urban populations particularly ...... (2) ......, as prolonged exposure increases the likelihood of inhalation. The health implications of inhalable microplastics are still being studied, but early findings suggest that they may cause respiratory irritation, inflammation, and even long-term lung damage. Once inhaled, microplastics can ...... (3) ...... deep into the respiratory tract, where they may interact with lung tissues. Scientists warn that these particles could also act as carriers of toxic chemicals and pathogens, thereby ...... (4) ...... health risks. A major challenge in addressing this issue lies in the lack of standardized monitoring methods for airborne microplastics. Unlike conventional air pollutants such as PM2.5 and PM10, microplastics are not yet ...... (5) ...... under routine air-quality regulations.

As a result, policy responses remain fragmented and insufficient. Experts argue that tackling airborne microplastic pollution requires a ...... (6) ...... approach involving better waste management, reduced plastic use, and improved urban planning. Public



awareness campaigns can also play a key role in changing consumer behaviour and promoting sustainable alternatives. Moreover, increased investment in scientific research is essential to ...... (7) ...... reliable data on the concentration and composition of airborne microplastics.

The study concludes that unless immediate steps are taken, inhalable microplastics could become an ...... (8)...... environmental threat in Indian cities. Strengthening regulatory frameworks and encouraging inter-agency coordination will be crucial to ......(9) ...... this emerging risk.

Ultimately, addressing this issue is necessary to safeguard public health and ensure long-term ...... (10) ...... of urban environments.

1. A) grounded B) suspended C) dissolved D) absorbed
2. A) immune B) indifferent C) vulnerable D) resistant
3. A) penetrate B) escape C) dissolve D) retreat
4. A) reducing B) neutralising C) amplifying D) eliminating
5. A) regulated B) monitored C) recorded D) prevented
6. A) isolated B) short-term C) fragmented D) comprehensive
7. A) generate B) ignore C) suppress D) distort
8. A) negligible B) emerging C) temporary D) exaggerated
9. A) ignore B) intensify C) mitigate D) delay
10. A) profitability B) stability C) uniformity D) sustainability

*Scan the QR code for Key*

*Writer: P. Manoj Kumar, Subject Expert*

# ఆ ఉపగ్రహాలు కూలితే ఏమవుతాయ్?

- 418 కిలోమీటర్ల ఎత్తులో 'స్టార్‌లింక్'లో తలెత్తిన లోపం

ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ స్టార్‌లింక్ ప్రాజెక్టులో భాగంగా మోహరించిన ఓ ఉపగ్రహం అదుపుతప్పింది. ఈ శాటిలైట్ పేరు స్టార్ లింక్-35956. భూమి నుంచి 418 కిలోమీటర్ల ఎత్తులో ఉన్నప్పుడు ఇందులో సాంకేతిక సమస్య తలెత్తింది. ఇది త్వరగా పడిపోతూ భూమివైపునకు దూసుకొస్తోంది. మరి ఈ ఉపగ్రహంతో ప్రమాదం పొంచి ఉందా..?

స్టార్‌లింక్ ప్రాజెక్టును 2015లో స్పేస్‌ఎక్స్ ప్రారంభించింది. ఇంటర్నెట్ సేవల కోసం నిర్మించిన వేలాది ఉపగ్రహాల సమూహమిది. ప్రపంచవ్యాప్తంగా హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించడం, ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు సేవలను అందించడం దీని ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా భారీ సంఖ్యలో ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపుతోంది. తొలి దశలో 12 వేల వరకు పంపాలన్నది సంస్థ ప్రణాళిక. ప్రస్తుతం 9,357 గ్రహాలు కక్ష్యలో ఉన్నాయి. ఇందులో 9,357 పని చేస్తున్నాయి. దీర్ఘకాలంలో 42 వేల ఉపగ్రహాలను స్పేస్‌ఎక్స్ మోహరించనుంది.

### వీటి జీవితకాలమెంత

స్టార్‌లింక్ ఉపగ్రహాలకు దాదాపు 5 సంవత్సరాల జీవితకాలం ఉంటుంది. పాతవి అయిపోతే ఉద్దేశపూర్వకంగా డీఆర్బిట్ చేస్తారు. స్టార్ లింక్-35956 మాత్రం అదుపుతప్పింది. ప్రస్తుతం స్టార్ లింక్‌లో 9,000+ ఉపగ్రహాలు ఉన్నాయి. రోజుకు 1-2 సాధారణంగా పడిపోతాయి. ఇవి భూమికి దగ్గరగా (భూ దిగువ కక్ష్యలో) తిరుగుతాయి.



### ఎందుకిది విఫలమైంది

ప్రొపల్షన్ సిస్టమ్‌లో సమస్య కారణంగానే అని అనుమానిస్తున్నారు. ఇతర వస్తువుతో ఢీకొట్టలేదని చెబుతున్నారు. అయితే ఇది అరుదైన సంఘటన. ఈ ఉపగ్రహాల్లో 3 శాతం వరకు విఫలమవ్వడం సాధారణమే అయినా ఈ స్టార్ లింక్-35956 మాత్రం శకలాలను వెదజల్లింది. అంటే అంతరిక్షంలోకి చెత్తను విడుదల చేసింది.

### ఇది ప్రమాదమా

ఈ శకలాలతో అంతరిక్ష పర్యావరణానికి పెద్దగా హాని కలగదంటోంది స్పేస్‌ఎక్స్. శాస్త్రవేత్తలూ అదే మాట చెబుతున్నారు. భవిష్యత్తులో వీటిని భారీగా మోహరిస్తే మాత్రం రిస్క్ శాతం పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### ఐఎస్ఎస్‌కు ముప్పుందా

ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)కైతే ఎలాంటి ప్రమాదం లేదు. ఎందుకంటే ఈ ఉపగ్రహం ఐఎస్ఎస్ కంటే తక్కువ ఎత్తులో ఉంది. కాబట్టి ఇవి ఢీకొనే అవకాశాల్లేవ్.

### పూర్తిగా కాలిపోతాయా

అవును, చాలావరకు వాతావరణంలోనే కాలిపోతాయి. భూమిపై పడే ప్రమాదం చాలా తక్కువ. 2024లో మాత్రం ఒక అల్యూమినియం ముక్క కెనడాలో పడింది. సాధారణంగా ఇవి సురక్షితం.

### స్పేస్‌ఎక్స్ ఏమంటోంది

సమస్యను తీవ్రంగా తీసుకుంటున్నామని చెబుతోంది. ఒత్తిడి పెరగడం లేదా ప్రొపల్షన్ విఫలమవ్వడం వలన ఈ ప్రమాదం జరిగి ఉంటుందని చెబుతోంది. ఉపగ్రహం నుంచి కొన్ని శకలాలు విడుదలయ్యాయని, అవి నెమ్మదిగా కదులుతున్నాయని చెబుతోంది. ఒక్కసారిగా ఉపగ్రహం నాలుగు కిలోమీటర్ల కిందకు దూసుకొచ్చిందని పేర్కొంది. వారం రోజుల్లో భూ వాతావరణంలోకి వచ్చి కాలిపోవచ్చని వెల్లడించింది. - నేషనల్ డెస్క్





# సైసై జోడెడ్లా బండి.. జాతరకు పోదాం పదండి

ఈటీవీ భారత్: ఒకప్పుడు గ్రామీణ జీవితంలో విరివిగా కనిపించిన ఎడ్లబండ్లు, జాతర్లలో చెక్క ఊయలల రంగులరాట్నాలు ఇప్పుడు కనుమరుగు అవుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని రత్లాం జిల్లాలో జరిగే ఒక ప్రత్యేక జాతరకు వెళితే మాత్రం కాలయంత్రంలో మళ్లీ పాత రోజులకు వెళ్లినట్టుగా ఉంటుంది. బిబడోంద్ గ్రామ జాతరకు అందరూ తమ వాహనాలు వదిలి ఎడ్లబండ్లపైనే వెళతారు. దాదాపు 300 ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఉత్సవానికి నాలుగు కిలోమీటర్లు వెళ్లి.. మళ్లీ వచ్చేందుకు రూ.5,000 వరకు ఎడ్లబండి కిరాయిని చెల్లిస్తారు. ఈ ఎడ్లబండ్లను ముందుగానే బుక్ చేసుకుంటామని జాతరకు వచ్చిన మయాంక్ కొఠారి తెలిపారు. అంతేకాదు.. చెక్క ఊయలల రంగులరాట్నాలు కూడా ఇక్కడ చూడవచ్చు. గ్రామంలో ఉన్న ఆదినాథుని పురాతన జైన మందిరంలో ఏటా మాఘమాసం అమావాస్య రోజున ఈ జాతర జరుగుతుంది.

# పీకేతో ప్రియాంక భేటీ.. మతలబేంటి?

ఈటీవీ భారత్: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ వాద్రాతో రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) భేటీ కావడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ నెల 15న దిల్లీ వేదికగా దాదాపు రెండు గంటల పాటు జరిగిన వీరి ప్రైవేటు సమావేశంలో ఏయే అంశాలపై చర్చించారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ కోసం ఒక ప్రధాన ప్రాజెక్టును ప్రశాంత్ కిశోర్ చేపడతారనే ప్రచారం ప్రస్తుతం మొదలైంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో హస్తం పార్టీకి పీకే చేదోడుగా నిలిచే అవకాశాలు ఉన్నాయనే అంచనాలు కూడా వెలువడుతున్నాయి.



ప్రియాంక నాయకత్వంపై పీకేకు గురి!

### భేటీపై ప్రియాంక ఏమన్నారంటే..

ప్రశాంత్ కిశోర్‌తో భేటీపై ప్రియాంకాగాంధీని ఇటీవల పార్లమెంటు శీతాకాల సమావేశాల వేళ మీడియా ప్రశ్నించింది. 'ఇది కూడా ఒక ప్రశ్నేనా?' అంటూ ఆమె సమాధానాన్ని దాటవేశారు. "కేంద్ర ప్రభుత్వం లోక్‌సభను ఎందుకు పనిచేయనివ్వడం లేదు. సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయం ఎందుకు కలిగిస్తోంది? ఈ విషయాలపై మీరు ఎందుకు ప్రశ్నలు అడగరు?" అని ప్రియాంక ఎదురు ప్రశ్నించారు.

ప్రియాంకాగాంధీ రాజకీయంగా ప్రతిభావంతురాలు అని ప్రశాంత్ కిశోర్ గతంలో చాలాసార్లు కొనియాడారు. రాహుల్‌గాంధీతో పోలిస్తే ఆమెతోనే పీకే చనువుగా ఉంటారు. రాజకీయ అంశాలపై ఆమెతో స్వేచ్ఛగా చర్చిస్తుంటారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి బలమైన గొంతుకలుగా రాహుల్, ప్రియాంక ఉన్నారు. వారికి రాజకీయ గురువుగా తల్లి సోనియాగాంధీ వ్యవహరిస్తున్నారు.

### భేటీ ఎందుకంటే..!

ప్రశాంత్ కిశోర్‌కు కాంగ్రెస్‌తో పాటు విపక్ష ఇండియా కూటమిలోని అన్ని పార్టీల అగ్రనేతలతోనూ బలమైన సంబంధాలు ఉన్నాయి. తమిళనాడు సీఎం స్టాలిన్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీలకు కూడా ఆయన సన్నిహితుడే. కేరళ, అస్సాం రాష్ట్రాల రాజకీయ సమీకరణాలపైనా పీకేకు మంచి అవగాహన ఉంది. ఇటీవలే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. దీంతో ఆ కూటమి ఉనికి ప్రశ్నార్థకంగా మారిందనే వాదన మొదలైంది. ఈ నేపథ్యంలో పీకే సుదీర్ఘ అనుభవాన్ని, విస్తృత రాజకీయ పరిచయాలను వినియోగించుకోవాలనే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉండొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రియాంకాగాంధీతో ఆయన భేటీ అయి ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్ రాజకీయ ప్రణాళికలు, సమీకరణాలపై వారి మధ్య చర్చ జరిగి ఉండొచ్చని చెబుతున్నారు.

### పీకే సంకల్పం అదే..: జన్ సురాజ్

ప్రియాంకాగాంధీతో పీకే భేటీపై జన్ సురాజ్ పార్టీ బిహార్ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతిని 'ఈటీవీ భారత్' పలు ప్రశ్నలు అడిగింది. భాజపాకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలనే ప్రశాంత్ కిశోర్ విజన్ ఈ మీటింగ్‌లో స్పష్టంగా కనిపిస్తోందని మనోజ్ చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో కమలదళానికి బిహార్ తరహా గెలుపు దక్కకుండా అడ్డుకోవాలనే సంకల్పంతో పీకే ఉన్నారని పేర్కొన్నారు.



కేరళ రాజధాని తిరువనంతపురంలోని ఓ కేథలిక్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ ట్రీ

# 'శాంతి' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

దిల్లీ: అణు రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వీలుగా తీసుకొచ్చిన సస్టెయినబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి) బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఇటీవల పార్లమెంటులో నెగ్గిన ఈ బిల్లుకు శనివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని ఆదివారం విడుదలైన ప్రభుత్వ నోటిఫికేషన్ వెల్లడించింది. పౌర అణు రంగానికి సంబంధించిన అన్ని చట్టాలను ఇది డీల్ చేయడంతోపాటు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించనుంది. కొత్త చట్టం రాకతో ద ఆటమిక్ ఎనర్జీ చట్టం-1962, సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజీ చట్టం-2010 రద్దవుతాయి.

✦ కొత్త చట్టం ద్వారా ప్రైవేటు కంపెనీలు, జాయింట్ వెంచర్లు.. అణు విద్యుత్తు ప్లాంట్లను సొంతంగా నిర్మించడంతోపాటు నిర్వహించవచ్చు. దీనికోసం ప్రభుత్వం నుంచి లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుంది.

✦ అయితే యురేనియం, థోరియంల వెలికితీత, వాటి శుద్ధి, ఐసోటోపిక్ సపరేషన్, స్పెంట్ ఇంధన రీప్రాసెసింగ్, హైలెవెల్ రేడియోయాక్టివ్ వ్యర్థాల నిర్వహణ, భారజల ఉత్పత్తి వంటివి మాత్రం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోగానీ, ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలోగానీ చేస్తారు.



దిల్లీలో వాయు కాలుష్యం నేపథ్యంలో శాంటాక్లాజ్ దుస్తులు ధరించి ప్రజలకు మాస్కులు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్‌యూఐ సభ్యులు

# వెస్ట్‌బ్యాంక్‌లో కొత్తగా 19 సెటిల్మెంట్లు

- ఏర్పాటుకు ఇజ్రాయెల్ క్యాబినెట్ ఆమోదం

టెల్ అవీవ్: ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో 19 కొత్త సెటిల్మెంట్లను ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనకు ఇజ్రాయెల్ క్యాబినెట్ ఆదివారం ఆమోదం తెలిపింది. 2005లో ఉపసంహరణ ప్రక్రియలో భాగంగా ఖాళీ చేసిన రెండు సెటిల్మెంట్లు కూడా ఈ ప్రణాళికలో భాగంగా ఉన్నాయని ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెట్జలెల్ స్మోట్రిక్ తెలిపారు. కొత్తగా ప్రతిపాదించినవాటి నిర్మాణం పూర్తయితే.. వెస్ట్‌బ్యాంక్‌లో గత రెండేళ్లలో ఏర్పాటుచేసిన సెటిల్మెంట్ల సంఖ్య 69కి, మొత్తం సెటిల్మెంట్ల సంఖ్య 210కి పెరుగుతుందని చెప్పారు.

# నిరసనలకు ఇమ్రాన్ ఖాన్ పిలుపు.. రావల్పిండిలో భారీగా బలగాల మోహరింపు

ఇస్లామాబాద్: తోషాఖానా-2 కేసులో తనకు, తన భార్య బుష్రా బీబీకి 17 ఏళ్ల జైలుశిక్ష ఖరారైన నేపథ్యంలో దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలకు పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ పిలుపునిచ్చారు. ఈ కేసులో మిలిటరీ తరహా విచారణ నిర్ణయం వెలువడిందని విమర్శించారు. ఇమ్రాన్ 'ఎక్స్' ఖాతాలో ఆదివారం తెల్లవారుజామున ఈ మేరకు పోస్టు కనిపించింది. ఎప్పుడు, ఎక్కడ నిరసనలు చేపట్టాలనే వివరాలు మాత్రం అందులో లేవు. ప్రస్తుతం ఇమ్రాన్ కారాగారంలో ఉన్నారు. సామాజిక మాధ్యమాలను వినియోగించే వెసులుబాటు ఆయనకు లేదు. ఈ నేపథ్యంలో.. 'ఎక్స్'లో పోస్టు పెట్టిందెవరనేది ప్రస్తుతానికి తెలియరాలేదు. అయితే ముందుజాగ్రత్త చర్యగా రావల్పిండిలో ప్రభుత్వం భారీగా బలగాలను మోహరించింది.

# ఆరెస్సెస్‌కు రాజకీయ ఎజెండా లేదు

- సంఘ్‌కు శత్రువులెవరూ లేరు
- మోహన్ భాగవత్ స్పష్టీకరణ



కోల్‌కతా: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు (ఆరెస్సెస్) ఎటువంటి రాజకీయ ఎజెండా లేదని, ఆ కోణంలో చూడటం తప్పని ఆ సంస్థ అధినేత మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. సంస్థపై కొన్ని వర్గాల ప్రజల్లో కొన్ని అపోహలున్నాయని, దీనివల్ల తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కోల్‌కతాలోని సైన్స్ సిటీ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

'సంఘ్‌కు శత్రువులెవరూ లేరు. కానీ సంస్థ ఎదుగుదలతో సంకుచిత మనస్తత్వాలున్నవారి దుకాణాలు మూతపడతాయని కొందరి భయం. ఆరెస్సెస్‌పై అభిప్రాయాలను వెల్లడించడంలో ప్రజలకు స్వేచ్ఛ ఉంది. అయితే అవి వాస్తవాలకు అనుగుణంగా ఉండాలి. ఊహాజనితంగా, సెకండరీ సోర్స్ ఆధారంగా ఉండకూడదు. ఈ విషయంలో ప్రజలకు వాస్తవాలను ప్రజలకు వివరించేందుకే దేశవ్యాప్తంగా నాలుగు నగరాల్లో ప్రసంగాలను ఏర్పాటు చేశాం' అని భాగవత్ తెలిపారు.

### హిందూ సమాజం అభివృద్ధికే..

హిందూ సమాజం అభివృద్ధి, పరిరక్షణకే ఆరెస్సెస్ పని చేస్తోందని భాగవత్ స్పష్టం చేశారు. 'భారత్ మళ్లీ విశ్వ గురువుగా అవతరించనుంది. ఈ ప్రక్రియలో ప్రజలను సంసిద్ధులను చేయడానికి సంఘ్ పని చేస్తుంది. ఇందులో భాగంగానే కోల్‌కతా, దిల్లీ, ముంబయి, బెంగళూరులలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. హిందూ సమాజ శక్తిని మేల్కొలుపుతాం. అది కచ్చితంగా జరిగి తీరుతుంది. వికసిత భారతమూ సంభవమే. అది కొంత మంది చెడ్డవారికి నచ్చడం లేదు. అందువల్లే సంఘ్‌లాంటి సంస్థలపై దుష్ప్రచారం చేస్తున్నారు' అని పేర్కొన్నారు.

### పొరుగు మంచిగుంటే మనమూ..

'గతంలో భారత్‌లో భాగంగా ఉన్న పొరుగు దేశాల్లో సుస్థిర పరిస్థితులుంటే మనకూ మంచిదే. అటువంటి అంశాల్లో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది. అయితే సమాజాలు, ప్రజల మధ్య సంబంధాల కోసం సంఘ్ కృషి చేస్తుంది' అని భాగవత్ తెలిపారు.

### స్వదేశీకి ఊతమివ్వాలి

మన దేశంలో తయారయ్యే వస్తువులను విదేశాల నుంచి తెచ్చుకోవడం సబబు కాదని భాగవత్ అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా స్వదేశీ ఉద్యమానికి ఊతమివ్వాలని పిలుపునిచ్చారు. విదేశీ భాషలకు బదులు మాతృభాషను వాడాలని సూచించారు. 'మీరు బెంగాలీ ప్రజలైతే.. ఇంటి ముందు వెల్‌కమ్‌కు బదులుగా స్వాగతం అని బోర్డులు పెట్టండి' అని సూచించారు.

✦ దేశంలోని సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలను సందర్శించాలని భాగవత్ పిలుపునిచ్చారు. దేశంలో చూడదగ్గ ప్రదేశాలు చాలా ఉన్నాయని వివరించారు.

✦ రాజ్యాంగంలోని మూల సూత్రాలను, పీఠికను, ప్రాథమిక విధులను ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు.

# ఆరెస్సెస్ చేతికి భారతీయ గణాంక సంస్థ

- రాహుల్ ధ్వజం

దిల్లీ: భారతీయ గణాంక సంస్థ (ఐఎస్ఐ) క్రమంగా ఆరెస్సెస్ చేతుల్లోకి వెళ్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. సంస్థలు విజ్ఞానం, సైన్స్ ఆధారంగా నడవాలిగానీ, సిద్ధాంతాల ఆధారంగా కాదని స్పష్టం చేశారు. ఇటీవల ఆ సంస్థ విద్యార్థులతో పార్లమెంటు ఆవరణలో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆదివారం ఆయన తన వాట్సప్ ఛానల్‌లో పోస్టు చేశారు. 'నేను గణాంక సంస్థ విద్యార్థులతో సమావేశమయ్యా. క్రమంగా తమ సంస్థను సంస్థాగతపరంగా తన చేతుల్లోకి తీసుకుంటోందని వారు చెప్పారు' అని రాహుల్ పేర్కొన్నారు.




'భారతీయ గణాంక సంస్థ సాధారణ సంస్థ కాదు. అది గణాంకాలు, గణితం, ఆర్థికం, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, పాలసీ తయారీలో అత్యున్నత పరిశోధనలు చేస్తోంది. అంతేకాకుండా ప్రపంచ స్థాయి నిపుణులను దేశానికి అందిస్తోంది' అని రాహుల్ పేర్కొన్నారు.

'విద్యావేత్తలతో నడవాల్సిన విద్యా సంస్థలు.. ప్రస్తుతం బ్యూరోక్రాట్ల ప్రభావం, సైద్ధాంతిక జోక్యాన్ని ఎదుర్కొంటున్నాయి. సిలబస్, పరిశోధనలను ఆరెస్సెస్ సిద్ధాంతాలు నియంత్రిస్తున్నాయి. ఇది విద్యా సంస్కరణ కాదు. విద్యా వ్యవస్థను బలహీనపరిచే కుట్ర. ఫలితంగా యువత భవిష్యత్తు చీకట్లోకి వెళ్తోంది. ఈ విద్యా సంస్థలను ప్రైవేటీకరించడంతోపాటు వాటి ఆస్తులను అమ్మేస్తారు. ఇది సంస్థలపై దాడే కాదు. దేశ మేధోపరమైన స్వేచ్ఛపై దాడి. సైంటిఫిక్ టెంపర్‌మెంట్, యువత భవిష్యత్తుపై దాడి. దీనిని కొనసాగనివ్వం' అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# నా దృష్టిలో వారే గొప్ప దౌత్యవేత్తలు: జైశంకర్

ఇంటర్నెట్ డెస్క్: 'నా దృష్టిలో శ్రీకృష్ణుడు, హనుమంతుడు గొప్ప దౌత్యవేత్తలు. రామాయణంలోని ప్రజాపాలన, సంక్లిష్ట పరిస్థితులు, రాజకీయ వ్యూహాలు మన పరిపాలనా విధానాలను తెలియజేస్తాయి. ఆ సమయంలో హనుమంతుడు దౌత్యవేత్తగా తన విధులను ఎంతో చక్కగా నిర్వహించారు. సీతలో మనోధైర్యాన్ని, రావణుడిలో భయాన్ని నింపాడు. మహా భారతంలో శ్రీకృష్ణుడు.. కౌరవులు, పాండవుల మధ్య సంధి కోసం ప్రయత్నించాడు. యుద్ధంలో ధర్మంవైపు నిలిచాడు. అంతకంటే గొప్ప దౌత్యవేత్తలను మనం ఇంకెక్కడ చూడగలం. వారిని ఆదర్శంగా తీసుకుని నేను ప్రధాని మోదీ నాయకత్వంలో ముందుకు వెళ్తున్నా' అని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. పుణెలోని పుస్తక మహోత్సవంలో ఆయన మాట్లాడారు. భారత్‌కు వ్యూహాత్మక రాజకీయాలు, రాజ్య నిర్వహణ తెలియవని అనేక మంది విదేశీ రచయితలు పుస్తకాల్లో రాసిన వ్యాఖ్యలను పదేపదే చదివి విసిగిపోయానని, మనమంతా సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పాటిస్తూ పెరిగామని, ఎన్నో ఏళ్లుగా భారత్ పాటిస్తున్న రాజనీతిని ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంటున్నానని స్పష్టం చేశారు.



మహారాష్ట్రలోని పుణెలో నిర్వహించిన సాహిత్య ఉత్సవంలో పుస్తకాలను పరిశీలిస్తున్న విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్

# జెనీవాలోని భారత శాశ్వత మిషన్‌లో రూ.2 కోట్ల అక్రమ మళ్లింపు

- అధికారిపై కేసు నమోదు చేసిన సీబీఐ

దిల్లీ: జెనీవాలోని భారత శాశ్వత మిషన్‌లో రూ.2 కోట్ల నిధుల అక్రమ దారిమళ్లింపు చోటుచేసుకుంది. ఈ వ్యవహారానికి సంబంధించి.. అక్కడ గతంలో అకౌంట్స్ అధికారిగా పనిచేసిన మోహిత్‌పై సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. మోహిత్ ఆ నిధులను క్రిప్టో-గ్యాంబ్లింగ్ వ్యాపారాల కోసం వినియోగించాడని అధికారులు తెలిపారు. జెనీవాలోని భారత శాశ్వత మిషన్‌లో మోహిత్ 2024 డిసెంబరులో అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా చేరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ (యూబీఎస్)కు చెల్లింపు సూచనలను భౌతికంగా సమర్పించే బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఒకే బ్యాంకు చెల్లింపు సూచనల పత్రం కింద అనేక క్యూఆర్ కోడ్‌లను జతచేయడం సాధారణ పద్ధతి. దాన్ని ఆధారంగా చేసుకుని మోహిత్ కొందరు విక్రేతల క్యూఆర్ కోడ్‌ల స్థానంలో సొంత క్యూఆర్ కోడ్‌లను చేర్చాడు. దాంతో చెల్లింపులు మొత్తం తన వ్యక్తిగత ఖాతాకు మళ్లించుకున్నాడు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'కాలేజీ చలో అభియాన్'

సెహోర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం విట్- భోపాల్ యూనివర్సిటీ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉన్నత విద్యావకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 'కాలేజీ చలో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించింది. 12వ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించి 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశ ప్రక్రియ, వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు, స్కాలర్‌షిప్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఉన్నత విద్యావకాశాలపై సందేహాలను యూనివర్సిటీ అధ్యాపకులు నివృత్తి చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉన్నత విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడంలో ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

# పొరపాటున తుపాకీ పేలి.. ఛత్తీస్‌గఢ్‌లో డీఆర్‌జీ జవాను మృతి

నారాయణ్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పుర్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. తుపాకీ పొరపాటున పేలడంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డు (డీఆర్‌జీ) జవాను ఒకరు మృతిచెందారు. కడేనార్ శిబిరంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. గస్తీ బృందం వాహనంలోకి ఎక్కుతుండగా తుపాకీ అనుకోకుండా పేలిందని అధికారులు తెలిపారు. తలలోకి తూటా దూసుకెళ్లడంతో కానిస్టేబుల్ బల్దేవ్ సింగ్ హుర్రా (33) మృతిచెందాడని వెల్లడించారు. పేలింది హుర్రా తుపాకీయా, మరొకరిదా అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

# మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో భాజపా ఘన విజయం

ముంబయి: మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార మహాయుతి ఘన విజయం సాధించింది. 288 మునిసిపల్ కౌన్సిళ్లు, నగర పంచాయతీలకు రెండు దశల్లో పోలింగు నిర్వహించి, ఓట్లను ఆదివారం లెక్కించారు. వీటిలో 207 మునిసిపల్ కౌన్సిళ్లలో భాజపా, శివసేన, ఎన్సీపీ కూటమి అభ్యర్థులు అధ్యక్షులుగా విజయం సాధించారు. విపక్ష మహా వికాస్ అఘాడీ 44కి పరిమితమైంది. తుది ఫలితాలను రాష్ట్ర ఎన్నికల సంఘం రాత్రి వెల్లడించింది. దానిప్రకారం భాజపా 117, శివసేన 53, ఎన్సీపీ 37 చొప్పున మున్సిపల్ అధ్యక్ష పదవుల్ని దక్కించుకున్నాయి. కాంగ్రెస్ 28, ఎన్సీపీ (ఎస్పీ) ఏడు, శివసేన (యూబీటీ) తొమ్మిది చొప్పున పొందాయి. మిగతా 37 పదవుల్ని ఇతర పార్టీలవారు, స్వతంత్రులు గెలుచుకున్నారు.



నాగ్‌పుర్‌లో భాజపా శ్రేణుల సంబరాలు

### ఈసీని తప్పుబట్టిన విపక్షం

మహాయుతి విజయానికి ఎన్నికల కమిషన్ దోహదపడిందని విపక్ష కాంగ్రెస్, శివసేన (యూబీటీ) ఆరోపించాయి. 'మహాయుతిని గెలిపించిన రాష్ట్ర ఎన్నికల సంఘానికి అభినందనలు' అని పీసీసీ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ వ్యంగ్యంగా స్పందించారు. అధికారపక్షం విపరీతంగా డబ్బు ఖర్చుపెట్టిందని, విపక్షం దాని ధాటికి నిలవలేకపోయిందని శివసేన (యూబీటీ) నేత సంజయ్‌రౌత్ చెప్పారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను మహాయుతి తారుమారు చేసిందని ఆరోపించారు. శాసనసభకు వాడిన ఈవీఎంలనే ఇప్పుడూ వినియోగించారని, వాటి 'సెట్టింగులు', డబ్బు పంపిణీ కూడా అప్పటిలాగే చేశారని చెప్పారు. ఈ రెండు ఫలితాల్లో ఏమాత్రం మార్పులేదన్నారు.

# రెండో చమురు నౌకను స్వాధీనం చేసుకున్న అమెరికా

- కరీబియన్ తీరంలో ఉద్రిక్తతలు

ఈటీవీ భారత్: అమెరికా, వెనెజువెలా దేశాల మధ్య ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరుకున్నాయి. నికోలస్ మదురో ప్రభుత్వాన్ని ఆర్థికంగా దెబ్బతీసేందుకు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన 'టోటల్ బ్లాకేడ్'ను అమెరికా వేగంగా అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. తాజాగా వెనెజువెలాకు చెందిన రెండో చమురు నౌకను స్వాధీనం చేసుకుంది. ఈ నౌకను 'కన్సెంటెడ్ బోర్డింగ్' విధానంలో స్వాధీనం చేసుకున్నట్లు అమెరికా అధికారులు తెలిపారు. నౌక స్వచ్ఛందంగా ఆగి.. అమెరికా బలగాలు నౌకపైకి ఎక్కేందుకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఈ ఆపరేషన్ జరిగిన కచ్చితమైన ప్రాంతాన్ని మాత్రం అధికారులు వెల్లడించలేదు.

గత పది రోజుల్లోనే రెండో చమురు నౌకను అమెరికా బలగాలు స్వాధీనం చేసుకోవడంతో కరీబియన్ సముద్ర తీరంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. అమెరికా చర్యలు వెనెజువెలా చమురు ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. గత వారం మొదటి ఆయిల్ ట్యాంకర్ స్వాధీనం తర్వాత వెనెజువెలాపై అప్రకటిత నిషేధం అమలులో ఉన్నట్లు స్పష్టమవుతోంది. దీని ఫలితంగా అమెరికా స్వాధీనం చేసుకుంటుందన్న భయంతో కోట్ల బ్యారెళ్ల చమురు లోడ్ చేసిన నౌకలు వెనిజువెలా జలాల్లోనే నిలిచిపోయాయి. దీంతో వెనిజువెలా నుంచి ముడి చమురు ఎగుమతులు భారీగా పడిపోయాయి. వెనెజువెలా ముడి చమురుకు చైనాయే అతి పెద్ద కొనుగోలుదారు. అమెరికా కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నప్పటికీ చమురు రవాణాలో కొన్ని నౌకలకు మినహాయింపులు కొనసాగుతున్నాయి. నౌకా యాజమాన్యం, రవాణా మార్గం, లావాదేవీల స్వభావం ఆధారంగా చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

# సెక్యులర్ పాట పాడాలంటూ వేధించారు: బెంగాలీ గాయని చక్రవర్తి

ఇంటర్నెట్‌డెస్క్: ఒక ప్రైవేటు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో 'సెక్యులర్' పాట పాడాలంటూ ఓ వ్యక్తి తనను వేధించినట్లు బెంగాలీ గాయని లగ్నజిత్ చక్రవర్తి ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శనివారం తూర్పు మేదినీపుర్‌లో లైవ్ షోలో భక్తి పాట పాడుతుండగా.. మెహబూబ్ మాలిక్ అనే వ్యక్తి వేదికపైకి వచ్చి అడ్డుతగిలినట్లు తెలిపారు. తనను దుర్భాషలాడుతూ.. దాడి చేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. భక్తి పాటలు కాకుండా 'సెక్యులర్' పాటలు పాడాలని ఒత్తిడి చేసినట్లు వాపోయారు. ఘటనపై ఫిర్యాదు తీసుకునేందుకు భగవాన్‌పుర్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ నిరాకరించినట్లు ఆరోపించారు. ఆ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్న పోలీసులు.. మాలిక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదు తీసుకునేందుకు నిరాకరించిన అధికారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఘటనను భాజపా తీవ్రంగా ఖండించింది. మాలిక్ అధికార తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడని భాజపా నేత శాకుదేబ్ పాండా తెలిపారు.



పదో సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ జయంతి సందర్భంగా పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆదివారం నిర్వహించిన నగర కీర్తన ఊరేగింపులో విన్యాసాలు